

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 82

శుక్రవారం 13-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 82

శుక్రవారం 13-6-2025



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



రెండో రోజూ 14 వికెట్లు

ఆసక్తికరంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ -14లో



భారత్‌కు 131వ స్థానం

డబ్ల్యూఈఎఫ్ జెండర్‌గ్యాప్ ఇండెక్స్ వెల్లడి.. గతేడాదికన్నా రెండు స్థానాలు పతనం -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇలా టేకాఫ్ అయి...



కూలిపోతూ...



మంటల్లో...



హాస్టల్‌లోకి చొచ్చుకెళ్లిన విమానం

మహా విషాదం

ఎయిరిండియా విమానానికి ఘోర ప్రమాదం

మెడికల్ కాలేజీపై కుప్పకూలి పేలిపోయిన డ్రీమ్‌లైనర్

265 మంది దుర్మరణం

విమాన ప్రమాదంలో కుటుంబ సభ్యుడిని కోల్పోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్న మహిళలు



అహ్మదాబాద్‌లో ఘోరం

- విమానంలోని 242 మందిలో బతికింది ఒక్కరే
- మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం రూపానీ సహా 180 మంది భారతీయులే, 53 మంది బ్రిటన్ వాసులు.. ఏడుగురిది పోర్చుగల్, ఒకరిది కెనడా
- టేకాఫైన కొద్ది క్షణాలకే కాలేజీ క్యాంటీన్, హాస్టల్‌పై పడ్డ విమానం
- వాటితో పాటు సమీప భవనాలు ధ్వంసం
- హాస్టల్‌లో ఉన్నవారిలో 24 మంది మృతి
- వారిలో ఒక వైద్యుడు, నలుగురు మెడికోలు
- 60 మందికి గాయాలు, ఐదుగురి పరిస్థితి విషమం
- శిథిలాల కింద ఇంకా పలువురు ఉండే అవకాశం
- రాష్ట్రపతి, ప్రధాని తదితర ప్రముఖుల దిగ్భ్రాంతి
- ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న సంతాపాలు
- ఘటనాస్థలికి మంత్రులు అమిత్ షా, రామ్మోహన్
- నేడు ప్రధాని మోదీ సందర్శన

అహ్మదాబాద్: మాటలకందని పెనువిషాదం. భారత విమానయాన చరిత్రలోనే అత్యంత దారుణమైన ఘటన. గురువారం గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లబాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.39 గంటలకు లండన్ బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ ఏఐ171 విమానం టేకాఫైన 39 సెకన్లలోనే కుప్పకూలింది. కేవలం 625 అడుగుల ఎత్తుకు వెళ్లగానే విమానంలో అనూహ్య సమస్య తలెత్తింది. దాంతో అది శరవేగంగా కిందికి దూసుకొచ్చింది. చూస్తుండగానే రన్‌వే సమీపంలో మేఘానీనగర్‌లోని బీజే మెడికల్ కాలేజీ, సిటీ సివిల్ హాస్పిటల్ మిగతా 2వ పేజీలో ▶

పక్షి ఢీకొట్టిందా?

మట్టి నిండిన భోజనం!

ప్రయాణికులపాలిట పీడకల.. 'డ్రీమ్'లైనర్

హృదయం ముక్కలైంది: మోదీ

మరిన్ని వార్తలు, కథనాలు 2,3 పేజీల్లో

విమాన ప్రమాద వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

మృత్యుంజయుడు



ప్రమాదం నుంచి బయటపడి వస్తున్న రమేశ్ విశ్వాస్‌కుమార్

చివరి సెల్ఫీ



విమానంలో రాజస్తాన్‌కు చెందిన డాక్టర్ కోమి వ్యాస్ కుటుంబం



దిగ్విజయాల నుంచి దిగంతాలకు

విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీ

పిడుగుపాటుకు ఆరుగురు మృతి

- ఆదిలాబాద్ జిల్లాలో మూడుచోట్ల ఘటనలు...అందరూ ఆదివాసీలే
- మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు

5లో

'పీఎం కుసుమ్'లో దళారీలు!



- రాష్ట్రంలో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం పొందిన రైతులతో రాయ'బేరాలు'
- ఈ పథకం లాభదాయకం కాదని నష్టపోతారంటూ ప్రచారం... ఎకరాకు రూ. 33 వేలు లీజు చెల్లిస్తామని.. ఏటా 10% పెంచుతామని హామీ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) కింద ఒకటి, రెండు మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశం పొందిన రాష్ట్ర రైతులపై దళారీలు గద్దల్లా వాలుతున్నారు. ఈ పథకం లాభదాయకం కాదని.. సాంకేతిక పరిజ్ఞానం లేనందున గిట్టుబాటుకాక నష్టపోతారని ప్రచారం చేస్తూ ఒత్తిడి తెస్తున్నారు. ఎకరాకు లీజు కింద రూ. 33 వేలు చెల్లిస్తామని.. ఏటా దాన్ని 10 శాతం పెంచుతామని మిగతా 6వ పేజీలో ▶

చేనేత.. దేశ వారసత్వ సంపద



భూదాన్ పోచంపల్లిలోని టూరిజం పార్కులో చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

- ఇక్కత్ ఒక అద్భుతమైన కళ
- భూదాన్ పోచంపల్లిని సందర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, యాదాద్రి, భూదాన్ పోచంపల్లి: చేనేత అంటే వస్త్రం కాదని, అది దేశ వారసత్వ సంపద అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులు అద్భుతమైన కళాత్మక వృత్తికి చిహ్నమని అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిని తన సతీమణితో కలిసి గవర్నర్ సందర్శించారు. చేనేత గృహాలను సందర్శించి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. టూరిజం పార్కులోని మ్యూజియంలో ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాలను స్వయంగా పరిశీలించి ఇక్కత్ డిజైన్లు, చేనేత కళాకారులను మిగతా 6వ పేజీలో ▶

నవీన్ మిత్తల్ బదిలీ


ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా నియామకం



- కలెక్టర్లు సహా మొత్తం 35 మంది ఐఏఎస్‌లకు స్థానచలనం
- ఒక ఐఎఫ్ఎస్ అధికారినీ బదిలీ చేసిన ప్రభుత్వం
- సీఎం సీపీఆర్ఓగా గుర్రం మల్సూర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం భారీ సంఖ్యలో సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్‌ను ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఆయనతో పాటు హైదరాబాద్, మల్కాజిగిరి సహా పలు జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం కలిగించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రస్తుత కార్యదర్శి బుద్ధప్రకాశ్‌ను ఆ పోస్టు నుంచి తప్పించింది. కలెక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు కొందరి బదిలీకి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అలాగే మిత్తల్‌ను దీర్ఘకాలం పాటు రెవెన్యూ శాఖలో కొనసాగించిన ప్రభుత్వం ఎట్టకేలకు మిగతా 7వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ట్రంప్ కార్డ్ దరఖాస్తులు షురూ



సంపన్న వలసదారులకోసం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకొచ్చిన శాశ్వత వీసా 'ట్రంప్ కార్డ్' దరఖాస్తులకు ఆహ్వానం పలికారు. గోల్డ్‌కార్డ్‌గా కూడా పిలిచే ఈ ట్రంప్‌కార్డు కొనుగోలుపై ఆసక్తి కలిగినవారు trumpcard.gov వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారమ్ నింపవచ్చని ట్రంప్ ప్రకటించారు. ఐదు మిలియన్ డాలర్లతో ఈ కార్డ్‌ను కొనుగోలు చేయవచ్చని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో వెల్లడించారు. 6లో

గురుకులాలకు తాళాలు!



- అద్దె బకాయిల కోసం భవన యజమానుల డిమాండ్
- కొన్నిచోట్ల భవనాలు ఖాళీ చేయాల్సిందేనని తేల్చిచెప్పిన వైనం
- పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు మధ్యాహ్నం వరకు బయటే..
- పెండింగ్ బిల్లులు కొంతవరకు విడుదల కావడం, అధికారులు సర్దిచెప్పడంతో కొన్నిచోట్ల మధ్యాహ్నం తర్వాత తెరుచుకున్న గేట్లు

సాక్షి, హైదరాబాద్: అద్దె బకాయిలు భారీగా పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న పలు గురుకుల పాఠశాలలకు యజమానులు తాళాలు వేశారు. వేసవి సెలవుల అనంతరం గురువారం గురుకులాలకు వచ్చిన ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులకు గేట్లకు వేసిన తాళాలు దర్శనమిచ్చాయి. దీంతో ప్రిన్సిపాళ్లు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు చర్చలు జరపడంతో మధ్యాహ్నం తర్వాత కొన్నిచోట్ల యజమానులు తాళాలు తీశారు.

గురుకులాలూ షురూ..: వేసవి సెలవులు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా గురువారం పాఠశాల లు తెరుచుకున్నాయి. మిగతా స్కూళ్లతో పాటు గురుకుల విద్యా సంస్థలు సైతం పునఃప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకల్లా తరగతులు ప్రారంభం కావాల్సి ఉండడంతో గంట ముందే ప్రిన్సిపాళ్లు పాఠశాలలకు చేరుకున్నారు. అయితే ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న పలు భవనాలకు పాఠశాల సిబ్బంది వేసిన తాళాల స్థానంలో భవన యజమానుల తాళాలు కనిపించాయి. అద్దె బకాయిలు చెల్లించే వరకు తాళాలు తీసే ప్రసక్తే లేదని యజమానులు ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి స్పష్టం చేశారు. మరికొందరు తమ భవనాలు వెంటనే ఖాళీ చేయాలని తేల్చిచెప్పడంతో పాఠశాలల సిబ్బంది, బడికెళ్లేందుకు వచ్చిన పిల్లలు బయటే నిలబడాల్సి వచ్చింది.

జనరల్ మినహా అన్నీ అద్దె భవనాల్లోనే..

రాష్ట్రంలో ఐదు ప్రభుత్వ గురుకుల సొసైటీలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నాలుగు గురుకుల సొసైటీలుండగా... విద్యాశాఖ పరిధిలో మిగతా 6వ పేజీలో ▶

పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాధ్యతల నుంచి ఉత్తమ్, కోమటిరెడ్డి, కొండా సురేఖలను తప్పించిన ప్రభుత్వం


సాక్షి, హైదరాబాద్: కేబినెట్‌లోకి ముగ్గురు కొత్త మంత్రులను తీసుకోవడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రుల విషయంలో స్వల్ప మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి మంత్రులుగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (కరీంనగర్), కోమటిరెడ్డి వెంకటరెడ్డి (ఖమ్మం), కొండా సురేఖ (మెదక్)లను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. అలాగే ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న సీతక్కను అక్కడ నుంచి మార్చి.. నిజామాబాద్ జిల్లా మిగతా 6వ పేజీలో ▶


విమానం కూలింది ఇక్కడే


విమానం పడిపోయిన భవనం.. మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


ల్యాండింగ్ గేర్


విమాన శకలాలు


మంటలు చెలరేగుతున్న దృశ్యం



కాలిన విమాన ఇంజన్


మృతదేహాలను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మహా విషాదం

▶ మొదటి పేజీ తరువాయి

సముదాయంపై పడి ఒక్కసారిగా పేలిపోయింది. ఒళ్లు గగుర్పొడిచే ఈ దారుణంలో విమానంలో ఉన్నవారిలో ఒక్కరు మినహా 241 మందీ దుర్మరణం పాలయ్యారు. ఎయిరిండియా ఈ మేరకు ధ్రువీకరించింది. మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 230 మంది ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు కాగా 53 మంది బ్రిటన్‌వాసులు, ఏడుగురు పోర్చుగల్‌వాసులు, ఒకరు కెనడా పౌరుడు. వీరితో పాటు ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది ఉన్నారు. బ్రిటన్‌లో స్థిరపడ్డ రమేశ్ విశ్వాస్‌కుమార్ బుచర్వాడ (38) అనే ప్రయాణికుడు గాయాలతో బయటపడి ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. విమానం తొలుత మెడికల్ కాలేజీ క్యాంటీన్‌పై పడి పేలిపోయింది. ముక్కలై మంటల్లో కాలిపోతూనే పక్కనున్న బాయ్స్ హాస్టల్ భవనంపైకి దూసుకెళ్లింది. దాంతో రెండు భవనాలూ తీవ్రంగా ధ్వంసమయ్యాయి. వాటితో పాటు పరిసరాల్లోని పలు బహుళ అంతస్తుల భవనాలు కూడా మంటలంటుకుని కాలిపోయాయి. ప్రమాద సమయంలో క్యాంటీన్లో చాలామంది వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వారితో పాటు హాస్టల్‌వాసుల్లో కూడా పలువురు ప్రమాదంలో గాయపడ్డారు. వారిలో కనీసం 24 మంది మరణించినట్టు చెబుతున్నారు! ఒక వైద్యుడు, నలుగురు ఎంబీబీఎస్ విద్యార్థులు, వైద్యుని భార్య మృతిని ఆస్పత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ''60 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు గాయపడ్డారు. వారిలో 19 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది'' అని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ పేర్కొంది. వారందరినీ హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగేలా ఉంది. ఇద్దరు ఎంబీబీఎస్ మూడో సంవత్సరం విద్యార్థులు, ఒక వైద్యుని తాలూకు ముగ్గురు బంధువుల ఆచూకీ తెలియడం లేదని కాలేజీ డీన్ డాక్టర్ మీనాక్షీ పారిఖ్ వెల్లడించారు. విమాన శకలాలు, ధ్వంసమై కాలిపోయిన భవనాలు, కార్లు, చెట్లు తదితరాలతో ప్రమాదస్థలి భీతావహంగా మారింది. విమానాశ్రయ, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సైనిక, స్థానిక సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద ధాటికి దాదాపుగా విమానంలోని వారంతా కాలిపోయి తీవ్రగాయాల పాలయ్యారు. వారిని బయటికి తీసి ఆ ప్రాంగణంలోనే ఉన్న సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ దారుణంపై భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నీ దిగ్భ్రాంతికి లోనయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బ్రిటన్ రాజు చార్లెస్–3, ప్రధాని యిర్ స్టార్మర్, పలువురు దేశాధినేతలు, రాజకీయ తదితర రంగాల ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. జరిగింది మాటలకందని దారుణమని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన ఘటనాస్థలిని సందర్శించనున్నారు.



పైలట్ 'మే డే' అలర్ట్

విమానం మధ్యాహ్నం 1.39కి టేకాఫ్ అయింది. 600 అడుగుల పై చిలుకు ఎత్తుకు వెళ్లిందో లేదో సమస్య తలెత్తింది. దాంతో మరింత పైకి వెళ్లాల్సిన విమానం కాస్తా కిందకు రాసాగింది. అప్పటికింకా కనీసం లాండింగ్ గేర్ కూడా పూర్తిస్థాయిలో మూసుకోలేదు! దాంతో తీవ్ర ప్రమాదాన్ని సూచిస్తూ పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు 'మే డే' కాల్ చేశారు. ''ఏటీసీ తక్షణం స్పందించి తిరిగి కాల్ చేసినా అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయింది. పైలట్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు'' అని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది. చుట్టుపక్కల వాళ్లంతా చూస్తుండగానే క్షణాల్లో ఘోరం జరిగిపోయింది. ప్రమాదం తాలూకు వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరలైంది. విమానం తాలూకు జంట ఇంజన్లలో టేకాఫ్‌కు అవసరమైన పూర్తిస్థాయి థ్రస్ట్ లోపించడమే ప్రమాదానికి కారణమని వైమానిక నిపుణులు భావిస్తున్నారు. లేదంటే ఇంజన్లను పక్షులు ఢీకొట్టి ఉండొచ్చని కూడా చెబుతున్నారు. ప్రమాదం నేపథ్యంలో అహ్మదాబాద్ విమానాశ్రయంలో కార్యకలాపాలు సాయంత్రం దాకా నిలిచిపోయాయి. ''విమానం చాలా తక్కువ ఎత్తులో ఎగురుతూ మెడికల్ కాలేజీలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది నివాస క్వార్టర్లపై కూలిపోయింది. వాటికి మంటలు అంటుకుని లోపలున్న చాలామంది గాయపడ్డారు'' అని ప్రత్యక్ష సాక్షి చెప్పుకొచ్చాడు.

ప్రమాద సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం!

ఎవరినీ కాపాడలేకపోయాం: అమిత్ షా

ప్రమాద సమయంలో ఎయిరిండియా విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉన్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ''అదంతా ఒక్కసారిగా అంటుకోవడంతో తీవ్రమైన మంటలు చెలరేగి భరించలేనంత వేడి పుట్టుకొచ్చింది. దాంతో ఎవరినీ కాపాడే అవకాశం లేకుండా పోయింది'' అని చెప్పారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాలను గుర్తించిన అనంతరం మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడుతుందన్నారు. ''డీఎన్ఏ శాంపిళ్లను ఇప్పటికే సేకరించారు. గుజరాత్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ, నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ వర్సిటీ డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తాయి''అని తెలిపారు.

సెకెనుకు 4 లీటర్ల ఇంధనం

విమాన ఇంధనాన్ని జెట్ ఫ్యూయల్ లేదా జెట్ ఏ1 అని పిలుస్తారు. బోయింగ్ 747 విమానం నడవాలంటే భారీగా ఇంధనం కావాలి. సెకెనుకు 4 లీటర్లు ఖర్చవుతుంది. అంటే నిమిషానికి 240 లీటర్లు, గంటకు 14,400 లీటర్లు కావాలన్నమాట. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు సుమారు 6,859 కి.మీ. దూరానికి 9 గంటలపైనే ప్రయాణం. ఎయిరిండియా విమానంలో అంత భారీగా ఇంధనం ఉండటానికి అదే కారణం. విమానం వేగంగా, బలంగా నేలను తాకగానే అంత ఇంధనం ఒకే మండిపోయింది. దాంతో భారీగా మంటలు చెలరేగి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణం తేలాల్సి ఉంది. విమానం బ్లాక్ బాక్స్ కోసం అన్వేషిస్తున్నారు.

హృదయ విదారక దృశ్యాలు


విమాన కుప్పకూలిన బీజే మెడికల్ కాలేజీలో హృదయ విదారక దృశ్యాలు మనసులను మెలిపెడుతున్నాయి. కుప్పకూలిన హాస్టల్ భవనాలు తదితరాల కింద చాలామంది వైద్య విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు చిక్కుకుని ఉంటారని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఏఐఎంఏ) తెలిపింది. వారిని వెలికితీసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటిదాకా 265 మృతదేహాలను సిటీ సివిల్ ఆస్పత్రికి తరలించినట్టు డీఎస్పీ కనన్ దేశాయ్ వెల్లడించారు. మృతుల సంఖ్య భారీగా పెరగవచ్చని ఎఫ్ఏఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దివ్యాన్ష్ సింగ్ అన్నారు. వెలికితీసిన మృతదేహాలన్నీ పూర్తిగా కాలిపోయి ఉన్నాయని చెప్పారు.


ఆస్పత్రిలో రమేశ్‌ను పరామర్శిస్తున్న అమిత్ షా

మృత్యుంజయుడు రమేశ్

అహ్మదాబాద్: రమేశ్ విశ్వాస్ కుమార్ బుచార్‌వాడ.. అత్యంత అదృష్టవంతుడంటే ఇతడే. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో.. ఏదో అద్భుతం జరిగినట్లుగా ప్రాణాలతో బయటపడ్డాడు. 38 ఏళ్ల రమేశ్ బ్రిటీష్ జాతీయుడు. తన సోదరుడితో కలిసి లండన్‌కు పయనమయ్యాడు. ఏఐ171 విమానంలో 11ఏ సీట్లో కూర్చున్నాడు. అత్యవసర ద్వారానికి వెనుకే ఈ సీటు ఉంది. విమానం నేలకూలి మంటల్లో చిక్కుకున్న తర్వాత రమేశ్ గాయాలతో బయటకు వస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. కొందరు వ్యక్తుల సాయంతో అంబులెన్స్ వద్దకు చేరుకున్నాడు. విమానంలోని ఇతర ప్రయాణికుల గురించి జనం అతడిని ఆరాతీశారు. చాలామంది రమేశ్ చుట్టూ గుమికూడారు. ప్రయాణికులంతా అక్కడే(ఘటనా స్థలంలో) ఉన్నారు అంటూ బలహీన స్వరంతో బదులిచ్చాడు. విమానం ఒక్కసారిగా పేలిపోయిందని, తన చుట్టూ శకలాలే కనిపించాయని చెప్పాడు. ప్రమాదం నుంచి బయటపడిన రమేశ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ జి.ఎస్.మాలిక్ తెలిపారు.

ఆ సీటులో ఉంటే భద్రమేనా?



విమానంలో 11ఏ సీటులో కూర్చున్న రమేశ్ క్షేమంగా బయటపడ్డాడు. బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానంలో ఈ సీటు ఎకానమీ క్లాస్ కేబిన్‌లో మొదటి వరుసలో ఉంటుంది. విమానంలో కుడి పక్కన రెక్కల కంటే రెండు వరుసల ముందు కిటికీ పక్కనే ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లడానికి ఉద్దేశించిన ఎమర్జెన్సీ డోరు వెనుకే 11ఏ సీటు ఏర్పాటు చేశారు. ఈ స్థానంలో కూర్చోవడం రమేశ్ ప్రాణాలతో బయటపడడానికి కారణమైనట్లు నిపుణులు చెబుతున్నారు. 11ఏ సీటు సురక్షితమని భావిస్తున్నారు. మరోవైపు విమాన ప్రమాదంతోపాటు మృతులకు సంబంధించిన సమాచారం అందించడానికి ఎయిర్ ఇండియా సంస్థ 1800 5691 444 హాట్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేసింది. విదేశీయుల కోసం +91 8062779200 నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రయాణం వాయిదాతో బతికాడు

ఇదే విమానంలో వెళ్లాల్సిన శావ్‌జీభాయి తింబాడియా చివరి నిమిషంలో ప్రయాణం వాయిదా వేసుకోవడం అతడి పాలిట వరంగా మారింది. లండన్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లడానికి ఆయన అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. కుమారుడే విమానం టికెట్ బుక్ చేశాడు. విమానంలో సీటు కూడా తింబాడియాకు కేటాయించారు. కానీ, తింబాడియా చివరి నిమిషంలో మనసు మార్చుకున్నాడు. తన ప్రయాణాన్ని నాలుగు రోజులపాటు వాయిదా వేసుకున్నాడు. అదే ఆయన ప్రాణాన్ని కాపాడింది. గురువారం జరిగిన ప్రమాదం గురించి తెలిసి తింబాడియా దిగ్భ్రాంతి చెందాడు. భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు. తాను నమ్మే దైవమైన స్వామి నారాయణ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పాడు.

మేడే.. మేడే.. మేడే!

అత్యవసర పరిస్థితిలో పైలట్ పలికే మాట ఇది

న్యూఢిల్లీ: విమాన ప్రమాదాలు జరిగిన ప్రతిసారి ఒక పదం ప్రధానంగా వినిపిస్తుంది. అదే 'మేడే'. ఏదైనా పౌర విమానంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) కేంద్రానికి సహాయం కోసం ఆ విమానం పైలట్ పంపే అభ్యర్థనే ఈ 'మేడే'. పైలట్ మేడే.. మేడే.. మేడే అని మూడుసార్లు పలికి సిగ్నల్ పంపాడంటే విమానం అత్యంత ప్రమాదంలో ఉందని అర్థం. ఈ పదానికి అర్థమేంటి? దీనిని ఎప్పటి నుంచి వాడుతున్నారో తెలుసా..?

105 ఏళ్ల క్రితం మాట..

సివిల్ ఏవియేషన్ రంగంలో మేడే అనే పదాన్ని మొదట 1920లో వాడారు. లండన్‌లోని క్రోయ్‌డన్ విమానాశ్రయంలో రేడియో ఆఫీసర్‌గా పనిచేసిన ఫ్రెడరిక్ స్టాన్లీ మాక్‌ఫోర్డ్ ఈ పదాన్ని మొదట ఉపయోగించినట్లు రికార్డుల్లో ఉంది. ఇది ఫ్రెంచ్ పదమైన మైడెర్‌కు సమానార్థకం. ఫ్రెంచ్‌లో మైడెర్ అంటే సహాయం చేయండి (హెల్ప్ మీ) అని అర్థం. 1923 నుంచి అంతర్జాతీయ రేడియో కమ్యూనికేషన్ వాడే పైలట్లు, సముద్రయానం చేసే మెరైన్ సిబ్బంది ఈ మేడే పదాన్ని వాడటం మొదలుపెట్టారు. అధికారికంగా మాత్రం సివిల్ ఏవియేషన్ రంగం 1927 నుంచి ఈ పదాన్ని స్వీకరించింది. అత్యవసర సమయాల్లో మేడేతోపాటు ఎస్ఓఎస్ పదాన్ని కూడా వాడుతుంటారు. కానీ, మేడే పదమే బాగా ప్రాచుర్యంలో ఉంది.

మేడే కాల్ వస్తే ఏం జరుగుతుంది?

ఎవరైనా పైలట్ నుంచి ఏటీసీకి మేడే కాల్ వచ్చిందంటే ఆ విమానం కూలిపోయే ప్రమాదంలో ఉందని అర్థం. వెంటనే ఏటీసీ అధికారులు అత్యవసరం కాని సేవలన్నింటినీ నిలిపేసి ఆ విమానాన్ని కాపాడేందుకు ప్రయత్నం మొదలు పెడతారు. సహాయం కోసం మేడే కాల్ ఇచ్చిన పైలట్ తన విమానం ఏ ప్రాంతంలో ఉంది? ఎంత ఎత్తులో ఉంది? ఎలాంటి ప్రమాదంలో ఉంది? విమానంలో ఎంతమంది ప్రయాణిస్తున్నారు అనే విషయాలు కూడా అందించాల్సి ఉంటుంది. దాన్ని బట్టి సహాయ చర్యలు ఎలా చేపట్టాలన్నది ఏటీసీ అధికారులు నిర్ణయిస్తారు. ఈ మేడే సిగ్నల్‌ను సాధారణంగా 121.5 మెగాహెర్ట్జ్, 243 మెగాహెర్ట్జ్‌లో పంపుతుంటారు. ఈ ఫ్రీక్వెన్సీలను ఏటీసీ అధికారులు అనుక్షణం పరిశీలిస్తుంటారు.

ఆశలు బుగ్గిపాలు

ఉద్యోగరీత్యా వేల కిలోమీటర్ల దూరంలో ఉంటూ ఎలాగైనా తన కుటుంబాన్ని తన వద్దకు చేర్చుకుని హాయిగా జీవిద్దామని భావించిన ఓ భారతీయుని కల కలగానే మిగిలిపోయింది. అతని కుటుంబం మొత్తం మంటల్లో కాలిపోయింది. విమాన ప్రమాద ఘటనలో ఈ హృదయవిదారక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రతీక్ జోషి అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గత ఆరేళ్లుగా లండన్‌లో పనిచేస్తున్నారు. అతని భార్య డాక్టర్ కౌమీ వ్యాస్ రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. వీళ్లకు ఎనిమిదేళ్ల కూతురు మిరాయా, ఐదేళ్ల కవల కుమారులు నకుల్, ప్రద్యుత్ ఉన్నారు. కుటుంబం మొత్తాన్నీ లండన్‌కు శాశ్వతంగా తీసుకురావాలన్న ప్రతీక్ ప్రయత్నాలు ఇటీవల సఫలమయ్యాయి. దీంతో కేవలం రెండ్రోజుల క్రితమే భార్య కోమీ తన డాక్టర్ ఉద్యోగానికి రాజీనామాచేసింది. కొద్దిరోజుల క్రితం ప్రతీక్ భారత్‌కు వచ్చి కుటుంబంతో సహా లండన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. బ్యాగులనీ ప్యాక్ చేసుకుని ఇరు కుటుంబాలకు టాటా బైబైలు చెప్పి అందమైన భవిష్యత్తుపై కలలలో ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరారు. లండన్‌కు వెళ్లే విమానం ఎక్కగానే తమ తమ సీట్లలో కూర్చొని ఒక అందమైన సెల్ఫీతీసుకున్నారు. భార్యాభర్త పక్క సీట్టలో, కవల సోదరులు, సోదరి మరో సీట్లో కూర్చుని నవ్వుతూ దిగిన ఫొటోను బంధువులకు వెంటనే పంపేశారు. కొత్త జీవితానికి స్వాగతం పలుకుతున్నామనుకున్నారుగానీ సమిధలౌతామని అస్సలు ఊహించి ఉండరు. ప్రమాదంలో ఎగసిన అగ్నికీలలో కుటుంబం మొత్తం కాలిబూడిదైంది. రెప్పపాటులో రంగుల ప్రపంచం మసిబారిపోయి నుసిగా మారింది. జీవితం క్షణభంగురం. నువ్వు నిర్మించిన, నువ్వు కలలుగన్న, నువ్వు ప్రేమించినదంతా ఒక సెకన్‌లో సమాధిగా మారిపోయింది. అందుకే ఇప్పుడే జీవించు, ఇప్పుడే ప్రేమించు. రేపు అనేది ఎలా ఉంటుందో ఎవరికీ తెలీదు. జీవితం అస్థిరం. అది ముగిసేలోపే వీలైనంత ప్రేమను పెంచుదాం. పంచుదాం..

ట్రాఫిక్ వల్ల దక్కిన ప్రాణాలు

ట్రాఫిక్ సమస్య వల్ల ఎయిర్‌పోర్టుకు ఆలస్యంగా రావడంతో ప్రాణాలు దక్కాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం నుంచి భూమి చౌహాన్ అనే మహిళ తప్పించుకున్నారు. ఆమె ట్రాఫిక్‌లో చిక్కుకొని ఎయిర్‌పోర్టుకు పది నిమిషాల ఆలస్యంగా వచ్చారు. దాంతో వెళ్లాల్సిన విమానం అప్పటికే టేకాఫ్ అయ్యింది. కొద్ది క్షణాల్లోనే కుప్పకూలింది. తనను వినాయకుడే రక్షించాడని భావిస్తున్నట్లు భూమి చౌహాన్ చెప్పారు.


భార్య పిల్లలతో ప్రతీక్ జోషి

హృదయం ముక్కలైంది

ప్రమాదఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

మాస్కో/లండన్/వాషింగ్టన్/పారిస్/బ్రస్సెల్స్: మాన ప్రమాద వార్త తెలియగానే తన హృదయం ముక్కలైందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' ఖాతాలో ఒక సంతాప పోస్ట్ పెట్టారు. '' అహ్మదాబాద్‌లో పెను విషాదం నన్ను ఎంతగానో కలచివేసింది. మాటలు రావడం లేదు. మాటలకందని మహా విషాదమిది. నా హృదయం ముక్కలైంది. ఈ విషాద సమయంలో నా ఆలోచనలన్నీ మృతుల కుటుంబాల గురించే. సహాయక చర్యల్లో నిగమ్నమైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులతో నిరంతరం మాట్లాడుతున్నా'' అని మోదీ అన్నారు. '' హృదయ విదారక దుర్ఘటన ఇది. ఇంతటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు యావత్‌భారతావని అండగా నిలుస్తోంది'' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తంచేశారు. ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పలు పార్టీల అధినేతలు, అగ్రనేతలు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తూ సంతాప సందేశాలు వెలువర్చారు.

ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేసిన ప్రపంచాధినేతలు

అంతులేని విషాదాన్ని మిగిల్చిన గుజరాత్ విమాన ప్రమాద ఘటనపై ప్రపంచదేశాలు నిర్వరపోయాయి. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తంచేస్తూ ప్రపంచవ్యాప్తంగా సంతాపాలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మొదలు మలేసియా ప్రధాని అన్వర్‌ఇబ్రహీం దాకా పలువురు ప్రపంచ దేశాల అధినేతలు, పాలకులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తూ సంతాప సందేశాలు పంపించారు. '' ఎంతో మంది బ్రిటిష్ జాతీయులతో లండన్‌కు బయల్దేరిన విమానం కూలిన దుర్ఘటన దృశ్యాలు అత్యంత హృదయ విదారకంగా ఉన్నాయి. ఈ ఘటన వివరాలను ఎప్పటికప్పుడు తెల్సుకుంటున్నా. తాజా పరిస్థితిపై ఆరాతీస్తున్నా. భాదితుల కుటుంబాలకు నా ప్రగాడ సానుభూతి తెలియజేస్తున్నా'' అని బ్రిటన్ ప్రధాన మంత్రి కెయిర్ స్టార్మర్ వ్యాఖ్యానించారు. బ్రిటన్ రాజు ఛార్లెస్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డేర్ లెయిన్ తదితరులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

విమానం కొత్తదే!

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో గురువారం కుప్పకూలిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం మరీ పాతదేమీ కాదని ఏవియేషన్ అధికారులు తెలిపారు. ఈ విమానం 2013లో సేవలు ప్రారంభించిందని వెల్లడించారు. 12 సంవత్సరాల నుంచి ఇది వాణిజ్య సేవలు అందిస్తోంది. పౌర విమానయాన రంగంలో 12 సంవత్సరాలు అంటే దాదాపు కొత్త విమానం కిందే లెక్క అని నిపుణులు తెలిపారు. ఈ విమానం వీటీ–ఏఎన్‌బీ పేరుతో రిజిస్టర్ అయ్యింది. ఎయిర్ ఇండియా సంస్థ వద్ద ఉన్న బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన 27 విమానాల్లో ఇదీ ఒకటి. ఈ రకానికి చెందిన ఒక విమానం ప్రమాదంలో పూర్తిగా ధ్వంసం కావటం ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. 2020లో కాసరగోడ్‌లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం కూలిపోయిన ఘటన తర్వాత దేశంలో అతిపెద్ద విమాన ప్రమాదం కూడా ఇదే.

ఆ పైలట్లకు 9,300 గంటల అనుభవం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో ఘోర ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా 787–8 డ్రీమ్‌లైనర్ విమానాన్ని నడిపిన పైలట్లకు సర్వీస్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. ఈ విమానాన్ని ప్రధాన పైలట్ కెప్టెన్ సుమీత్ సభర్వాల్, కో పైలట్ క్లైవ్ కుందర్ నడిపారు. ప్రయాణికుల విమానాలు నడపడంలో సుమీత్‌కు ఏకంగా 8,200 గంటల అనుభవం ఉంది. కో పైలట్ క్లైవ్‌కు 1,100 గంటల అనుభవం ఉంది. ఇద్దరికి కలిసి 9,300 గంటలపాటు వినిమానం నడిపిన అనుభవం ఉందని డీజీసీఏ వెల్లడించింది.

బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం

ప్రకటించిన టాటా గ్రూప్

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మ రణించిన ప్రయాణికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందజేస్తామని టాటా గ్రూప్ ప్రకటించింది. ఈ దుర్ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఈ విషాదాన్ని వర్ణించడానికి మా టలు రావడం లేదని టాటా గ్రూప్, ఎయిర్ ఇండి యా చైర్మన్ ఎస్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఎంతోమంది తమ ఆత్మీయులను కో ల్పోయారని, వారికి ప్రగాఢ సానుభూత తెలియజేస్తున్నామని వెల్లడించారు. బాధిత కుటుంబాలను తప్పనిసరిగా ఆదుకుంటామని తెలిపారు. గాయపడినవారి చికిత్సకు అయ్యే ఖర్చును తామే భరిస్తామ ని స్పష్టంచేశారు. అలాగే విమాన ప్రమాదం వల్ల ధ్వంసమైన బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ పునర్నిర్మాణానికి సహకరిస్తామని ఎస్.చంద్రశేఖరన్ చెప్పారు.

రామ్మోహన్ నాయుడికి ప్రధాని ఫోన్

ప్రమాద సంఘటనపై ఆరా

సాక్షి, న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘ టన జరిగిన వెంటనే ఈ విషయమై ప్రధాని మోదీ కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. విమాన ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో రెస్క్యూ, సహాయ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి తక్షణమే అహ్మదాబాద్‌కు వెళ్లాలని ఆదేశించారు. అవసరమైన అన్ని సహాయాలను తక్షణమే అందించాలని, పరిస్థితిపై క్రమం తప్పకుండా సమాచారం అందించాలని సూచించారు. దీంతో రామ్మోహన్ నాయుడు ఎన్డీఏ ప్రభుత్వం ఏడాది వార్షికోత్సవాలను ముగించుకొని అహ్మదాబాద్‌కు వెళ్లారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఎన్‌డీఆర్‌ఎఫ్, డీజీసీఏ సహా గుజరాత్ రాష్ట్ర అధికారులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నట్లు, సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టినట్లు రామ్మోహన్ నాయుడు వివరించారు. సంబంధిత ఏజెన్సీలన్నీ అప్రమత్తంగా ఉన్నాయని, సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. డీజీసీఏ, ఏటీఎస్ సహా సహాయక బృందాల అధికారులతో అహ్మదాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. అక్కడి నుంచి క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు ప్రధానికి సమాచారం అందించారు.

మట్టి నిండిన భోజనం!

అహ్మదాబాద్: సరిగ్గా మధ్యాహ్న భోజన సమయం కావటంతో బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ క్యాంటీన్‌లో హడావిడి మొదలైంది. ఆకలిమీద ఉన్న రెసిడెంట్ వైద్యులు నచ్చిన ఆహారం వడ్డించుకొని డైనింగ్ టేబుల్స్‌పై కూర్చొని ముచ్చట్లు చెప్పుకొంటూ.. ఇష్టంగా తింటున్నారు. అంతలోనే ఒక్కసారిగా భారీ శబ్దం.. బీటలువారి కూలిపోతున్న భవనం గోడలు.. ఆ వెంటనే దూసుకొచ్చిన రాకాసి అగ్నికీలలు.. కన్నుమూసి తెరిచేంతలో అంతా బూడిదమయం.. అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ప్రదేశంలో దృశ్యాలు ప్రమాద తీవ్రత ఎంతగా ఉందో చెప్పకనే చెప్పాయి. దుమ్ముతో నిండిపోయిన డైనింగ్ టేబుల్స్.. వాటిపై నిండుగా భోజనంతో పొందికగా ఉన్న ఆహారం పేట్లు.. పక్కనే మంచినీటి గ్లాసులు..

బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ మెస్‌లో భయానక దృశ్యాలు

- విమాన ప్రమాదం ధాటికి కాలి బూడిదైన చెట్లు
- ప్రమాద తీవ్రతకు నుజ్జునుజ్జయిన భవనం పిల్లర్లు

మసిబారిపోయిన క్యాంటీన్.. కొన్నిచోట్ల చిందరవందరగా పడిపోయిన సామగ్రి ఆ ఘోర ప్రమాదానికి సాక్ష్యంగా నిలిచాయి. ఆ హాస్టల్ భవనంలో రెసిడెంట్ వైద్యులు నివాసం ఉంటారు.

నేరుగా భవనంపైనే కూలిన విమానం..

సాంకేతిక లోపంతో విమానం కిందికి దూసుకొచ్చి నేరుగా హాస్టల్ భవనంలోని నాలుగో అంతస్తులోకి దూసుకెళ్లింది. దీంతో భవనం ఒకవైపు పూర్తిగా ధ్వంసమైంది. భవనానికి భారీ రంధ్రం ఏర్పడింది. భారీగా మంటలు చెలరేగటంతో భవనం గోడలు మొత్తం నల్లగా మారిపోయాయి. ఆ భవనం చుట్టూ ఉన్న చెట్లు నిలువునా కాలిపోయిన నల్లని మొద్దులు మాత్రమే మిగిలాయి. విమాన ఫ్యూజ్‌లేజ్‌లు (ప్రధాన బాడీలోని కొన్ని భాగాలు) భవనం గోడల్లోనే ఇరుక్కుపోయాయి. విమానం టైర్లు తల్లకిందులై భవనంలో వేలాడుతూ కనిపించాయి. విమానం తాకిన వేగానికి ఎంతో బలమైన భవనం పిల్లర్లు కూడా నుజ్జునుజ్జు అయ్యాయి. అరంతస్తుల భవనం బయటి గోడలు మొత్తం ధ్వంసమైపోయి బిల్డింగ్ ఎందుకూ పనికిరాకుండా పోయింది.



బీజే మెడికల్ కాలేజ్ హాస్టల్‌లో ప్రమాద తీవ్రత. (ఇన్‌సెట్లో) ల్యాండింగ్ గేర్

గుడ్‌బై ఇండియా

అహ్మదాబాద్: ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైన ఇద్దరు బ్రిటిష్ పౌరులు.. ఆ ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు ఎంతో సంతోషంగా తీసుకున్న వీడియో వైరల్‌గా మారింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎయిర్‌పోర్టులో బోర్డింగ్ కోసం ఎదురు చూస్తున్న సమయంలో జేమీ రే మీక్, ఫియోంగల్ గ్రీన్‌లా ఈ సెల్ఫీ వీడియో తీశారు. వీరు వెల్‌నెస్ ఫౌండ్రీ అనే సంస్థ వ్యవస్థాపకులు. ఈ వీడియోను ఆ సంస్థ వెబ్ పేజీలో పోస్ట్ చేశారు. ప్రమాదం తర్వాత వారు మృతిచెందటంతో ఆ పేజీ నుంచి ఆ వీడియో తొలగించబడింది. వీడియోలో వారిద్దరు ఎంతో సంతోషంగా కనిపించారు. 'ఎయిర్‌పోర్టులో ఉన్నాం. గుడ్‌బై ఇండియా. ఇప్పుడు మేం బ్రిటన్ తిరిగి వెళ్తున్నాం. ఎంతో సంతోషంగా.. సంతోషంగా తిరిగి వెళ్తున్నాం'అని ఫియోంగల్ నవ్వుతూ చెప్పాడు.

కోటి ఆశలతో గాల్లోకి ఎగిరి..

ప్రమాదంలో నవ వధువు మృతి

అహ్మదాబాద్: ఆరు నెలల క్రితమే వివాహమైంది. భర్త లండన్‌లో డాక్టర్. కొత్త జీవితంపై కోటి ఆశలతో భర్త వద్దకు బయలుదేరింది ఆ నవ వధువు. కానీ, గాల్లోకి ఎగిరిన నిమిషాల్లోనే ఆమె ఆశలు ఆవిరయ్యాయి. ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాకు చెందిన కుష్బూ (21)కి ఈ ఏడాది జనవరిలో లండన్‌లో వైద్యుడిగా పనిచేస్తున్న విపుల్‌తో వివాహమైంది. పెళ్లి తర్వాత రెండు నెలలకు విపుల్ లండన్ తిరిగి వెళ్లారు. భర్త వద్దకు వెళ్లేందుకు కుష్బూ గురువారం ప్రమాదానికి గురైన విమానంలో బయలు దేరింది. విమానం ఎక్కే ముందు ఆమె తండ్రి మదన్‌సింగ్ కుష్బూతో సెల్ఫీ ఫొటో తీసుకొని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి 'ఆశీర్వాద్ కుష్బూ బేటా.. గోయింగ్ టు లండన్'అని రాశాడు. కూతురును విమానం ఎక్కించి తిరుగు పయనమైన మదన్‌సింగ్‌కు.. ఆ విమానం కూలిపోయిందని తెలిసి హతాశుడయ్యాడు.

పక్షి ఢీకొట్టిందా?

బోయింగ్ 787 ప్రమాదానికి అదే కారణమా?

- పక్షులు ఢీకొట్టి అనేక ప్రమాదాలు
- టేకాఫ్, ల్యాండింగ్‌లలోనే ఎక్కువ

గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన బోయింగ్ 787–7 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాద దుర్ఘటనలో.. ఇంకా కారణాలు నిర్ధారణ కానప్పటికీ పక్షి ఢీకొట్టడం వల్లే ఇది జరిగిందా అనే సందేహాలు వినిపిస్తున్నాయి. భారత్‌లో 2015లో ఇలాంటి పెద్ద ప్రమాదం జరిగింది. కత్రా నుండి వైష్ణోదేవి ఆలయానికి వెళుతున్న హెలికాప్టర్.. రాబందు ఢీకొనటంతో పల్టీలు కొట్టి, మంటలు చెలరేగి పైలట్‌తో సహా ఏడుగురు చనిపోయారు. రన్‌వేపై లేదా గాల్లో పక్షులు ఢీకొనడం వల్ల గతంలో మనదేశంలో అనేక విమాన ప్రమాద దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత ప్రమాదం జరిగిన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో.. 2022తో పోలిస్తే 2023లో దాదాపు రెట్టింపునకు పైగా ఇలాంటి ప్రమాదాలు జరగడం గమనార్హం. 2022లో కేవలం 39 ప్రమాద ఘటనలే జరిగితే ఆ తరవాతి ఏడాది ఈ సంఖ్య 81కి పెరిగింది.

ఢిల్లీ రన్‌వేపై 700సార్లు!

పక్షులు ఢీకొన్న సంఘటనలు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యధికంగా జరిగాయి. 2018–2023 మధ్య ఆ రన్‌వేలపై 700 కేసులు నమోదయ్యాయి. 2023 డిసెంబరు 18న రాజ్యసభలో పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానం ప్రకారం.. భారతదేశంలో అ త్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలు వన్యప్రాణు లు, ప్రధానంగా పక్షుల బెడదతో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నాయని తెలుస్తోంది. గత ఏడాది ఎమిరేట్స్ విమానం ముంబైలో ఫ్లెమింగోల గుంపును ఢీకొట్టడంతో 39 పక్షులు చనిపోయాయి.

పక్షులు తగిలితే ఎందుకు కూలిపోతాయి?

నిజానికి పక్షుల తగిలినంత మాత్రానే విమానాలు కూలిపోవు. కొన్ని సందర్భాలలో ఇంజిన్ లేదా ఇతర భాగాలకు నష్టం వాటిల్లుతుంది. విమానాలు చాలా వేగంగా టేకాఫ్ అవుతాయి. పక్షులు, ముఖ్యంగా పెద్ద పక్షులు; ఇంజిన్ లేదా విండ్‌షీల్డ్‌లోకి ప్రవేశించే పక్షి సమూహాలు ఢీకొనడం వల్ల మాత్రం పెద్ద ముప్పే వాటిల్లవచ్చు. టేకాఫ్ దశలో ఇంజిన్ చాలా వేగంతో తిరుగుతున్నప్పుడు, విమానం తక్కువ ఎత్తులో ఉండగానే పక్షి ఢీకొన్నప్పుడు ఇంజిన్ ఫ్యాన్ బ్లేడ్‌లకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీంతో ఇంజిన్ విఫలమై ప్రమాదం సంభవించవచ్చు. పక్షి ఢీకొట్టగానే పైలట్ దృష్టి చెదిరి ప్రమాదాలు జరుగుతుంటాయి.

అన్ని పక్షులూ ముప్పుకాదు

1966–1989 మధ్య కాలంలో తీవ్రమైన విమాన నష్టానికి కారణమైన పక్షుల జాబితాలో రాబందులు ఒకప్పుడు అగ్రస్థానంలో ఉండేవి. వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోవటంతో వాటి వల్ల ముప్పు తగ్గింది. నేడు ప్రధానంగా బ్లాక్ కైట్స్ (డేగ జాతి), గబ్బిలాలు, ల్యాప్‌విగ్ పక్షులు ప్రమాదం కలిగించే జాబితాలోకి చేరాయి. 2020 జూన్‌లో 'డిఫెన్స్ లైఫ్'సైన్స్ జర్నల్ లో 'భారతదేశంలో విమానాలకు వన్యప్రాణుల తాకిడి'అనే శీర్షికతో ప్రచురితమైన అధ్యయన పత్రం ప్రకారం.. ఈ మూడు జాతుల పక్షులే ఇప్పుడు ప్రధానంగా రన్‌వేపై విమాన ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. 2012–2018 మధ్య భారతదేశంలో 3,665 వన్యప్రాణుల తాకిళ్లు సంభవించినట్లు ఈ పత్రం పేర్కొంది. వీటిల్లో 385 ఘటనలు విమాన నష్టానికి కారణం అయ్యాయి. 2005–2018 మధ్య మూడు సైనిక విమానాలు కూలిపోవటానికి బ్లాక్ కైట్స్ పక్షులే కారణం.

ఘోర విషాదాలు

- దేశంలో పలు విమాన ప్రమాదాలు
- వందల సంఖ్యలో ప్రయాణికులు మృతి
- సాంకేతిక లోపాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులే కారణం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం దేశ ప్రజలను ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దేశంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఇది కూడా ఒకటని చెబుతున్నారు. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. వందలాది మంది ప్రయాణికులు గమ్యస్థానం చేరకుండానే కన్నుమూశారు. చాలావరకు సాంకేతిక లోపాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతోపాటు మానవ తప్పిదాలు సైతం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

- **2020 ఆగస్టు 7:** కేరళలోని కోజికోడ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై ఎయిర్ ఇండియా 1344 విమానం ల్యాండవుతున్న సమయంలో అదుపు తప్పింది. పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. విమానం రెండు ముక్కలు కావడంతో అందులో ఉన్న 190 మంది ప్రయాణికుల్లో 21 మంది మృతిచెందారు. భారీ వర్షం, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో ఇద్దరు పైలట్లు సైతం ఉన్నారు.
- **2010 మే 22:** కర్ణాటకలోని మంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 737–800 విమానం ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పి లోయలో పడిపోయింది. విమానంలో వెంటనే మంటలు చెలరేగడంలో 158 మంది మరణించారు. ఇది టేబుల్ టాప్ రన్‌వే కావడంతో విమానాన్ని ల్యాండింగ్ చేయడంలో పైలట్ తడబడినట్లు గుర్తించారు.
- **2000 జూలై 17:** బిహార్ రాజధాని పాట్నాలో అలయెన్స్ ఎయిర్ ఫ్లైట్ 7412 జనావాసాలపై కుప్పకూలింది. 60 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 55 మంది విమాన ప్రయాణికులు కాగా, ఐదుగురు ఇళ్లల్లోని నివాసితులు.
- **1996 నవంబర్ 12:** సౌదీ అరేబియా విమానం 763, కజకిస్తాన్ ఎయిర్‌లైన్స్ విమానం 1907 హరియాణాలోని చార్కీ దాద్రీ గగనతలంలో పరస్పరం ఢీకొని కుప్పకూలాయి. ఏకంగా 349 మంది మరణించారు. సమాచార మార్పిడిలో లోపం వల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.
- **1990 ఫిబ్రవరి 14:** ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం 605 బెంగళూరు హెచ్ఏఎల్ ఎయిర్‌పోర్టులో ల్యాండయ్యే ముందు అదుపుతప్పింది. రన్‌వే పక్కన భూమిని ఢీకొని పక్కనే ఉన్న గోల్ఫ్ కోర్సులోకి దూసుకెళ్లింది. విమానంలో 146 మంది ఉండగా, వీరిలో 92 మంది మృతి చెందారు.
- **1988 అక్టోబర్ 19:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 113 ల్యాండింగ్ సమయంలో రన్‌వే పక్కన చెట్లను ఢీకొట్టింది. వెంటనే మంటలు చెలరేగడంతో 135 మంది ప్రయాణికులకు గాను 133 మంది విగత జీవులయ్యారు. పొగమంచు అధికంగా ఉండడం వల్ల రన్‌వే కనిపించకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది.
- **1978 జనవరి 1:** ముంబై నుంచి దుబాయ్‌కి బయలుదేరిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ 855 అరేబియా సముద్రంలో కూలిపోయింది. విమానంలోని మొత్తం 213 మంది ప్రయాణికులు మరణించారు. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ దుర్ఘటన జరిగింది.
- **1973 మే 31:** ఢిల్లీ పాలమ్ ఎయిర్‌పోర్టులో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం 440 ల్యాండింగ్ కంటే ముందు హైటెన్షన్ విద్యుత్ వైర్లను ఢీకొట్టింది. దాంతో అందులో మంటలు వ్యాపించడంతో 65 మందికిగాను 48 మంది ప్రయాణికులు బలయ్యారు. ప్రతికూల వాతావరణం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

దిగ్విజయాల నుంచి దిగంతాలకు

సక్సెస్‌ఫుల్ సీఎంను కోల్పోయిన గుజరాత్

- రూపానీ మరణంపై రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన సంతాపాలు



న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో సాధారణ ప్రయాణికులతోపాటు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ సైతం ప్రాణాలు కోల్పోయిన వార్త తెలిసి గుజరాత్ ప్రజలు హతాశులయ్యారు. పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజారంజకంగా పాలించిన విజయ్ రూపానీ లేరన్న వార్త గుజరాత్‌వాసులను కలిచివేసింది.

విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్‌పై మక్కువ

ప్రస్తుతం మయన్మార్‌గా పిలుచుకుంటున్న నాటి బర్మాలోని యాంగూర్ నగరంలో 1956 ఆగస్ట్ రెండో తేదీన విజయ్ కుమార్ రూపానీ జన్మించారు. నాటి బర్మాలో రాజకీయ అస్థిరత కారణంగా రూపానీ తల్లిదండ్రులు మాయబెన్, రామ్‌నిక్‌లాల్ రూపానీలు 1960లో గుజరాత్‌కు వలసవచ్చింది. చిన్నప్పటి నుంచే హిందూత్వంపై మక్కువతో టీనేజీలో ఉన్నప్పుడే ఆర్ఎస్ఎస్ 'శాఖ'లో చేరారు. ఇందులోభాగంగా తొలుత ఏబీవీపీలో విద్యార్థి కార్యకర్తగా చేరారు. 1971లో జనసంఘ్‌లో చేరారు. భారతీయ జనతాపార్టీ ఆవిర్భావం నాటి నుంచి పార్టీకు పూర్తిగా అంకితమయ్యారు. 1976లో ఎమర్జెన్సీ కాలంలో భుజ్, భావనగర్ జైళ్లలో 11 నెలల పాటు కారాగార శిక్ష అనుభవించారు. 1978 నుంచి 1981 వరకు ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గానూ పనిచేశారు. 1987లో రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా గెలిచారు. 1996 నుంచి 1997 దాకా రాజ్‌కోట్ మేయర్‌గా సేవలందించారు. 1998లో బీజేపీ గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కేశూభాయ్‌పటేల్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మేనిఫెస్టో కమిటీకి ఛైర్మన్‌గా ఉన్నారు. 2006లో గుజరాత్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా సేవలందించారు. 2006 నుంచి 2012 ఏడాదిదాకా గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. బీజేపీ గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు పనిచేసిన రికార్డ్ ఈయన సొంతం. నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో రాష్ట్ర మున్సిపల్ ఫైనాన్స్ బోర్డ్‌కు రూపానీ ఛైర్మన్ సేవలందించారు. 2014లో విజుభాయ్ వాలా రాజ్‌కోట్ పశ్చిమ శాసనసభ నియోజకవర్గానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక చేపట్టారు. బీజేపీ మద్దతుతో ఆనాడు రూపానీ భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014 నవంబర్‌లో నాటి మహిళా ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ తొలిసారిగా కేబినెట్‌ను విస్తరించినప్పుడు మొట్టమొదటిసారిగా రూపానీని మంత్రిపదవి వరించింది. రవాణా, నీటి పారుదల, ఉపాధి కార్మిక శాఖల మంత్రిగా పనిచేశారు. 2016 ఫిబ్రవరిలో గుజరాత్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షునిగా రూపానీ ఎన్నికయ్యారు. 2021లో భారత్‌లో అత్యంత ప్రభావశీలురైన తొలి 100 మంది వ్యక్తుల జాబితాలో రూపానీ స్థానం సంపాదించుకున్నారు.

ముఖ్యమంత్రిగా..

2017లో గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. అప్పటిదాకా సీఎంగా కొనసాగిన ఆనందిబెన్ పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో పార్టీకోసం దశాబ్దాలుగా అవిశ్రాంతంగా పనిచేస్తున్న రూపానీకి సీఎం పదవి కట్టబెట్టాలని పార్టీ అగ్రనాయకత్వం నిర్ణయించింది. రాజ్‌కోట్ వెస్ట్‌లో కాంగ్రెస్ నేత ఇంద్రాణిరాజ్యగురును మట్టికరిపించి ఎమ్మెల్యేగా గెలిచిన రూపానీని పార్టీ శాసనసభాపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రకటించింది. ప్రజల సమస్యలను వీలైనంత ఎక్కువగా పరిష్కరించేందుకు కృషిచేసి సమర్థవంతమైన సీఎంగా పేరుతెచ్చుకున్నారు.

లక్కీనంబర్ 1206 నాడే...

1206. ఇది తన లక్కీ నంబర్ అని విజయ్ రూపానీ బాగా నమ్ముతారు. అందుకే తొలినాళ్లలో వాడిన మోటార్‌సైకిళ్ల నుంచి ఆయన కార్ల దాకా అన్నింటికీ ఇదే నంబర్ ఉంటుంది. చివరికి విమాన ప్రమాదంలో రూపానీ దుర్మరణం పాలైన తేదీ కూడా 12.06 (జూన్ 12) కావడం విధి వైచిత్రేనంటూ ఆయన అభిమానులు వాపోతున్నారు.

ప్రయాణికులపాలిట పీడకల..

డ్రీమ్‌లైనర్

- పుష్కరకాలంగా సేవలందిస్తున్నా పుష్కలంగా ఆరోపణలు మోస్తున్న 787 మోడల్ విమానం
- విడిభాగాల బిగింపులో ప్రమాణాలు పాటించట్లేరన్న సంస్థ మాజీ సీనియర్ ఇంజనీర్
- లోపాలతో గతంలో తయారీని నిలిపేసిన బోయింగ్ సంస్థ



విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం కలలు రెక్కలు కట్టుకుని విమానం ఎక్కే వందలాది మంది ప్రయాణికులు తాజాగా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ పేరు చెప్పగానే హడలిపోతున్నారు. ఇది మార్గమధ్యంలో కూలిపోయి తమ కలలను కల్లలుచేస్తుందన్న ప్యాసింజర్ల భయాందోళల నడుమ ఈ మోడల్ విమానంపై సర్వత్రా చర్చ నెలకొంది. అమెరికా విమానతయారీరంగ దిగ్గజం బోయింగ్ 2011లో అత్యంత ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తెచ్చిన ఈ విమానం ఇప్పుడు అత్యంత అప్రతిష్టను మూటగట్టుకుంటోంది. దీంతో ఈ మోడల్ విమానం గత విజయాలు, విశేషాలతోపాటు వివాదాలపర్వాన్ని యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. వేర్వేరు చోట్ల తయారుచేసి మరోచోట విడిభాగాలను పటిష్టమైన ప్రామాణాలను పాటించకుండానే బిగిస్తున్నారని, డిజైన్ లోపాలున్నాయని ఈ మోడల్‌పై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మోడల్ పుట్టుపూర్వోత్తరాలను ఒకసారి గమనిద్దాం.

విలాసానికి మారుపేరు.. ఎప్పుడొచ్చింది?

2011లో విశ్వవిపణిలోకి తొలిసారిగా అడుగుపెట్టినప్పుడు బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానంలోని సదుపాయాలు, సామర్థ్యాన్ని చూసిన వాళ్లంతా ఔరా అనేశారు. ఎక్కువ మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యంతో పాటు సుదూరాలకు ఇది అవలీలగా వెళ్లగలదు. కొనుగోలుచేసిన, నిర్వహణ సంస్థకు అనువుగా 242 నుంచి గరిష్టంగా 290 వరకు ప్రయాణికులు ఇందులో ప్రయాణించవచ్చు.

సామర్థ్యం ఎంత?

ఏకధాటిగా ఎక్కడా ఆగకుండా ఏకంగా 13,530 కిలోమీటర్లు ప్రయాణించగలదు. దీంతో సుదూర నగరాల మధ్య సంధానకర్తగా ఇది మంచి పేరు తెచ్చుకుంది. అత్యంత పటిష్టమైన, అత్యంత తేలికైన మూలకాలతో విమాన నిర్మాణ విడిభాగాలను తయారుచేశారు. దీంతో మిగతా పోటీ సంస్థల మోడళ్లతో పోలిస్తే దీని బరువు తక్కువగా ఉంటుంది. మైలేజీపరంగా తక్కువ ఇంధనంతో పనిచేస్తుంది.

టెక్నాలజీ ఎలాంటిది?

కొత్తతరం డిజైన్, అధునాతన ఫ్లై–బై–వైర్ కంట్రోలర్లతో పనిచేస్తుంది. ప్రతి ఆదేశాన్ని పైలట్ ఇవ్వాల్సిన పనిలేకుండా గాల్లో కదిలే దిశ, ఒంపుకు అనుగుణంగా ఆటోమేటిక్‌గా కంప్యూటరే ఆదేశాలు ఇచ్చే వ్యవస్థ ఇందులో ఉంది. అత్యాధునిక ప్రయాణికుల భద్రతా ఏర్పాట్లు దీనిలో ఉన్నాయి. సింథటిక్ విజన్ సిస్టమ్(ఎస్‌వీఎస్) సాయంతో కింద ఉన్న భూభాగాన్ని త్రిమితీయ(3డీ) ఫొటోలు తీసి ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో రన్‌వేపై పక్షులు, ఎయిర్‌పోర్ట్ వస్తువులు ఏమైనా ఉన్నాయోలేదో వెంటనే అలర్ట్‌చేస్తుంది. మంచుదుప్పటి కప్పుకున్నా, భీకర వర్షం పడుతున్నా రన్‌వే పరిసరాలను స్పష్టంగా చూపిస్తుంది.

ఇంకెన్ని ఫీచర్లు ఉన్నాయి?

ప్రయాణికుల సీటింగ్ క్యాబిన్, కాక్‌పిట్, కార్గో సెక్షన్లు అన్నింటిపైనా సమీకృత పర్యవేక్షణ ఉండేలా ఇంటిగ్రేటెడ్ మాడ్యులర్ ఏవియానిక్స్(ఐఎంఏ) విధానంతో విమానం పనిచేస్తుంది. ఆక్సిజన్ పీడనం, ఇంధన లీకేజీలు, హఠాత్తుగా ప్రయాణ ఎత్తు తగ్గడం, పిడుగులతో కుదుపులకు లోనవడం వంటి సందర్భాల్లో వెనువెంటనే ఆటోమేషన్‌లో తనంతట తానుగా సర్దుబాటు చేసుకునే వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

మరి లోపాలేంటి?

తొలిరోజుల్లో నవతరం విమానానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన 787–8 డ్రీమ్‌లైనర్ నెమ్మదిగా విమర్శల సుడిగుండంలో పడింది. 2013లో ఈ మోడల్ విమానాల్లో లిథియం అయాన్ బ్యాటరీలు పేలిపోయాయి. దీంతో అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) వీటి రాకపోకలను స్తంభింపజేసింది. విమానం మధ్యలోని ప్రధాన విడిభాగాన్ని ఇతర భాగాలను అనుసంధానించేటప్పుడు సరైన ప్రమాణాలను పాటించట్లేరని 2019లో తొలిసారిగా ఆరోపణలు వచ్చాయి. బిగింపుల మధ్య అతుకులు సరిగా పూడ్చట్లేరని, ఇందుకు కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కూడా తోడైందని వెల్లడైంది. దీంతో తరలింపు కోసం వాడిన బోల్ట్‌లు ఆ తర్వాత సైతం జాయింట్ల వద్ద అలాగే ఉండిపోయి మొత్తం వ్యవస్థకే సమస్యాత్మకంగా మారుతున్నాయి. సమీక్ష జరిపాకే ఎయిర్‌లైన్స్‌లకు కొత్త విమానాలను డెలివరీ చేయాలని ఎఫ్ఏఏ ఆదేశించడంత 2021 జనవరి నుంచి 2022 ఆగస్ట్ దాకా 787 సిరీస్‌ల డెలివరీ ఆగిపోయింది.

లోపాలను ఎత్తిచూపిన సీనియర్ ఉద్యోగులు

ఏళ్ల తరబడి బోయింగ్ సంస్థలో పనిచేసిన సీనియర్ ఇంజినీర్లు ఈ మోడల్ విమానాల్లో లోపాలు ఉన్నట్లు పలుమార్లు బహిరంగంగా చెప్పారు. బోయింగ్ సంస్థలో ఇంజనీర్‌గా 17 ఏళ్లపాటు పనిచేసిన మాజీ ఉద్యోగి సామ్ సలేహ్‌పౌర్ 2024లో ఎఫ్ఏఏకు ఫిర్యాదు కూడా చేశారు. ''విడిభాగాల ఉత్పత్తి దశలో బోయింగ్ అడ్డదారులు తొక్కుతోంది. విడిభాగాల బిగింపు సమయంలో అత్యున్నత స్థాయి ప్రమాణాలను పాటించట్లేదు. హడావిడిగా తుది ఆమోద ముద్ర వేసేలా ఇంజనీరింగ్ సిబ్బందిపై ఒత్తిడి చేస్తోంది. సరైన బిగింపు లేకపోవడం వల్ల విమానం పాతబడేకొద్దీ లోపం అనేది అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అసెంబ్లీ యూనిట్లలో సిబ్బంది అడవిలో టార్జాన్ మాదిరిగా ఒక చోట నుంచి మరోచోటుకు వేగంగా మారుతూ పనిని సవ్యంగా చేయట్లేరని సంస్థకు ఎన్నోసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. 2020 ఏడాది నుంచి మూడుసార్లు సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తే నన్ను 'నోరు మూస్కో'అన్నారు. ఇన్ని లోపాలతో తయారైన ఈ లోహ విహంగాలు టిక్ టిక్ శబ్దం చేసే టైంబాంబులే. రక్షణ, భద్రతా సంస్కృతికి బోయింగ్ తిలోదకాలిస్తోంది''అని సలేహ్‌పౌర్ ఆరోపించారు.

సమస్యలు ఎత్తిచూపి శాశ్వత నిద్రలోకి..

క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌గా 32 ఏళ్లు బోయింగ్‌లో పనిచేసిన జాన్ బార్నెట్ సైతం పలు లోపాలను ఎత్తిచూపారు. ''అత్యధిక పని ఒత్తిడి కారణంగా సిబ్బంది.. తయారీ లోపాలున్నాసరే ఆయా భాగాలను బిగించేస్తున్నారు. ఆక్సిజన్ వ్యవస్థల్లో ఇలాంటి లోపాలను గుర్తించా. ప్రతి నాలుగింట ఒక ఎమర్జెన్సీ బ్రీతింగ్ మాస్క్‌లో లోపం ఉంది. వాడేటప్పుడు ఇవి విఫలమవడం ఖాయం''అని అన్నాడు. ఈ లోపాలను బయటపెట్టినందుకు ఈయనపై కేసు నమోదైంది. తర్వాత ఈయన ఆత్మహత్యచేసుకున్నారు. విమానాల్లో లోపాలను క్వాలిటీ ఆడిటర్ జాషువా డీన్ సైతం బయటపెట్టారు. తర్వాత ఆయన సైతం అనారోగ్య సమస్యలతో చనిపోయారు. - సాక్షి, నేషనల్ డెస్క్

ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉంటారో, మేము వారిని తప్పక సద్వర్తనులతో చేర్చుతాము.
- ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 13 జూన్ 2025

ఆకాశంలో విషాదం!

గుజరాత్‌లోని అహమ్మదాబాద్ నుంచి 242 మంది ప్రయాణికులతో లండన్ బయల్దేరిన ఎయిరిండియా సంస్థ విమానం బోయింగ్–787–8 డ్రీమ్‌లైనర్ టేకాఫ్ అయిన కాసేపటికే గురువారం ప్రమాదానికి లోనై కూలిపోవటం ఎంతో విషాదకరం. మన విమానాలు ఎంతో సురక్షితమైనవనీ, ప్రమాదాలకు ఆస్కారం లేనివనీ పేరుంది. ఇప్పుడు కూలిపోయిన విమానం పదకొండేళ్లుగా వినియోగంలో ఉంది. ఈ తరహా విమానాల స్థానంలో కొత్తవి కొనుగోలు చేసే ఆలోచన కూడా ఉంది. ఇంతలోనే ఈ దురదృష్టకర సంఘటన జరిగింది. ప్రయాణికుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సహా 169 మంది భారతీయులు కాగా, 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ వాసులు, కెనడావాసి ఒకరు వున్నారని ఎయిరిండియా సంస్థ ప్రకటన చెబుతోంది. వీరిలో ఒక్కరు గాయాలతో బయటపడ్డారు. భవనంపై ఈ విమానం కూలడంతో అందులో కూడా మరణాలు సంభవించాయని, చాలామంది గాయపడ్డారని అంటున్నారు. వర్తమాన యుగంలో దేశాల మధ్య అనుసంధానం బాగా పెరిగింది. వ్యాపారం, వాణిజ్యం, చదువు, ఉపాధి, పర్యాటకం లాంటి ఎన్నెన్నో అవసరాల నిమిత్తం ఒకచోటనుంచి మరో చోటుకు ప్రయాణిస్తున్నవారి సంఖ్య పదేళ్ల క్రితంతో పోల్చినా ఎన్నో రెట్లు పెరిగింది. ఒకప్పుడు సంపన్న వర్గాల సొంతం అనుకునే విమానయానం ఇవాళ మధ్యతరగతి పౌరులకు సైతం జీవితావసరంగా మారింది.

ఎప్పటికప్పుడు అందుబాటులోకొస్తున్న సాంకేతికతలు విమానయానాన్ని సురక్షితం చేశాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మానవ తప్పిదాలకు ఆస్కారం ఉంటుంది గనుక విమాన గమనాన్నీ, దాని తీరుతెన్నులనూ నిర్దేశించగల మెకానికల్, హైడ్రో మెకానికల్ నియంత్రిత వ్యవస్థలు ప్రవేశించాయి. ఇందువల్ల పైలెట్ ఒక కమాండ్ ఇవ్వగానే దానికి సంబంధించిన అనుబంధ మార్పులన్నీ ఒకదాని వెంబడి మరోటి వేగంగా పూర్తవుతాయి. ఈ క్రమంలో ఎక్కడ లోపం కనిపెట్టినా సెన్సర్లు గుర్తిస్తాయి. ఆ వెనకే తక్షణం సరిచేయగల వ్యవస్థలకు సంకేతాలిస్తాయి. ఏకకాలంలో అనేక పనుల్ని క్షణాల్లో చేయగలిగే ఈ వ్యవస్థల కారణంగా పైలెట్ల పని గతంతో పోలిస్తే చాలా మేరకు తగ్గిందనే చెప్పాలి. అయితే పైలెట్ సొంతంగా ఆలోచించాల్సిన అవసరం లేకపోవటం ఇందులోని బలహీనత. ఏ వృత్తిలోనైనా అనుభవపూర్వకంగా తెలుసుకోగలిగినవెన్నో ఉంటాయి. అన్నీ యంత్రాలే చేయటం ఆ అనుభవాలకు పరిమితులు విధిస్తుంది.

మరి ఇంత సాంకేతికాభివృద్ధి జరిగినా ప్రమాదం ఎలా సంభవించిందన్నదే ప్రశ్న. ఒక మాదిరి విశాలంగా, ఒకేసారి 290 మంది ప్రయాణించగల ఈ మోడల్ విమానాలను ప్రపంచవ్యాప్తంగా ఎన్నో విమానయాన సంస్థలు వినియోగిస్తున్నాయి. ఎక్కడా ఆగకుండా ఏకబిగిన వేలాది కిలోమీటర్లు ప్రయాణించగల సామర్థ్యం దీని సొంతం. అయినా ఈ విషాదం ముంచుకొచ్చింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం చోటుచేసుకుని ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు. పైలెట్ నుంచి తక్షణ సాయం అవసరమని సూచించే 'మేడే కాల్' కూడా అందింది. ఆ మరుక్షణమే విమానం ప్రమాదంలో చిక్కుకుంది. దూరప్రయాణం కనుక ఇంధనం అధికంగా ఉంది. దాని వల్ల ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. విమానాశ్రయం చుట్టుపక్కల ఆవాసాలుండటం ఒక సమస్య. అందువల్ల ఆహారం కోసం వచ్చే పక్షులు విమానాలకు ముప్పు తెస్తాయి. అయితే ఇలాంటి సందర్భాల్లో 92 శాతం వరకూ పెద్దగా ప్రమాదం ఉండకపోవచ్చంటారు. మహా అయితే అత్యవసర ల్యాండింగ్ తప్పకపోవచ్చు. కానీ ఆ మిగిలిన 8 శాతం మేర ముప్పు పొంచివున్నట్టే లెక్క. పక్షుల గుంపు విమాన మార్గంలో అడ్డు తగలటం, దానికుండే రెండు ఇంజన్లలోనూ అవి చిక్కుకోవటం వంటి కారణాలు ప్రమాదానికి దోహదపడ్డాయా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అయితే ఈ డ్రీమ్‌లైనర్ రకం విమానాల్లో నిర్వహణా లోపాలున్నాయని చాన్నాళ్లుగా ఫిర్యాదులందుతున్నాయి. వాటి పర్యవసానంగా విమానాలు కూలిపోవటం వంటివి చోటుచేసుకోలేదుగానీ అవి భారీ కుదుపులకు లోనై ప్రయాణికులు గాయపడిన ఉదంతాలున్నాయని ఏవియేషన్ సేఫ్టీ నెట్‌వర్క్ (ఏఎస్ఎన్) గణాంకాలు చెబుతున్నాయి. నిరుడు జనవరిలో అలాస్కా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం ప్రయాణంలో ఉండగా దానికి చిల్లుపడి చొచ్చుకొచ్చిన పెనుగాలి ధాటికి ప్రయాణికులు భయభ్రాంతులకు లోనయ్యారు. అప్రమత్తమైన పైలెట్ చాకచక్యంగా కిందకు దించటంతో ముప్పు తప్పింది. విమానం ఫ్యూజలాజ్ (ప్రయాణికులు కూర్చునే బాడీ) నిర్మాణం సక్రమంగా లేదని, అందువల్ల ముప్పు ఏర్పడే అవకాశమున్నదని బోయింగ్‌లో పనిచేసిన ఒక ఇంజనీర్ నిరుడు వెల్లడించినప్పుడు సంస్థ కొట్టిపారేసింది. విస్తృతంగా పరీక్షలు జరిపాక వెంటనే సమస్యాత్మకం అయ్యేదేమీ లేదని ప్రకటించింది. అయితే ఈ కంపెనీ రూపొందించిన 737 రకం విమానాలు రెండు 2018, 2019 సంవత్సరాల్లో కుప్పకూలి 346 మంది మరణించారు. ఈ రెండు ఉదంతాల్లోనూ తన నేరసంబంధ బాధ్యత నుంచి తప్పించుకోవటానికి అమెరికా ప్రభుత్వంతో గత నెలలోనే ఒప్పందానికొచ్చింది. ప్రభుత్వ పర్యవేక్షణను తప్పించుకునే ప్రయత్నం చేసినందుకు భారీయెత్తున జరిమానా చెల్లించింది. విమానాల తయారీలో నాణ్యతనూ, భద్రతనూ మరింత పెంచుతామని లిఖితపూర్వక హామీ ఇచ్చింది. ఈ దురదృష్టకర ఘటనపై జరిగే దర్యాప్తులో ఉత్పాదక సంబంధ లోపాలపై కూడా దృష్టి పెట్టాల్సివుంది. ఇదే సమయంలో విమానయాన సంస్థలన్నీ భద్రతపై మరింత శ్రద్ధపెట్టి పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి.

ఇలాంటి ఎన్నికలతో అనిశ్చితి పోతుందా?

విశ్లేషణ



నిరుపమా సుబ్రమణియన్

వచ్చే ఏడాది ఏప్రిల్ మొదటి పక్షంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ ప్రకటించారు. అసలు ఆయనకు అధికారాన్ని ప్రజా ప్రతినిధులకు అప్పగించే ఉద్దేశం ఉందా అనీ ఆయన విమర్శకులు, ప్రత్యర్థులు ప్రశ్నిస్తున్న తరుణంలో, ఎన్నికలను ప్రకటించడం ద్వారా వారి నోటికి తాళం వేసే ప్రయత్నం చేశారు.

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని బలవంతంగా గద్దె దింపి పది నెలలు గడుస్తున్నా, తాత్కాలిక ప్రభుత్వం దేశంలో కొద్ది మేరకైనా శాంతి భద్రతలను పునరుద్ధరించలేకపోయింది. యూనస్ నిర్ణయాల పట్ల బంగ్లాదేశ్ సైన్యం బాహాటంగానే అసంతృప్తిని వ్యక్తపరచింది. ఉదాహరణకు, ఐక్యరాజ్య సమితి ప్రోద్బలంతో, బంగ్లాదేశ్ నుంచి మయన్మార్‌లోని రాఖినే రాష్ట్రం వరకు 'మానవీయ కారిడార్' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ విషయమై తమను సంప్రదించనేలేదని సైన్యం ప్రకటించింది. ''అన్ని పార్టీలను కలుపుకొనిపోతూ, వీలైనంత త్వరగా'' ఎన్నికలు నిర్వహించాలని సైన్యం హితవు పలికింది. తాము లేనిదే దేశానికి వేరే దిక్కు లేదని భావించే నాయకులు ఏనాటి నుంచో అనుసరిస్తూ వస్తున్న ఎత్తుగడనే యూనస్ కూడా ఆశ్రయించారు. రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించడం, ఊహించినట్లుగానే ఆయనను పదవిలో కొనసాగమని కోరడం జరిగిపోయింది.

ఈ ఏడాదిలో జరగాల్సిందే!

అయితే, దేశంలో నెలకొన్న రాజకీయ అస్థిరతను కానీ, యూనస్ ఉద్దేశాలపై ఉన్న సందేహాలను కానీ ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహిస్తామన్న ప్రకటన తొలగించలేకపోయింది. అవామీ లీగ్ తర్వాత, దేశంలో రెండవ అతి పెద్ద పార్టీ అయిన బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్పీ) కూడా ఎన్నికలకు అంత వ్యవధి తీసుకోవడాన్ని వ్యతిరేకించింది. ఈ ఏడాది ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఈ విషయంలో అదీ, సైన్యం ఒకే వైపున నిలిచాయి. పదేళ్ళ పైచిలుకుగా బీఎన్పీ వేధింపులకు, అణచివేతకు గురైంది. హసీనా ప్రభుత్వంపై ఆగ్రహావేశాలతో నిండిన దేశంలోని ప్రస్తుత సంక్షుభిత రాజకీయ వాతావరణంలో, ఎన్నికల్లో అతి పెద్ద విజయాన్ని చేజిక్కించుకోవాలని బీఎన్పీ ఉవ్విళ్ళూరుతోంది.

ఎన్నికలను వచ్చే ఏడాది నిర్వహించడానికి యూనస్ ఒక సాకు చూపుతున్నారు. పదవిని చేపట్టినపుడు తాను మూడు వాగ్దానాలు చేశాననీ, జాతీయ ఏకాభిప్రాయ సాధన ప్రక్రియ ద్వారా రాజ్యాంగ, ఎన్నికల, ఇతర సంస్థాపరమైన సంస్కరణలు తీసుకొస్తానని అన్నాననీ, వాటిని నెరవేర్చవలసి ఉందనీ ఆయన చెబుతున్నారు. ఆ తర్వాతనే, ఎన్నికలు అన్నది ఆయన అభిప్రాయంగా ఉంది.

బీటలువారిన రాజకీయ, పాలనా, న్యాయ వ్యవస్థలకు కాయకల్ప చికిత్స చేస్తేనే ఎన్నికలు సత్ఫలితాలు ఇవ్వగలవని యూనస్ వాదన. లేకపోతే గతంలో మాదిరిగానే, ఒకే పార్టీ పాలన కిందకు దేశం వస్తుందనీ, హసీనా మూడు విడతల పాలనలో చూసిన నిరంకుశ పార్శ్వాన్నే తిరిగి చూడవలసి ఉంటుందనీ అంటున్నారు. ఈ రకమైన సంస్కరణలను 2008 ఎన్నికలకు ముందే తీసుకొచ్చి ఉంటే,



నేటి రక్తపాతాన్ని, రాజకీయ కల్లోల పరిస్థితులను నివారించగలిగి ఉండేవారమనే అభిప్రాయం దేశంలోని కొన్ని వర్గాల్లో ఉంది.

అవామీని దూరం చేయకూడదు!

ప్రతి పార్శ్వాన్నీ అధ్యయనం చేసి మార్పులను సూచించేందుకు యూనస్ ఆరు కమిషన్లను ఏర్పాటు చేశారు. అవి నివేదికలను కూడా సమర్పించాయి. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడిన 'జాతీయ ఏకాభిప్రాయ కమిషన్' సంస్కరణలపై సర్వతోముఖ అంగీకారాన్ని కుదిర్చే పనిలో ఉంది. కానీ, అటువంటి ఏకాభిప్రాయం కనుచూపు మేరలో కనబడకపోవడంలో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు.

బీఎన్పీకి అధికారం పదేళ్ళుగా అందని మానిపండుగానే ఉన్నప్పటికీ, దాని నాయకురాలు ఖలీదా జియా ఏళ్ళ తరబడి జైల్లో మగ్గినప్పటికీ దాని రాజకీయ చతురత ఏమాత్రం మొక్కవోలేదు. సంస్కరణలపై ఏకాభిప్రాయం కొరవడటాన్ని సాకుగా చూపి ఎన్నికలను వాయిదా వేయకూడదని అది పేర్కొంది. ఎన్నికలను వాయిదా వేస్తూ పోవడం వల్ల దేశంలో అల్లకల్లోలం తీవ్రరూపం దాల్చవచ్చనే భయాలున్నాయి. పరిస్థితులు మరింత దిగజారి ఎన్నికల నిర్వహణే అసాధ్యంగా మారే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

అవామీ లీగ్‌ను నిషేధించి, ఎన్నికల్లో పాల్గొనడానికి లేకుండా చేయడం వల్ల సంస్కరణలు, ఏకాభిప్రాయ సాధనకు సంబంధించిన మాటలంతా శుష్క వాగ్దానాలుగానే కనిపిస్తున్నాయి. హసీనా, ఆమె అంతరంగిక పరివారంలోని అనేక మంది నాయకులు ఢిల్లీలో అజ్ఞాత జీవితం గడుపుతూండటంతో ఆమె పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు స్వదేశంలో లక్ష్యంగా మారుతున్నారు. అవామీ లీగ్ బక్కచిక్కిన స్థితిలో ఉన్నప్పటికీ, అది ఎన్నికల్లో పాల్గొనకపోతే, బంగ్లాదేశ్‌కు చెందిన అనేక సమస్యలకు ఎటువంటి పరిష్కారాలను ముందుకు తెచ్చినా అవి నిష్ప్రయోజనమైనవే అవుతాయి. ఒక రాజకీయ పార్టీని ఎన్నికలకు దూరంగా ఉంచడం వల్ల రాజకీయ, సామాజిక విభేదాలు మరింత పెరుగుతాయి. హసీనా చేసిన అనేక తప్పిదాలు పునరావృత్తమయ్యేలా ఇది తిరిగి బాటలు పరచడమే అవుతుంది.

బలం పెంచుకుంటున్న జమాత్!

మరోవైపు, దేశ విముక్తికి ముందు నెలల్లో, పాకిస్తాన్ సైన్యంతో చేతులు కలిపి అత్యాచారాలకు ఒడిగట్టిన జమాత్–ఏ–ఇస్లామీకి జవజీవాలు నింపే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఒక రాజకీయ పార్టీగా జమాత్‌కున్న రిజిస్ట్రేషన్ గతంలో రద్దయింది. జాతీయ

◆ అవామీ లీగ్ లేకుండా ఎన్నికలు నిర్వహించడం షేక్ హసీనా చేసిన తప్పిదాలనే తిరిగి చేయడమవుతుంది.

◆ అవామీ లీగ్ స్థాపకుడు, జాతిపిత షేక్ ముజిబుర్ రహమాన్ ఇంటిని లూటీ చేసి నిప్పుపెట్టి ఉండవచ్చుగాక. కరెన్సీ నోట్ల నుంచి ఆయన ఫోటోను తొలగించి ఉండవచ్చుగాక. కానీ, బంగ్లాదేశ్ 1971 మార్చిలో స్వాతంత్ర్య ప్రకటన చేసుకున్న తర్వాత సాగిన హత్యలు, అత్యాచారాల జ్ఞాపకాలను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచేయడం అంత తేలిక కాదు.

రాజ్యాంగంలోని లౌకిక సూత్రాలకు ఆ పార్టీ నియమావళి విరుద్ధంగా ఉందంటూ హసీనా కనుసన్నల్లోని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో జమాత్ పార్టీ 2013లో జరిగిన ఎన్నికల్లో పాల్గొనలేకపోయింది. హసీనా ఏర్పాటు చేసిన 'ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు' జమాత్ నాయకుడు అజహరుల్ ఇస్లామ్‌ను విచారించి, దోషిగా ప్రకటిస్తే, ప్రభుత్వం గత నెలలో ఆయనను విడుదల చేసింది.

అప్పట్లో జమాత్ నాయకులు కోర్టు విచారణలను పక్షపాతంతో కూడినవిగా, సందేహాస్పదమైనవిగా ఆక్రోశించారు. వైచిత్రి ఏమిటంటే, బంగ్లాదేశ్‌ను సరైన బాటలో పెట్టాలని కోరుకుంటున్నట్లు చెబుతున్న యూనస్ ప్రభుత్వం... అవినీతి ఆరోపణలపైన, 'మానవాళిపై చేసిన నేరాలకు'గాను హసీనాను విచారించడానికి అదే కోర్టును వినియోగించుకుంటోంది. ఆమె లేకుండానే చేసే ఆ విచారణ ఫలితం ఎలా ఉండబోతోందో ముందే తెలుసు. హసీనాను అప్పగించాలనే బంగ్లాదేశ్ డిమాండ్‌కు భారత్ అంగీకరించకపోవచ్చు. ఈ అంశం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత కుంగదీస్తుంది. అవామీ లీగ్ కూడా ఎన్నికల్లో పాలుపంచుకునేట్లు ప్రభుత్వంపై సైన్యం ఒత్తిడి తేగలదన్నదే ఆ పార్టీకి ఆశాకిరణంలా ఉంది.

బీఎన్పీ మాజీ మిత్రపక్షమైన జమాత్ ఈసారి సొంతంగా ఎక్కువ విజయాలు సాధించగలమని ధీమాతో ఉంది. ఎన్నికల నిర్వహణను అది కూడా గాఢంగా కోరుకుంటున్నప్పటికీ, దానికి వ్యవధి తీసుకున్నా ఫరవాలేదని భావిస్తోంది. ఎన్నికలను 2026 మధ్యలో నిర్వహించాలని జమాత్ చేస్తున్న డిమాండ్‌కు యూనస్ నిర్ణయించిన ఏప్రిల్ ముహూర్తం దగ్గరగానే ఉంది. ఈలోగా క్షేత్రస్థాయిలో తన పార్టీని పటిష్ఠపరచుకోవడానికి ఆ కాలం కలిసొస్తుంది.

అవామీ లీగ్ స్థాపకుడు, జాతిపిత షేక్ ముజిబుర్ రహమాన్ ఇంటిని లూటీ చేసి నిప్పుపెట్టి ఉండవచ్చుగాక. కరెన్సీ నోట్ల నుంచి ఆయన ఫోటోను తొలగించి ఉండవచ్చుగాక. కానీ, బంగ్లాదేశ్ 1971 మార్చిలో స్వాతంత్ర్య ప్రకటన చేసుకున్న తర్వాత సాగిన హత్యలు, అత్యాచారాల జ్ఞాపకాలను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచేయడం అంత తేలిక కాదు. 'పార్టీ సభ్యుల గత చర్యలకు' జమాత్ అధినేత షఫీకుర్ రహమాన్ క్షమాపణ కోరినంతమాత్రాన సరిపోదు. బంగ్లాదేశ్‌తో సంబంధాలను 'సాధారణీకరించుకోవాలని' పాకిస్తాన్ పెట్టుకున్న లక్ష్యం కూడా అందుకే నెరవేరకపోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

మొదటి దారుణం!



చరిత్రలో మొదటి సారి బి–787 డ్రీమ్‌లైనర్ విమానం కూలిపోయింది. అత్యంత సురక్షితమైన విమానాల్లో దీన్నీ ఒకటిగా పరిగణిస్తారు. అత్యంత దిగ్భ్రాంతికరం!

- ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

రాజీనామా చేయాలి!



1950ల్లో రైలు పట్టాలు తప్పినప్పుడు, లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా చేశారు. అదే నైతిక బాధ్యత తీసుకుని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి. అప్పుడే స్వేచ్ఛాపూరిత పారదర్శకమైన విచారణ జరుగుతుంది.

- సుబ్రహ్మణ్య స్వామి, కేంద్ర మాజీ మంత్రి

జవాబు కావాలి!



బోయింగ్ 787 భద్రతా సమస్యలు: 2013- బ్యాటరీ మంటలు ప్రపంచవ్యాప్తంగా గ్రౌండింగ్ (ఎర్తింగ్)కు దారి తీశాయి. 2019–20: ఫ్యూజలాజ్ (ప్రధాన భాగం), బిగింపులు, తోక భాగంలో సమస్యలొచ్చాయి. 2021–22: నాణ్యతా ప్రమాణాల తప్పుల వల్ల యూఎస్ ఎఫ్ఏఏ డెలివరీలను నిలిపేసింది. 2025: మొదటిసారి ఏ విధమైన రిపేర్‌కూ ఆస్కారం లేనంతగా 787 దారుణ క్రాష్ జరిగింది. బోయింగ్ జవాబు చెప్పాలి!

- అతుల్ కుమార్ మిశ్రా, ఆంట్రప్రెన్యూర్

చద్దివార్తలే నయం!



పహల్గామ్ ఉగ్రదాడి, బెంగళూరులో తొక్కిసలాట, ముంబయి లోకల్ రైలు విషాదం, అహ్మదాబాద్‌లో విమానం ఘోరంగా కుప్పకూలడం – ఇప్పటివరకూ 2025 దారుణంగా నడుస్తోంది. ఈ దారుణ వార్తలు చూశాక... బోరింగ్ వార్తల చక్రం బలంగా కావాలనిపిస్తోంది. – చంద్ర ఆర్. శ్రీకాంత్, జర్నలిస్ట్

ఏమని చెబుతాం?



మనుషుల ప్రాణ నష్టపు దుఃఖాన్ని వ్యక్తపరచడానికి మాటలు ఎప్పుడూ అశక్తమైపోతాయి. ముఖ్యంగా ఆ నష్టం ప్రమాదాల రూపంలో జరిగినప్పుడు!

– ఉర్వీశ్ కొఠారీ, గుజరాతీ రచయిత

ఇన్ బాక్స్

జన భార(త)మ్

ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం భారత జనాభా 146 కోట్లకు చేరుకుంది. అది 40 ఏళ్లలో 170 కోట్లకు చేరుకుని, తర్వాత తగ్గడం మొదలుపెడుతుంది. ఎందుకంటే ప్రస్తుత జననాల రేటు స్థిరీకరణకు అవసరమైన 2.1 కన్నా తక్కువగా 1.9గా కొనసాగుతోంది. అలా తక్కువగా కొనసాగడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. కాబట్టి దాన్ని అధిగమించాలా, లేక ప్రపంచంతోనే నడుస్తూ, భారత్ కూడా అట్టే పట్టించుకోనక్కర లేదా అన్నది ఒక కోణం.

ఇప్పుడు దృష్టి పెట్టాల్సిన రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఒకటి – జనాభాలో 68 శాతం పని చేయగల వయస్సు వారు. 64 ఏళ్ల లోపు వారు. అందులో యువత కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. సమగ్ర ప్రణాళికల అమలుతో వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చు. ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఉపాధి వీలైనంత ఎక్కువమందికి చౌకగా అందుబాటులో ఉంచాలి. వ్యవసాయం, పరిశ్రమలు, పరిశోధన, సేవలు, ఉత్పాదకత రంగాలను ఆధునిక సాంకేతికత సాయంతో దేశం స్వయం సమృద్ధి సాధించడానికే కాకుండా ప్రపంచ దేశాలకు ఉత్పత్తులను అందించే స్థాయికి తీసుకురావాలి. ప్రస్తుతం తీసికట్టుగా ఉన్న మానవ అభివృద్ధి సూచీల మెరుగుదల సాధించాలి. నలభై శాతం దేశ సంపద, ఆదాయాలు ఒక్క శాతం మంది చేతిలో ఉండడం సరి కాదు. అందుకనే సంపద పంపిణీ, పేదరిక నిర్మూలనలపై విధానాలను పునస్సమీక్షించుకోవడం అవసరం.

ఇక రెండో ముఖ్యాంశం: వృద్ధులు జనాభాలో ఏడు శాతం. జీవన ప్రమాణాల పెంపుతో ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. వారికి సామాజిక రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత కనుక నూతన విధానాలతో ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉంటుంది. అలాగే జననాల రేటు తగ్గినా అది దేశవ్యాప్తంగా ఒకేలా లేదు. అందుకనే దక్షిణాది రాష్ట్రాలు పిల్లల్ని ఎక్కువగా కనమని పిలుపు ఇస్తుంటే, ఉత్తరాది వారు ఎక్కువమందితో సతమతమవుతున్నారు. దీర్ఘకాలిక వ్యూహంతో డీల్ చేస్తే అధిక జనాభా దేశానికి వరం. లేదంటే పెను భారం.

– డా॥ డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

మొదలు నరికినా మొలకెత్తే చేవ!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

పది రోజుల కింద 'మహారాష్ట్ర అంగన్‌వాడీ కర్మచారి సంఘటన్ వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో బొంబాయి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గౌరి గాడ్సే, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్ ఇచ్చిన మధ్యంతర ఆదేశానికి అనేక రకాలుగా ప్రాధాన్యం ఉంది. ఆ ఆదేశం ఆ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో పాటించవలసిన కనీస నిబంధనలను గుర్తు చేసింది. అది ఆ రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన ఉద్యోగానికి కనీసం పదకొండు సంవత్సరాలుగా నియామకాలు జరగలేదనే వాస్తవాన్ని బయట పెట్టింది. అది ఆ రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగులు ఇరవై సంవత్సరాలకు పైగా పదోన్నతి లేకుండా కింది స్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్నారని చూపింది. అన్నిటికీ మించి, అంగన్‌వాడీ కర్మచారి సంఘటన్ తరఫున ఈ కేసు వాదించి గెలిచిన న్యాయవాది ఎన్నో ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని, తన ప్రజా జీవనాన్నీ, తన న్యాయవాద వృత్తినీ ధ్వంసం చేయడానికి పాలకులు చేసిన ప్రయత్నాలను ధిక్కరించి, ప్రజా ప్రయోజన, కార్మిక సంక్షేమ కృషిలో మొక్కవోని దీక్షతో కొనసాగుతున్నారని చూపింది.

మహారాష్ట్ర ప్రభుత్వం 'ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్'(ఐసీడీఎస్)లో భాగమైన అంగన్‌వాడీ ముఖ్య సేవిక అనే పర్యవేక్షక ఉద్యోగ నియామకాల కోసం 2021 జూన్ 4న ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. మళ్లీ 2025 ఫిబ్రవరి 4న కూడా ఆ ఉద్యోగాలకు సంబంధించే మరొక నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్పటికే ఆ ఉద్యోగం కన్నా కింది స్థాయి సేవిక (వర్కర్) ఉద్యోగంలో పది సంవత్సరాలకు పైగా, కొన్ని సందర్భాలలోనైతే ఇరవై, ఇరవై అయిదు సంవత్సరాలకు పైగా పని చేస్తున్న వారికి ఈ ముఖ్య సేవిక ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు.

అంగన్‌వాడి సేవికల సంఘమైన మహారాష్ట్ర అంగన్‌వాడీ కర్మచారి సంఘటన్ తమకు జరిగిన ఈ అన్యాయాన్ని న్యాయస్థానంలో సవాల్ చేయదలచుకుంది. వారి తరఫున న్యాయవాది సుధా భరద్వాజ్ బాంబే హైకోర్టులో పిటిషన్ వేశారు. వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో వీరికి కూడా అవకాశం కల్పించేలా మార్పులు చేయాలని, ఈ మార్పులకు తగినట్టుగా గడువు తేదీలు మార్చాలని కోర్టు ఇప్పుడు మధ్యంతర ఆదేశం ఇచ్చింది. ఈ ఆదేశం మహారాష్ట్రలో ఎన్నో సంవత్సరాలుగా సేవికలుగా ఎదుగూ బొదుగూ లేకుండా పని చేస్తున్న వేలాదిమందికి ఒక ఆశాసూచిక.





సుధా భరద్వాజ్

దేశంలో మొత్తంగా కొనసాగుతున్న కార్మిక వ్యతిరేక విధానాలలో ఈ మధ్యంతర తీర్పు ఒక చిన్న ఊరట. సుధా భరద్వాజ్ ఛత్తీస్‌గఢ్‌లో దాదాపు రెండు దశాబ్దాలు ప్రధానంగా కార్మిక వ్యవహారాల న్యాయవాదిగా, ఆ తర్వాత ఢిల్లీలో ఒక న్యాయ శాస్త్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసిన వ్యక్తి. సుధా భరద్వాజ్ ప్రపంచ ప్రఖ్యాత అర్థశాస్త్రవేత్త కృష్ణా భరద్వాజ్ కూతురు. అమెరికాలో పుట్టి, అమెరికన్ పౌరురాలిగా అక్కడే పదకొండేళ్ల వయసు దాకా ఉన్నారు. ఢిల్లీలో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రారంభిస్తున్నప్పుడు అక్కడి అర్థశాస్త్ర శాఖను నిర్మించమని కృష్ణా భరద్వాజ్‌కు పిలుపు వెళ్లగా, సుధ కూడా తల్లితో పాటు ఢిల్లీ వచ్చారు. పద్దెనిమిదేళ్ల వయసు రాగానే స్వచ్ఛందంగా తన అమెరికన్ పౌరసత్వం వదులుకున్నారు. కాన్పూర్ ఐఐటీలో గణితశాస్త్రంలో ఎంఎస్ చేశారు. విద్యార్థి దశలో ఎన్ఎస్ ఎస్‌లో భాగంగా ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ గ్రామీణ ప్రాంతాలకు, కార్మిక ప్రాంతాలకు వెళ్లి, కుల, వర్గ అసమానతలను చూసి, ఆ పేద ప్రజల సేవలోనే తన జీవితం గడపాలని నిర్ణయించుకున్నారు. అప్పటి మధ్యప్రదేశ్‌లో గని కార్మికులను సంఘటితం చేస్తున్న శంకర్ గుహ నియోగి ఆలోచనలతో, ఆచరణతో ప్రభావితమై తన ఇరవై ఐదవ ఏట, 1986లో అక్కడ కార్మికుల మధ్య పని చేయడానికి వెళ్లారు. అనేక సంఘాల్లో పని చేయడం ప్రారంభించారు.

భిలాయిలో ఎక్కువగా నిరక్షరాస్యులైన కార్మికుల మధ్య, పేదల మధ్య పని చేస్తున్నప్పుడు, అక్కడ చదువు వచ్చిన ఏకైక వ్యక్తిగా ఆమె ఆ కార్మికులకు, పేదలకు జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడడానికి, న్యాయస్థానాలలో కేసులు వేయడానికి ఎక్కువగా న్యాయవాదులను కలవ వలసి ఉండేది. పిటిషన్లు రాయవలసి ఉండేది. అటువంటి పనులు చేస్తుండగా, ఆ కార్మికులు 'మీరే ఎందుకు న్యాయవాది కాకూడదు' అని ప్రోత్సహించడంతో, 2000 నాటికి తానే న్యాయవాదిగా మారారు. భూకబ్జాలకు, పెత్తందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, కార్మికుల హక్కులనూ, ఆదివాసుల సామూహిక అటవీ హక్కులనూ, పర్యావరణాన్నీ పరిరక్షించడానికి ఎన్నో కేసులు వాదించారు. 'జన హిత' అనే న్యాయవాదుల బృందాన్ని ఏర్పాటు చేశారు. 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్'లో పని చేశారు.

ఇలా ఛత్తీస్‌గఢ్‌లో, ముఖ్యంగా బిలాస్‌పూర్ హైకోర్టులో, ఇతర న్యాయస్థానాల్లో ఆదివాసుల కోసం, కార్మికుల కోసం, మహిళల కోసం ఆమె చేస్తున్న విస్తారమైన పని, ప్రభుత్వానికి కంటగింపు అయింది. ఆమె పనిని అడ్డుకోవడానికి, వేధించడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరికి 'అర్బన్ నక్సల్' అనే ముద్ర కొట్టి 2018 ఆగస్ట్ 28న ఆమెను అరెస్టు చేసి భీమా కోరేగాం కేసులో నిందితురాలిగా చూపారు. మూడేళ్ల జైలు జీవితం తర్వాత 2021 డిసెంబర్‌లో షరతులతో కూడిన బెయిల్ మీద ఆమె విడుదల య్యారు. ఆ షరతుల్లో ప్రధానమైనది, 'ముంబయి వదిలి పోకూడదు' అనేది. అందుకే బొంబాయి హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఈ అంగన్‌వాడీ సేవికల కేసులో గణనీయమైన విజయం సాధించారు.


వ్యాసకర్త 'వీక్షణం' ఎడిటర్

యోగ్యులకే...

'సుధాపి విషమేవ స్యాద్దత్తా అపాత్రే భవేద్యది' అనే సూక్తి అందరికీ తెలిసిందే. యోగ్యత లేని వానికి అమృతమిస్తే అది కాస్తా విషంగా పరిణమిస్తుందని అర్థం. ఎవరికైనా సలహా సంప్రదింపులు ఇవ్వదలచుకొంటే అవతలి వ్యక్తికి యోగ్యత ఉంటేనే ఇవ్వాలి. లేదంటే... చెప్పినా ప్రయోజనం కలగదు. పైగా తేలిక భావం ఏర్పడుతుంది.

దేశసంచారం చేస్తూ ప్రజలకు జ్ఞానప్రబోధం కలిగిస్తున్న యోగి ఒక గ్రామంలో ప్రవేశిస్తూనే ఎదురుగా వస్తున్న ఒక వ్యక్తిని పిలిచి 'నాయనా ఈ ఊళ్ళో పోస్టాఫీసు ఎక్కడ?' అని అడిగాడు. ఆ వ్యక్తి ఫలానా చోట అని చెప్పి తన దారిన పోతుండగా అతణ్ణి ఆపి, 'మంచిది బాబూ! ఈ రోజు సాయంకాలం మీ ఊరు టౌనుహాల్లో ముక్తి మార్గాన్ని గురించి నేను ఉపన్యాసం చెప్పటానికి ఇక్కడి వాళ్ళు ఏర్పాటు చేశారు. కనుక నా ఉపన్యాసం విందువుగాని నీవు కూడా తప్పకుండా రా నాయనా!' అని కృతజ్ఞతాపూర్వకంగా అన్నాడు. అవతలి వ్యక్తికి ఇదేదీ పట్టలేదు. అతను వెంటనే 'అయ్యా! నీకు పోస్టాఫీసుకే దారి తెలియక అడిగావు. అలాంటి వాడికి ముక్తికి దారి ఎలా తెలుస్తుంది? బాగానే ఉంది చాల్లే' అంటూ వెటకారం చేశాడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మరో ఉదాహరణ చూద్దాం: దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాల సముద్రం మథించారు. అమృతం పుట్టింది. కాని అమృతం దేవతలకే చెందాలి, రాక్షసులకు చెందకూడదని విష్ణుమూర్తి సంకల్పం. అందుకని తాను మోహినీరూపం ధరించి రాక్షసుల్ని సమ్మోహంలో పడేసి వాళ్ళు అమృతం విషయం మరచిపోయేలాగా చేశాడు. దేవతలకు మాత్రమే అమృతం దక్కింది. అప్పటికీ అందరి కళ్ళూ కప్పి రాహువు దేవతల పంక్తిలో కూర్చొని అమృతం ఆరగించబోయాడు. అది తెలుసుకొని విష్ణువు తన చక్రంతో వాడి కంఠం ఉత్తరించాడు. ఇక్కడ రాక్షసులు అమృతపానానికి అర్హులు కారు. ఒకవేళ వారికది దక్కితే లోకాలను మరెంతగానో వేధించేవారు. అందుకనే అయోగ్యులను గుర్తించి విష్ణువు అలా చేశాడు.

సద్గురువు కూడా అర్హతానర్హతలను గుర్తించి ఉపదేశం చేస్తాడు. అందువల్ల సద్గురూపదేశానికి కావలసిన అర్హతను సంపాదించటం ప్రథమ కర్తవ్యం. జయ గురుదత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.విదియ ప.2.18 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.10.54 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ఉ.7.46 నుండి 9.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.18 వరకు, **అమృత ఘడియలు:** సా.5.43 నుండి 7.24 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

పిడుగుపాటుకు ఆరుగురు మృతి

- ఆదిలాబాద్ జిల్లాలో మూడుచోట్ల ఘటనలు
- అందరూ ఆదివాసీలే..మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు



పిడుగు పడినచోట చెల్లాచెదురుగా మృతదేహాలు

సాక్షి, ఆదిలాబాద్: మూడుచోట్ల పిడుగులు పడి ఆదిలాబాద్ జిల్లాలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. వీరంతా ఆదివాసీలే. గాదిగూడ మండలం పిప్పిరి గ్రామానికి చెందిన రైతు పెందూర్ మాధవరావు తన కుటుంబసభ్యులు, 14 మంది కూలీలతో కలిసి చేనులో గురువారం మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. మధ్యాహ్న భోజన సమయం తర్వాత మళ్లీ అదేపనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలోనే ఒక్కసారిగా వర్షం పడింది. దీంతో వారంతా సమీపంలోని ఓ పందిరి కిందకు చేరారు. అక్కడే ఓ టేకు చెట్టు ఉంది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా చెట్టుపై పిడుగు పడింది. దీంతో దానికి దగ్గరలోనే ఉన్న పెందూర్ మాధవరావు(45), ఆయన కూతురు పెందూర్ సుజాత(16), సిడం రంభబాయి(40), మంగం భీమ్‌బాయి (45) అక్కడికక్కడే మృతిచెందారు. మాధవరావు భార్య, ఇద్దరు కుమారులు, బంధువులు 10 మంది గాయపడ్డారు. వీరిని సమీపంలోని పీహెచ్‌సీలకు, మరికొందరిని మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

- బేల మండల పరిధిలోని సాంగిడి గ్రామంలో పత్తి విత్తనాలు వేస్తుండగా పిడుగు పడి గెడం నందిని(30), సోన్‌ఖాస్ గ్రామంలో పొలం పనులు చేస్తుండగా కోవ సునీత(40) అక్కడికక్కడే మృతిచెందారు.
- ఉట్నూర్ మండలం కుమ్మరితండాకు చెందిన ధర్మరాజు, కృష్ణబాయి, నిర్మల చేను పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.చేను సమీపంలోని చెట్టుపై పిడుగు పడడంతో ముగ్గురూ గాయపడ్డారు. వీరిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

రైలు బోగీలో ప్రసవం

- మగబిడ్డకు జన్మనిచ్చిన మహారాష్ట్ర మహిళ
- నిర్మల్ జిల్లా బాసర రైల్వేస్టేషన్‌లో ఘటన



శిశువుతో 108 సిబ్బంది

బాసర: నిర్మల్ జిల్లా బాసర రైల్వేస్టేషన్‌లో గురువారం ఆగిన రైలులో ఒక గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలివి. మహారాష్ట్రలోని ధర్మబాద్ మండలం కర్ఖెళ్లి గ్రామానికి చెందిన గర్భిణి నాగేశ్వరి వైద్య పరీక్షల నిమిత్తం నిజామాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. గురువారం తిరుగు ప్రయాణంలో నిజామాబాద్ నుంచి కాచిగూడ–నాగర్‌సోల్ రైలులో ధర్మబాద్ బయల్దేరింది. రైలు నిర్మల్ జిల్లా బాసర రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే.. ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. తోటి ప్రయాణికులు, ఆమె కుటుంబ సభ్యులు అప్రమత్తమై రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన రైల్వే అధికారులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. రైలు బాసర స్టేషన్‌లో ఆగగానే నాగేశ్వరికి నొప్పులు తీవ్రమయ్యాయి. తోటి ప్రయాణికులు సహకరించడంతో.. మగశిశువుకు జన్మనిచ్చింది. ఇంతలో 108 అంబులెన్స్ సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. తల్లీబిడ్డలను అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

కామాంధుల కర్కశత్వం

- 90 ఏళ్ల వృద్ధురాలిపై లైంగికదాడి

యాచారం: కాటికి కాలు చాచిన 90 ఏళ్ల వృద్ధురాలిపై గుర్తు తెలియని కామాంధులు లైంగికదాడికి పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఈ దుర్ఘటన వెలుగుచూసింది. బాధితురాలికి ముగ్గురు కొడుకులు, ఓ కూతురు సంతానం. వీరిలో ఓ కొడుకు చనిపోగా.. కూతురు, ఓ కొడుకు హైదరాబాద్‌లో, మరో కొడుకు యూఎస్‌లో స్థిరపడ్డారు. తమ వద్ద ఉండాలని ఎంత ప్రాధేయపడినా ఊరిపై మమకారంతో సొంత ఇంటిని వీడలేదు. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు బుధవారం రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి నిద్రకు ఉపక్రమించింది. అర్ధరాత్రి తర్వాత వచ్చిన దుండగులు తలుపు తన్నడంతో గడియ ఊడిపోయింది. లోనికి చొరబడిన ఆగంతకులు ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. దీంతో తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయింది. పక్కంట్లో ఉండే మహిళ ఉదయాన్నే వెళ్లి పిలవగా పలకలేదు. తలుపులు తట్టి చూసేసరికి దుస్తులు లేకుండా, రక్తస్రావమై, అచేతనంగా కనిపించడంతో గ్రామస్తులకు విషయం చెప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను వనస్థలిపురం ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ సిబ్బంది ఆధారాలు సేకరించారు. వృద్ధురాలు నివసించే ఇంటి పక్కనే కొంతమంది యువకులు అర్ధరాత్రి వరకూ మద్యం తాగుతారని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల ఓ వ్యక్తి డబ్బుల కోసం ఆమెను బెదిరించాడని చెప్పారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

బెయిల్‌పై ఓఎంసీ నిందితుల విడుదల

చంచల్‌గూడ: ఓఎంసీ అక్రమ మైనింగ్ కేసులో దోషులుగా ఉన్న బి.శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డిలు చంచల్‌గూడ జైల్లో శిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. కాగా వారి శిక్షను హైకోర్టు సస్పెండ్ చేయగా ఇరువురూ గురువారం ఉదయం జైలు నుంచి విడుదలయ్యారు. ఇతర నిందితులు గాలి జనార్దన్‌రెడ్డి, అలీఖాన్‌లు ప్రస్తుతం బెంగళూరు జైల్లో ఉన్నారు.

ముందస్తు నివారణ చర్యలే మేలు

- భారీ వర్షాలు, వరదల నష్టంపై మంత్రి పొంగులేటి
- వరద ముప్పు కట్టడికి హైదరాబాద్ మాదిరి జిల్లాల్లో ఏర్పాట్లు
- ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి ఉన్నతస్థాయి కమిటీ
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో రంగనాథ్, నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో తీవ్ర నష్టం జరిగిన తరువాత స్పందించడం కంటే.. నష్టం జరగకముందే నివారణ చర్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే అధిక వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ (ఐఎండీ) చెపుతున్న నేపథ్యంలో మంత్రి పొంగులేటి గురువారం సచివాలయంలో ప్రకృతి విపత్తుల నిర్వహణ ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలోనే జిల్లాల్లో వరదల ముప్పును ఎదుర్కొనేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ, ఆరోగ్య శాఖల కమిషనర్‌లతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని వివరించారు. తర్వాత కమిటీ నివేదిక ప్రకారం చర్యలు చేపడ్తామని తెలిపారు. వర్షాకాలం ముందుస్తుగానే వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని వైపరీత్యాల ప్రభావాన్ని వీలైనంత వరకు తగ్గించాలని మంత్రి ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదుల పరీవాహక ప్రాంతాల్లో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే భారీ వర్షాల వల్ల ఊహించని వరదలు వస్తున్నాయని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరీవాహక ప్రాంతాల్లోని నివాసితులను గుర్తించి వారిని అక్కడి నుంచి శాశ్వతంగా తరలించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మూసపద్ధతికి స్వస్తి చెప్పండి..

విపత్తుల నిర్వహణ విభాగం మూసపద్ధతికి స్వస్తి చెప్పి, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులను, పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి వరదల కార్యాచరణ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోగా తయారు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే వరద నియంత్రణ కట్టలు, చిన్న–మధ్య తరహా కాల్వలు, వర్షపు నీటి డ్రెయిన్‌లు.. మొదలైన వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలన్నారు. బోట్లు, లైఫ్ జాకెట్లు, అత్యవసర ఆహార కిట్లను ముందే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక సహాయక బృందాలను ఏర్పాటు చేసి, వారికి బాధితులను తరలించడం, తక్షణ స్పందన చర్యలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, విపత్తుల నిర్వహణ కమిషనర్, అగ్నిమాపక విభాగం డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయతీరాజ్ కమిషనర్ సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలుకు ఈఈ నూనె శ్రీధర్

- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు
- ఉదయం 6:30 గంటలకు జడ్జి ఇంటి దగ్గరే రిమాండ్



సిటీ కోర్టులు: ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించిన కేసులో నీటిపారుదల శాఖకు చెందిన కాళేశ్వరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారుజామున ప్రిన్సిపల్ ఏసీబీ కోర్టు జడ్జి ఇంటి దగ్గర హాజరుపర్చగా జడ్జి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో అతన్ని నేరుగా చంచల్‌గూడ జైల్‌కు తరలించారు. చొప్పదండి డివిజన్‌లో ఈఈగా పనిచేస్తున్న నూనె శ్రీధర్ అక్రమాస్తుల విలువ రూ.100 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన గాయత్రి పంప్‌హౌస్ బాధ్యతలను శ్రీధర్ చూసేవారని, అక్కడ బాహుబలి మోటార్ల కొనుగోళ్లలో ఆయన కమీషన్లు తీసుకున్నారన్న ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. శ్రీధర్ ఇళ్లు, బంధువుల ఇళ్లలో సోదాల అనంతరం ఆయనను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

'ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరిట రేవంత్ మోసం చేస్తున్నారు'

సాక్షి, హైదరాబాద్: విద్యా శాఖను తన వద్దే పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని ఉద్దేశపూర్వకంగా నాశనం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరిట మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను రూ.250 కోట్లతో నిర్మించి ఒకే చోట 2,560 మంది విద్యార్థులకు చదువు చెప్పడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫొటోషాప్‌తో అధునాతన భవనాల ఫొటోలు సృష్టిస్తూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలు పూర్తయినట్టుగా మభ్య పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిరలోనూ ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పనులు ప్రారంభం కాలేదన్నారు. కేసీఆర్ పాలనలో వెలుగొందిన గురుకుల విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. సర్దుబాటు పేరిట ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులను గురుకుల పాఠశాలల్లోకి రానివ్వడం లేదని ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'రహమాన్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలి'

సాక్షి, హైదరాబాద్: ఇథనాల్ ఫ్యాక్టరీ దుష్ప్రభావాలపై వరుస కథనాలను ప్రచురించిన 'జనం సాక్షి' పత్రిక ఎడిటర్ ఎం.ఎం.రహమాన్‌పై రాజోలీ పోలీసులు నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూ డబ్ల్యూజే) కోరింది. ఈ మేరకు గురువారం టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణలను కలిసి వినతి పత్రాలు సమర్పించింది. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఎడిటర్ రహమాన్ గద్వాల జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఆ ప్రాంతంతో అనుబంధం ఉందని ఈ నేపథ్యంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆ ప్రాంత రైతులు చేస్తున్న పోరాటాల్ని తన పత్రికలో వరుస కథనాలు రాశారని తెలిపారు.

సెరికల్చర్ విభాగాన్ని పటిష్టం చేస్తాం

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సెరికల్చర్ (పట్టు పురుగుల పెంపకం) విభాగాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సెరికల్చర్ విభాగాన్ని ఉద్యానవన శాఖలో విలీనం చేయడం వల్ల ఇప్పుడా శాఖ మనుగడ ప్రమాదస్థితికి చేరిందని అన్నారు. గురువారం బీఆర్కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్‌తో సెరికల్చర్ విభాగం అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత పదేళ్ల కాలంలో సెరికల్చర్ విభాగం నిర్లక్ష్యానికి గురైందని, నియామకాలు చేపట్టకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో ఈ విభాగం నిర్వీర్య పరిస్థితికి వచ్చిందని అధికారులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కూడా అధికారుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ విభాగంలో ఇప్పుడు 60 మంది ఉద్యోగులే ఉన్నారని తెలిపారు. కాగా, రాష్ట్రంలో పట్టు పురుగుల సాగులో మంచి లాభాలున్నా.. ఈ రంగాన్ని పట్టించుకోలేదని, పట్టు పురుగుల సాగుతో రైతులు లాభపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కమిషన్ చైర్మన్, సభ్యులకు అధికారులు వివరించారు. సెరికల్చర్ విభాగం సమస్యలను పరిష్కరించడంతో పాటు, ఈ శాఖ అభివృద్ధి విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి తీసుకెళ్తామని కోదండరెడ్డి హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా జస్టిస్ ఘోష్ కమిషన్ ముందుకు రావడానికి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎందుకు హైడ్రామా చేశారో అర్థం కావడం లేదని ఆయన వ్యాఖ్యానించారు.







క్లుప్తంగా...

రిఫైనరీలకు కొమ్ము కాస్తున్న కేంద్రం

మాజీమంత్రి హరీశ్‌రావు



ఆయిల్‌పాం గెలను కోస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: ఇతర దేశాల నుంచి వచ్చే ముడి పామాయిల్‌పై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించి రిఫైనరీలకు కొమ్ము కాస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండల పరిధిలోని గోపులాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ బాలమల్లు సాగు చేసిన ఆయిల్‌పాం తోట మొదటి పంటను హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయిల్‌పాం గెలను కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పాం రైతుల పక్షాన ఉండకుండా, ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గించి రిఫైనరీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

గొల్ల కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలి

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సాక్షి,హైదరాబాద్: సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రివర్గ విస్తరణతో మరోసారి రుజువైందని, అయితే గొల్ల కురుమలకు మాత్రం స్థానం కల్పించాల్సి ఉందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో ఏ కేబినెట్‌లో కూడా గొల్ల కురుమలు లేకుండా ప్రభుత్వం లేదని అన్నారు. గొల్ల కురుమలకు మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, ఒక ఎమ్మెల్సీ పదవితో పాటు ఐదు కార్పొరేషన్ చైర్మన్లు, ఐదు కమిషన్ సభ్యులు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వచ్చే పార్టీ పదవులలో గొల్ల కురుమలకు తప్పక అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అవినీతి డబ్బు బలుపు కేటీఆర్‌ది

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అక్రమంగా సంపాదించిన అవినీతి డబ్బు బలుపుతో కేటీఆర్ మాట్లాడుతున్నారని, కల్వకుంట్ల కుటుంబంకంటే స్టువర్టుపురం దొంగలు నయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీఎల్‌పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ ఏమైనా స్వాతంత్య్ర సమరయోధుడా అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను తిట్టాలంటే సంస్కారం అడ్డువస్తోందన్నారు. ఇన్ని అక్రమాలు చేసిన కల్వకుంట్ల కుటుంబం ఇంకా జైలుకు వెళ్లడం లేదనే బాధ మాకుందని, అయితే కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని.. ఓపికగా ఉండాలని సీఎం చెబుతున్నారని తెలిపారు.

'పదవుల్లో సామాజిక న్యాయం పాటించడం హర్షణీయం'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పదవులు, ప్రభుత్వ పదవుల్లో సామాజిక న్యాయం పాటించినందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందంతో కలిశారు. ఎమ్మెల్సీ పదవుల ఎంపికలో వందశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళకు కట్టబెట్టడం, మంత్రివర్గ విస్తరణలో కూడా ఇదే ఒరవడిలో మొత్తం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించడం, ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఉపాధ్యక్షులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే 70 శాతం పదవులు కట్టబెట్టడం అభినందనీయమన్నారు.

ట్రంప్ కార్డ్ దరఖాస్తులు షురూ



వాషింగ్టన్: సంపన్న వలసదారుల కోసం తెచ్చిన శాశ్వత వీసా పథకం 'ట్రంప్ కార్డ్'దరఖాస్తులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం పలికారు. గోల్డ్‌కార్డ్‌గా పిలిచే ఈ దీని కొనుగోలు కోసం trumpcard.gov వెబ్‌సైట్‌లో దరఖాస్తు నింపవచ్చని ట్రంప్ ప్రకటించారు. 50 లక్షల డాలర్లతో ఈ కార్డును కొనుగోలు చేయవచ్చని ట్రూత్ సోషల్‌లో అధ్యక్షుడు వెల్లడించారు. ''ప్రపంచంలోనే గొప్ప దేశమైన అమెరికాలో అడుగు పెట్టడానికి, ఇక్కడ జీవన ప్రయాణం మొదలుపెట్టడానికి ఏం చేయాలని చాలామంది అడుగుతున్నారు. వేలాది మంది కాల్ చేస్తున్నారు''అని పేర్కొన్నారు. అయితే గోల్డ్ కార్డ్ అమెరికా పౌరసత్వానికి హామీ ఇవ్వదని, నివాసానికి అవకాశం మాత్రమే కల్పిస్తుందని ఆయన సూచించారు. ''ఈ కార్డు పౌరసత్వం ఇవ్వదు. కనుక దీనికి కాంగ్రెస్ ఆమోదం అవసరం లేదు''అని ట్రంప్ తెలిపారు.

అమెరికా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు కావాలనుకునే భారతీయులకు, ఇతర విదేశీయులకు గోల్డ్ కార్డు దారి చూపుతుందని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ ఇటీవల ప్రకటించారు. విదేశీ పెట్టుబడులను పెంచడమే లక్ష్యంగా 1990లో అమెరికా ఈబీ-5 వీసాలను ప్రవేశపెట్టింది. కనీసం 10 మందికి ఉపాధి కల్పించే కంపెనీలో 10 లక్షల డాలర్లు పెట్టుబడి పెడితే ఈ శాశ్వత వీసాలు లభించేవి. వాటి స్థానంలో గోల్డ్ కార్డ్ తేనున్నట్టు ట్రంప్ ఫిబ్రవరిలో ప్రకటించారు. గతంలోలా ఈ వీసాలకు ఉద్యోగాల కల్పన తప్పనిసరి చేయలేదు. ఈబీ-5 వీసాల్లో జరుగుతున్న మోసాన్ని అరికట్టడానికే కొత్త కార్డు తీసుకొస్తున్నట్లు తెలిపారు. 10 లక్షల గోల్డ్ కార్డులను జారీ చేయాలని ట్రంప్ సర్కారు భావిస్తోంది.

గోల్డ్ కార్డ్ నిబంధనలు
- శాశ్వత నివాసం పొందాలంటే కార్డు తీసుకున్న అనంతరం ఐదేళ్లు అమెరికాలోనే ఉండాల్సి ఉంటుంది.
- 18 ఏళ్లు నిండి ఉండాలి
- ఇంగ్లిష్ మాట్లాడగలగాలి

జైళ్లలో డీ అడిక్షన్ సెంటర్లు

నాలుగు చోట్ల ఏర్పాటుకు జైళ్ల శాఖ సన్నాహాలు
- ఖైదీలకు మత్తు పదార్థాల నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యం
- మానసిక, శారీరక పరివర్తన తెచ్చేలా కృషి
- డాక్టర్లు ఇతర సిబ్బంది కోసం ఇప్పటికే నోటిఫికేషన్



సాక్షి, హైదరాబాద్: మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన ఖైదీల్లో మానసిక, శారీరక పరివర్తన తెచ్చేలా తెలంగాణ జైళ్ల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. శాఖ పరిధిలోని నాలుగు కేంద్ర కారాగారాల్లో డీ అడిక్షన్ (వ్యసన విముక్తి) కేంద్రాలను త్వరలోనే ప్రారంభించనుంది. చర్లపల్లి, చంచల్‌గూడ, సంగారెడ్డి, నిజామాబాద్ సెంట్రల్ జైళ్లలో వీటిని ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే ఆయా జైళ్లలో అవసరం మేరకు భవనాలు గుర్తించారు. కేంద్రాల్లో పనిచేయాల్సిన మెడికల్ ఆఫీసర్లు, సైకియాట్రిస్టులు, క్లినికల్ సైకాలజిస్టులు సహా ఇతర సిబ్బంది నియామకానికి సంబంధించి జైళ్ల శాఖ తరఫున ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 23 నుంచి మూడురోజుల పాటు డీజీ సౌమ్యా మిశ్రా నేతృత్వంలోని కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది.

డీ అడిక్షన్ టీంలో ఎవరెవరు ఉంటారు

మెడికల్ ఆఫీసర్, సైకియాట్రిస్టు, క్లినికల్ సైకాలజిస్టులు, ఫిజీషియన్, మోటివేషనల్ స్పీకర్లు, మెంటార్లు, యోగా, మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్స్, నర్సింగ్ స్టాఫ్, అకౌంటెంట్, అడ్మిన్ మేనేజర్.

ఏ ఖైదీలను ఈ కేంద్రాల్లో పెడతారు..

జైళ్లలో ఉండే శిక్ష పడిన, రిమాండ్ ఖైదీలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) గైడ్‌లైన్స్ ప్రకారం జైల్ మెడికల్ అధికారి ద్వారా తొలుత హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఇందులో మత్తు పదార్థాలకు బానిసలైన వారందరినీ గుర్తించి ఎర్రగడ్డలోని మెంటల్ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు మాత్రమే జైళ్లలో ఏర్పాటు చేయబోతున్న డీ అడిక్షన్ సెంటర్లలో ఖైదీలను చేర్చి చికిత్స ప్రారంభిస్తారు.

రకరకాల క్లాసులు.. వ్యాపకాలు

డీ అడిక్షన్ ప్రక్రియలో భాగంగా ఖైదీలకు వ్యక్తిత్వ వికాసం, మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తారు. సైకియాట్రిస్టులతో అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర వ్యాపకాల వైపు వారి దృష్టి మళ్లిస్తారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వ్యక్తిగత కౌన్సెలింగ్, గ్రూప్ కౌన్సెలింగ్, ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రతిరోజూ యోగా, పెయింటింగ్, ఆర్ట్ థెరపీ తరగతులు, మ్యూజిక్ సెషన్స్ ఉంటాయి.

సదుపాయాలు ఇలా..

ప్రతి డీ అడిక్షన్ సెంటర్‌లో 20 పడకలు, ఇంటెన్సివ్ కేర్ రూమ్‌లు, జనరల్ అబ్జర్వేషన్ రూమ్‌లు, 24 గంటల పాటు నర్సింగ్ కేర్ సదుపాయాలు ఉంటాయి.

మంచి పౌరులుగా మార్చడమే లక్ష్యం



మత్తుపదార్థాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు పెరగడంతో రాష్ట్రంలోని జైళ్లకు వస్తున్న ఖైదీల్లోనూ డ్రగ్స్‌కు బానిసలైన వారి సంఖ్యా ఎక్కువగా ఉంటోంది. డ్రగ్స్‌కు అలవాటుపడి, నేరాలు చేసి జైళ్లకు వచ్చేవారిని మార్చేందుకు, వారికి డ్రగ్స్ నుంచి విముక్తి కల్పించేందుకు.. వారి శిక్షాకాలం సరైన సమయంగా మేం భావిస్తున్నాం. శిక్ష పూర్తి చేసుకుని బయటికి వెళ్లే సమయానికి వారిని సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా వారి కుటుంబాలకు, సమాజానికి అందివ్వడమే ఈ డీ అడిక్షన్ సెంటర్ల ఏర్పాటులో ముఖ్య ఉద్దేశం. ఖైదీల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక పెంచేలా అవసరమైన సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించబోతున్నాం.

– సౌమ్యా మిశ్రా, డీజీ, తెలంగాణ జైళ్లశాఖ

గురుకులాలకు తాళాలు!

▶ మొదటి పేజీ తరువాయి

జనరల్ గురుకుల సొసైటీ ఉంది. వీటి పరిధిలో 1,023 గురుకుల పాఠశాలలు, కళాశాలలున్నాయి. విద్యాశాఖ పరిధిలోని జనరల్ గురుకులాలన్నీ శాశ్వత భవనాల్లోనే నిర్వహిస్తుండగా..ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు సంబంధించిన 662 గురుకుల విద్యా సంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇందులో పలు పాఠశాలలకు యజమానులు తాళాలు వేశారు. అద్దె బకాయిలు చెల్లిస్తేనే తాళాలు తొలగిస్తామని స్పష్టం చేయగా... మరికొందరు మాత్రం భవనాలను ఖాళీ చేయాలని తేల్చిచెప్పారు. దీంతో పాఠశాల సిబ్బందితో పాటు పలువురు విద్యార్థులు గేటు బయటే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూ.215 కోట్ల బకాయిలు

ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు నెలకు సగటున రూ.20 కోట్ల మేర అద్దె రూపంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే గత 10 నెలలుగా అద్దె బిల్లులను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో బకాయిల మొత్తం రూ.215 కోట్లకు చేరింది. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ అధికారులపై సంబంధిత యజమానులు గత కొంత కాలంగా తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. కానీ ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలోనే అద్దె చెల్లించాలంటూ యజమానులు డిమాండ్ చేస్తున్నారు. మరికొందరు ఖాళీ చేయాలంటూ ప్రిన్సిపాళ్లపై ఒత్తిడి తెస్తున్నారు. 63 గురుకుల పాఠశాలలను ఖాళీ చేయాలంటూ ఆయా భవనాల యజమానులు గత నెలలోనే సంబంధిత ప్రిన్సిపాళ్లకు తేల్చిచెప్పారు. అయినా ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో బిల్లులు విడుదల కాలేదు.

కాస్త ఉపశమనం : గురుకుల పాఠశాలలకు తాళాలు పడే పరిస్థితి ఉండటంతో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలకు సంబంధించిన అద్దె బకాయిల్లో కొంతమేర చెల్లించేలా చర్యలు తీసుకుంది. దాదాపు 10 నెలల బకాయిలు ఉండగా.. మూడు నుంచి నాలుగు నెలలకు సంబంధించిన బిల్లులకు ఆర్థికశాఖ మోక్షం కలిగించింది. ఈ మేరకు నిధులను సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లకు విడుదల చేసింది. వారు భవనాల యజమానులకు చెల్లించేందుకు గురువారం హడావుడిగా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే యజమానులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వచ్చే త్రైమాసికంలో మిగిలిన బకాయిలు విడుదల చేస్తారని, అప్పటివరకు ఓపికపట్టాలని నచ్చజెప్పడంతో, చాలాచోట్ల మధ్యాహ్నం తర్వాత యజమానులు తాళాలు తీశారు.

చేసిన పనులకు బిల్లులు రాలేదని..

సిద్దిపేట జిల్లాలో బడికి కాంట్రాక్టర్ తాళం



కాంట్రాక్టర్ దాసుతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నీరేష్

చేర్యాల (సిద్దిపేట): పాఠశాల అభివృద్ధిలో భాగంగా రెండేళ్ల క్రితం చేసిన పనులకు ఇప్పటివరకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ బడికి తాళం వేసిన ఘటన సిద్దిపేట జిల్లా ఆకునూరులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆకునూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్ల క్రితం మన ఊరు – మన బడి కార్యక్రమం కింద కాంట్రాక్టర్ డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టి టైల్స్, విద్యుత్ పనులు చేశారు. ఇందుకు సంబంధించి రూ.8.5 లక్షల బిల్లు చెల్లించాల్సి ఉంది. కాంట్రాక్టర్ పలుమార్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ గురువారం పాఠశాల పునఃప్రారంభం రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకముందే పాఠశాల గేటుకు తాళం వేశారు. అయితే విద్యాశాఖ అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నీరేష్ వెంటనే అక్కడికి చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడించడంతో తాళం తీశారు.

పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులు

▶ మొదటి పేజీ తరువాయి

ఇన్‌చార్జిగా నియమించగా, అక్కడి ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్‌కు మార్చింది. కొత్తగా మంత్రివర్గంలో చేరిన ముగ్గురికి జిల్లా ఇన్‌చార్జిలుగా బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు మార్పులు జరిగిన జిల్లాలతోపాటు మొత్తం పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులు వీరే..

ఇన్‌చార్జి మంత్రి	జిల్లా పేరు
దామోదర రాజనర్సింహ	మహబూబ్‌నగర్
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	రంగారెడ్డి
పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి	వరంగల్
పొన్నం ప్రభాకర్	హైదరాబాద్
సీతక్క	నిజామాబాద్
తుమ్మల నాగేశ్వరరావు	కరీంనగర్
జూపల్లి కృష్ణారావు	ఆదిలాబాద్
వివేక్ వెంకటస్వామి	మెదక్
అడ్లూరి లక్ష్మణ్‌కుమార్	నల్లగొండ
వాకిటి శ్రీహరి	ఖమ్మం

పాఠశాలల అద్దె బకాయిలు విడుదల చేశాం

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల పాఠశాలల అద్దె బిల్లులకు సంబంధించి నాలుగు నెలల బకాయిలు విడుదల చేసినట్టు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గురువారం సచివాలయం నుంచి జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకరమైన ఆహారం, వసతి సదుపాయాలు కల్పించాలని మంత్రి సూచించారు. భవనాల యజమానులను సంప్రదించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, వసతి సామగ్రి వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి అధికారులు నెలవారీ రిపోర్టులు తెప్పించుకోవాలని, ప్రయత్న లోపాలు లేకుండా విద్యార్థులకు విద్య, వసతులు అందించాలని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి విద్యార్థులందరికీ బ్యాంక్ అకౌంట్లు తెరిపించాలని ఆదేశించారు.

'పీఎం కుసుమ్'లో దళారీలు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రలోభాలకు గురిచేస్తూ అనుమతులను తమకు ఇచ్చేయాలని దళారులతోపాటు సౌర ఫలకాల తయారీ సంస్థలు నేరుగా రైతులకే ఫోన్లు చేస్తున్నాయి. అర్హత ఉన్న వారికి ఉద్యోగం కూడా కల్పిస్తామని నమ్మబలుకుతున్నాయి.

3 వేల మెగావాట్లు కాస్తా..

వాయు కాలుష్యానికి కారణమయ్యే డీజిల్ పంపుసెట్ల స్థానంలో సౌరశక్తితో నడిచే పంపుసెట్లను రైతులు ఉపయోగించేలా ప్రోత్సహించడంతోపాటు వారు అదనపు ఆదాయం పొందేందుకు 2 మెగావాట్ల వరకు సౌరవిద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసే ఉద్దేశంతో కేంద్రం పీఎం కుసుమ్ పథకాన్ని తీసుకొచ్చింది. సోలార్ పంపుసెట్లపై 30 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ కూడా అందిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రంలో మొత్తం 3,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకోసం మెగావాట్‌కు దాదాపు రూ. లక్ష వరకు ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లించాలని పేర్కొంది. 25 ఏళ్లపాటు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్‌ను యూనిట్‌కు రూ. 3.13 చొప్పున కొనేలా ఒప్పందం (పీపీఏ) చేసుకుంటాయని వెల్లడించింది. ఇందుకోసం బ్యాంకులు రుణాలు కూడా మంజూరు చేస్తాయని వివరించింది. అయితే సొంత భూమి లేదా లీజుకు తీసుకున్న భూమి ఉంటేనే ఈ పథకం కింద రైతులు అర్హులని పేర్కొంది. దీంతో దాదాపు 6,000 మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి దరఖాస్తులు వచ్చాయి. అయితే తాము నిర్దేశించిన గడువులోగా రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించలేదంటూ కేంద్రం 3,000 మెగావాట్ల పథకాన్ని కాస్తా 1,000 మెగావాట్లకు కుదించింది. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో చివరకు ఈ పథకాన్ని 1,450 మెగావాట్లకు పెంచింది. రైతులు, రైతు బృందాలు, స్వయం సహాయక బృందాలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు, ప్రైవేటు వ్యక్తులు 6,000 మెగావాట్ల కోసం దరఖాస్తు చేసినా ఈఎండీ చెల్లించింది మాత్రం 1,600 మెగావాట్లకే కావడంతో ఈ ఏడాది 1,450 మెగావాట్లకు మాత్రమే అనుమతులిచ్చే అవకాశం ఉంది.

65 శాతం రైతుల నుంచే..

ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల్లో సుమారు 65 శాతం రైతుల నుంచే వచ్చాయని విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఎక్కువ మంది రైతులు ఒకటి, ఒకటిన్నర మెగావాట్ కోసం దరఖాస్తు చేసుకోగా కొందరు రెండు మెగావాట్లకు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పొందిన రైతుల వద్దకు దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ఆయా రైతులు ఆది, సోమవారాల్లో దక్షిణ డిస్కంతో పీపీఏలు కుదుర్చుకోవడానికి రాగా అక్కడ కూడా వారిని ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించారు. కొందరు ఉద్యోగులు కూడా దళారులకు వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం. కాగా, విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పడానికి ఎక్కువగా మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు టీజీ రెడ్కో అధికారులు వివరించారు. ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు 70 నుంచి 80మంది రైతులతో పీపీఏలు కుదుర్చుకుంది. ఎస్‌పీడీసీఎల్ జూలై 7 వరకు పీపీఏ ప్రక్రియ కొనసాగుతుందని ఓ అధికారి వివరించారు.

మెగావాట్‌కు ఏడాదికి 16 లక్షల యూనిట్ల విద్యుత్..

సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో ఒక మెగావాట్‌కు ఏడాదికి 16 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుందని అంచనా. సోలార్ ప్యానెల్స్ మేలు రకమైనవి అయితే ఇంకాస్త విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికార వర్గాల సమాచారం. పీపీఏలు చేసుకున్న తర్వాతే బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి మొగ్గుచూపుతున్నాయి. అయితే ఒక మెగావాట్‌కు మూడు కోట్ల వరకు వ్యయం అవుతుండగా బ్యాంకులు మాత్రం మెగావాట్‌కు రూ. 2 కోట్ల వరకు మాత్రమే రుణాలు ఇవ్వడానికి అంగీకరిస్తున్నాయని.. మిగిలిన నిధులకూ పూచీకత్తు ఇవ్వాలంటున్నారని ఔత్సాహిక రైతులు రఘురామ్, అర్జున్ వివరించారు. 25 ఏళ్ల వరకు పీపీఏలు ఉన్న నేపథ్యంలో మొదట్లో భారీగా ఆదాయం రాకపోయినా పదేళ్ల తరువాత నిర్వహణ వ్యయం పోనూ ఏటా రూ. 15-20 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

జెండర్ గ్యాప్ ఇండెక్స్‌లో భారత్‌కు 131వ స్థానం



న్యూఢిల్లీ: భారత్‌లో లింగ అసమానతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఆధునిక యుగంలోనూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ రిపోర్టు-2025లో 148 దేశాలకు గాను భారత్ 131వ స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే రెండు స్థానాలు దిగజారడం గమనార్హం. గురువారం ఈ నివేదిక విడుదలైంది. దక్షిణాసియా దేశాల్లో ఇండియా అట్టడుగు స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇండియా లింగ సమానత్వం స్కోర్ 64.1 శాతం. గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ గత ఏడాది 129వ స్థానంలో ఉండగా, ఈసారి 131వ స్థానానికి పరిమితమైంది. ఆర్థిక వ్యవస్థలో స్త్రీ-పురుష భాగస్వామ్యం, విద్యా రంగంలో సాధించిన విజయాలు, ఆరోగ్య రంగంలో పోషించిన పాత్ర, రాజకీయ సాధికారత వంటి ప్రమాణాల ఆధారంగా దేశాలకు ర్యాంకులిచ్చారు.

మీ నిజాయితీయే.. మీ విలువైన ఆస్తి

సీఏ విద్యార్థుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: భారతదేశం ఆర్థికంగా ఆరోగ్యంగా ఉండాలంటే చార్టెడ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. చార్టెడ్ అకౌంటెంట్లు నైతికతకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. గురువారం శిల్పకళావేదికలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా (ఐసీఏఐ) హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన సీఏ విద్యార్థుల జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, తెలంగాణ ఇతర రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీ పడుతోందన్నారు. ఐటీ, ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్స్‌టైల్ పార్క్ వంటి వాటితో అభివృద్ధిలో ప్రపంచ పటంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకుందని చెప్పారు. సీఏ కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. టెక్నాలజీ శరవేగంగా పెరుగుతున్న ఈ కాలంలో మీ నిజాయితీయే మీకు అత్యంత విలువైన ఆస్తి అని ఆయన అన్నారు. సీఏ విద్యార్థులు ఉద్యోగం కోసం కాకుండా భవిష్యత్తులో వ్యాపారాలు, సంస్థలు, ప్రభుత్వాల ఆర్థిక ఆరోగ్యానికి బాధ్యత వహించేందుకు సిద్ధమవాలని కోరారు. భారతదేశం ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ సమయంలో చార్టెడ్ అకౌంటెంట్లకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ఢిల్లీలో ముఖ్యమంత్రి గులాంగిరీ

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి గల్లీలో గలీజ్ దందాలు.. ఢిల్లీలో గులాంగిరీ అన్నట్లుగా తయారైందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మంత్రుల శాఖల కేటాయింపు కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడినా సీఎంకు కాంగ్రెస్ అధిష్టానం అపాయిమెంట్ దొరకలేదన్నారు. నిస్పృహ నుంచి బయట పడేందుకు ఆయన .. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేసీఆర్ ఒక్కటేనంటూ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీతో రేవంత్ స్నేహబంధం అనేక సందర్భాల్లో బయట పడిందని, రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచేందుకు కాంగ్రెస్ నుంచి బలహీన అభ్యర్థులను పోటీలో పెట్టారని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ బలపడేందుకు నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా ఇవ్వలేదన్నారు. రేవంత్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కంటే ప్రధాని అపాయింట్‌మెంట్ సులభంగా దొరుకుతోందన్నారు. తాను బీజేపీ స్కూల్లో చదువుకున్నానని రేవంత్ చెప్పడం బీజేపీలో ఆయన చేరికకు సంకేతమని చెప్పారు.

చేనేత.. దేశ వారసత్వ సంపద



పోచంపల్లిలోని టూరిజం పార్కులో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో శైలజారామయ్యర్, ఎమ్మెల్యే కుంభం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం చేనేత కార్మికులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తాను గతంలో త్రిపుర హ్యాండ్లూమ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న కాలంలోనే పోచంపల్లి ఇక్కత్ పేరు బాగా వినబడేదని, దాంతో ఎలాగైనా పోచంపల్లిని సందర్శించి ఇక్కత్ కళను తెలుసుకోవాలనే ఇక్కడికి వచ్చానన్నారు. ఐఐటీ, ఎన్‌ఐటీ సంస్థలను ఇక్కడికి తీసుకొచ్చి చేనేతలో నూతన డిజైన్ల అభివృద్ధి, ఉపాధి తదితర అంశాలపై అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీతో నకిలీ ఇక్కత్ వస్త్రాల నిరోధానికి కృషి చేస్తామని అన్నారు. పోచంపల్లికి మిస్ వరల్డ్ బృందం సందర్శనతో ఇక్కడ 30 శాతం వస్త్రాల కొనుగోళ్లు పెరిగాయని చెప్పడం గొప్పవిషయమని అన్నారు. ఈ ప్రాంతంలోని చేనేత కళాకారులు అత్యంత ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం చేనేత కార్మికులకు బీమా చెక్కులతో పాటు త్రిఫ్ట్ ఫండ్ చెక్కులను అందజేశారు. చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. గవర్నర్ స్థాయి లాంటి వ్యక్తులు పోచంపలికి రావడం రెండవసారి అని అన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆభరణాల ఫ్రాంచైజ్‌కు కిస్నా ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆభరణాల ఫ్రాంచైజ్ నెట్‌వర్క్‌లో భాగం కావాలని 'కిస్నా' ఆహ్వానిస్తోంది. హరికృష్ణ గ్రూప్ నుంచి ప్రముఖ ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ విస్తరిస్తున్న రిటైల్ ప్రయాణంలో భాగం కావాలని ఏపీ , తెలంగాణ రాష్ట్రాల్లోని రిటైలర్లు, వ్యాపార దార్శనికులను ఆహ్వానిస్తోంది. ఎనభైకి పైగా ప్రత్యేక షోరూమ్‌ల అద్భుతమైన ఉనికి, 1,500కు పైగా షాప్-ఇన్-షాప్ అవుట్‌లెట్లతో కిస్నా భారతదేశం అంతటా వేగంగా అభివృద్ధి చెందుతున్న నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఈ బ్రాండ్ వజ్రాలు, బంగారు ఆభరణాల రిటైల్‌ను సాటిలేని స్థాయి, నమ్మకంతో పునర్‌నిర్వచిస్తోంది.

పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో ఏఐ పరిష్కారాలు

- జీన్ పవర్ ఆర్ఎక్స్, ఎంజీఐ టెక్ మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: పర్సనలైజ్డ్ మెడిసిన్ (వ్యక్తి శరీర స్వభావాన్ని బట్టి ప్రత్యేకమైన వైద్యం అందించే విధానం) రంగంలో ఏఐ ఆధారిత జన్యు పరిష్కారాలను వేగవంతం చేసేందుకు జీవన్ పవర్ ఆర్ఎక్స్, ఎంజీఐ టెక్ సంస్థల మధ్య కీలక భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో జీన్ పవర్ ఆర్ఎక్స్ సంస్థకు, జీవ శాస్త్రాల్లో సాంకేతికత అభివృద్ధిలో ఎంజీఐ టెక్ ప్రముఖ సంస్థలుగా ఉన్నాయి. ఈ ఒప్పందం ద్వారా అత్యాధునిక జన్యు సీక్వెన్సింగ్, ఏఐ ఆధారిత విశ్లేషణ చేసి ఆరోగ్య రక్షణ, కచ్చితమైన చికిత్స విధానాలు, దీర్ఘాయుష్షు సాధనలో విప్లవాత్మక మార్పులు సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ ఒప్పందం పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో కొత్త యుగానికి దారితీస్తుందని జీన్‌పవర్ ఆర్ఎక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కల్యాణ్ రామ్ ఉప్పలూరి అన్నారు. దృఢమైన సీక్వెన్సింగ్ ప్లాట్‌ఫాంలను తమ ఏఐ ఆధారిత సాంకేతికతో సకాలంలో అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎంజీఐ టెక్ ఎండీ డాక్టర్ హిమ జ్యోతి చల్ల వెల్లడించారు. పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో జీన్ పవర్ ఆర్ఎక్స్‌తో ఒప్పందం చేసుకోవటం తమకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని ఎంజీఐ ఆసియా పసిఫిక్ జనరల్ మేనేజర్ రాయ్ టాన్ అన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యకే ప్రాధాన్యం: ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

సాక్షి, హైదరాబాద్: నైపుణ్యంతో కూడిన విద్యకు ప్రాధాన్యం పెరిగిందని అఖిల భారత సాంకేతిక విద్య చైర్మన్ డాక్టర్ టీజీ సీతారాం తెలిపారు.



పోటీ ప్రపంచంలో ముందుకెళ్లాలంటే సాంకేతికతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్ఫాయ్ ఫౌండేషన్ నేతృత్వంలో 'ఉన్నత విద్యలో సంస్కరణలు–జాతీయ విద్యా విధానం అమలులో ఉత్తమ ప్రయోగాలు'అనే అంశంపై హైదరాబాద్‌లో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం మొదలైంది. ముఖ్య అతిథిగా వచ్చిన సీతారాం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జాతీయ విద్యావిధానం గ్రామీణ ప్రాంత విద్యార్థికి వెన్నుదన్నుగా ఉంటుందని, పరిశోధన దిశగా ముందుకు తీసుకెళ్తుందన్నారు. నైపుణ్యవంతమైన యువతను భారత్ కోరుతోందని, అనేక రంగాల్లో నిష్ణాతులకు ఆహ్వానం పలుకుతోందని తెలిపారు. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ–జర్నల్స్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్స్, ఆన్‌లైన్ కోర్సులు, భారతీయ భాషల్లో డిజిటల్ పుస్తకాల రూపకల్పన, స్కిల్‌పై పారిశ్రామిక శిక్షణ వంటివి చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మణిపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ ఎండీ వెంకటేశ్ ,ఇక్ఫాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం, వైద్య విద్యలో అత్యుత్తమ మోడల్

- సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి పనితీరు గర్వకారణమన్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజారోగ్యం, వైద్య విద్యలో హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ఆసుపత్రి అత్యుత్తమ మోడల్‌గా ఆవిర్భవించిందని కేంద్రం తెలిపింది. ఆసుపత్రి పనితీరు గర్వకారణమని ప్రశంసించింది. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వం చొరవ వల్లే ఆసుపత్రి ఈ స్థాయికి చేరిందని పేర్కొంది. కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించాలనే నిబద్ధతకు ఈ ఆసుపత్రి నిదర్శనమని తెలిపింది. ఆసుపత్రి సాధించిన విజయాలను గురువారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో గుర్తు చేసింది. సనత్‌నగర్ ఆసుపత్రి 72.6 లక్షలకు పైగా బీమా చేయబడిన వ్యక్తులకు (ఐపీ), వారి లబ్ధిదారులకు సేవలు అందిస్తోందన్నారు. ప్రతిరోజు 3,200 మందికి పైగా రోగులు ఔట్ పేషంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ)కి హాజరవుతున్నారని, వివిధ విభాగాల్లో 200 మందికి పైగా రోగులు చేరుతున్నారని వివరించింది.



ఏసీ@ 24.. ఆదా సూపర్

ఏటా 2,000 కోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా	రూ.10,000 కోట్ల ప్రజాధనం పొదుపు చేసినట్లే

కర్బన ఉద్గారాలు తగ్గి పర్యావరణానికీ మేలు
ఏసీలు ఇకమీదట 20–28 డిగ్రీల సెట్టింగుతో
కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో మారనున్న ఏసీలు

సాక్షి, స్పెషల్ డెస్క్

'ఏసీ లేనిదే నాకు నిద్రపట్టదు'.. తరచూ మన చుట్టూ ఉండే వాళ్లు చెప్పే డైలాగ్. ఇంట్లో, ఆఫీసులో.. చివరకు కారులో కూర్చున్నా చాలామందికి చల్లని గాలి వీయాల్సిందే. ఎక్కువమందికి ఏసీ 16–20 డిగ్రీల మధ్యే ఉండాలి. అంతలా జనం ఏసీ చల్లదనానికి అలవాటుపడ్డారు. ఏటా భారత్‌లో 1.5 కోట్ల ఏసీలు అమ్ముడవుతున్నాయంటే కారణం ఇదే. ఇదంతా నాణేనికి ఒకవైపు. కానీ, అతి చల్లదనం.. మనకుగానీ, పర్యావరణానికి గానీ మంచిది కాదని వైద్యులు, పర్యావరణ నిపుణులు చెబుతున్నమాట. అందుకే కనిష్టంగా 20.. గరిష్టంగా 28 డిగ్రీల సెల్సియస్‌కు ఏసీల సెట్టింగ్స్‌ను తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరి, ఇలా చేస్తే మనకు, పర్యావరణానికి ఏంటి ప్రయోజనం?

ఏసీలు మనకు ఎంత చల్లదనాన్ని ఇస్తాయో.. విద్యుత్ వ్యవస్థకు, పర్యావరణానికి అంత 'వేడి'కూడా చేస్తాయి. అంటే... విద్యుత్ వాడకం పెరుగుతుంది! మనం వాడే విద్యుత్.. బొగ్గు వంటి వాటితో ఉత్పత్తి అయితే ఆ మేరకు పర్యావరణంపైనా ప్రభావం పడుతుంది. పర్యావరణంపై ప్రభావాన్ని కొందరు తేలిగ్గా తీసుకోవచ్చు.. ఎందుకంటే, అది ఎప్పటికోగానీ ఫలితం చూపించదు అనుకుంటారు కాబట్టి! కానీ, విద్యుత్ వాడకం పెరగడం వల్ల మాత్రం ఫలితాలను మనం తక్షణమే చూడాల్సి వస్తుంది.. చూస్తున్నాం కూడా.. కరెంటు కోతల రూపంలో!!

విద్యుత్ అంతరాయాలు

దేశంలో విద్యుత్ డిమాండ్.. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మించిపోయింది. దీని ఫలితంగా ముఖ్యంగా వేసవిలో ఏప్రిల్ నుండి జూన్‌వరకు కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా 2024లో గరిష్ఠ డిమాండ్ 250 గిగావాట్లకు చేరుకుంది. ఈ డిమాండ్ 2025లో 8 శాతం పెరుగుతుందని అంచనా. వేసవిలోనూ దేశంలో వర్షాలు పడడంతో విద్యుత్ డిమాండ్ అదుపులో ఉంది. అయితే జూన్‌లో వేడి గాలులు తిరిగి వీయడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. విద్యుత్ డిమాండ్ ఈ ఏడాది జూన్9న 241 గిగావాట్లకు చేరింది. 2025లో ఇదే గరిష్టం. పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని కట్టడి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. అందుకే ఇళ్లు, హోటళ్లు, కార్లలో వినియోగించే ఏసీలకు సరికొత్తగా 'ఉష్ణోగ్రత నిబంధన'ను వర్తింపజేయనున్నట్టు ప్రకటించింది.

ఏటా రూ. 7.5 లక్షల కోట్లు ఆదా!



ఏసీ ఉష్ణోగ్రత ఒక్కో డిగ్రీ పెరిగితే (ఉదాహరణకు 16 నుంచి 17 డిగ్రీల సెల్సియస్‌కు చేరితే).. విద్యుత్ వినియోగం 6 శాతం తగ్గుతుందని కేంద్ర విద్యుత్ కార్యదర్శి పంకజ్ అగర్వాల్ వెల్లడించారు. ఈ స్థాయి తగ్గింపు వల్ల దేశం మొత్తంగా చూస్తే.. గరిష్ఠంగా 3 గిగావాట్ల వరకు ఆదా చేయవచ్చునట. 'దేశంలో దాదాపు 10 కోట్ల ఎయిర్ కండీషనింగ్ ఉపకరణాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం సుమారు 1.5 కోట్ల ఏసీలు కొత్తగా తోడవుతున్నాయి. ఏసీలతో 50 గిగావాట్ల విద్యుత్ ఖర్చు అవుతోంది. మొత్తం దేశీయ డిమాండ్‌లో ఇది సుమారు 20 శాతం. ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి, విద్యుత్ వినియోగాన్ని తగ్గించే ప్రతిపాదిత చర్యలతో 2035 నాటికి భారత గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌లో 60 గిగావాట్లను ఆదా చేసే అవకాశం ఉంది'అని ఆయన తెలిపారు. ఇదే జరిగితే నూతన విద్యుత్ ఉత్పత్తి, గ్రిడ్ మౌలిక సదుపాయాల ఖర్చుల విషయంలో భారత్ ఏటా రూ.7.5 లక్షల కోట్లను ఆదా చేస్తుందని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం అధ్యయనం వెల్లడించింది.

2వేల కోట్ల యూనిట్ల ఆదా!

ఏసీని 24 డిగ్రీల వద్ద వాడటం వల్ల.. వచ్చే కరెంటు బిల్లు మొత్తం తగ్గడమే కాదు, విద్యుత్తును కూడా భారీగా ఆదా చేయవచ్చని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బీఈఈ) చెబుతోంది. ఖర్చు ఆదా, పర్యావరణ ప్రయోజనాల కోసం బాధ్యతాయుతంగా ఏసీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి బీఈఈ పలు నగరాల్లో ఇంధన పరిరక్షణపై ప్రచారం చేస్తోంది. ఏసీలను 24ని డిగ్రీల వద్ద సెట్ చేస్తే.. సంవత్సరానికి 2,000 కోట్ల యూనిట్ల వరకు విద్యుత్ ఆదా అవుతుంది. తద్వారా రూ.10,000 కోట్లు పొదుపు చేయవచ్చు. సగం మంది వినియోగదారులు తమ సూచలను పాటించినా 1,000 కోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా చేయవచ్చని, రూ.5,000 కోట్లు పొదుపు చేసినట్టేనని తెలిపింది. అంతేకాదు, కర్బన ఉద్గారాలు సంవత్సరానికి 82 లక్షల టన్నులు తగ్గుతాయని బీఈఈ వెల్లడించింది.

కొత్తవి వచ్చేది 2027లోనే?

ప్రస్తుతం ఏసీలు 16–30 డిగ్రీల సెట్టింగ్స్‌తో వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత నిబంధన ఈ ఏడాదే అమలులోకి వస్తే.. కొత్త ఏసీలు కనీసం 20, గరిష్ఠం 28 డిగ్రీల ఉష్ణోగ్రతతో మాత్రమే పనిచేసేలా కంపెనీ సెట్టింగ్స్‌తో వస్తాయి. కానీ ఈ కొత్త ఏసీలు ఇప్పుడే వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే ఏసీ తయారీ కంపెనీలకు 2025 సమ్మర్ సీజన్‌నిరాశను మిగిల్చింది. చాలా ప్రాంతాల్లో 2024 స్థాయిలో ఎండలు లేకపోవడం, అకాల వర్షాలతో వాతావరణం చల్లబడింది. దీంతో అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. డీలర్లు, తయారీ కంపెనీల వద్ద ఏసీ యూనిట్ల నిల్వలు పేరుకుపోయాయి. వీటి అమ్మకాలు జరిగేది 2026 సీజన్‌లోనే. వచ్చే ఏడాది భానుడు ప్రతాపం చూపిస్తే కొత్త ఏసీలు రంగ ప్రవేశం చేసే అవకాశం ఉంది.

దేశంలో ఏసీలతో ఖర్చయ్యే మొత్తం విద్యుత్ 50 గిగావాట్లు
మొత్తం దేశీయ డిమాండ్‌లో ఇది సుమారు 20%
ఏసీలను 24 డిగ్రీల వద్ద సెట్ చేస్తే.. ఏడాదికి 2 వేలకోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా
రూ.10,000 కోట్లు పొదుపు
ఏటా 82 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుదల

వివాదాల్లేకుండా నియామకాలు

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో కీలక పాత్ర పోషిస్తున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు న్యాయ వివాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. చాలా సందర్భాల్లో న్యాయవివాదాలు తలెత్తడంతో వాటి పరిష్కారానికి, ఉద్యోగ నియామకాల ప్రక్రియ పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతోందని, దీంతో అభ్యర్థులు నష్టపోతున్నారని అన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లలో 'న్యాయ సమస్యలు – పరిష్కార మార్గాలు'అనే అంశంపై గురువారం నల్సార్ వర్సిటీలో జాతీయ స్థాయి సదస్సు జరిగింది. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుంచి 8 పీఎస్సీల చైర్మన్లతో పాటు వివిధ రాష్ట్రాల పీఎస్సీల సభ్యులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో ఉద్యోగ నియామకాల్లో న్యాయ వివాదాలు తగ్గించే లక్ష్యంతో ఈ సదస్సును తలపెట్టడం మంచి పరిణామమని అన్నారు. అనంతరం యూపీఎస్సీ చైర్మన్ అజయ్ కుమార్ మాట్లాడుతూ పీఎస్సీల పనితీరును మెరుగుపర్చడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) సాయం తీసుకోవాలని సూచించారు. శుక్రవారం కూడా ఈ సదస్సు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఏపీపీఎస్సీ చైర్మన్ ఏఆర్ అనురాధ, టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీధర్‌బాబు. చిత్రంలో వెంకటేశం

2070కి కాలుష్య రహిత భారత్

- పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ కో రేటింగ్ కీలకం
- సీఐఐ 'గ్రీన్ కో సమ్మిట్ 2025'లో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: భూ వనరులు మన పూర్వీకుల నుంచి వచ్చిన బహుమతి కాదని, భవిష్యత్ తరాల నుంచి తీసుకున్న రుణం అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే తరాల కోసం ఆరోగ్యకరమైన, శుభ్రమైన, మరింత సుస్థిరమైన భూ గ్రహాన్ని వదిలివెళ్లే బాధ్యత మనందరిపైనా ఉందని తెలిపారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 'గ్రీన్ కో 2025'పేరు నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును మంత్రి శ్రీధర్‌బాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెట్ జీరో లక్ష్యాల దిశగా పరిశ్రమలు కృషి చేయడంలో గ్రీన్ కో రేటింగ్ కీలకంగా మారిందని పేర్కొన్నారు. 2070 నాటికి భారతదేశం పూర్తి కాలుష్య రహితంగా (నెట్ జీరో) మారడం, 2030 నాటికి 50 శాతం పునర్వినియోగ ఇంధనం తయారీ వంటి లక్ష్యాలకు చేరుకోవాల్సి ఉందని వెల్లడించారు. సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ పర్యావరణ పరిరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని మంత్రి తెలిపారు. 'క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025'ద్వారా 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సమగ్ర విధానం రూపొందినట్లు వివరించారు. పునర్వినియోగ ఇంధన ఆవిష్కరణలో స్టార్టప్‌లకు మద్దతు ఇచ్చేందుకు రూ.50 కోట్లతో ఇంక్యుబేషన్ ఫండ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సులో సీఐఐ చైర్మన్ జమ్షీద్ ఎన్ గోద్రెజ్, ఉపాధ్యక్షులు డాక్టర్ సుచిత్ర ఎల్లా, గ్రీన్ సమ్మిట్ 2024 చైర్మన్ ప్రదీప్ భార్గవ, తెలంగాణ సీఐఐ చైర్మన్ ఆర్.శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడిలో సహకరించండి

- ఆరు రాష్ట్రాల నార్కోటిక్స్ బ్యూరో అధికారుల భేటీలో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్ : డ్రగ్ మాఫియాను అరికట్టేందుకు తెలంగాణ సరిహద్దు రాష్ట్రాల పోలీసులతోపాటు కేంద్ర దర్యాప్తు సంస్థలకు చెందిన అధికారులు సహకారం అందించాలని డీజీపీ జితేందర్ కోరారు. తెలంగాణలో మత్తు పదార్థాల కట్టడిలో కీలక చర్యలు తీసుకుంటున్నామని, మత్తు ముఠాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సమన్వయ సమావేశం జరిగింది. తెలంగాణతోపాటు ఏపీ, గోవా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర పోలీస్ అధికారులతోపాటు మత్తుపదార్థాల కేసుల దర్యాప్తులో కీలకంగా ఉన్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డీఆర్ఐ, కస్టమ్స్, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, ఈడీల నుంచి అధికారులు హాజరయ్యారు. మత్తుపదార్థాల సరఫరా ముఠాల కట్టడిలో ఉమ్మడి వ్యూహాలపైనా డీజీపీ పలు కీలక సూచనలు ఇచ్చారు. టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా అంతర్–రాష్ట్ర కేసులు, డ్రగ్స్ ముఠాలపై చర్యల్లో సమాచార వినిమయంపై చర్చించారు. డీఐజీ అభిషేక్ మొహంతి, ఎస్పీ రూపేశ్ డ్రగ్ ట్రాఫికింగ్ పరిస్థితిని వివరించారు.

చార్మినార్ సమీపంలో మెట్రో పనులు చేపట్టొద్దు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో మెట్రో పనులు చేపట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో రైలు విస్తరణ పనులను ఆపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్ ఈ పిల్ దాఖలు చేశారు. మెట్రో విస్తరణతో పరిసర ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలపై ప్రభావం పడుతోందని, చార్మినార్, ఫలక్‌నుమా, దారుల్‌షిఫా లాంటి కట్టడాలకు ప్రమాదం వాటిల్లనుందన్నారు. వీటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై పురావస్తు శాఖ, పర్యావరణ, ఆయారంగ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసిన అధ్యయనం చేయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మెట్రో రెండో దశ పనుల మార్గంలో పురానాహవేలీ, దారుల్‌షిఫా మసీద్, మొగల్‌పూరా టూంబ్ లాంటి నిర్మాణాలున్నాయన్నారు. తెలంగాణ వారసత్వ కట్టడాల రక్షణ చట్టంతోపాటు కేంద్ర పురావస్తుశాఖ చట్ట నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఆ తర్వాతే పనులను కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు చారిత్రక కట్టడాల సమీపంలో మెట్రో పనులను ఆపేలా ఆదేశాలివ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. మెట్రో రెండోదశపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, గడువు కావాలన్నారు. అనుమతించిన ధర్మాసనం.. తదుపరి విచారణ వరకు చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో మెట్రో వద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

విద్యుత్ వ్యవస్థ బలోపేతంపై దృష్టి: నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిత్తల్ తెలిపారు. వీలైనంత త్వరగా బాధ్యతలు స్వీకరించబోతున్నట్టు చెప్పారు. గురువారం రాత్రి ఆయన 'సాక్షి'ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ శాఖ తనకు కొత్తదని, ఇంజనీరింగ్ విద్య నేపథ్యమున్న తాను ఆ శాఖ గురించి సమగ్రంగా అధ్యయనం చేస్తానన్నారు. ఉద్యోగులతో సమ న్వయం చేసుకుంటూ ముందుకెళతానని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ప్రజలు కోరిన విధంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు యంత్రాగాన్ని నడిపిస్తానన్నారు. విద్యుత్ శాఖ బలోపేతంపై ప్రభుత్వానికి ఉన్న ప్రతీ ఆలో చనను కార్యారూపంలో ఉంచేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. రెన్యూవబుల్ ఎనర్జీని దేశవ్యాప్తంగా ప్రోత్సహిస్తున్నారని, ఈ రంగంలో మరింత సాంకేతికతను జోడించి ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఉన్నట్టు చెప్పారు. తనపై విశ్వాసంతో ప్రజలకు అత్యంత ముఖ్యమైన విద్యుత్ శాఖను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'రిజర్వేషన్ల' కేసు విచారణపై స్టే

సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: 'రిజర్వేషన్ల'కు సంబంధించి దాఖలైన ప్రైవేట్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. గతంలో ట్రయల్‌కోర్టు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వగా.. గురువారం కేసు విచారణను నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23వ తేదీ వరకు తదుపరి విచారణ వాయిదా వేస్తూ.. అప్పటి వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రజాప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేసిన బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లును ఆదేశించింది. గత సంవత్సరం ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ చేసిన ప్రసంగంపై వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ అన్నారని దానికి సంబంధించిన ఆడియో క్లిప్పింగ్‌లను, మీడియా ప్రచురణలను అందజేశారు. అయితే ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై కేసు బనాయించారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ నిర్వహించారు. కాసం ఇంకా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. తదుపరి విచారణను 23కు వాయిదా వేస్తూ.. అప్పటివరకు ట్రయల్‌కోర్టు విచారణపై స్టే విధించారు.

రేవంత్‌రెడ్డిపై 'కోడ్'ఉల్లంఘన కేసు కొట్టివేత

సిటీ కోర్టులు: సీఎం రేవంత్‌పై గత ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ నమోదైన కేసు నుకొట్టేస్తున్నట్లు గురువారం నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసు విచారణ నేపథ్యంలో ఇటీవల రేవంత్ కోర్టుకు హాజరై వివరణ ఇచ్చారు. అనంతరం రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది విశ్వేశ్వర్‌రావు.. ఈ కేసులో ఆధారాలు లేవని వాదించడంతో కేసును కొట్టేస్తున్నట్లు జడ్జి శ్రీదేవి తీర్పు ఇచ్చారు.

మిత్తల్ బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన్ను బదిలీ చేసింది. గత ప్రభుత్వంలో కూడా కీలకంగా వ్యవహరించిన ఆయనపై..అధికారంలోకి రాకముందు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అక్కడే కొనసాగించడం చర్చనీయాంశమయ్యింది. మరో సీనియర్ ఐఏఎస్ అధికారి, ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్ కూడా బదిలీ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆయన మొత్తం మూడుసార్లు బదిలీ కావడం గమనార్హం. ఇక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవిని ఆశించిన డాక్టర్ శశాంక్ గోయల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ స్థానంలో ఉన్న గౌరవ్ ఉప్పల్‌ను కేంద్ర ప్రాజెక్టులు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శిగా సర్కారు నియమించింది. మొత్తం 36 మంది అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం సీపీఆర్‌వోగా జి.మల్సూర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య పౌరసంబంధాల అధికారిగా జి.మల్సూర్ నియమితుల య్యారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వ హిస్తూ, ఇటీవలే పదవీ విరమణ చేసిన మల్సూర్‌ను సీఎం సీపీఆర్‌వోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన ఎండీ టీజీఎండీసీగా కూడా పనిచేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం నాన్ కేడర్ అధికారులను బదిలీ చేశారు. సీడీఎంఏ అదనపు సంచాలకుడు శంకరయ్యను టీజీ ఆయిల్ ఫెడ్ ఎండీగా నియమించారు. పి.శ్రీకాంత్‌బాబును ఆయుష్ డైరెక్టర్‌గా, టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పవన్‌కుమార్‌ను నియమించారు.

బదిలీలు ఇలా..

1. డాక్టర్ శశాంక్ గోయల్; ప్రస్తుతం: స్పెషల్ సీఎస్, తెలంగాణ భవన్ (ఢిల్లీ); బదిలీ: స్పెషల్ సీఎస్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్. 2. నవీన్ మిత్తల్; ప్రస్తుతం: ముఖ్య కార్యదర్శి రెవెన్యూ శాఖ, సీసీఎల్ఏ ; బదిలీ: ముఖ్య కార్యదర్శి, ఇంధన శాఖ 3. ఎస్. శ్రీధర్; ప్రస్తుతం: ముఖ్య కార్యదర్శి, ఎస్సీ అభివృద్ధి శాఖ; బదిలీ: ముఖ్య కార్యదర్శి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,ఆర్‌డబ్ల్యూఎస్, అదనంగా ముఖ్య కార్యదర్శి మైన్స్, జియాలజీ. 4. డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్; ప్రస్తుతం: కార్యదర్శి స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్, గృహనిర్మాణ శాఖ; బదిలీ: కార్యదర్శి ఎస్సీ అభివృద్ధి, అదనంగా ప్రణాళిక శాఖ, టీజీఆర్ఏసీ డీజీ. 5. లోకేశ్‌కుమార్; ప్రస్తుతం: అదనపు సీఈవో; బదిలీ: పూర్తి అదనపు బాధ్యతలు కార్యదర్శి, రెవెన్యూ, సీసీఎల్ఏ. 6.గౌరవ్ ఉప్పల్; ప్రస్తుతం: రెసిడెంట్ కమిషనర్ తెలంగాణ భవన్ ఢిల్లీ; బదిలీ: కార్యదర్శి సమన్వయం కేంద్ర ప్రాజెక్టులు, ప్రాయోజిత కార్యక్రమాలు. 7. భారతీ లక్పతి నాయక్ ; ప్రస్తుతం: కార్యదర్శి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్; బదిలీ: కార్యదర్శి, సమాచార కమిషన్. 8. హరిచందన దాసరి; ప్రస్తుతం: కార్యదర్శి, రోడ్లు, భవనాలు; బదిలీ: కలెక్టర్, హైదరాబాద్. 9. కిల్లు శివకుమార్‌నాయుడు; ప్రస్తుతం: అదనపు కమిషనర్ జీహెచ్ఎంసీ; బదిలీ: కమిషనర్, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ ఐ క్యాడ్. 10. రాజీవ్‌గాంధీ హన్మంతు; ప్రస్తుతం: కలెక్టర్, నిజామాబాద్; బదిలీ: ప్రత్యేక కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, కమిషనర్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ అదనపు బాధ్యతలు. 11. వినయ్ కృష్ణారెడ్డి; ప్రస్తుతం: కమిషనర్ ఆర్,ఆర్ అండ్ ఎల్ ఏ, ఐ క్యాడ్; బదిలీ: కలెక్టర్, నిజామాబాద్. 12. జి.శ్రీజన ; ప్రస్తుతం: డైరెక్టర్, పీఆర్ అండ్ ఆర్‌డీ; బదిలీ: డైరెక్టర్ మహిళా శిశు సంక్షేమం(అదనపు బాధ్యతలు). 13. శివశంకర్ లాహోటి; ప్రస్తుతం: వెయిటింగ్ ఫర్ పోస్టింగ్; బదిలీ: సంయుక్త కార్యదర్శి, వ్యవసాయం, సహకార శాఖ, సంయుక్త కార్యదర్శి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (అదనపు బాధ్యతలు) 14. చిట్టెం లక్ష్మి; ప్రస్తుతం: వెయిటింగ్ ఫర్ పోస్టింగ్; బదిలీ: సంయుక్త కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ. 15. కె.హైమావతి; ప్రస్తుతం: పీడీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ; బదిలీ: కలెక్టర్, సిద్దిపేట. 16. వాసం వెంకటేశ్వర్లు; ప్రస్తుతం: డైరెక్టర్ యువజన సర్వీసులు ; బదిలీ:డైరెక్టర్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, కుటుంబ సంక్షేమం. 17. వీపీ గౌతమ్ ; ప్రస్తుతం: ప్రత్యేక కార్యదర్శి, గృహ నిర్మాణం; బదిలీ: కార్యదర్శి, గృహ నిర్మాణ శాఖ (అదనపు బాధ్యతలు) 18. గౌతం పొట్రూ; ప్రస్తుతం: కలెక్టర్, మల్కాజిగిరి–మేడ్చల్; బదిలీ: డైరెక్టర్ సింగరేణి పర్సనెల్ అండ్ అడ్మినిస్ట్రేషన్. 19.కె. నిఖిల; ప్రస్తుతం: సీఈవో, టీజీఐఆర్‌డీ; బదిలీ: డైరెక్టర్, మత్స్యశాఖ, సీఈవో (టీజీఐఆర్‌డీ అదనపు బాధ్యతలు) 20.వల్లూరి క్రాంతి; ప్రస్తుతం: కలెక్టర్, సంగారెడ్డి; బదిలీ: మేనేజింగ్ డైరెక్టర్ , పర్యాటకాభివృద్ధి సంస్థ 21.ఉదయ్‌కుమార్; బదిలీ: సీఈవో, ఆరోగ్యశ్రీ ట్రస్ట్, ప్రత్యేక కార్యదర్శి, పీఈ శాఖ 22. ప్రియాంక ఆలా ; ప్రస్తుతం: డైరెక్టర్, మత్స్య శాఖ; బదిలీ: కార్యదర్శి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్. 23. పి. ప్రావీణ్య; ప్రస్తుతం: కలెక్టర్, హనుమకొండ; బదిలీ: కలెక్టర్, సంగారెడ్డి. 24. నిర్మలా కాంతివెస్లీ ; బదిలీ: కార్యదర్శి, సీఈవో, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, వీసీ అండ్ ఎండీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్. 25. మిక్కిలినేని మనుచౌదరి; బదిలీ: కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి. 26. ముజమ్మిల్ ఖాన్; ప్రస్తుతం: కలెక్టర్, ఖమ్మం; బదిలీ: డైరెక్టర్ సివిల్ సప్లయ్స్, సీఆర్‌వో హైదరాబాద్ (అదనపు బాధ్యతలు). 27. స్నేహ శబరీష్ ; ప్రస్తుతం: అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ; బదిలీ: కలెక్టర్, హనుమకొండ. 28. అనుదీప్ దురిశెట్టి; ప్రస్తుతం: కలెక్టర్, హైదరాబాద్; బదిలీ: కలెక్టర్, ఖమ్మం 29. నవీన్ నికోలస్; ప్రస్తుతం: కార్యదర్శి, టీజీపీఎస్సీ; బదిలీ: డైరెక్టర్, పాఠశాల విద్య, (ఎస్ ఎస్ఏ పీడీగా అదనపు బాధ్యతలు). 30. చెక్క ప్రియాంక ; ప్రస్తుతం: ఉప కార్యదర్శి, ఎంఏ అండ్ యూడీ; బదిలీ: స్పెషల్ కమిషనర్, ఐ అండ్ పీఆర్. 31. చాహత్ బాజ్‌పేయి; ప్రస్తుతం: కమిషనర్, కరీంనగర్ కార్పొరేషన్; బదిలీ: కమిషనర్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్. 32. అశ్విని తానాజీ వకాడే; బదిలీ: అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) కరీంనగర్. 33. ప్రఫుల్ దేశాయ్; బదిలీ: కమిషనర్, కరీంనగర్ కార్పొరేషన్. 34. షఫీయుల్లా; ప్రస్తుతం : ప్రత్యేక కమిషనర్, గ్రామీణాభివృద్ధి; బదిలీ: కార్యదర్శి, మైనారిటీ సంక్షేమం, కార్యదర్శి, మైనారిటీ స్కూల్స్ (అదనపు బాధ్యతలు) 35. వీఎస్ఎన్‌వీ ప్రసాద్ (ఐఎఫ్ఎస్); బదిలీ: డైరెక్టర్, హెచ్ఎండీఏ 36. నిఖిల్ చక్రవర్తి; ప్రస్తుతం: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, టీజీఐఐసీ; బదిలీ: డైరెక్టర్, పరిశ్రమల శాఖ,

అనధికారిక నిర్మాణాలను ఆపేయండి

- జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో చేపడుతున్న అనధికారిక నిర్మాణాలను వెంటనే ఆపేయాలని హైకోర్టు తేల్చిచెప్పింది. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడంతో గవర్నింగ్ కౌన్సిల్‌పై కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను వచ్చే నెల 10వ తేదీకి వాయిదా వేసింది. జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని జూబ్లీహిల్స్‌కు చెందిన పి.వేణుగోపాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున న్యాయవాది ఏ.రఘురాం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రవికిరణ్‌రావు వాదనలు వినిపిస్తూ.. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినందుకు వేణుగోపాల్‌పై అక్రమ కేసు బనాయించారని చెప్పారు. కార్పొరేషన్ నుంచి స్పీకింగ్ ఆర్డర్ వచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. వెంటనే కఠిన చర్యలు తీసుకొని, నిర్మాణాలు నిలిపివేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

నోటీసులు జారీ చేసినా ఆపడం లేదు..

జీహెచ్ఎంసీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ అరుణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. అధికారిక అనుమతులు లేకుండా జూబ్లీహిల్స్, రోడ్ నంబర్ 14, సర్వే నంబర్ 403/1లో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ నిర్మాణాలు చేపడుతోందని చెప్పారు. టీఎస్ బీపాస్ చట్టం 2020, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని 2024, డిసెంబర్ 9న షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. అయినా అక్రమ నిర్మాణదారు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ ఏడాది జనవరి 9న స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశామని.. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించామన్నారు. అయితే సదరు అక్రమ నిర్మాణదారు అనధికారిక నిర్మాణాలన్నింటికి బిల్డింగ్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ దరఖాస్తు పెండింగ్‌లో ఉందని, చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గవర్నింగ్ కౌన్సిల్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అనుమతి వచ్చే వరకు నిర్మాణాలపై ముందుకు వెళ్లొద్దని హెచ్చరిస్తూ.. విచారణ వాయిదా వేశారు.





చేతులకు రోజాలు







పువ్వులకు మగువలకు విడదీయరాని బంధం ఉంటుంది.
పువ్వులను తమ భుజాల మీదుగా
మణికట్టు వరకు అలంకరించుకుని
అందంగా కనిపించడానికి ఇష్టపడుతున్నారు.
వెస్ట్రన్ గౌన్లలో విరివిగా కనిపించే ఈ స్టైలు ఇప్పుడు
ఎల్లలు దాటి మన సంప్రదాయ డిజైనర్ వేర్‌లోనూ కనువిందు చేస్తోంది.
ఫ్యాబ్రిక్‌తో పువ్వులు వచ్చేలా కుట్టడం ఈ స్టైల్ ప్రత్యేకత.
ఇక పువ్వులు చేతుల్లో కాదు, చేతులకు అందంగా అలంకరించుకోవచ్చు.

గులాబీ పువ్వు ఆకృతి వచ్చేలా బ్లౌజ్ స్లీవ్స్ డిజైన్ చేయడం ఈ స్టైల్ స్పెషల్. ఈ పువ్వులు లేయర్లుగా మంచి ఫ్లేర్ వచ్చేలా డిజైన్ చేస్తారు. వీటిని ఎక్కువగా నెట్, ఆర్గాంజా, షిఫాన్ వంటి ఫ్యాబ్రిక్స్‌తో తయారు చేస్తారు.

- ఇండో వెస్టర్న్ డ్రెస్సుల్లో, ఫ్యూజన్ గౌన్లు, క్రాప్ టాప్ + స్కర్ట్ లుక్, పెప్లం టాప్స్, షరారా, పలాజో సెట్‌లలో విరివిగా కనిపిస్తున్నాయి.
- సంప్రదాయ డ్రెస్సులకు రెండు వైపులా ఫ్యాబ్రిక్ గులాబీల కుచ్చు ఉంటే, వెస్టర్న్ స్టైల్స్‌లో బ్లౌజ్ లేదా గౌన్‌కు, సింగిల్ షోల్డర్ ఫ్రాక్‌కి ఒకవైపు గులాబీ గుచ్చం కనువిందు చేస్తుంది.
- శారీ లేదా లెహంగా కూడా సింగిల్ షోల్డర్ రోజ్ బొకేని డిజైన్ చేయించుకోవచ్చు.
- శారీ బ్లౌజ్ ట్రెండ్‌లలో గులాబీ స్లీవ్స్ అందంగా అమరిపోతున్నాయి.
- రోజ్ స్లీవ్స్ ఎంచుకున్నప్పుడు జుట్టును పోనీటైల్ లేదా బన్ స్టైల్ వేసుకుంటే డ్రెస్సింగ్ మరింత స్పష్టంగా కనిపిస్తుంది.
- హై నెక్ టాప్ అయితే డ్యూయల్ రోజ్ స్లీవ్స్ బాగుంటాయి.
- స్లీవ్స్ డిజైన్ బోల్డ్‌గా ఉంటే, నెక్ సింపుల్‌గా ఎలాంటి ఆభరణాలు లేకుండా ఉంటే బాగుంటుంది. పెద్ద పెద్ద ఆభరణాలు కాకుండా సన్నని చైన్లు వాడచ్చు.

పింక్, పీచ్ కలర్ బ్లౌజ్ అయితే ఫెమినైన్ లుక్, రెడ్ కలర్ అయితే స్టేట్‌మెంట్ అటైర్‌గా, తెలుపు, గోధుమరంగు అయితే వేదికలపైన పల్లకీ లుక్‌తో కనిపిస్తారు. ఏ స్టైల్‌లో కనిపించాలనుకుంటే ఆ డ్రెస్సింగ్‌కి సరిగ్గా నప్పే ఈ గులాబీల గుచ్చాలు ప్రత్యేకంగా కనిపించడమే కాదు, ఫొటోలలోనూ విలాసంగా ఉంటుందనే ఆలోచన కూడా దీనికి క్రేజ్ పెంచుతోంది.
నిన్నటి వరకు పిల్లల డ్రెస్సింగ్‌లో కనిపించే ఈ స్టైల్ పెద్దవారి చీరకట్టుకూ అందాన్ని తీసుకువచ్చింది. రిసెప్షన్, సంగీత్.. వంటి వేడుకలలో గ్రాండ్‌గా వెలుగుతోంది.

ఆదివాసీ కోయిల
నా అడవి నాదే పాట

ఆకులందు అణిగిమణిగి ఉండే అడవి పాటను
భళ్లుమనే దీపాల నగర వేదికల మీదకు తెచ్చింది మాహి.
మహారాష్ట్ర ఆదివాసీ తెగకు చెందిన ఈ యువ గాయని
తన రాప్ సింగింగ్‌ని పేరు కోసమో కీర్తి కోసమో కాక
అడవి కోసం, పర్యావరణం కోసం ఆయుధంగా మార్చింది.
మాహి చెప్పేది ఒకటే - దేశంలో ఎవరు ఎక్కడ ఉండాలో
కొందరు నిర్ణయించారు.
ఎక్కడకు చేరాలో మనం నిశ్చయించుకుంటే చాలు అని.
మాటీఖ నిర్ణయం ప్రకారం ఆమె పాట సరిహద్దులు దాటుతోంది.



మాహి



'నేను మీకు వినోదం అందించడానికి రాలేదు. నా జాతికి ప్రాతినిధ్యం వహించడానికి వచ్చాను' అంటుంది మాహి. 27 ఏళ్ల ఈ ర్యాప్ సింగర్ ఆదివాసీల జీవితాన్నే పాటగా మార్చి లైవ్ షోస్ చేస్తూ ఆదరణ పొందుతోంది. ఎడతెగని వచనాన్ని పాటలా పాడే 'ర్యాప్' లో మన దేశం నుంచి మురికివాడల పిల్లలు కూడా షైన్ అయ్యి పేరు సంపాదించారు. ఇప్పుడు అడవి నుంచి వచ్చిన మాహి వంతు. 'మా ఆదివాసీల గురించి నేను పాడక పోతే ఇంకెవరు పాడతారు' అంటుంది మాహి.

గిరిజన కోయిల
మాహి పూర్తి పేరు మధుర యశ్వంత్ ఘనె. అయితే ర్యాపర్‌గా మాహి.జి పేరుతో గుర్తింపు పొందింది. ఈమె సొంత ఊరు మహరాష్ట్రలోని వరంగుషి. వీళ్లంది మహదేవ్ కోలి అనే గిరిజన తెగ. తండ్రి బస్ కండక్టర్‌గా పని చేస్తుంటే తల్లి గృహిణి. 'మా తెగలో ఎవరూ బడికి వెళ్లరు. వెళ్లినా మధ్యలోనే మానేస్తారు. అందుకే మా అమ్మా నాన్నా నా చదువు కోసం ముంబై వలస వచ్చారు' అంటుంది మాహి. ముంబైలో తమ్ముడితో కలిసి ఇంజనీరింగ్‌లో చేరిన మాహి అక్కడే స్టూడెంట్స్ పాడే ర్యాప్ సాంగ్స్‌ను మొదటిసారి వింది. అయితే ఆమెకు పాడటం రాదు, బాణీ కట్టడం అంతకన్నా రాదు. కాని అప్పుడప్పుడు కవిత్వం రాసేది. కాని కోవిడ్ వచ్చాక ఆమెలోకి గాయని బయటకు వచ్చింది.

అడవి పాట ఇచ్చింది
కోవిడ్ వచ్చినప్పుడు ముంబై మూగబోయింది. ఆ సమయంలో నగరం మంచిది కాదని మాహి కుటుంబం అడవిలోని సొంత పల్లెకు వెళ్లి ఉండిపోయింది. 'అక్కడకు వెళ్లాక మా వాళ్ల జీవితం నాకు కొత్తగా అర్థమైంది. వారు కోవిడ్ కాలంలో కూడా హాయిగా జీవిస్తున్నారు. వారు ప్రకృతి ఒడిలో ఉన్నారు. ఆశ లేదు. పరుగు లేదు. ఎవరికీ హాని చేయరు. అడవిని కాపాడి మేలు చేస్తారు. కాని వీరి గురించి ఎవరూ మాట్లాడరే. అడవుల్లో గిరిజనులు ఉన్న ఊసే ఎవరికీ ఉండదే అనిపించింది. అలా మొదటి పాట తన్నుకొని వచ్చింది. ఆ పాటే 'జంగిల్ చా రాజా'. 2019లో ఈ పాట బయటకు రాగానే నాకు గుర్తింపు వచ్చింది' అంటుంది మాహి.

హక్కుల కోసం పాట
మాహి తన పాటలో సామాజిక స్పృహ ఉండాలని కోరుకోవడం ఆమెకు గౌరవాన్ని తెచ్చింది. జేఎన్‌యూ స్టూడెంట్స్ ప్రత్యేకంగా ఆహ్వానించి మాహి షో నిర్వహించడంతో మాహి పాటల్లోని రాజకీయ స్పృహ మరింతగా పదును తేలింది. ఇక మాహి పాటలు వరుసెత్తాయి. రైతుల సమస్యలు, కుల వివక్ష, క్వీర్ కమ్యూనిటీ హక్కులు, గ్రామీణ జీవనం, స్త్రీల సంఘర్షణ ఆమె పాట వస్తువులయ్యాయి. 'కనిపించే వాటిని చూస్తూ కూడా అంధుడిగా మారకు'... 'ఎవరి చెమటతో నీ ఇల్లు పూర్తవుతుందో వారు ఏ ఠికానా లేకుండా తిరగడాన్ని చూడు'... 'బేటీ బచావు కబ్ తక్... ఎందుకు ఆడపిల్లను కాపాడాలి... కాపాడాల్సిన అవసరమే లేని సమాజాన్ని నిర్మించలేమా'... ఇలా ఉంటాయి ఆమె పాటల్లోని లైన్లు.
మాహి ఇంకా చాలా పేరునూ గుర్తింపునూ పొందనుంది. ఎందుకంటే ఆమె పాటలో అర్థం, ఆగ్రహం ఉన్నాయి. అవి పాటను సజీవం చేస్తాయి.

ఆ వెడ్డింగ్ గౌనుకి ఒకటిన్నర మిలియన్ల వ్యూస్..!

ఐదంటే ఐదు డాలర్లు పెట్టి ఎప్పుడో అరవై ఏళ్ల క్రితం నాటి వెడ్డింగ్ గౌన్ కొనుక్కుందామె, అది తొడుక్కుని చూద్దామని టిక్‌టాక్‌లో అన్‌బాక్సింగ్ వీడియో పోస్ట్ చేసింది. అయితే అది ఆమెకు సరిపోలేదు. దాంతో తనకన్నా కొద్దిగా తక్కువ పర్సనాలిటీ ఉన్న తన చెల్లెలికి ఆ గౌన్ ఇచ్చింది. అది ఆమెకు అతికినట్లు సరిపోయింది. త్వరలో జరగనున్న తన వెడ్డింగ్‌కి ఆ గౌన్‌ని డ్రై క్లీనింగ్ చేయించి దానినే ధరించాలని డిసైడ్ చేసుకుంది. ఇక్కడ అది కాదు విశేషం. వీరిద్దరి వీడియోస్‌కి మిలియన్ల సంఖ్యలో వ్యూస్ వచ్చాయి. షష్టిపూర్తి కూడా జరుపుకున్న



నాటి ఆ గౌను అంత నాజూగ్గా ఉండటం, అది కారుచౌకగా కొనుక్కుని దానికి చిన్న చిన్న రిపేర్లు చేయించి తన వెడ్డింగ్ రోజున అదే గౌన్‌ను ధరించాలనుకోవడం చాలా బాగుందంటూ అందరూ ఆ అక్కచెల్లెళ్లని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఓహియోలోని కొలంబస్‌కు చెందిన మ్యాడీ స్ట్రేయర్ అనే ఆమె వింటేజ్ వెడ్డింగ్ డ్రెస్‌లు దొరికే ఎస్టేట్ సేల్‌లో పాతకాలం నాటి ఈ వెడ్డింగ్ గౌన్ చూసి ముచ్చటపడింది. వెంటనే ఐదు డాలర్లు చెల్లించి దానిని కొనుక్కుంది. తనకు సరిపోకపోవడంతో చెల్లెలికి దానిని ప్రెజెంట్ చేసింది. అయితే ఆమె కూడా ఆ గౌనును చూసి మురిసిపోయి త్వరలో జరగబోయే తన పెళ్లికి బోలెడంత ఖరీదు చేసి అప్పటికే వెడ్డింగ్ గౌన్‌ను కొనుక్కున్నప్పటికీ దానిని పక్కనపెట్టి మరీ అక్క ఇచ్చిన ఈ గౌన్ తొడుక్కోవడానికి డిసైడైంది. వీరిద్దరి వీడియోలకూ ఒకటిన్నర మిలియన్లకి పైగా వ్యూస్, లక్షా ఇరవై ఆరువేల లైకులూ వచ్చాయి.

కలియుగ శ్రవణ కుమారుడు

రామాయణ కాలంలో శ్రవణకుమారుడు అంధులైన తన తల్లిదండ్రులను కావడిలో మోసుకుంటూ తీసుకువెళ్లేవాడని మనం చిన్నప్పుడు చదువుకున్నాం. దాని సంగతి ఎలా ఉన్నా బిహార్‌కు చెందిన ఈ అభినవ శ్రవణ కుమారుడు మాత్రం తొంభై ఏళ్ల తన తల్లిని భుజాలమీద కూచోబెట్టుకుని గయలో స్నానానికి తీసుకువెళ్లాడు. ఈ వార్త వైరల్ అయింది. బిహార్‌లోని కైమూర్ జిల్లాకు చెందిన రాణా ప్రతాప్ సింగ్ అనే అతనికి తన తల్లి అంటే పంచప్రాణాలు. ఆమె అడిగితే ఏమైనా చేస్తాడు. ఆ ముసలి తల్లి ఓ రోజు తన కుమారుడిని తనకు గంగాస్నానం చేయాలని ఉంది చెప్పింది. ఇంతకాలానికి తనకు తల్లి కోరిక నెరవేర్చే అవకాశం దొరికిందని అతడు ఎగిరి గంతేశాడు. అయితే అమ్మను అక్కడికి తీసుకువెళ్లాలంటే ఏదైనా వాహనం మాట్లాడుకోవాలి. అందుకు చాలా ఖర్చవుతుంది. అంత భారం భరించలేడు తను. అందుకోసం అతను తన తల్లిని పసిపిల్లలా ఎత్తి తన మెడలమీద కూచోబెట్టుకున్నాడు. నెమ్మదిగా నడుచుకుంటూ ఆమెను వారణాసికి తీసుకువెళ్లాడు. అక్కడ పవిత్రమైన గంగాస్నానం చేయించాడు. ''అమ్మ అంటే నాకెంతో ఇష్టం. చిన్నప్పుడు బిడ్డలకు అమ్మ చేసే సేవలతో పోల్చుకుంటే ఇదెంత? దుస్తులు పాడుచేసుకున్న ప్రతిసారీ బిడ్డకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా శుభ్రం చేసి పొడిబట్టలు తొడుగుతుంది. గోరుముద్దలు తినిపిస్తుంది. ఉప్పెక్కించుకుని తిప్పుతుంది. పిల్లలతో గుర్రం ఆట ఆడుతుంది. ఆ బిడ్డలు మాత్రం పెద్దయ్యాక అమ్మానాన్నలను అంతగా పట్టించుకోరు. అయితే తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకునేవారికి జీవితంలో అపజయం అంటూ ఉండదని నా నమ్మకం. నేను నా తల్లిని నా బిడ్డలా చూసుకుంటాను. ఆమె తనకు గంగాస్నానం చేయాలని ఉందని చెప్పగానే వాహనం కుదుపులు లేకుండా నేనే తనను ఎత్తుకుని తీసుకువెళ్లాలనుకున్నాను. అందుకే అమ్మను ఇలా తీసుకువచ్చి స్నానం చేయించాను. ఇప్పుడు నాకెంతో సంతృప్తిగా ఉంది'' అంటున్నాడు.



తల్లిని ఎత్తుకుని గంగా స్నానానికి తీసుకెళుతున్న రాణా ప్రతాప్ సింగ్

బ్యూటిప్స్



- ఆలివ్ ఆయిల్, అలొవెరా జెల్ సమపాళ్లలో తీసుకొని అందులో కొద్దిగా వెనిలా ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని పొడిబారే చర్మతత్వం గల వారు మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు.
- చర్మం తాజాగా మెరుస్తూ ఉండాలంటే ఎప్పటికప్పుడు చర్మంపై ఉండే మృతకణాలను తొలగిస్తూ ఉండాలి. ఇందుకోసం కార్న్‌ఫ్లేక్స్‌ని పొడి చేసి అందులో తేనె, పాలు కలిపి చర్మానికి పట్టించి మర్దన చేయాలి. దీంతో మృతకణాలు తొలగిపోయి, చర్మం మృదువుగా మారుతుంది.
- మూడు టీ స్పూన్ల కొబ్బరి నూనె, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ గ్లిజరిన్, రెండు టీ స్పూన్ల నీళ్లు కలిపి మరిగించాలి. ఈ మిశ్రమం చల్లారాక ముఖానికి రాసి, మసాజ్ చేయాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ ఆయిల్ ప్యాక్ చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.



బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 12న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,410
బంగారం (22 క్యారెట్లు)	90,600
వెండి	1,05,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,360
బంగారం (22 క్యారెట్లు)	91,000
వెండి	1,08,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,280
బంగారం (22 క్యారెట్లు)	91,000
వెండి	1,18,900
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,360
బంగారం (22 క్యారెట్లు)	93,730
వెండి	1,08,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,900
బంగారం (22 క్యారెట్లు)	89,150
వెండి	1,04,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,270
బంగారం (22 క్యారెట్లు)	91,000
వెండి	1,19,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

మిస్ వరల్డ్ 2025
భారతీయ నాట్యానికి ప్రపంచ వేదిక



శ్రవ్య

కూచిపూడి కళాకారిణి శ్రవ్యమానస. అత్యంత సామాన్య కుటుంబంలో పుట్టిన శ్రవ్య తనకు తానుగా ఎక్కిన నిచ్చెన మెట్లే అన్నీ. తొమ్మిదేళ్ల వయసులో గజ్జె కట్టి... నేడు 'మిస్ వరల్డ్ 2025' కార్యక్రమాల్లో నాట్య ప్రదర్శనలిచ్చిన ఘనతను తన ఖాతాలో జమ చేసుకున్నారు.

కళాకారుల బిడ్డ!
శ్రవ్య అమ్మానాన్నలిద్దరూ కళాకారులే. సామాన్య కుటుంబం కావడంతో ఉద్యోగం మీదనే దృష్టి పెట్టాల్సి వచ్చింది. శ్రవ్య జీవితంలో నాట్యం, చదువు రెండూ సమతూకంగానే పెరిగాయి. ఎంటెక్ పూర్తి కాగానే హైదరాబాద్ మెట్రో రైల్‌లో ఉద్యోగం వచ్చింది. కానీ కళ కోసం ఉద్యోగాన్ని వదిలేయాల్సి వచ్చింది. దేశవిదేశాల్లో ఆమె ప్రదర్శనలు పద్దెనిమిది వందలు దాటాయి. ఆమె అకాడెమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థుల సంఖ్య మూడు వేలు దాటింది.

అధ్యయనమే గెలిపిస్తోంది!
'నాట్యసాధనలో నిత్యం మేధోమథనం జరుగుతూ ఉండాలి. గురువులు నేర్పించిన జ్ఞానంతో సరిపుచ్చుకుంటే అక్కడే ఆగిపోతాం' అంటారు శ్రవ్య. మిస్ వరల్డ్ 2025 పోటీల్లో బుద్ధవనంలో ప్రదర్శన బుద్ధుడి ఇతివృత్తంగా ఉండాలన్నారు నిర్వాహకులు. వారం రోజుల్లో బౌద్ధాన్ని అధ్యయనం చేసి, కాస్ట్యూమ్స్ లేత రంగులతో నిరాడంబరంగా డిజైన్ చేసి, బృందం మొత్తానికి కుట్టించడం వరకు ఎందులోనూ రాజీ పడలేదామె.
అలాగే చౌమొహల్లా ప్యాలెస్ ప్రదర్శనకు సితార్ వంటి నిజాం సంగీత శైలితో సెమీ క్లాసికల్ రూపొందించి ప్రదర్శించారు. పోచంపల్లిలో తెలుగు జానపదం కోలాటం, శిల్పారామంలో బృందావనం, బంజారా, రాసలీలలు ప్రదర్శించి చూపారు.

ఆర్ద్రతే కళ
క్యాన్సర్ పేషెంట్‌కి విగ్ తయారు చేయడానికి సహజమైన కేశాలు అవసరమని తెలిసి గుండు చేయించుకుని తన కేశాలనిచ్చారు శ్రవ్య. కళాకారులను బతికించేది మనసు లోతుల్లోంచి ఉబికి వచ్చే ఎమోషనే. ఈ సున్నితత్వాన్ని తనలో పదిలపరుచుకుంటున్నారామె. అబుదాబిలో శ్రీనివాస కల్యాణం ప్రదర్శనకు స్టాండింగ్ ఒవేషన్ రావడం మధురానుభూతి, యాసిడ్ సర్వైవర్ మనోగతాన్ని ఆవిష్కరించడం నర్తకిగా ఆమె సామాజిక బాధ్యత. కళాకారులు సామాజిక సమస్యల మీద స్పందించడంతో పాటు సాంకేతికంగా కూడా ఎప్పటికప్పుడు తమను తాము అప్‌డేట్ చేసుకోవాలి. చెయ్యి పట్టుకుని నడిపించే గాడ్‌ఫాదర్‌లు లేని శ్రవ్య మానస... డిజిటల్ వేదికగా ప్రపంచానికి సుపరిచితం కావడం వల్లనే మిస్ వరల్డ్ 2025 కార్యక్రమాల్లో నాట్య ప్రదర్శన అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. 'వ్యక్తిగా పరిపూర్ణత సాధించిన బ్యూటీ పాజంట్స్ నుంచి చాలా నేర్చుకున్నాను'... అన్నప్పుడు ఆమెలో శిఖరాన్ని అధిరోహించిన సంతోషం వ్యక్తమైంది.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

భారత నాట్యరీతుల భారత్ కీ బేటీ
మన దేశంలోని నాట్యరీతులు దేనికదే వైవిధ్యభరితం. గత ఏడాది జరిగిన 'లోక్‌మంథన్' కళల ప్రదర్శనలో 'భారత్ కీ బేటీ' పేరుతో నేను రూపొందించిన అరగంట ప్రదర్శన తల్లిగర్భంలోని ఒక పాపాయి అంతర్మథనం. తాను ఎక్కడ పుట్టాలనే మీమాంసలో ఉంటుందా బిడ్డ. గుజరాత్‌లో పుడితే గర్బా నాట్యం నేర్చుకోవచ్చు. పంజాబ్‌లో పుడితే భాంగ్రా నాట్యకారిణి కావచ్చు. భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ... ఇలా ఆ బిడ్డ ఆలోచన సాగుతుంది. ఈ థీమ్‌లో మనదేశంలోని 15 నాట్యరీతులను ప్రదర్శించాను. ఇక నాకు మిస్ వరల్డ్ పోటీల కోసం వచ్చిన బ్యూటీ పాజంట్స్‌తో పని చేయడం ఒక ఎడ్యుకేషన్. వారిలోని సంయమనం, దయ, కరుణ, ఒదిగినతనం వంటి లక్షణాలు బాగా ఆకట్టుకున్నాయి.
– శ్రవ్యమానస, కూచిపూడి నాట్యకారిణి





గొంతు మార్చి.. రూ.2 లక్షలు కాజేసి!
ఓ వ్యక్తి గొంతును అనుకరించి.. ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసి రూ.2.5 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. -10లో



పికిల్స్.. పీక్స్..
నగరం నుంచి విదేశాలకు ఎగుమతి కోసం పచ్చళ్ల తయారీ ఊపందుకుంది. ఏటా జూన్‌లో భారీగా ఎగుమతయ్యే నేపథ్యంలో సందడి కనిపిస్తోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.







బడి వైపు అడుగులు

బడి గంటలు మోగాయి. గురువారం నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకున్నాయి. ఇన్నాళ్లూ ఆటా పాటలతో సరదాగా గడిపిన పిల్లలు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయం నుంచే రోడ్లపై సందడి కనిపించింది. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూల్ వరకు వచ్చి వదిలివెళ్లారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ప్రవేశ ద్వారం వద్ద విద్యార్థులకు చాకెట్లు, పెన్సిళ్లు, బెలూన్లు, పూలు అందించి స్వాగతం పలికాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. - సాక్షి, సిటీబ్యూరో

బడి గంట మోగినా.. బండి బాగుపడలే..

గ్రేటర్ పరిధిలో 1,825 బడిబస్సులు ఫిట్‘లెస్’

- సామర్థ్యం లేనివాటిపై రవాణా శాఖ కొరడా
- నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు
- మొదటి రోజు 40 బస్సులు జప్తు
- ప్రత్యేక బృందాలతో యంత్రాంగం నిఘా



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: బడులు తిరిగి తెరుచుకొనే నాటికి సామర్థ్యం ఉన్న బస్సులను అందుబాటులో ఉంచాలనే నిబంధన మరోసారి ఉల్లంఘనకు గురైంది. సామర్థ్యంలేని బస్సులు వందల సంఖ్యలో రోడ్డెక్కాయి. స్కూల్ బస్సుల నిర్వహణపై రవాణాశాఖ ఆంక్షలు విధించినా.. కొన్ని విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. గురువారం గ్రేటర్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో సామర్థ్యం లేని 40 బస్సులను జప్తు చేసినట్లు రవాణా శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే బస్సులను జప్తు చేయడంతో పాటు భారీ జరిమానాలను సైతం విధిస్తామని ఆయన హెచ్చరించారు.

ఏటా.. ఏదో ఒక చోట..

- ప్రతి సంవత్సరం ఎక్కడో ఒకచోట స్కూల్ బస్సులు ప్రమాదానికి గురవుతున్నాయి. అభం శుభం తెలియని చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా ఘటనల్లో బస్సుల సామర్థ్యం ప్రశ్నార్థకం కావడంతో పాటు డ్రైవర్ల నిర్లక్ష్యం కూడా ఉంటోంది. వాహనాలు నడిపే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.
- మరోవైపు బస్సు బయటి వైపు వెనుక, ముందు గమనించకుండా ముందుకు కదిలించడం వంటి ఘటనల్లోనూ చిన్నారులు బలవుతూనే ఉన్నారు. మరోవైపు నగర శివార్లలోని పలు విద్యాసంస్థలకు చెందిన వాటిలో కాలం చెల్లిన బస్సులే ఎక్కువగా ఉన్నాయి. సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసి వాటిని పిల్లల కోసం వినియోగిస్తున్నారు. ఆర్టీఏ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రేటర్ పరిధిలో ఇప్పటికీ ఫిట్‌నెస్ లేనివి 1,825 బస్సులు ఉన్నాయి. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 13,552 బస్సులు ఉండగా వాటిలో ఇప్పటి వరకు 11,727 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

ముంపు కట్టడికి ముందస్తు ప్రణాళిక

వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

- శేరిలింగంపల్లి పరిధిలో పర్యటించిన రంగనాథ్
- ఉప్పర్‌పల్లిలో కేవలం 12 గంటల్లో సమస్య పరిష్కారం



స్థానికులతో మాట్లాడుతున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వరద ముప్పు ఉన్న పలు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి నీరు చేరిన డోయన్స్ కాలనీ, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి తదితర చోట్లకు ఆయన వెళ్లారు. ఎగువ నుంచి వచ్చిన వరద సాఫీగా గోపి చెరువుకు చేరే మార్గం లేని కారణంగా శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం రోడ్డు, కాలనీల్లోని నీరు చేరినట్లు గుర్తించారు. వర్షం నీరు, గోపి చెరువు నుంచి వచ్చిన వరదతో లింగంపల్లి అండర్ పాస్‌లో మునిగినట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

గోపి చెరువు, చాకలి చెరువులో నీటి మట్టం తగ్గించి వరద కట్టడి చేయవచ్చని సూచించారు. కొండాపూర్‌లోని కాసోరోస్ అపార్ట్‌మెంట్ పరిసరాలను రంగనాథ్ తనిఖీ చేశారు. వరద, మురుగు కాలువలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. బాచుపల్లిలో పలు వరద కాలువలను ఆయన పరిశీలించారు. ఎస్ఎన్‌డీపీ పథకం కింద చేపట్టిన కాలువల నిర్మాణ పనులు వేగంగా జరగాలని అధికారులను ఆదేశించారు. అప్పటి వరకు చెన్నం చెరువు నుంచి వచ్చే వరద రామచంద్రాపురం కాలనీలో నిలవకుండా దిగువన ఉన్న బాచుపల్లి చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వరద ముప్పునకు పరిష్కారం..

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు నగరంలోని రాజేంద్రనగర్ మండలంలోని ఉప్పర్‌పల్లి, శాస్త్రిపురం, పల్లె చెరువు ప్రాంతాలను రంగనాథ్ బుధవారం సందర్శించారు. ఉప్పర్‌పల్లిలోని అశోక్ విహార్ కాలనీలో మురుగు, వరద కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు వెళ్లారు. ఎగువ నుంచి వచ్చే వరదలతో ఐదు అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న 400 కుటుంబాలు ఏడేళ్లుగా తాము పడుతున్న అవస్థలను హైడ్రా కమిషనర్‌కు వివరించారు. 150 మీటర్ల దూరంలో మూసీ నదిని కలిపే ప్రధాన కాలువ ఉందని దానికి అనుసంధానంగా కాలువ ఏర్పాటు చేస్తే తమకు ఇబ్బందులు తప్పుతాయని విజ్ఞప్తి చేశారు. నిధులు మంజూరైనా భూయజమానులు పనులకు అనుమతించడం లేదన్నారు. ఆ కాలువను తవ్వి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో గురువారం ఉదయం కాలువల్ని తవ్వించిన రంగనాథ్ స్థానికుల సమస్యను పరిష్కరించారు. మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లె చెరువు ఔట్‌లెట్‌తో పాటు శాస్త్రీపురంలోని కబ్జాకు గురైన పార్కును పరిశీలించారు.

హైదరాబాద్ కలెక్టర్‌గా హరిచందన

మేడ్చల్‌కు మిక్కిలినేని మనూ చౌదరి



హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా దాసరి హరిచందనను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. మేడ్చల్ జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మనూ చౌదరిని నియమించింది. ఇక్కడి కలెక్టర్ గౌతమ్‌ను సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా బదిలీ చేసింది. హైదరాబాద్ సీఆర్ఓగా ముజమ్మిల్ ఖాన్ హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా ముజమ్మిల్ ఖాన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఎఫ్ఓబీలు ఎందుకో!

GHMC ప్రజల కోసమా.. ప్రకటనల కోసమా ?

- ఉన్నవాటికే దిక్కులేదు..
- కొత్తగా 86 ఎఫ్ఓబీలకు రెడీ
- జీహెచ్‌ఎంసీ రూటే సపరేటు



సాక్షి, సిటీబ్యూరో: ఉన్న సదుపాయాలను ప్రజలు వినియోగించుకుంటున్నదీ, లేనిదీ పట్టించుకోని జీహెచ్‌ఎంసీ.. ఎవరి ప్రయోజనాల కోసమో గానీ అవసరం లేకపోయినా కొన్ని పనులు చేస్తుంటుంది. అందుకు ఉదాహరణగా ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ)లనే చెప్పుకోవచ్చు. నిజానికి నగరంలో ఎఫ్ఓబీల అవసరం ఎక్కువే. ప్రధాన రహదారుల్లో పలు ప్రాంతాల్లో రోడ్లు దాటలేక పాదచారులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వారి సమస్య తీర్చడం కోసం ఇప్పటికే కొన్ని ఎఫ్ఓబీలు నిర్మించిన జీహెచ్‌ఎంసీ.. వాటిని ఎంతమంది వినియోగించుకుంటున్నారు? అవస్థలు పడుతూ అయినా చాలామంది రోడ్డుపైనే నడుస్తున్నారు తప్ప వాటిని ఎందుకు వినియోగించుకోవడం లేదు? అనే ఆలోచనే లేకుండాపోయింది. కట్టడం వరకే మావంతు అన్నట్లుగా వ్యవహరించడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఎన్నో ఫ్లైఓవర్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని ఏళ్ల తరబడి నిర్మాణాల్లోనే ఉన్నాయి. అయినా.. మళ్లీ కొత్తగా 86 ఎఫ్ఓబీలకు ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సిందిగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం)ను కోరింది. దాని స్టడీ పూర్తయ్యాక కొత్త ఎఫ్ఓబీలు నిర్మించేందుకు సిద్ధమైంది.

అప్పుడలా..

- పాదచారులు ప్రమాదాల బారిన పడకుండా రోడ్డు దాటేందుకు 100 ప్రాంతాల్లో ఎఫ్ఓబీలు నిర్మించాలని ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భావించింది. ఎఫ్ఓబీలపై ప్రకటనల వల్ల వాటిని చూస్తూ వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉండటంతో, పాదచారులకు ఉపకరించడానికే అవి ఉండాలని భావించి నిబంధనల్ని మార్చింది. ప్రకటనలు లేకుంటే ఆదాయం రాదని భావించి పీపీపీ పద్ధతిలో వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీలు వెనకడుగు వేశాయి. కేవలం తొమ్మిది ఎఫ్ఓబీలకు మాత్రమే ప్రైవేటు ఏజెన్సీలు ముందుకొచ్చాయి. దాంతో ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకొని తొలిదశలో 42 ఎఫ్ఓబీలు హెచ్ఎండీఏకు, 10 ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ బాధ్యతలప్పగించింది.
- ఐదు ప్రాంతాల్లో తప్ప తాము నిర్మించలేమని హెచ్ఎండీఏ చేతులెత్తేయడంతో, 39 ఎఫ్ఓబీల నిర్మాణ వ్యయాన్ని భరించాల్సిందిగా ఆదేశించి, పనులు జీహెచ్‌ఎంసీకి అప్పగించింది. ఫీజిబిలిటీ తదితరాలను పరిగణనలోకి తీసుకుని 17 ప్రాంతాల్లో పనులు చేపట్టినప్పటికీ, కొన్నింటి పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఇందుకు నిదర్శనం జీవీకే మాల్ దగ్గరి ఎఫ్ఓబీ. బాలానగర్, మదీనాగూడ, మియాపూర్, ఈఎస్ఐ ఆస్పత్రి (ఎర్రగడ్డ), హైదరాబాద్ సెంట్రల్ మాల్ (పంజగుట్ట), నేరేడ్‌మెట్ బస్టాప్, సెయింట్ ఆన్స్ స్కూల్ (సికింద్రాబాద్), సెయింట్ ఆన్స్ స్కూల్ (తార్నాక), స్వప్న థియేటర్ (రాజేంద్రనగర్), ఒమర్ హోటల్ అండ్ షాలిమార్ హోటల్, రంగభుజంగ థియేటర్, మూసాపేట క్రాస్ రోడ్స్ ప్రాంతాల్లో పూర్తయ్యాయి.

పాత ఎఫ్ఓబీలున్న ప్రాంతాలు

అనూటెక్స్ (సైనిక్‌పురి), హెచ్‌పీ పెట్రోల్‌బంక్ (రామంతాపూర్), నేషనల్ పోలీస్ అకాడమీ (రాజేంద్రనగర్), గగన్ పహాడ్, మహావీర్ హాస్పిటల్, ఎన్ఎండీసీ (మాసాబ్‌ట్యాంక్), ఎన్టీఆర్ మార్గ్ (ట్యాంక్‌బండ్), గ్రీన్‌లాండ్స్ గెస్ట్‌హౌస్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ముఫకంజా కాలేజ్ (బంజారాహిల్స్), భారతీయ విద్యాభవన్ స్కూల్(ఫిల్మ్‌నగర్), వెల్స్ ఫార్గో (ఖాజాగూడ), ఐఎస్‌బీ, ఐటీసీ కోహినూర్, మియాపూర్ క్రాస్‌రోడ్స్, ఆల్విన్ క్రాస్ రోడ్స్ (మదీనాగూడ), మలేషియన్ టౌన్‌షిప్, కేపీహెచ్‌బీ-4 ఫేజ్, కళామందిర్ (కేపీహెచ్‌బీ కాలనీ), ఐడీపీఎల్, మెట్టుగూడ, రైల్‌నిలయం , హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట).

నిర్వహణ లేమి..

నగరంలో 23 ఎఫ్ఓబీలు ఎప్పటి నుంచో ఉన్నాయి. వాటికి నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. పరిశుభ్రత లేకపోవడంతో పాటు కొన్నింట్లో పైకి వెళ్లేందుకు లిఫ్టులు లేక, కొన్నింట్లో లిఫ్టులు ఉన్నప్పటికీ పని చేయక నిరుపయోగంగా మారాయి. లిఫ్టులు లేని చోట అంత పైకి మెట్లు ఎక్కలేక, కష్టమైనా రోడ్డు దాటడానికే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. రోడ్డు డివైడర్లను సైతం దూకుతున్నారు తప్ప ఎఫ్ఓబీలను వినియోగించుకోవడం లేదు. ఎఫ్ఓబీలు ఉన్నచోట 5 శాతం ప్రజలు కూడా వినియోగించుకోవడం లేదు.

ఇప్పుడిలా..

గత ప్రభుత్వం ప్రమాదాలు జరుగుతాయని ప్రకటనలపై ఆంక్షలు విధిస్తే.. పురాతనమైన ఎఫ్ఓబీలను సైతం ప్రకటనలకిచ్చేందుకు, తద్వారా ఆదాయం పొందేందుకు అనుమతించాలంటూ జీహెచ్‌ఎంసీ ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరింది. కొత్తవాటినీ ప్రకటనల ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసేందుకే ఫీజిబిలిటీ స్టడీ కోసం ఎన్ఐయూఎంను కోరింది.



ఉచిత బియ్యం.. నో స్టాక్

మూడు నెలల కోటా డ్రాకు పెరిగిన తాకిడి

- రేషన్ షాపులను తెరవని డీలర్లు
- ఆందోళనకు గురవుతున్న లబ్ధిదారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ‘ఉచిత బియ్యం’ నిల్వలు ఖాళీ కావడంతో డీలర్లు నో స్టాక్ బోర్డులు పెట్టేశారు. ఆహార భద్రత కార్డు కలిగిన కుటుంబాలకు ఒకేసారి మూడు (జూన్, జులై, ఆగస్టు) నెలల రేషన్ బియ్యం కోటాను పంపిణీ చేయడంతో బియ్యం నిల్వలపై ప్రభావం పడింది. కేటాయింపుల్లో తగినంత బియ్యం కోటా రేషన్ షాపులకు సరఫరా చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వాస్తవంగా రేషన్ దుకాణాల్లో మూడు నెలల కోటాకు సరిపడా స్థలం లేక డీలర్లు సైతం దుకాణం కెపాసిటీకి తగిన నిల్వలు మాత్రమే గోదాముల నుంచి డ్రా చేస్తూ వచ్చారు. రేషన్ కార్డుదారులు మూడు నెలల కోటా డ్రా చేయడంతో బియ్యం నిల్వలు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో డీలర్లు బియ్యం స్టాక్ వచ్చే వరకు దుకాణాలు మూసివేయడంతో లబ్ధి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

సన్నబియ్యంపై ఆసక్తితో..



ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యంపై లబ్ధి కుటుంబాల ఆసక్తి పెరిగింది. ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తుండటంతో ఈ నెల ఒకటి నుంచి రేషన్ షాపులకు తాకిడి పెరిగింది. గత రెండు వారాలుగా షాపుల ముందు ఉదయం నుంచే భారీగా క్యూ కట్టారు. వాస్తవంగా ఏప్రిల్ వరకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో కార్డుదారులు కోటా డ్రా చేసేందుకు అంతగా ఆసక్తి కనబర్చలేదు. గత నెలలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం కావడంతో డిమాండ్ పెరిగింది. తాజాగా మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో మరింత డిమాండ్ పెరిగినట్లయింది.

కోటా కేటాయింపు ఇలా..

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు కలిపి సుమారు 11,02,32,403 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను ప్రభుత్వం కేటాయించింది. మొత్తం దాదాపు 17.57 లక్షల కార్డులు ఉండగా, అందులో సుమారు 62,26,523 యూనిట్లు ఉన్నాయి. ఆహార భద్రత కార్డులు కలిగిన ఎఫ్ఎస్‌సీ కేటగిరీలో యూనిట్‌కు నెలకు ఆరు కిలోల బియ్యం చొప్పున మూడు నెలలకు 18 కిలోలు, ఏఎఫ్ఎస్‌సీ కార్డులకు నెలకు 35 కిలోల చొప్పున 105 కిలోల బియ్యం, అన్నపూర్ణ కార్డులకు నెలకు 10 కిలోల చొప్పున 30 కిలోలు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు.

గొంతు మార్చి.. రూ.2 లక్షలు కాజేసి!



- వాట్సాప్ మిమిక్రీతో ఫ్రాడ్ చేసిన సైబర్ నేరగాళ్లు
- లండన్‌లోని స్నేహితుడి పేరిట నగరవాసికి టోకరా

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నతాధికారులు, పరిచయస్తులు, స్నేహితులు, బంధువుల ఫొటోలను వాట్సాప్ డీపీలుగా పెట్టుకుని వారి మాదిరిగా చాటింగ్ చేస్తూ డబ్బు కాజేసిన ఉదంతాలు ఇదివరకు అనేకం చూశాం కదా! అయితే ఇప్పుడు సరికొత్తగా 'వాట్సాప్ మిమిక్రీ' ఫ్రాడ్ వెలుగులోకి వచ్చింది. లండన్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి గొంతును సైబర్ నేరగాళ్లు అనుకరిస్తూ నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసి రూ.2.05 లక్షలు కాజేశారు. ఈ మేరకు బాధితుడు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బాధితుడి(27) స్నేహితుడు కొన్నేళ్లుగా లండన్‌లో విద్యనభ్యసిస్తున్నారు. గత నెల 22న బాధితుడికి +44 7961925094 నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. లండన్‌లో ఉన్న స్నేహితుడు పంపినట్లుగా అది ఉండటంతో బాధితుడు అప్రమత్తం అయ్యాడు. తన స్నేహితుడికి నేరుగా ఫోన్ చేసి సంప్రదించడానికి ప్రయత్నించాడు. అయితే ఆ నెంబర్ అందుబాటులో లేకపోవడంతో సాధ్యం కాలేదు. కొద్దిసేపటికి 8132883688 నెంబర్ నుంచి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు బాధితుడి స్నేహితుడి గొంతును అనుకరిస్తూ మాట్లాడారు. దీంతో తన స్నేహితుడే మాట్లాడుతున్నట్లు బాధితుడు భావించాడు. తాను లండన్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లు అవతలి వ్యక్తి చెప్పాడు. కొద్దిసేపటికి మళ్లీ ఫోన్ చేసిన నేరగాడు తాను ఢిల్లీ విమానాశ్రయంలో చిక్కుకున్నట్లు తెలిపాడు. తన వద్ద విదేశీ కరెన్సీ ఉండటంతో ఆదాయపు పన్ను అధికారులు అదుపులోకి తీసుకున్నారని చెప్పాడు. కొద్దిసేపటికి కాల్ చేసిన మరో వ్యక్తి ఆదాయపు పన్ను అధికారిగా పరిచయం చేసుకున్నాడు.

క్లియరెన్స్ చార్జీలు చెల్లిస్తే..

రూ.55,500 క్లియరెన్స్ చార్జీలు చెల్లిస్తే స్నేహితుడిని విడిచిపెడతామని సైబర్ నేరగాడు చెప్పాడు. బాధితుడిని నమ్మించేందుకు ఓ నకిలీ రసీదును వాట్సాప్ ద్వారా పంపాడు. తన స్నేహితుడిని రక్షించాలనే ఉద్దేశంతో బాధితుడు ఈ మొత్తం చెల్లించాడు. ఆ తర్వాత మళ్లీ కాల్ చేసిన నేరగాడు మరో పన్ను పేరుతో ఇంకో రూ.1,50,000 బదిలీ చేయించుకున్నాడు. ఆపై మరోసారి కాల్ చేసి రూ.3,50,000 డిమాండ్ చేయడంతో బాధితుడు అనుమానించాడు. తన స్నేహితుడిని అతడి నెంబర్‌కు కాల్ చేసి సంప్రదించాడు. అలా తాను మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు ఆన్‌లైన్ ద్వారా సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించాడు.

కూతురిని కాపాడబోయిన ఘటనలో తండ్రి మృతి

వారం క్రితం కూతురు మృతి



మృతి చెందిన మహ్మద్ అలీ

సికింద్రాబాద్: ఆత్మహత్యకు పాల్పడేందుకు రైలు పట్టాలు ఎక్కిన కూతురిని కాపాడబోయిన తండ్రి గురువారం మృతి చెందాడు. ఈ ఘటన జరిగిన రోజే కూతురు మృతిచెందిన విషయం తెలిసిందే. వారం రోజులలోపే తండ్రి కూతురు మృతి చెందడం పాటిగడ్డలోని ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన మేరకు.. మహ్మద్‌అలీ (50)కూతురు ఆలియాబేగం (26) భర్త, అత్తింటి వారి వేధింపులు తాళలేక ఈనెల 7న సంజీవయ్య పార్కు రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్ పై కూర్చుంది. తండ్రి పరుగున ట్రాక్ వద్దకు వెళ్లి కుమార్తెను వారిస్తున్న సమయంలోనే సికింద్రాబాద్ నుంచి నాంపల్లి వెళుతున్న లైట్‌ఇంజిన్ రైలు వేగంగా వచ్చి వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆలియాబేగం అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ ఆమె తండ్రి మహ్మద్ అలీ గురువారం మృతి చెందాడు.

మున్నూరు కాపు విద్యార్థులకు ఉచిత వసతి

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాల నుంచి ఉన్నత చదువుల కోసం వచ్చే మున్నూరు కాపు విద్యార్థులకు ఉచిత వసతి కల్పించనున్నట్లు కాచిగూడలోని మున్నూరు కాపు వసతిగృహం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ప్రొ.ఎం.ఆర్.వెంకట్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీబీఎస్, ఎంఫార్మసీతోపాటు బీ ఫార్మసీ, బీటెక్, హోటల్ మేనేజ్మెంట్, సీఏ, బీఎస్సీ, బీకాం, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్ వంటి కోర్సులు చేస్తున్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి వసతి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 14వ తేదీ నుంచి 28వ తేదీలోపు దరఖాస్తులను అందించాలని తెలిపారు. దీనికి సంబంధించి 040-24658160 లేదా 9491627404 నెంబర్లలో సంప్రదించవచ్చని అన్నారు.

గ్యాస్ లీకై ప్రమాదం.. ఇద్దరికి తీవ్రగాయాలు

రాజేంద్రనగర్: గ్యాస్ బంక్‌లో వెల్డింగ్ పనులను నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాలు... అత్తాపూర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 135 వద్ద శ్రీ సిద్ధి వినాయక ఫ్యుయల్ ఇస్పార్ యునీ గ్యాస్ పంపు ఉంది. ఇందులో రెండు గ్యాస్ కంటైనర్లకు గురువారం సాయంత్రం మాధవరావు(48), గోపి(30)లు వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారి పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో మాధవరావు, గోపి తీవ్రంగా గాయపడ్డారు. మంటలు చెలరేగడంతో స్థానికులు, వ్యాపారస్తులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు, ఉప్పర్‌పల్లి ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయాలకు గురైన వారిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక..

మూసాపేట: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు... నాగర్‌కర్నూల్‌కు చెందిన టి.వెంకటస్వామి(54) కూకట్‌పల్లి వివేక్‌నగర్‌లో నివాసం ఉంటూ అడ్డా కూలిగా పనిచేస్తున్నాడు. భార్య కూడా దినసరి కూలి. వారి ఇద్దరు కుమారులు ఆటోడ్రైవర్లు. అయితే అప్పులు పెరిగిపోవటంతో వెంకటస్వామి నిత్యం చింతిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బాత్‌రూంకి వెళ్లి అందులోని యాసిడ్ తాగి బయటకు వచ్చి కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్

ప్రభాకర్‌రావు వైఖరితో పంథా మార్చిన అధికారులు

- ఆ నిందితులను మరోసారి విచారించాలని నిర్ణయం
- నేడు రావాలంటూ ప్రణీత్‌రావుకు నోటీసులు జారీ
- హార్డ్‌డిస్కులు ధ్వంసం కేంద్రంగా సాగుతున్న దర్యాప్తు



(ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: సుదీర్ఘకాలం అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు తిరిగి రావడం, ఆయన విచారణ పర్వం కొనసాగుతుండటంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ అధికారులు ముమ్మరం చేశారు. విచారణ అధికారులు అడుగుతున్న ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణిలో సమాధానాలు చెప్తుండటంతో తమ వ్యూహం మార్చారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితులను మరోసారి ప్రశ్నించాలని నిర్ణయించారు. ఎస్ఐబీలోని ఎస్ఓటీకి నేతృత్వం వహించిన డి.ప్రణీత్‌రావు ఈ కేసులో అరెస్టు అయిన తొలి నిందితుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఈయన్ను బుధవారం ప్రభాకర్‌రావుతో కలిపి విచారించారు. తాజాగా శుక్రవారం సైతం విచారణ హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ప్రభాకర్‌రావు శనివారం మరోసారి సిట్ ఎదుట విచారణకు వస్తుండటంతో ఒక రోజు ముందు ప్రణీత్‌ను ప్రశ్నించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసుకు మూలం ఎస్ఐబీ కార్యాలయంలోని హార్డ్‌డిస్కులు ధ్వంసం చేయడం. ఎస్ఐబీ అదనపు ఎస్పీగా పని చేస్తున్న డి.రమేష్ ఫిర్యాదు ఆధారంగా కుట్ర, నమ్మక ద్రోహం, నేరపూరిత చర్యలు, ప్రజా ఆస్తుల విధ్వంసం తదితర సెక్షన్ల కింద నమోదైన ఈ కేసులో చాన్నాళ్ల తర్వాత టెలిగ్రాఫిక్ యాక్ట్ చేర్చారు. నల్లగొండ జిల్లాలో పని చేస్తూ, ఇన్‌స్పెక్టర్ హోదాలో 2018లో ఎస్ఐబీలోకి ప్రవేశించిన దుగ్యాల ప్రణీత్ రావుకు 2023లో డీఎస్పీగా యాక్సిలేటరీ పదోన్నతి లభించింది. ఈయన ఎస్ఐబీలో ఉన్న మిగిలిన అధికారుల మాదిరిగా కాకుండా విధులు నిర్వర్తించారు. ఎస్ఐబీ కార్యాలయంలో తన కోసం ప్రత్యేకంగా రెండు గదులను ఏర్పాటు చేసుకున్నారు. హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ కూడా తీసుకు 17 అత్యాధునిక కంప్యూటర్లతో పని చేశారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, సంఘ విద్రోహక శక్తుల పేరుతో పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారనేది ప్రధాన ఆరోపణ. ప్రణీత్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ నిఘాకు సంబంధించిన అనేక వివరాలను తన వ్యక్తిగత డ్రైవ్‌ల్లో భద్రపరుచుకున్నారని, 2023 డిసెంబర్ 4 రాత్రి ఎస్ఐబీ కార్యాలయంలోకి వచ్చిన ప్రణీత్ రావు అక్కడి సీసీ కెమెరాలు పని చేయకుండా ఆపేసి కంప్యూటర్లలో ఉన్న సమాచారాన్ని డిలీట్ చేయడంతో పాటు ఎస్ఐబీకి చెందిన 42 హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్లినట్లు అధికారులు గుర్తించారు. రెండు టీబీల డేటాను డిలీట్ చేయడంతో పాటు దాదాపు 1600 పేజీల కాల్ డేటాను కూడా ప్రణీత్ రావు తగులబెట్టినట్లు, కొన్ని హార్డ్‌డిస్కుల్ని ధ్వంసం చేయడంతో పాటు మరికొన్ని తీసుకుపోయి వాటి స్థానంలో కొత్తవి పెట్టినట్లు తేల్చారు. ప్రణీత్ రావు ఎస్ఐబీలో పని చేసినప్పుడు 30 మంది సిబ్బందితో ప్రత్యేక బృందం ఉంది. అప్పట్లో ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్ రావు ఉండటంతో ఆయనకు తెలిసే ఇదంతా జరిగిందని సిట్ అనుమానిస్తోంది. ఈ ఆరోపణల్లో అత్యధికం ప్రభాకర్‌రావు ఖండిస్తుండటంతో సిట్ అప్రమత్తమైంది. శుక్రవారం ప్రణీత్‌రావు నుంచి సేకరించే వివరాల ఆధారంగా శనివారం ప్రభాకర్‌రావుకు సంధించాల్సిన ప్రశ్నావళిని సిద్ధం చేయనున్నారని తెలిసింది. ప్రణీత్ తర్వాత భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావులకూ నోటీసులు జారీ చేసి ప్రశ్నించేందుకు సిట్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

గన్ గురిపెట్టి రూ.5 లక్షలు దోపిడీ..

కుత్బుల్లాపూర్: హోల్ సేల్ కిరాణం దుకాణం యజమానిని' గన్ 'తో బెదిరించి రూ. 5 లక్షల నగదుతో పరారైన ఘటన కొంపల్లిలో కలకలం రేపింది. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై మూడు ప్రత్యేక బృందాలు గాలింపు ముమ్మరం చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు..కొంపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా లక్ష్మీ కిరాణా జనరల్ స్టోర్ పేరుతో సాయిబాబా, రజిత దంపతులు కిరాణం షాపు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పదిన్నర సమయంలో దుకాణం మూస్తుండగా ఇద్దరు వ్యక్తులు వాహనంపై వచ్చి గన్ చూపించి చేతిలో ఉన్న రూ. 5 లక్షల నగదు తీసుకొని క్షణాల్లో పరారయ్యారు. వీరితో పాటు దుకాణంలో పని చేస్తున్న పర్వేజ్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా తప్పించుకొని మున్సిపల్ కార్యాలయం పక్క సందు నుండి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్, ఎస్‌ఓటి, సిసిఎస్ పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి వారు ఎక్కడికి వెళ్లారు ...! అన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ప్రతిరోజు హోల్ సేల్ వ్యాపారం ద్వారా వచ్చే నగదు వివరాలను తెలుసుకున్న తర్వాతే పక్కా ప్రణాళికతో ఈ దోపిడీ వ్యూహరచన చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. గతంలో ఈ దుకాణం లో భారీ చోరీ జరగగా పది లక్షల విలువ చేసే వివిధ రకాల వస్తువులు దొంగతనం చేసి డీసీఎం వాహనం లో తీసుకెళ్లిన ఘటన పోలీసులు అప్పట్లో నిందితులను పట్టుకున్నారు. ఇదే షాపు వ్యాపారిని బెదిరించి నగదుతో ఉడాయించిన నిందితుల కోసం బృందాలుగా విడిపోయి పట్టుకునేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. విశేషమేమిటంటే సుమారు కిరాణం దుకాణం చుట్టూ రెండు గంటలసేపు మూసివేసే వరకు రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం దోపిడీకి రూపకల్పన చేయడం విశేషం. దొంగలు వినియోగించిన వాహనం నంబర్ ప్లేట్ లేకపోవడం... రాత్రి సమయం కావడంతో సీసీ కెమెరాలో స్పష్టమైన ఆధారాలు దొరకకపోవడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆడుకోవడానికి వెళ్లి.. క్వారీ గుంతలో పడి..

ఇద్దరు చిన్నారుల మృతి



దుర్గప్రసాద్ (ఫైల్)



సుబ్రమణ్యం (ఫైల్)

జవహర్‌నగర్: క్వారీ గుంతలో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు పడి మృతి చెందారు. జవహర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాలు... జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో యాదమ్మ కుటుంబసభ్యులతో కలిసి ఉంటోంది. యాదమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించడానికి బంధువులు స్వాతి, అంజమ్మ, వారి కుమారులు దుర్గప్రసాద్(11), సుబ్రమణ్యం(8)లను తీసుకొని ఆమె ఇంటికి వచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఆడుకోవడానికి బయటకు వెళ్లిన దుర్గప్రసాద్, సుబ్రమణ్యం ఆ తర్వాత కనిపించకపోవడంతో చుట్టపక్కల వెతికారు. ఎంతకూ వారి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం ఆ చిన్నారులు బండబావి క్వారీ గుంతలో శవాలై తేలారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి మృతులను గుర్తించి వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కుమారులు మృతి చెందడంతో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి.

నగరంలో కలకలం రేపిన విమాన దుర్ఘటన

బంధువులు, తెలిసిన వాళ్ల కోసం ఆరా

సాక్షి, సిటీబ్యూరో: అహ్మదాబాద్ విమాన దుర్ఘటన అంతటా తీవ్ర కలకలం రేపింది. ప్రమాదానికి గురైన వారిలో తెలిసిన వాళ్లు, బంధువుల కోసం నగరవాసులు ఆరా తీశారు. గుజరాత్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు నగరంలో వ్యాపారరంగంలో పెద్ద సంఖ్యలో స్థిరపడ్డారు.అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోనూ ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు ఉన్నారు. ఏదో ఒక విధంగా ఉత్తరాదితో సంబంధ బాంధవ్యాలు కలిగిన నగరవాసుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు 242 మంది ప్రయాణికులు, సిబ్బందితో బయలుదేరిన విమానం కొద్దిసేపట్లోనే నేల కూలిపోయిన సంఘటన ప్రతి ఒక్కరినీ ఎంతో కలచివేసింది. చెట్టుకు ఢీకొట్టి ఒక ఆసుపత్రి భవనంపైన పడిపోవడంతో ఆ ఆసుపత్రిలోని పలువురు డాక్టర్లు, సిబ్బంది సైతం మృత్యువాతపడ్డారు. దీంతో అక్కడి పరిణామాలు, దృశ్యాలను ప్రసారమాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లో చూసి ఆవేదనకు గురయ్యారు. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న విమాన ప్రమాదాల్లో ఇదే అతి పెద్ద దుర్ఘటన కావడం శోచనీయం. మరోవైపు ఈ దుర్ఘటనపై సోషల్‌మీడియాలోనూ సమాచారం వెల్లువెత్తింది. దీంతో చాలామంది ప్రమాద దృశ్యాలను, వివరాలను తెలుసుకొనేందుకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున సెర్చ్ చేశారు.

మనవరాలిపై లైంగిక దాడి.. వృద్ధుడికి ఐదేళ్ల జైలు

లంగర్‌హౌస్: సొంత మనవరాలిపై అఘాయిత్యానికి యత్నించిన వృద్ధుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు తెలిపిన వివరాలు... 2018 ఆగస్టులో ఖాదర్‌బాగ్‌లో నివాసముండే సయ్యద్ ముస్తాఫా హుస్సేన్(60) ఇంటికి ఆయన కూతురు, మనవరాలు వచ్చారు. ఓ రాత్రి అతను మనవరాలికి పోర్న్ వీడియోలు చూపుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి మెట్రోపాలిటన్ 12వ కోర్టు జడ్జి అనిత గురువారం తీర్పు వెల్లడించారు.

చరిత్రపై అవగాహన అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ చరిత్రపై అవగాహన అవసరమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి చిన్నారెడ్డి అన్నారు. గురువారం ఓయూ చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల బోధన, పరిశోధనలో ఓయూకు మంచి గుర్తింపు ఉందన్నారు.

10 స్వీట్ షాపుల సీజ్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు ఫుడ్‌సేఫ్టీ అధికారులు బుధవారం నుంచి 69 మిఠాయి దుకాణాలను తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్లక్ష్యంగా షాపులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. కనీసం ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కూడా లేని పది దుకాణాలకు తాళాలు వేసి సీల్ చేశారు. అధికారులు మూసివేసిన మిఠాయి దుకాణాల్లో శ్రీలక్ష్మి మిఠాయి భండార్(ఎల్‌బీ నగర్), శ్రీరాఘవేంద్ర స్వీట్ హౌస్ అండ్ బేకరి(ఎల్‌బీ నగర్), శ్రీసాయిరామ్ హాట్‌చిప్స్ అండ్ స్వీట్స్ (ఎల్‌బీ నగర్), న్యూబాలాజీ మిఠాయి భండార్ అండ్ హాట్ చిప్స్ (కొత్తపేట), సూపర్ స్వీట్స్(అలీజా కోట్ల), రామ్‌స్వరూప్ మిఠాయి భండార్ (రామంతాపూర్), ప్రేమ్ స్వీట్స్ (శేరిలింగంపల్లి), శ్రీబాలాజీ భగన్‌లాల్ మిఠాయి భండార్ (మల్లికార్జున నగర్), జోధ్‌పూర్ మిఠాయివాలా (మచ్చ బొల్లారం), శ్రీరాఘవేంద్ర హాట్‌చిప్స్ (బీరంగూడ) ఉన్నాయి.

ఆరు వాహనాలు సీజ్

అందులో ఫిట్‌నెస్ లేని నాలుగు స్కూల్ బస్సులు కూడా..



కేపీహెచ్‌బీ కాలనీ: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో రోడ్లపైకి వస్తున్న స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బస్సులను, సరైన ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా కూకట్‌పల్లి ప్రాంతీయ రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం తులసివనం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని నాలుగు స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. టాక్స్ చెల్లించని మరో రెండు వాహనాలను సీజ్ చేశారు. వీటితోపాటు నిబంధనలకు విరుద్ధంగా బస్సులో ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించుకున్న శ్రీ చైతన్య, నారాయణ విద్యా సంస్థల బస్సులను కూడా సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా కనీసం ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న మూడు స్కూల్ బస్సులను ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు ఆధ్వర్యంలో బుధవారం సీజ్ చేశారు. మంగళవారం కూడా ఒక స్కూల్ బస్సు ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతుండటంతో పట్టుకున్నట్లు శ్రీనుబాబు తెలిపారు. పన్నులు చెల్లించని మరో రెండు వాహనాలను కూడా సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ప్రధానంగా ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అగ్నిమాపక పరికరాలు, వాహన ఫిట్‌నెస్ వంటివి లేకుంటే చర్యలు తప్పవని ఎంవీఐ హెచ్చరించారు.

'ట్రాఫిక్'కు పోలీసు బకాయి రూ.68 లక్షలు!

నగర పోలీసుల వాహనాలపైనా ఈ-చలానాలు జారీ

- ఇప్పటి వరకు జరిమానాలు చెల్లించనివి 17 వేలకుపైనే
- సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిన విషయాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగర పోలీసు విభాగానికి చెందిన వాహనాలు సైతం ఎడాపెడా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. వీటిని ట్రాఫిక్ విభాగం అధికారులు గుర్తించి జారీ చేసిన ఈ-చలాన్ల బకాయిలు భారీగానే ఉన్నాయి. ఈ జరిమానాల చెల్లింపు విషయంలో మాత్రం ఉన్నతాధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. రహదారి నిబంధనలపై అవగాహనకు కృషి చేస్తున్న నగరవాసి లోకేంద్ర సింగ్ సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలను వెలుగులోకి తెచ్చారు. పోలీసు వాహనాలపై జారీ అయిన ఈ-చలాన్లలో ఇప్పటికీ 17,391 పెండింగ్‌లో ఉన్నాయి. వీటి జరిమానా మొత్తం రూ.68 లక్షలని లెక్క తేలింది. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 210 బీ ప్రకారం ఆ చట్టాన్ని అమలు చేసే ఏ అధికారికి సంబంధించిన వాహనమైనా ఉల్లంఘనకు పాల్పడితే... సాధారణ జరిమానాకు రెట్టింపు విధించే అవకాశం ఉంది. ఆ కోణంలో లెక్కిస్తే జరిమానా మొత్తం రూ.1.36 కోట్లుగా పరిగణించవచ్చు. నగరంలోని రహదారులపై ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాలను పోలీసు విభాగం ఈ-చలాన్ల రూపంలోనే జరిమానా విధిస్తోంది. చౌరస్తాలతోపాటు ఇతర కీలక ప్రాంతాల్లో ఉన్న కెమెరాలు, క్షేత్ర స్థాయిలో ఉండే పోలీసులు ఆ ఉల్లంఘనలను ఫొటోలు తీస్తారు.

ఆటోమేటెడ్ కెమెరాలు గుర్తించి..

సాధారణంగా క్షేత్ర స్థాయి సిబ్బంది తమ విభాగానికి చెందిన వాహనాలు చేసే ఉల్లంఘనల పట్ల చూసీచూడనట్లుగా వ్యవహరిస్తారు. అవి కంట పడినప్పటికీ ఫొటోలు తీయరు. అయితే ఓవర్ స్పీడింగ్ వంటి ఉల్లంఘనల్ని ఆటోమేటెడ్ కెమెరాలు గుర్తించి ఫొటోలు తీస్తాయి. దీంతో పోలీసు వాహనాలపైనా ఈ-చలాన్లు జారీ అవుతున్నాయి. ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని సర్వర్‌కు ఆర్టీఏ డేటాబేస్ అనుసంధానించి ఉంటుంది. దీని ఆధారంగా ఆయా వాహన చోదకుల రిజిస్టర్డ్ చిరునామాలకు ఈ-చలాన్లు, రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్లకు ఎస్సెమ్మెస్‌లు వెళ్తాయి. అయితే పోలీసు విభాగానికి సంబంధించిన వాహనాలు అన్నీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) పేరుతోనే రిజిస్టరై ఉంటాయి. దీంతో ఈ ఈ-చలాన్లు కూడా ఆ పేరుతోనే జారీ అవుతాయి. ఆ వాహనం ఎవరు వినియోగిస్తున్నారో వారి చిరునామాలు రికార్డుల్లో ఉండవు. ఈ కారణంగానూ పోలీసు వాహనాలపై జారీ అయిన ఈ-చలాన్లలో అత్యధికం పెండింగ్‌లో ఉండిపోతున్నట్లు తెలుస్తోంది. పోలీసు వాహనాలపై జారీ అయిన ఈ ఈ-చలాన్లను అన్ని రకాలైన ఉల్లంఘనలకు సంబంధించి ఉన్నాయని తెలుస్తోంది.

ఓవర్ స్పీడ్‌పైనే ఎక్కువ..

ఓవర్ స్పీడింగ్, రాంగ్ పార్కింగ్ తదితర ఉల్లంఘనలపై జారీ అయినవి ఎక్కువగా ఉన్నాయి. కొన్ని వాహనాలపై గరిష్ఠంగా 15 చలాన్లు పెండింగ్‌లో ఉండగా... వీటిలో కొన్ని 2017 నాటివి కావడం గమనార్హం. అత్యంత ప్రముఖుల వాహనాలకు పైలెటింగ్, ఎస్కార్ట్ చేస్తున్న, ఆయా కాన్వాయ్‌లను అనుసరిస్తున్న పోలీసు వాహనాలు పరిమితికి మించిన వేగంతోనే ప్రయాణించాల్సి వస్తుంది. ఈ కారణంగానూ కొన్నింటిపై ఈ-చలాన్లు జారీ అవుతున్నాయి. కాగా, గత ఏడాది ట్రాఫిక్ విభాగం అధికారులు మొత్తం 56.3 లక్షలు ఈ-చలాన్లు జారీ చేశారు. వీటిలో 46.6 లక్షలు చలాన్లకు సంబంధించిన జరిమానాను వాహన చోదకులు చెల్లించారు.

ఆటో మీటర్ చార్జీలు పెంచడానికి ఒత్తిడి తెస్తా

హిమాయత్‌నగర్ : ఆటో మీటర్ చార్జీలు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు తోపాటు ఇతర పెండింగ్ లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ జీఓ జారీ చేసేందుకు కృషి చేసిన కూనంనేని సాంబశివ రావుకు గురువారం మఖ్దూమ్ భవన్‌లో గురువారం తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం, సిహెచ్.జంగయ్య, ఎండీ.ఒమర్ ఖాన్, ఎస్.కె.లతీఫ్, ఎం.శ్రీనివాస్, వి.ప్రవీణ్, లింగం పాల్గొన్నారు.

అకారణంగా వైద్యుడిపై దాడి

వెంగళరావునగర్ : వేగంగా వచ్చి కారును ఢీకొట్టడమే కాకుండా యువ వైద్యుడిపై దాడిచేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వెంగళరావు నగర్‌లో నివసించే డాక్టర్ కేశగాని భరద్వాజ్ అపోలో ఆసుపత్రిలో డిప్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం కారులో విధులకు వెళ్తుండగా యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ సమీపంలో వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం కారును ఢీకొంది. దీంతో భరద్వాజ్ కారును ఆపగా ద్విచక్ర వాహనంపై ఉన్న యువకులు చేతితో కారు అద్దాలు పగలకొట్టారు. అనంతరం కారులో ఉన్న భరద్వాజ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారు. చుట్టుపక్కల వారు అడ్డుకోవడానికి ప్రయత్నించినా వారిని సైతం బెదిరిస్తూ తీవ్రంగా దుర్భాషలాడారు. దాడిలో గాయపడిన డాక్టర్ భరద్వాజ్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్న అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

అక్రమ నిర్మాణాల సీజ్

బంజారాహిల్స్: అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝళిపించారు. గురువారం పలు అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు. షేక్‌పేట ఫాల్కన్‌వ్యాలీ కాలనీలో ఇంద్రిష్ అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తి సిల్ట్ ప్లస్ 3 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకుని అదనంగా అంతస్తులు నిర్మించారు. సంబంధిత నోటీసులు జారీ చేసిన అనంతరం అధికారులు గురువారం అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేశారు. అలాగే షేక్‌పేట ఓయూ కాలనీలో ప్లాట్ నెంబర్ 362లో సిల్ట్ ప్లస్ 2 అంతస్తులు నిర్మాణానికి సయ్యద్ అనీఫ్ అనుమతులు తీసుకుని గ్రౌండ్ ప్లస్ 4 అంతస్తులు నిర్మించారు. ఈ నిర్మాణాన్ని కూడా సీజ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు.


విద్యార్థులకు స్వాగతం పలుకుతూ బెలూన్లతో పాఠశాలను ముస్తాబు చేసిన టీచర్లు


ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్‌లో..

మోగిన బడి గంట

- మొదటి రోజు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం
- యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాల పంపిణీ


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎన్‌బీటీనగర్‌లో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్: వేసవి సెలవుల అనంతరం 2025–26 విద్యా సంవత్సరానికి పాఠశాలలు గురువారం తెరుచుకున్నాయి. ఉదయం నుంచే సర్కార్ బడుల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి స్పష్టంగా కనిపించింది. ఒకవైపు కొత్తగా చేరుతున్న విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్న టీచర్లు..ఇంకోవైపు స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తూ మొదటి రోజు బిజీబిజీగా గడిపారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ, 43 ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్నం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

- విద్యార్థులకు స్వాగతం పలుకుతూ రాజ్‌భవన్ హైస్కూల్ టీచర్లు గేటుకు రంగురంగుల బెలూన్లు ఏర్పాటు చేశారు.
- బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా తరగతి గదులకు వచ్చిన విద్యార్థులకు టీచర్లు గులాబీ పువ్వులు ఇచ్చి ఆహ్వానించారు.
- ఫిలింనగర్‌లోని ఎంజీనగర్‌లో హైస్కూల్‌లో విద్యార్థులకు తొలిరోజు యూనిఫామ్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.
- తల్లిదండ్రులు మొదటి రోజున విద్యార్థులను తీసుకుని పాఠశాలకు వచ్చి టీచర్లకు అప్పగించి వారి బాధ్యతలను తీసుకోవాలని సూచించడం గమనార్హం.
- అన్ని పాఠశాలల్లోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి కొత్త అడ్మిషన్లు చేపట్టారు.
- నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు అప్పటికప్పుడే పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు అందజేశారు.

క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలి..


విద్యార్థులకు యూనిఫామ్ పుస్తకాలు అందజేస్తున్న సురేష్‌కుమార్

వెంగళరావునగర్ : వివిద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. విద్యాసంవత్సరం తొలిరోజు గురువారం ఆయన యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికశాతం మంది బస్తీలు, నిరుపేదల కుటుంబాల నుంచి వస్తుంటారని, వారందరూ బాగా చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు. మొదట విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నరసింహా, ప్రైమరీ హెచ్‌ఎం శ్రీదేవి, స్కూల్ ఎన్‌సీసీ అధికారి ప్రభాకర్, టీచర్లు శ్రీనివాసన్, నాగరాజు, శ్రీవాత్సవ, శాంతి పాల్గొన్నారు.


ఎంజీనగర్ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ


రాజ్‌భవన్ హైస్కూల్‌లో పుస్తకాల పంపిణీ

పాలన చేతకాక తప్పుడు ప్రచారం

మేడే రాజీవ్ సాగర్


సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన రాజీవ్ సాగర్

హిమాయత్‌నగర్: రాష్ట్ర సర్కార్ తప్పిదాలను ప్రశ్నిస్తున్న వారిపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేయిస్తోందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు పరిపాలన చేతకాక, కుదురితే అక్రమ కేసులు పెట్టడం, లేదంటే తప్పుడు ప్రచారం చేయడం అలవాటైందని దుయ్యబట్టారు. తనకు సంబంధం లేని ఘటనలో తన పేరు, ఫొటో వాడి వ్యక్తిగత ప్రతిష్ట దిగజార్చడానికి ప్రయత్నించిన వారిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు రవికుమార్ గౌడ్, రామచంద్రు నాయక్‌లతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం రాజీవ్ సాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. అదే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం వల్లే తనపై తప్పుడు ప్రచారం చేయిస్తోందని ఆరోపించారు. గాయని మంగ్లీ బర్త్ డే పార్టీలో డ్రగ్స్, గంజాయి వాడారని, ఆ పార్టీలో తాను కూడా ఉన్నట్లు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయిస్తోందని దుయ్యబట్టారు.

‘తెలంగాణ సినిమా రంగానికి అన్యాయం’


మాట్లాడుతున్న తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి

హిమాయత్‌నగర్ : తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒక్కటై తెలంగాణ సినిమా రంగానికి అన్యాయం చేస్తున్నారని తెలంగాణ సినిమా వేదిక(టీసీవీ) గౌరవ అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 12 ఏళ్లు అవుతున్నా సినిమా రంగంలో ఆంధ్ర సినీ పెద్దల ఆధిపత్యం ఇంకా కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ లారా, కో–కన్వీనర్ మోహన్ బైరాగితో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిలిం అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వకూడదని హైకోర్టులో పిటిషన్ వేశామన్నారు. శుక్రవారం వాదనను వినిపించబోతుందని, కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జూనియర్ కమిటీని రద్దు చేయాలని, తెలంగాణ సినిమా రంగంలో పనిచేస్తున్న వారితో జూరి కమిటీ నిర్వహించి అవార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.రవి, టీసీవీ రాష్ట్ర నాయకులు, చంద్రన్న ప్రసాద్, సాయి, కృష్ణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



నినాదాలు చేస్తున్న నేతలు

హిమాయత్‌నగర్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, బాలసంఘం కన్వీనర్ షేక్ మహమూద్ తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం బాల సంఘం, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం-భావి భారత పౌరులు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అనే నినాదంతో చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాయత్‌నగర్ మండల విద్యాశాఖాధికారి సుమన్ మాట్లాడుతూ.. పిల్లలను పనిలో పెట్టుకోవడాన్ని సమాజం వ్యతిరేకించిన నాడే దీనికి పరిష్కార మార్గం దొరుకుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, కిషోర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీఖాన్, సాయి భగత్, వంశీ, భరత్ పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత

బంజారాహిల్స్: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఐపీఎస్ అధికారిణి శిఖాగోయెల్ అన్నారు. గురువారం ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరిగినన దీప్షికా మహిళా క్లబ్ 61వ నూతన కమిటీ ప్రమాణ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు తమ పిల్లలను బాల్య దశ నుంచే లింగ భేదాలు లేకుండా పెంచాలన్నారు. మహిళా క్లబ్‌లో సమాజం కోసం, మహిళాభివృద్ధి కోసం పని చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దీప్షికా మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా ప్రియాంక బహేతి, ఐపీపీగా రాధికా మలని, ఉపాధ్యక్షురాలిగా సంగీతా జైన్, కార్యదర్శిగా భావనా సంఘి, కోశాధికారిగా మీనాక్షి భురారియా, సంయుక్త కార్యదర్శిగా శివాని తిబ్రెవాల్, సభ్యులుగా ఇందిరా డొచానియా ప్రమాణ స్వీకారం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న శిఖా గోయెల్

ఎర్రగడ్డ ఆసుపత్రి నుంచి రోగి పరారీ

రహమత్‌నగర్ : ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి నుంచి ఓ వ్యక్తి రోగి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్ బాబానగర్‌కు చెందిన ఫేరోజ్‌ఖాన్(28)కు గత కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో చికిత్స నిమిత్తం బుధవారం ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి తరలించగా అక్కడి నుంచి ఫేరోజ్ ఖాన్ పరారయ్యాడు తల్లి అబిదాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పంజగుట్ట: మొదటి విడతలో లాటరీ పద్ధతి ద్వారా డబుల్ బెడ్‌రూం మంజూరైన వారికి వెంటనే హైదరాబాద్‌లో కేటాయించాలని భాగ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, శేషు, ఇబ్రహీంల మాట్లాడారు. 2023 సెప్టెంబర్ 2వ తేదీన లాటరీ ద్వారా చాంద్రాయణగుట్ట, యాకత్‌పురా, చార్మినార్, మలక్‌పేట నాలుగు నియోజకవర్గాలకు చెందిన 1730 మందిని డబుల్ బెడ్రూమ్‌లకు ఎంపిక చేశారని తెలిపారు. తమకు రంగారెడ్డి జిల్లా, మహేశ్వరంలో డబుల్ బెడ్రూమ్ కేటాయించాని, కాని రంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు హైదరాబాద్ జిల్లావారికి రంగారెడ్డి జిల్లాలో ఎలా కేటాయిస్తారని జీవో నెంబర్ 10ని ఆధారంగా చూపుతూ హైకోర్టుకు వెళ్లారని పేర్కొన్నారు. తమకు ఇళ్లు కేటాయించిన ప్రభుత్వం ఏ మాత్రం మాకు సాయం చెయ్యకున్నా తామే అడ్వకేట్‌ను పెట్టుకుని న్యాయస్థానంలో కేసు పోరాడామని, ఈ నెల 9వ తేదీన కోర్టు ఈ 1730 మంది అర్హులు కాదు, అక్కడి జిల్లావారికే ఇవి కేటాయిచాలని తమకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందన్నారు. ప్రభుత్వమే తమను డబుల్ బెడ్రూమ్‌లకు అర్హులు అని ప్రకటించిందని, తమకు వెంటనే హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో శ్రీవిద్య, నవ్య, సుభాష్, కౌసర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అక్షరాస్యతలో సవాళ్లను అధిగమించాలి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ తమ సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వారి బోధనా సామర్థ్యాన్ని పెంపొందించేలా గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'డిజిటల్ అక్షరాస్యతలో ఎదురయ్యే సవాళ్లు' అనే అంశంపై హైదరాబాద్ యూనివర్సిటీ విశిష్ట అధ్యాపకురాలు ఉషా రామన్ ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. డిజిటల్ అక్షరాస్యతలో సవాళ్లను పరిష్కరించడం వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఉషా రామన్ తెలిపారు. ప్రజలు డిజిటల్ విభజనను అధిగమించడానికి మొబైల్ ఇంటర్నెట్ సాధ్యపడుతుందని, ప్రపంచ వ్యాప్తంగా సమాచారాన్ని, అవకాశాలను ప్రజలు యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుందని నొక్కి చెప్పారు. డిజిటల్ మీడియాలో పాఠశాల పాత్రను కూడా ఆమె వివరించారు. అలాగే కాన్సెప్ట్ స్పష్టత కోసం పిల్లలు అన్వేషించడానికి, తగిన సమాచారాన్ని పొందడానికి ఏఐ సాధనాలు ఎంతగానో సహకరిస్తాయని తెలిపారు.

‘11 ఏళ్లలో ఒక్క అవినీతీ జరగలేదు’


సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్ రెడ్డి

హిమాయత్‌నగర్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి సూచించారు. వికసిత్ భారత్ కా అమృత్ కా సేవా సుశాసన్, గరీబ్ కల్యాణ్ వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి 11 ఏళ్లు గడచిన కార్యక్రమాల్లో భాగంగా కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసి 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవితో కలిసి మాట్లాడారు. గడిచిన 11 ఏళ్లలో దేశంలో ఎక్కడా అవినీతీ జరగలేదన్నారు. దేశ వ్యాప్తంగా 18 వేల గ్రామాలకు కరెంటు సదుపాయం లేదని గుర్తించి మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పైలెట్ ప్రాజెక్టు కింద కేవలం 90 రోజుల్లో దేశంలో ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ అందించారన్నారు. ప్రధాన మంత్రి జన ఔషధీ కేంద్రాల ద్వారా 80 శాతం పైగా చౌక ధరలో మందులను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఉమా మహేందర్, కోలా దీపక్ కుమార్, శైలేందర్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

తల్లి, బిడ్డ మృతికి వైద్యులు కారణమంటూ ఫిర్యాదు

ఖైరతాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణితో పాటు నవజాత శిశువు మృతికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2014 బ్యాచ్‌కు చెందిన విమలాకుమారి(33) కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. నాలుగేళ్ల క్రితం సుంకర ప్రదీప్ కుమార్‌తో వివాహమైంది. ఇటీవల గర్భం దాల్చిన విమలాకుమారికి కడుపులో నొప్పి రావడంతో బంజారాహిల్స్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంది. వారం రోజుల పాటు అడ్మిట్ కూడా అయింది. ప్రస్తుతం ఆమె 7 నెలల గర్భవతి. ఈ నెల 10న మరోసారి కడుపులో నొప్పి రావడంతో భర్త హాస్పిటల్‌లో చేర్పించాడు. స్కాన్ చేసి కవల పిల్లలని, అందులో ఓ పాప చనిపోయిందని చెప్పారు. ఆపరేషన్ చేయాలని మీకున్న ఆరోగ్య భద్రత నుంచి అప్రూవల్ రాలేవు మీరు మూడు లక్షలు చెల్లించాలని చెప్పడంతో భర్త రూ.లక్ష చెల్లించాడు. ఆ తరువాత మరుసటి రోజు 11వ తేదీ ఉదయం 6 గంటలకు డాక్టర్ రజిని ఆధ్వర్యంలో సిజేరియన్ ఆపరేషన్ చేసి చనిపోయిన పాప మృతదేహాన్ని, బతికున్న బాబును బయటకు తీశారు. ప్రాణాలతో ఉన్న బాబు పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో ఆ బాబును కూడా ఐసీయూలో పెట్టారు. మృతిచెందిన పాపకు అంత్యక్రియలు నిర్వహిస్తుండగానే హాస్పిటల్ నుంచి భర్తకు ఫోన్‌చేసి మీ భార్య పరిస్థితి కూడా బాగాలేదు మీరు వెంటనే రావాలని చెప్పడంతో వెంటనే హాస్పిటల్‌కు వెళ్లారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు మీ భార్య కూడా చనిపోయిందని వైద్యులు చెప్పడంతో భర్త, కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్, సహకరించిన నర్సింగ్ స్టాఫ్, హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాష్ట్రంలో రజాకార్ ప్రభుత్వం నడుస్తోంది


సమావేశంలో మాట్లాడుతున్న రావినూతల శశిధర్

పంజగుట్ట: తెలంగాణలో ప్రజా ప్రభుత్వమా.. లేక రజాకార్ ప్రభుత్వం నడుస్తుందో అర్థం కావడం లేదని, ఎంఐఎం పార్టీ మెప్పుకోసం అమాయక దళిత, హిందువులపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సెక్రటేరియట్ ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం సరి కాదని, మైలార్‌దేవ్‌పల్లిలోని రాజీవ్ గృహకల్ప, వాబే కాలనీల్లో హిందువులపై జరుగుతున్న ఘోరాలు కూడా చూడాలని సూచించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ ప్రతినిధులు రామరాజు, రమేష్, పగుడాకుల బాలస్వామి మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల బక్రీద్ జరగలేదని, గౌఈద్ జరిగిందని, హిందువులను కించపరిచేందుకు బహిరంగంగా గోహత్యలు చేశారని ఆరోపించారు. మైలార్‌దేవ్‌పల్లి రాజీవ్‌గృహకల్ప, వాంబే కాలనీల్లో జంతువ్యర్థాలు తీసుకువచ్చి అక్కడ డంపింగ్ చేస్తుంటే అడ్డుకున్న స్థానికులపై అక్రమ కేసులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మోహన్, జస్వంత్, అనీల్, ఉత్తం సుమన్, ఉప్పల నరసింహ, ధీరజ్ పాల్గొన్నారు.

ఎక్సెల్ హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం

హిమాయత్‌నగర్: ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న ఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. నారాయణగూడలోని వెంకటేశ్వర కాలనీలో ఐదంతస్తుల బిల్డింగ్‌లో మొదటి, రెండవ అంతస్తులో హాస్పిటల్ నిర్వహిస్తుండగా పై అంతస్తులో డాక్టర్ వెంకటరమణ కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఈ ప్రమాదంలో హాస్పిటల్‌లో భారీగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో పేషంట్స్ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హాస్పిటల్ సిబ్బంది అప్రమత్తంతో ఐదుగురు రోగులు, డాక్టర్స్ ఫ్యామిలీ మెంబర్స్ కిందకు దిగారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటన స్థలానికి చేరుకొని మంటలు పై అంతస్తుకు వ్యాపించకుండా అదుపు చేశారు.


గురుబ్రహ్మనగర్ బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే


గురుబ్రహ్మనగర్ బస్తీలో సర్వే చేస్తున్న అధికారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని నందగిరిహిల్స్‌ను ఆనుకుని గురుబ్రహ్మనగర్ బస్తీలో గురువారం హౌసింగ్, రెవెన్యూ అధికారులు మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రతిపాదిత సర్వే చేపట్టారు. హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఏఈ సిద్దార్థ, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరామ్, షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి బస్తీలో పర్యటించి స్థానికుల అభిప్రాయాలను సేకరించారు. బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్‌తో మాట్లాడారు. ఎంత మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నాయి, ఎంతమంది గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు అనే వివరాలను సేకరించారు. 2009లో 192 మందికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేసింది. ఇంకా కొంతమందికి ఇవ్వాల్సి ఉండగా వాటిని రెవెన్యూ అధికారులు భద్రపరిచారు. తాజా లెక్కల ప్రకారం ఈ బస్తీలో 272 మంది నివసిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో 272 మందికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రతిపాదించిన ప్రభుత్వం అక్కడ ఎంత స్థలం అందుబాటులో ఉందో సర్వే చేయాలని అధికారులను ఆదేశించడంతో ఈ మేరకు అధికారుల బృందం ఇక్కడ పర్యటించింది.



మాదాపూర్ : కళాకారుడు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో 'దేవదేవం' పేరిట కళాకారుడు శ్రీకాంత్ బాబు వేసిన చిత్రాల ప్రదర్శనను ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి గురువారం



'దేవదేవం' చిత్ర ప్రదర్శన..

17వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగింపు

ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న చిత్రాలు

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు.



ఈనెల 17వ తేదీ వరకూ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని, 35 చిత్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



నేటి నుంచి 'మ్యాపోగ్రాఫీ' ఎగ్జిబిషన్..

స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ వేదికగా ఫొటోల ప్రదర్శన | 15 వరకు సందర్శకులకు అందుబాటులో

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ వేదికగా 'మ్యాపోగ్రాఫీ ఫొటో ఎగ్జిబిషన్' శుక్రవారం ప్రారంభం కానుంది. యువ ఫొటోగ్రాఫర్ కావలి చంద్రకాంత్ తన ఫొటోగ్రఫీ ప్రయాణంలో భాగంగా తీసిన ఫొటోలను 'మ్యాపోగ్రాఫీ ఫొటో ఎగ్జిబిషన్' ద్వారా ప్రదర్శించనున్నారు. ఈ నెల 15వ తేదీ వరకూ కొనసాగనున్న ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు సంబంధించి తాను తీసిన ఫొటోలు చాలా మందికి తెలియని కథలను చెబుతాయని ఫొటోగ్రాఫర్ కావలి చంద్రకాంత్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు.



మామిడి సీజన్ ముగుస్తుండగానే మరోవైపు.. పచ్చడి మామిడి సీజన్ హడావుడి మొదలవుతోంది. తెలుగుతనానికి ప్రతీకలైన ఆవకాయ, మాగాయ వంటి పచ్చళ్ల తయారీ ఇంటింటా ఊపందుకోగా.. నగరం నుంచి విదేశాలకు ఎగుమతి కోసం పచ్చళ్ల తయారీ మొదలైంది. నగరం నుంచి వివిధ ప్రాంతాలకు సరఫరా చేసేందుకు తయారీదారులు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు ఏటా జూన్‌లోభారీగా ఎగుమతయ్యే నేపథ్యంలో ఆ హడావుడి, సందడి కనిపిస్తోంది.

– సాక్షి, సిటీబ్యూరో



పికిల్స్.. పీక్స్..

నగరంలో ఊపందుకున్న పచ్చళ్ల తయారీ

దేశ విదేశాలకు తరలుతున్న సిటీ పికిల్స్ | ఏటా జూన్ నెలలో పచ్చళ్ల తయారీ సందడి | టన్నుల కొద్దీ పచ్చళ్లు, రూ.కోట్ల విలువైన ఎగుమతులు | ఆర్గానిక్ వెరైటీలకు పెరుగుతున్న డిమాండ్

ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు ప్రజలు జూన్ నెల వస్తుందంటే నోరూరించే పచ్చళ్ల కోసం లొట్టలేసుకుంటూ ఎదురు చూస్తుంటారు. ఈ సీజన్‌లో వారి పచ్చళ్ల ప్రియత్వాన్ని తీర్చడంలో నగరమే కీలకంగా మారుతోంది. ఉద్యోగం, ఇతరత్రా వ్యాపకాల రీత్యా నగరం నుంచి వెళ్లి విదేశాల్లో నివసిస్తున్న తమ బంధువుల కోసం ఈ మామిడికాయ పచ్చళ్లను సిటి జనులు పంపిస్తుంటారు. ప్రస్తుతం హోమ్‌మేడ్ ఆర్గానిక్ పచ్చళ్లకు ఎక్కువ ఆదరణ ఉంది. అలాగే ఆర్గానిక్ వెరైటీలకు కూడా డిమాండ్ భారీగా ఉందని సరఫరాదారులు చెబుతున్నారు.



టన్నుల కొద్దీ సరఫరా..

నగరంలో తయారయ్యే ఆవకాయ, మాగాయ, ముక్కాళి తదితర సంప్రదాయ హోమ్‌మేడ్ పచ్చళ్లకు విదేశీ మార్కెట్లలో భారీ డిమాండ్ ఏర్పడింది. ప్రతి సంవత్సరం వేసవి ముగింపు దశలో, జూన్ నెల నుంచే పచ్చళ్ల సరఫరా గణనీయంగా పెరుగుతుంది. నగరం నుంచి కనీసం 1500–2000 టన్నుల వరకూ వివిధ రకాల పచ్చళ్లను అనేక దేశాలకు తరలిస్తారని అంచనా. ఇందులో 70% భాగాన్ని ఆవకాయ ఆక్రమిస్తుంది. ప్రధానంగా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్) ఈ పచ్చళ్ల భారీ సరఫరాకు కేంద్రబిందువుగా నిలుస్తోంది. మరోవైపు వీటిని పెద్ద ఎగుమతిదారులు సముద్ర మార్గం ద్వారా కూడా ముంబై పోర్టు లేదా చెన్నై పోర్ట్ ద్వారా కూడా కన్సైన్మెంట్లు పంపిస్తున్నారు.

ఎక్కడెక్కడికి.. ఎక్కువగా..

నగరం నుంచి అమెరికాలోని న్యూయార్క్, కాలిఫోర్నియా, టెక్సాస్ వంటి రాష్ట్రాలకు, కెనడాలోని టొరంటో, వాంకూవర్, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్, బర్మింగ్‌హామ్, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్, మిడిల్ ఈస్ట్‌లో దుబాయ్, ఖతార్, సౌదీ అరేబియాలకు అత్యధిక పరిమాణంలో ఈ పచ్చళ్లు సరఫరా అవుతాయి. అక్కడి ఇండియన్ స్టోర్లలో ఇవి రిటైల్ ఫార్మాట్‌లో పికిల్స్ విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. అమెరికాలోని పటేల్ బ్రదర్స్, అప్నా బజార్ తదితర స్టోర్లలో హైదరాబాద్ పచ్చళ్లకు మంచి డిమాండ్ ఉంది.

ఎందరో తయారీ 'దారులు'..

నగరానికి చెందిన పికిల్ కార్ట్, తెలుగు పికిల్స్, అమ్మ చేతి వంట వంటి కొన్ని ప్రత్యేక డెలివరీ స్టార్టప్స్, సంస్థలు ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా విదేశాలకు నేరుగా డెలివరీ చేస్తున్నాయి. ఇక మియాపూర్‌లోని పికిల్స్ బై శ్రీదేవి, కూకట్‌పల్లిలోని మై గ్రాండ్ మా పికిల్స్, ఇసీఐఎల్ అనంత్ నగర్‌లోని పికిల్స్ బై రేణుక, గచ్చిబౌలిలోని అమ్మచేతి వంట, మాదాపూర్‌లోని తెలుగు హోమ్ ఫుడ్స్ ఇలా అనేక సంస్థల పచ్చళ్లు విదేశాల ఎగుమతులకు పేరొందాయి. అలాగే పచ్చడి తయారు చేయడం కంటే, దాన్ని విదేశాలకు పంపించడానికే ఎక్కువ ఖర్చు అవుతోందని తయారీదారులు అంటున్నారు. ఒక కేజీ ఆవకాయ పచ్చడి తయారీ ఖర్చు అన్ని దినుసులకూ కలిపి రూ.125 నుంచి రూ.150 వరకూ అవుతుందని అంచనా. అదే కేజీ ఆవకాయను అమెరికాకు పంపించేందుకు అన్ని రకాల పన్నులూ కలిపి రూ.900 వరకూ అవుతుంది.





ఆవకాయ బిర్యానీకి ఆదరణ..

అమెరికాలోని పలు ప్రాంతాల్లో ఉన్న రెస్టారెంట్స్‌లో ఆవకాయ బిర్యానీ హల్‌చల్ చేస్తోంది. దీని కోసం కూడా పచ్చళ్ల తయారీ దారులు ఆవకాయను పెద్ద యెత్తున తరలిస్తున్నారు. 'ఈ సీజన్‌లో వందల కిలోల పరిమాణంలో ఆవకాయను పంపిస్తాం. అక్కడ ఉన్న మన బావార్చి రెస్టారెంట్ సహా పలు స్టాల్స్‌కి వీటిని సరఫరా చేస్తాం' అంటూ చెప్పారు మల్కాజ్‌గిరిలో ఆవకాయ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న రాజశేఖర్ అనే వ్యాపారి.

తెలంగాణ బోనం..

సాంస్కృతిక ప్రయాణం..

ఉత్సవాలకే హైలెట్‌గా కళా ప్రదర్శనలు

నెల రోజుల ముందుగానే కళాకారులకు బుకింగ్స్

బోనాల జాతరలో ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు



చార్మినార్ : ఆషాఢమాసంలో బోనాల జాతర ఉత్సవాలకు నగరం సిద్ధమవుతోంది. పాతబస్తీలో ఈసారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించడానికి భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఇప్పటికే సర్వసభ్య సమావేశం నిర్వహించింది. పాతబస్తీలో బోనాల సమర్పణ అనంతరం నిర్వహించే సామూహిక ఘటాల ఊరేగింపులో ప్రధాన పాత్ర వహించే శకటాలు, కళాకారుల విన్యాసాల కోసం సంబంధిత ఉత్సవాల నిర్వాహకులు పెద్ద ఎత్తున కళాకారులకు ఇప్పటికే బుకింగ్స్ ఇస్తున్నారు.

కళాకారుల నృత్య ప్రదర్శనలు..

ఈసారి ఉత్సవాల్లో కళాకారుల నృత్య ప్రదర్శనలు హైలెట్‌గా నిలువనున్నాయి. కళాకారులు ప్రదర్శించే హావభావాలను చూసే ప్రతి ఒక్కరూ భక్తిపారవశ్యంతో తన్మయత్వం పొందుతారు. ఘట స్థాపన ఊరేగింపు, పోతురాజుల నృత్యాలు, అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు తదితర కార్యక్రమాల్లో వివిధ రకాల అలంకరణల్లో, రూపాల్లో కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరిస్తాయి.

పాతబస్తీకి ప్రత్యేకం..

నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారి దేవాలయాల్లో పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన బోనాన్ని సమర్పించడం ఆనవాయితీ. తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే విధంగా నగరంలో ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతాయి. తెలంగాణ జిల్లాల్లోనే అత్యంత వైభవంగా జరిగే ఈ ఉత్సవాలు పాతబస్తీ ప్రత్యేకతను చాటుతాయి.

ఇతర రాష్ట్రాల కళాకారులకు ఉపాధిగా..

రాష్ట్రంలో జరిగే బోనాల ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, తమిళనాడుకు చెందిన కళాకారులు ఎక్కువగా పాల్గొంటారు. నగరంలో బోనాల జాతర ఉత్సవాల్లో కళాకారులు, వినూత్న తరహా సెట్టింగ్స్ కోసం నిర్వాహకులు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తారు. ఈసారి కళాకారులకు డిమాండ్ ఎక్కువగానే ఉంది. దీంతో ఇప్పటికే బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. పాతబస్తీలోని ప్రముఖ దేవాలయాల నిర్వాహకులు కళాకారుల కోసం పోటీ పడుతున్నారు. దీంతో కొన్ని వందల కుటుంబాల కళాకారులకు ఈ బోనాల జాతర ఉత్సవాలు యేటా ఉపాధి కల్పిస్తున్నాయి.





ఆకట్టుకునే రూపాలు, నృత్యాలు..

బోనాల జాతర ఉరేగింపులో కేరళ పులికళి, భేరీ నృత్యం, గరిగెలు, బేతాళ నృత్యం, ఒగ్గోళ్ల నృత్యం, బోనాలు, కాళికాదేవీ, లక్ష్మీదేవీ, వేంకటేశ్వర స్వామి, పొట్టి పోతరాజులు, సింహరథం, డప్పులోళ్లు, హనుమంతునిలో రాముడు, తయ్యం, దేవ నృత్యం, ఉరుములు, కొమ్ము కొయ్య, జడ కోలాటం, యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి శకటం.. అందులో ఏర్పాటు చేసే మూర్తులు, విజయవాడ కనకదర్గమ్మ దేవాలయ రథం.. అందులో కొలువుదీరే అమ్మవారి వేషధారణలోని కళాకారుల హావభావాలు.. ఇలా ఒకటేంటి పలు రకాల శకటాలు, కళాకారుల నత్యాలు విశేషంగా ఆకట్టుకుంటాయి.

ఆన్‌లైన్ ఆర్థిక అక్షరాస్యత వేదిక

ఫిన్‌ఈ



సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక అక్షరాస్యత కేవలం నైపుణ్యం మాత్రమే కాదు, ఈ తరానికి ఇదొక తప్పనిసరి అవసరమని ఫిన్‌ఈ వ్యవస్థాపకురాలు బ్లెసిడా బెన్నీ అన్నారు. విద్యార్థులు మొదలు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ వరకూ ఆర్థిక విద్య (ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్)ను చేరువ చేయడానికి ఫిన్‌ఈ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఆర్థిక అక్షరాస్యత వేదిక ఫిన్‌వర్సిటీని ప్రారంభించామన్నారు. నగరంలోని మెర్క్యూర్ హోటల్ వేదికగా గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ విప్లవాత్మక ఫిన్‌వర్సిటీని ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవానికి మాజీ ఐఏఎస్ అధికారి జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేటి ప్రపంచంలో ఆర్థిక అక్షరాస్యత ప్రధానమైన అంశమని, మనం మరింత విజ్ఞానం, సాధికారత కలిగిన జనాభా కోసం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆర్థిక అవగాహనను ప్రోత్సహించడం ముఖ్యమని తెలిపారు. ఆర్థిక స్వాతంత్ర్యం అందరికీ అందుబాటులో ఉండే భవిష్యత్తును నిర్మించడమే ఈ వర్సిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం బ్లెసిడా బెన్నీ తన అభిప్రాయాలు పంచుకుంటూ.. యువతతో పాటు నిపుణులలో ఆర్థిక అక్షరాస్యతలో గణనీయమైన అంతరం ఉందని, ఈ క్లిష్టమైన అంతరాన్ని తగ్గించే ప్రణాళికలు తమ లక్ష్యమని అన్నారు. ఫిన్‌వర్సిటీతో రానున్న రెండేళ్లలో 20 లక్షల మందిని మార్చుతూ.. ప్రపంచ ఆర్థిక నైపుణ్యాలతో సాధికారత కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామని వివరించారు. మాజీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆర్ఎస్‌వి బద్రీనాథ్, ఫిన్‌ఈ డైరెక్టర్ సులకజోడు మధు వినయ్, నటులు శ్రీ తేజ్, అభిలాష్ శంకర, ప్రఖ్యాత గాయకుడు లక్ష నాయుడు, జబర్దస్త్ ఆర్టిస్టులు తదితర సెలబ్రిటీలు పాల్గొన్నారు.



ఆగస్టులో క్యూబ్ కాన్, క్లౌడ్ నేటివ్ కాన్ ఇండియా సదస్సు

సాక్షి, సిటీబ్యూరో : క్లౌడ్ నేటివ్ కంప్యూటింగ్ ఫౌండేషన్ (సీఎన్‌సీఎఫ్) ఆధ్వర్యంలో క్యూబ్ కాన్ క్లౌడ్ నేటివ్ కాన్ ఇండియా–2025 సదస్సు నగరంలో జరగనుంది. ఈ విషయాన్ని సదస్సు నిర్వాహక సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 6–7 తేదీల్లో జరగనున్న ఈ కార్యక్రమం, ప్రముఖ క్లౌడ్ నేటివ్ కమ్యూనిటీలను, అడాప్టర్స్, సాంకేతిక నిపుణులను ఒకే చోట చేర్చనుందని, దీని కోసం ఇన్‌ఫ్రా క్రౌడ్ టెక్నాలజీస్‌కు చెందిన అతుల్ ప్రియా శర్మ, జెడ్ స్కాలర్‌కు చెందిన భవాని ఇందుకూరి సారథ్యంలో ఏర్పడిన 55 మంది సభ్యులతో కూడిన కమిటీ ఈ సదస్సును నిర్వహించనుందని వివరించారు.

యువర్స్

ఆమె పాదం 'ఆర్ట్'ఫిషియల్

● యంగ్ టాలెంట్



**చిన్నతనంలోనే అంజనశ్రీ ప్రమాదవశాత్తు కాలు కోల్పోయింది.
కూచిపూడి నాట్యం అంటే ఈ చిన్నారికి ఎంతో ఇష్టం.
ఇక నాట్యానికి దూరం కావాల్సిందేనా?
'లేదు' అన్నది ఆ చిన్నారిలోని ఆత్మవిశ్వాసం.
ఆత్మవిశ్వాసం ముందు అంగవైకల్యం ఓడిపోయింది.
కూచిపూడి నాట్యంలో అంజనశ్రీ రాణిస్తోంది.
జాతీయస్థాయిలో ప్రదర్శనలు ఇస్తూ అందరి మన్ననలు పొందుతోంది...**



జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన బొమ్మకంటి నాగరాజు, గౌతమి దంపతుల కుమార్తె అంజనశ్రీ నాలుగు సంవత్సరాల వయస్సులో రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు పూర్తిగా కోల్పోయింది.

నాట్యప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని సుధాచంద్రన్ నిరూపించింది. ఆమె ఎదుర్కొన్న కష్టాలు, వాటిని అధిగమించిన తీరును అంజనశ్రీకి కథలుగా చెప్పే వాళ్లు తల్లిదండ్రులు.

అంతేకాదు, కూచిపూడి నాట్యకారుడు మచ్చ దేవదాసు వద్ద శిక్షణ ఇప్పించారు. దురదృష్టవశాత్తు రెండోసారి రోడ్డు ప్రమాదం జరిగింది. కుడికాలుకు తీవ్రగాయాలు కావడంతో ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. అయినప్పటికీ కృంగిపోకుండా కూచిపూడిలో శిక్షణను కొనసాగించింది.

ఇప్పటి వరకు జాతీయస్థాయిలో యాభైకి పైగా నాట్య ప్రదర్శనలు ఇచ్చింది అంజనశ్రీది పేద కుటుంబం. నాన్న బొమ్మకంటి నాగరాజు చిన్నపాటి పాల వ్యాపారం చేస్తున్నాడు. తల్లి గౌతమి గృహిణి.

'మా అమ్మాయి కూచిపూడి నాట్యంలో పెద్ద పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాం' అంటున్నారు అంజనశ్రీ తల్లిదండ్రులు.

– కందుకూరి శశిధర్, సాక్షి, జగిత్యాల

ఆ మాటే ధైర్యం చెప్పింది

నాకు కూచిపూడి అంటే చాలా ఇష్టం. యాక్సిడెంట్‌లో కాలుపోవడంతో ఇక ఎప్పుడూ డ్యాన్స్ చేయలేను అని బాధపడే దాన్ని. నా తల్లిదండ్రులు మాత్రం 'నువ్వు ఎప్పటిలాగే మళ్లీ డ్యాన్స్ చేస్తావు' అని ధైర్యం చెప్పారు. వారి ఆశీర్వాదబలంతో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను. 'పట్టుదల ఉంటే కానిది లేదు' అనే మాటను స్కూలు పాఠాల్లో విన్నాను. ఆ మాట నాకు ధైర్యం చెప్పినట్లు అనిపించేది.

- అంజనశ్రీ

● మ్యూజిక్ వరల్డ్



మోస్ట్ వ్యూడ్ వీడియో

స్థానిక కళాకారులతో కలిసి పాటల కచేరి నిర్వహించినా, అంతర్జాతీయ వేదికలపై ఆడిపాడినా హరిహరన్ గళానికి ఉన్న ప్రత్యేకత వేరు. తాజా విషయానికి వస్తే...ఈ ప్రముఖ గాయకుడు పాడిన 'హనుమాన్ చాలీసా' యూట్యూబ్‌లో 'మోస్ట్ వ్యూడ్ వీడియో'గా నిలిచింది. 4.6 బిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. 'ఊహించని స్పందన ఇది. ఎక్కడకు వెళ్లినా హనుమాన్ చాలీసా గురించే మాట్లాడుతున్నారు' అంటున్నాడు హరిహరన్.

జీమ్యూజిక్‌కు రెడ్ డైమండ్ ప్లే బటన్

మన దేశంలోని టాప్ మ్యూజిక్ లేబుల్స్‌లో 'జీ మ్యూజిక్ కంపెనీ' ఒకటి. తాజా విషయానికి వస్తే... యూట్యూబ్‌లో 100 మిలియన్ సబ్‌స్క్రైబర్‌లతో 'వావ్' అనిపించింది. యూట్యూబ్ వారి ప్రతిష్ఠాత్మకమైన 'రెడ్ డైమండ్ ప్లే బటన్'ను సాధించింది. ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్ అందుకున్న ప్రపంచంలోని రెండో మ్యూజిక్ లేబుల్... జీ మ్యూజిక్. దశాబ్దం క్రితం ప్రారంభమైన 'జీ మ్యూజిక్' ఇండియన్ మ్యూజిక్ మార్కెట్‌లో తనదైన స్థానాన్ని సంపాదించుకుంది.

మెటా వారి... వరల్డ్ మోడల్



సాంకేతిక దిగ్గజం మెటా తన సరికొత్త ఏఐ మోడల్ 'వి–జెప 2' గురించి ప్రకటించింది. దీన్ని 'వరల్డ్ మోడల్'గా అభివర్ధించింది. భౌతిక ప్రపంచాన్ని అర్థం చేసుకునే సాంకేతికత ఉండే 'వి–జెప2'కు రోబోటిక్స్, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను మెరుగుపరిచే సామర్థ్యం ఉంది. ఇది ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్. ఈ సాంకేతిక పరిజ్ఞానం రోబోటిక్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ, భవిష్యత్ ఏఐ అసిస్టెంట్స్‌కు సంబంధించి ఉపయోగపడుతుంది. ఏఐకి సంబంధించి గూగుల్, మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ నుంచి మెటా గట్టి పోటీ ఎదుర్కొంటోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏఐ సాంకేతికత తమ తొలి ప్రాధాన్యతగా ప్రకటించింది మెటా.

అవును... ఇది నిజమే!

- జీబ్రాల సమూహాన్ని 'డజెల్' అంటారు.
- థాయ్‌లాండ్‌లోని లోపుబురిలో ప్రతి సంవత్సరం 'మంకీ బఫెట్ ఫెస్టివల్' నిర్వహిస్తారు. స్థానికంగా ఉన్న కోతులకు కడుపు నిండా తినిపిస్తారు.
- ఫస్ట్ వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్‌కు 1960లో పేటెంట్ లభించింది. మోర్టన్ హైలీగ్ రూపొందించిన ఈ హెడ్–మౌంటెడ్ డిస్‌ప్లేను 'టెలీస్పియర్ మాస్క్' అని పిలిచేవారు.
- స్కాట్‌లాండ్ చుట్టూ ఉన్న చిన్న చిన్న ద్వీపాలను 'క్రానోగ్స్' అని పిలుస్తారు. అయితే ఇవి సహజమైన దీవులు కావు...మనుషులు రూపొందించినవే.
- మిన్నెసోట(యూఎస్)లోని యాక్షన్ పార్క్‌లో మిలిటరీ ట్యాంక్‌లు, ఆర్మీ వెహికిల్స్‌ను డ్రైవ్ చేయవచ్చు.
- 19వ శతాబ్దం అమెరికా చరిత్రలో ఒకానొక నిర్దిష్టమైన కాలపరిధిని 'బోన్ వార్స్' లేదా 'గ్రేట్ డైనోసర్ రష్' అని పిలిచేవారు. డైనోసర్ శిలాజాల అన్వేషణ, కొత్త విషయాలకు సంబంధించిన ఆసక్తి, పోటీ ఈ కాలంలో తీవ్రంగా ఉండేది.
- కెన్యాకు చెందిన రాయ్ ఆలెల్ల సృష్టించిన స్మార్ట్ గ్లోవ్ సైన్ లాంగ్వేజ్ మూమెంట్‌ను స్పీచ్‌గా మారుస్తుంది.

● టెక్ టాక్



వన్‌ప్లస్ ప్యాడ్ 3

సైజ్	: 13.2 అంగుళాలు
రిఫ్రెష్ రేట్	: 144 హెచ్‌జడ్
ఫ్రంట్ కెమెరా	: 6 ఎంపీ
ఓఎస్	: ఆండ్రాయిడ్ 15
రిజల్యూషన్	: 3392X2400 పిక్సెల్స్
బరువు	: 675 గ్రా.

షావోమీ ప్యాడ్



డిస్‌ప్లే	: 11.20 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్	: 144 హెచ్‌జడ్
ఫ్రంట్ కెమెరా	: 32 ఎంపీ
బ్యాటరీ	: 8850 ఎంఏహెచ్
మెమోరీ	: 128జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్

హానర్ ఎక్స్6సి



సైజ్	: 6.61 అంగుళాలు
రిఫ్రెష్ రేట్	: 120 హెచ్‌జడ్
బ్యాటరీ	: 5,300 ఎంఏహెచ్ ● 6/8జీబి ర్యామ్ ● 128/256 జీబి స్టోరేజ్
కలర్స్	: ఓషియన్ సియాన్, మూన్‌లైట్ వైట్, మిడ్‌నైట్ బ్లాక్

● ఇంటర్నెట్ స్లాంగ్

మోగర్

ఇటీవల కాలంలో యువ ప్రపంచంలో పాపులర్ అయిన పదం...మోగర్. ఇతరుల కంటే ఆకర్షణీయంగా, గొప్పగా కనిపించాలనే వ్యక్తులను 'మోగర్' అంటారు.

ఫానమ్ ట్యాక్స్

'ఫానమ్ ట్యాక్స్' అనేది హ్యూమరస్ ఇంటర్నెట్ స్లాంగ్ టర్మ్. స్నేహితులు, ఇతరుల భోజనంలో వాటా అడిగే విషయంలో ఈ ఎక్స్‌ప్రెషన్ వాడుతున్నారు. ఒక కామెడీ బిట్‌తో 2022లో 'ఫానమ్ ట్యాక్స్' పాపులర్ అయింది.

● నేడే విడుదల | గేమింగ్



ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: సర్వైవల్ మోడ్: సింగిల్ ప్లేయర్

ప్రమాద ఘంటికలు వినిపించేలా...

సర్వైవల్ గేమ్ 'ది ఆల్టర్స్' నేడు విడుదల అవుతుంది. పోలిష్ గేమ్ డెవలపర్ '11 బిట్ స్టూడియో' నుంచి వస్తున్న గేమ్ ఇది. సైకలాజికల్ థ్రిల్లర్స్ ఇన్‌స్పిరేషన్స్‌తో రూపొందించారు. జాన్ డోలస్కీ అనే స్పేస్ మైనర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో అత్యంత విలువైన వనరు...టైమ్. టైమ్‌మేనేజ్‌మెంట్ తెలిస్తేనే దూసుకుపోగలుగుతారు. గేమ్‌లోని ప్రతి సెగ్మెంట్‌కు నిర్దిష్టమైన టైమ్ ఉంటుంది. సూర్యాస్తమయానికి ముందే సర్వైవ్, ఎస్కేప్ కాగలిగే టాలెంట్ ఉండాలి. 'ఆల్టర్స్'ను క్రియేట్ చేసుకోవాలి. సిమ్యులేషన్ గేమ్...శాటిస్ఫ్యాక్టరీ(2024) ప్రభావం ఈ గేమ్‌పై కనిపిస్తుంది.

సాక్షి సినిమా

ధీర... రణధీర



● గోపీచంద్

ప్రేక్షకులను ఏడో శతాబ్దంలోకి తీసుకుని వెళ్లనున్నారు గోపీచంద్. ఆయన హీరోగా 'ఘాజి' ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ హిస్టారికల్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గురువారం (జూన్ 12) గోపీచంద్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సినిమాలో గోపీచంద్ ఓ యోధుడు పాత్రలో నటిస్తున్నారు. ఇక విడుదలైన ఈ గ్లింప్స్ వీడియోలో 'ధీర... ధీర... రణధీర' అనే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వినిపిస్తుంది. ''7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని ఒక చారిత్రక ఘటనను ఆవిష్కరించబోతున్నాం. ఈ సినిమాలో గోపీచంద్‌ను విభిన్నమైన పాత్రలో చూస్తారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రూపొందించిన సెట్‌లో నెక్స్ట్ షెడ్యూల్‌ను ప్రారంభించాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ని విజయవంతం చేయాలి - 'దిల్' రాజు



''తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' వేడుకని విజయవంతం చేయాలి'' అని తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజు కోరారు. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం చాలా బాధాకరం. ఎప్పుడూ చూడని ఇలాంటి ప్రమాదం వల్ల దేశం దిగ్భ్రాంతిలో ఉంది. ఈ ప్రెస్‌మీట్‌కి తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిగారు హాజరు కావాల్సి ఉంది. అయితే విమాన ప్రమాదం ఘటనతో రాలేదు. ఇకపోతే... 14 ఏళ్ల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది మూడు అవార్డుల చొప్పున (తొలి ఉత్తమ సినిమా, ద్వితీయ ఉత్తమ సినిమా, తృతీయ ఉత్తమ సినిమా) హీరో, హీరోయిన్, డైరెక్టర్, నిర్మాత... ఇలా నాలుగు అవార్డులను ప్రదానం చేస్తాం. ఇప్పటికే అవార్డుగ్రహీతలందరికీ ఆహ్వానాలు పంపించాం. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ వేడుక ప్రారంభం అవుతుంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నాం'' అని పేర్కొన్నారు.

నిర్మాత మహేంద్ర కన్నుమూత



సీనియర్ నిర్మాత, ఏఏ ఆర్ట్స్ అధినేత కావూరి మహేంద్ర కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడ తాలూకా దోసపాడులో 1946 ఫిబ్రవరి 4న జన్మించారు కావూరి మహేంద్ర. కె. హేమాంబరధర రావు, కె. ప్రత్యగాత్మ వద్ద దర్శకత్వ శాఖలో పనిచేసిన మహేంద్ర నిర్మాతగా మారడం విశేషం. పలు సినిమాలకు ప్రొడక్షన్ కంట్రోలర్‌గానూ పని చేశారాయన. మురళీమోహన్, జయచిత్ర జోడీగా హేమాంబరధర రావు దర్శకత్వం వహించిన 'ప్రేమించి పెళ్లిచేసుకో' (1977) సినిమాతో నిర్మాతగా మారారు మహేంద్ర. గీతా ఆర్ట్స్ పిక్చర్స్, ఏఏ ఆర్ట్స్ బ్యానర్స్‌పై సినిమాలు నిర్మించారు. 'ఏది పుణ్యం? ఏది పాపం?, ఆరని మంటలు, తోడు దొంగలు, బందిపోటు రుద్రమ్మ, ఎదురులేని మొనగాడు, ఢాకూ రాణి, ప్రచండ భైరవి, కనకదుర్గ వ్రత మహత్మ్యం' వంటి సుమారు 50కు పైగా చిత్రాలు తీశారు. శ్రీహరిని హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' చిత్రాన్ని నిర్మించారు. ఆ తర్వాత శ్రీహరితోనే 'దేవా' సినిమా తీశారు. 'లక్ష్మీ కళ్యాణం' సినిమాతో కాజల్ అగర్వాల్‌ని హీరోయిన్‌గా పరిచయం చేశారు మహేంద్ర. కన్మణి దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా నటించిన 'అర్జున' మహేంద్ర చివరి చిత్రం. అయితే ఆర్థిక కారణాల వల్ల ఈ సినిమా విడుదల కాలేదట. తన కుమార్తెను నటుడు, నిర్మాత మాదాల రవికి ఇచ్చి వివాహం చేశారాయన. మహేంద్ర మృతిపై పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలిపారు. గురువారం మధ్యాహ్నం గుంటూరులో మహేంద్ర అంత్యక్రియలు జరిగాయి.

రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ పెద్ద సవాల్

- సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ రావు

''ఓ సినిమాని రియల్ లొకేషన్స్‌లో చిత్రీకరించడం సవాల్‌తో కూడుకున్న పని. 'కుబేర'ని రియల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశాం. ముంబైలోని స్లమ్ ఏరియా, డంపింగ్ యార్డ్స్, వీధులతో పాటు తిరుపతిలోనూ చిత్రీకరించాం. అవి మాకు సవాల్‌గా అనిపించాయి'' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ రావు తెలిపారు. అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ రావు గురువారం విలేకరులతో మాట్లాడుతూ– ''లవ్ స్టోరీ' సినిమా తర్వాత మరో సినిమా చేద్దామని శేఖర్ కమ్ములగారితో చెప్పినప్పుడు 'కుబేర' ఐడియా చెప్పారు. ధనుష్‌గారు 20 నిమిషాలు కథ విని, వెంటనే ఒప్పుకున్నారు. నాగార్జున గారితో సినిమా చేయాలని మాకు ఎప్పటి నుంచో ఉండేది. ఈ పాత్ర కోసం నాగార్జునగారు తప్పితే మరొకరు కనిపించలేదు శేఖర్‌గారికి. నాగ్ సార్‌కి ఈ కథ నచ్చి, చేశారు. 'పుష్ప' సినిమాకి ముందే రష్మికా మందన్నాని హీరోయిన్‌గా తీసుకున్నాం. ధనుష్, నాగార్జున, రష్మికగార్లు అద్భుతంగా సపోర్ట్ చేశారు. మోస్ట్ రిచెస్ట్ మేన్ ఇన్ ద వరల్డ్, ది పూరెస్ట్ మ్యాన్ ఇన్ ది స్ట్రీట్స్ అన్నది 'కుబేర' కాన్సెప్ట్. శేఖర్‌గారు ఈ చిత్రంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతినివ్వబోతున్నారు. ఇందులోని భావోద్వేగాలు ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతాయి. దేవిశ్రీ ప్రసాద్ చాలా వైవిధ్యమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాని దాదాపు 1600 స్క్రీన్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. మా సినిమా కోసం ప్రత్యేకించి టిక్కెట్ ధరలు పెంచడం లేదు. సింగిల్ స్క్రీన్స్‌లో రూ. 150, మల్టీప్లెక్స్‌లలో ప్రాంతాన్ని బట్టి రూ. 200, రూ. 225, రూ. 250గా నిర్ణయించాం. మా తర్వాతి సినిమాని కూడా శేఖర్ కమ్ములగారితోనే చేయనున్నాం. అయితే హీరో ఫైనలైజ్ కాలేదు'' అని తెలిపారు.



● రామ్మోహన్ రావు, సునీల్ నారంగ్

మిత్రమండలి విజయం సాధించాలి - అల్లు అరవింద్



● నిహారిక, ప్రియదర్శి, అనుదీప్, అల్లు అరవింద్, విజయేందర్ ఎస్, బన్నీ వాసు

''బన్నీ వాసు సమర్పిస్తున్న తొలి సినిమా , నా మిత్రులందరూ కలిసి తీసిన 'మిత్రమండలి' టీజర్‌ను లాంచ్ చేయడం బాధ్యతగా భావిస్తున్నా. ఈ టీజర్ బాగుంది. సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, నిహారిక ఎన్.ఎం, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిత్రమండలి'. విజయేందర్. ఎస్ దర్శకత్వంలో బన్నీ వాసు నూతన నిర్మాణ సంస్థ బీవీ వర్క్స్ సమర్పణలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ సినిమాను నిర్మించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''ప్రియదర్శి మాకు ఓ వెబ్ సిరీస్ చేశాడు. యాక్టర్‌గా అతను మంచి స్థాయికి వెళతాడని అప్పుడే ఊహించాను. 'కోర్ట్' సినిమాలో అద్భుతంగా నటించాడు. నిహారికకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ టీమ్ మాటలు వింటుంటే దర్శకుడిలో మంచి ప్రతిభ ఉన్నట్లుగా అర్థం అవుతోంది'' అని అన్నారు. ''మిత్రమండలి' ఆడియన్స్‌ను నవ్విస్తుంది'' అని తెలిపారు ప్రియదర్శి. ''నలుగురు కుర్రాళ్ళు కలిసి చేసే బడ్డీ కామెడీ ఎలా ఉంటుందో 'మిత్రమండలి' సినిమా అలా ఉంటుంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు బన్నీ వాసు. ''నేను రాసిన కామెడీని నటీనటులంతా కలిసి అద్భుతంగా పండించారు'' అన్నారు విజయేందర్ ఎస్. ''మిత్రమండలి' ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అని తెలిపారు భాను ప్రతాప. ''ఇంత మంచి సినిమా నా తొలి తెలుగు చిత్రం అవుతున్నందుకు హ్యాపీగా ఉంది'' అని తెలిపారు నిహారిక. దర్శకుడు కేవీ అనుదీప్, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ వేడుకలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సినిమాకు సహ నిర్మాత: సోమరాజు పెన్మెత్స.

ఓటీటీ | ఇది చూడొచ్చు

ఓ వెరైటీ కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో వెబ్ సిరీస్ 'దేవికా అండ్ డానీ' ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

సినిమాలైనా... వెబ్ సిరీస్‌లైనా... వాటిలో వచ్చే కథలు కొన్ని వాస్తవ రూపాలైతే మరికొన్ని కథలు దర్శకుని కాల్పనిక కళాకృతులు. రెండిటిలోను ప్రేక్షకుల నమ్మకం అనేది కీలకం. అది వాస్తవమైనా, కల్పన అయినా చూసే ప్రేక్షకుడికి నచ్చితే నెత్తిన పెట్టుకుంటాడు. అటువంటి కోవకి చెందినదే 'దేవికా అండ్ డానీ' వెబ్ సిరీస్. జియో హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతోంది. దీపక్ రాజ్ అందించిన ఈ సిరీస్ కథకు బి. కిరణ్ దర్శకత్వం వహించారు. ఇది ఫ్యామిలీ ఓరియంటెడ్ థ్రిల్లర్ అని చెప్పవచ్చు. సబ్జెక్ట్ సీరియస్ అయినా చక్కటి హాస్యంతో చాలా జాగ్రత్తగా స్క్రీన్‌ప్లే రాసుకున్నారు దర్శకుడు. 'పెళ్ళి చూపులు' ఫేం రీతూ వర్మ ఈ సిరీస్‌లో ప్రధాన కథానాయిక. ఓ రకంగా కథంతా ఆమె చుట్టూనే తిరుగుతుంటుంది. దేవిక పాత్రలో రీతూ జీవించారనే చెప్పాలి. ఇక కథ విషయానికొస్తే... దేవిక ఆ ఊరి స్కూల్‌లో సంగీతం నేర్పించే టీచర్‌గా పని చేస్తుంటుంది. దేవిక తాత పెద్ద ఉపాసకుడు. ఆయనకు ఆత్మలతో మాట్లాడే అద్భుతమైన శక్తి ఉంటుంది. అదే శక్తి మనవరాలు దేవికకు కూడా ఉందన్న విషయం కథ మధ్యలో తెలుస్తుంది. దేవికకు ఓ పెళ్ళి సంబంధం ఖాయమవుతుంది. దేవిక స్కూల్‌కి వెళ్ళే సమయంలో ఓ రోజు డానీ అనే వ్యక్తి పరిచయమవుతాడు. డానీని దేవిక ఇష్టపడుతుంది. కానీ దేవిక దగ్గరకు డానీ ఓ సమస్యతో వస్తాడు. ఆ సమస్య వల్ల దేవిక చాలా పెద్ద ప్రమాదంలో ఇరుక్కుని ప్రాణాల మీదకు కూడా తెచ్చుకుంటుంది. పుట్టి బుద్ధి ఎరిగిన నాటి నుండి ఇల్లు, స్కూలుకి పరిధిలోని 20 కిలోమీటర్లలోనే ప్రయాణిస్తున్న ఓ పెళ్ళి నిశ్చయమైన అమ్మాయి దారిలో కనబడ్డ అబ్బాయితో ప్రేమలో పడి ఆ అబ్బాయికి సంబంధించిన సమస్యను పరిష్కరించడానికి దాదాపు 300 కిలోమీటర్లు ప్రయాణించి తన ప్రాణాలను పణంగా పెడుతుంది. మరి... డానీ సమస్యను దేవిక తీర్చగలిగిందా? తనకు నిశ్చితార్థమైన అబ్బాయినే పెళ్ళి చేసుకుందా? అన్న విషయాలు తెలుసుకోవాలంటే మాత్రం 'దేవికా అండ్ డానీ' వెబ్ సిరీస్ చూసేయండి. సిరీస్ మొత్తం మంచి ట్విస్టులతో, చక్కటి హ్యూమర్‌తో ఎక్కడా బోర్ కొట్టదు. ఇంకెందుకు ఆలస్యం... చూసేయండి మరి.



- హరికృష్ణ ఇంటూరు

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
823	253
81,692	24,888

విదేశీ సూచీలు

నాస్డాక్	19,600	▽	11
డోజోన్స్	42,938	△	23
ఎఫ్టీఎస్ఈ 100	8,885	△	21
డాక్స్	23,771	△	177
షాంఘై	3,403	△	1
నికాయ్	38,173	▽	248

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.05	86.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.70	117.67
€	యూరో	ఎస్‌బీఐ	97.19	99.92
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.68	60.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.54	56.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.60	69.28
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.91	23.41
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.94	23.44
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.05	12.88

పసిడి.. పరుగులు



- మళ్లీ రూ. లక్షకు చేరువ...
- రూ.850 పెరుగుదల
- ఢిల్లీలో రూ.99,340కి చేరిక

న్యూఢిల్లీ: పసిడి ధరలు మరోసారి బలపడ్డాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.850 లాభపడి రూ.99,340 స్థాయికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూల పరిణామాలు ఇందుకు అనుకూలించాయి. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం 10 గ్రాములకు రూ.800 పెరిగి రూ.98,800కి చేరుకుంది. వెండి ధర కిలోకి రూ.100 నష్టపోయి రూ.1,07,000 వద్ద స్థిరపడింది. ఎంసీఎక్స్ మార్కెట్లో ఆగస్ట్ కాంట్రాక్ట్ 10 గ్రాములకు రూ.1,585 ఎగసి రూ.98,289కు దూసుకెళ్లింది. అక్టోబర్ డెలివరీ కాంట్రాక్ట్ ధర సైతం రూ.1,520 పెరిగి రూ.99,213 స్థాయిని నమోదు చేసింది. ''యూఎస్–ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ చెలరేగడంతో సురక్షిత పెట్టుబడి సాధనం అయిన బంగారానికి తిరిగి డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు అమెరికా ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా రావడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై అంచనాలు పెరగడం కూడా బంగారం ధరలకు మద్దతునిచ్చింది''అని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ శ్రీరామ్ అయ్యర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం ర్యాలీ చేసింది. ఔన్స్‌కు 68 డాలర్లు ఎగసి 3412 డాలర్ల స్థాయిని చేరింది. ఏకవ్యాప్త టారిఫ్‌లను రెండు వారాల్లో అమలు చేయనున్నట్టు యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో ధరలు మరోసారి గరిష్ట స్థాయిల్లో ట్రేడ్ అయినట్టు కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కేతన్ చైన్‌వాలా తెలిపారు.

ట్రూజెట్ మళ్లీ వస్తోంది..



- పర్మిట్ రెన్యువల్‌పై కసరత్తు
- నవంబర్ నుంచి సేవలు ప్రారంభించే అవకాశం

న్యూఢిల్లీ: దాదాపు మూడేళ్ల క్రితం ఆర్థిక సంక్షోభంతో కార్యకలాపాలు నిలిపివేసిన ట్రూజెట్ (గతంలో టర్బో మేఘా ఎయిర్‌వేస్) మళ్లీ సర్వీసులను ప్రారంభించడంపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ఇన్వెస్టర్ల దన్నుతో బ్రాండ్‌ను పునరుద్ధరించేందుకు అనుమతుల కోసం పౌర విమానయాన శాఖను సంప్రదించినట్లు కంపెనీ ఎండీ ఉమేశ్ వంకాయలపాటి తెలిపినట్లు వార్తా కథనం వెలువడింది. సుదీర్ఘ చర్చల అనంతరం కేంద్రం తమకు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) జారీ చేసినట్లు ఆయన వివరించారు. ఇక పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ)లో ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్‌ను (ఏవోపీ) రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని ఉమేశ్ తెలిపారు. ఇందుకోసం సుమారు 180 రోజుల వరకుసమయం పట్టొచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రాథమికంగా రూ. 200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు, 600 మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన చెప్పారు. 2015–2022 మధ్య కాలంలో ప్రాంతీయ రూట్లలో చౌక విమానయాన సేవలందించే సంస్థగా, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా ట్రూజెట్ కార్యకలాపాలు సాగించింది. అయితే, కోవిడ్ అనంతర ప్రతికూల ప్రభావాలతో, ఆర్థిక సంక్షోభం తలెత్తి 2022 ఫిబ్రవరి నుంచి కార్యకలాపాలు నిలిపివేసింది.

హబ్‌గా వైజాగ్..

ఏవోపీ వచ్చాక ఎయిర్‌బస్ ఏ320 విమానంతో నవంబర్ నుంచి కార్యకలాపాలను పునఃప్రారంభించే యోచనలో ఉన్నట్లు ఉమేశ్ చెప్పారు. వైజాగ్ తమకు హబ్‌గా ఉంటుందన్నారు. తొలి ఫ్లయిట్ విశాఖ నుంచి ఢిల్లీ, ముంబై, బెంగళూరు లేదా హైదరాబాద్‌కి నడిపే అవకాశం ఉందని ఉమేశ్ వివరించారు. ఏ320 విమానాలతో పాటు ప్రాంతీయ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ఉడాన్ స్కీము కింద సర్వీసులు నడిపేందుకు ఏటీఆర్ టర్బోప్రాప్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను కూడా తీసుకునే ప్రణాళికలు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఏటీఆర్‌లకు లక్నో విమానాశ్రయం బేస్‌గా ఉంటుందన్నారు.

ఆహార ధరలు మరింత తగ్గాయ్..!

- ఆరేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- మే నెలకు 2.82 శాతంగా నమోదు



న్యూఢిల్లీ: ధరలు మరింత దిగొచ్చాయి. మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా ఆరేళ్ల కనిష్ట స్థాయి అయిన 2.82 శాతానికి తగ్గింది. 2019 ఫిబ్రవరిలో 2.57 శాతం తర్వాత తిరిగి కనిష్టానికి దిగి రావడం ఇదే మొదటిసారి. వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (సీపీఐ/రిటైల్) ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 3.16 శాతంగా ఉంటే, 2024 మే నెలలో 4.8 శాతంగా ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఆహార ధరల విభాగంలో ద్రవ్యోల్బణం 0.99 శాతానికి పరిమితమైంది. ఏడాది క్రితం ఇదే నెలలో ఇది 8.69 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం స్థాయిలో కట్టడి చేయాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం. ఈ స్థాయికి దిగువనే ఉండడం సానుకూలించే అంశం. ఈ అంచనాల నేపథ్యంలోనే ఆర్‌బీఐ ఈ నెల ఆరంభంలో రెపో రేటును ఏకంగా అర శాతం తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ''పప్పులు, వాటి సంబంధిత ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, ధాన్యం ఉత్పత్తులు, గృహ వినియోగ వస్తువులు, సేవల ద్రవ్యోల్బణం తగ్గడం మే నెలలో ఆహార, రిటైల్ ద్రవ్యోల్బణం దిగిరావడానికి దోహదపడింది''అని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) ప్రకటించింది. ఆహార ద్రవ్యోల్బణం 2021 అక్టోబర్ తర్వాత కనిష్ట స్థాయిలో నమోదైనట్టు తెలిపింది.

పట్టణాల్లో కాస్త ఎక్కువ..: మే నెలలో గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 2.59 శాతానికి పరిమితం అయితే.. పట్టణ ప్రాంతాల్లో ఇది 3.07 శాతంగా ఉంది. ముఖ్యంగా దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం తెలంగాణలో నమోదైంది. 0.55 శాతంగా ఉంది. కాగా, అత్యధికంగా కేరళలో 6.46 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
ఏఐ మార్కెట్ @ 17 బిలియన్ డాలర్లు
వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల్లోకి శ్రీరామ్ గ్రూప్

కేవైసీ అప్‌డేషన్ ఇక ఈజీ!



- కస్టమర్లకు తగినంత సమయం ఇవ్వండి
- బ్యాంక్‌లకు ఆర్‌బీఐ తాజా ఆదేశాలు
- బిజినెస్ కరస్పాండెంట్లకు అనుమతి

ముంబై: కాలానుగుణంగా కేవైసీ అప్‌డేషన్‌ను మరింత సులభతరం చేసే దిశగా ఆర్‌బీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. కేవైసీ అప్‌డేషన్ సేవలను బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా (బీసీలు) చేపట్టేందుకు అనుమతించింది. కస్టమర్లకు నిర్ణీత గడువుతో ముందస్తు నోటీసులు/సమాచారం ఇవ్వాలంటూ బ్యాంక్‌లతోపాటు తన నియంత్రణల పరిధిలోని ఆర్థిక సంస్థలను (ఎన్‌బీఎఫ్‌సీలు, హెచ్ఎఫ్‌సీలు తదితర) ఆర్‌బీఐ కోరింది. ''ఖాతాల కేవైసీ అప్‌డేషన్ విషయంలో పెద్ద ఎత్తున పెండింగ్ ఉన్నట్టు గమనించాం. ముఖ్యంగా ప్రత్యక్ష నగదు బదిలీ కోసం, స్కాలర్ షిప్ ప్రయోజనాల కోసం తెరిచిన ఖాతాలు, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల విషయంలో ఈ పరిస్థితి నెలకొంది''అని ఆర్‌బీఐ ఆదేశాల్లో పేర్కొంది. కస్టమర్ల సౌకర్యం దృష్ట్యా బిజినెస్ కరస్పాండెంట్ల (బీసీలు)ను కేవైసీ అప్‌డేషన్ పనుల నిర్వహణకు అనుమతిస్తున్నట్టు తెలిపింది. దీంతో గ్రామీణ ప్రాంతాలు, బ్యాంక్ శాఖలు అంతగా అందుబాటులో లేని ప్రాంతాల కస్టమర్లకు సైతం కేవైసీ అప్‌డేషన్ సులభతరం కానుంది. ఇందుకు వీలుగా సవరించిన కేవైసీ ఆదేశాలను జారీ చేసింది.

3 పర్యాయాలు సమాచారం ఇవ్వాల్సిందే..

కాలానుగుణ కేవైసీ అప్‌డేషన్ విషయంలో కస్టమర్లకు బ్యాంక్‌లు ముందస్తు నోటీసులు ఇవ్వడం తప్పనిసరి. కనీసం మూడు పర్యాయాలు కస్టమర్లకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో ఒక్కసారి లేఖ ద్వారా తెలియజేయాలని ఆర్‌బీఐ పేర్కొంది. ప్రతి ఇంటిమేషన్/రిమైండర్‌ను నమోదు చేయాలని కూడా ఆదేశించింది. కేవైసీ వివరాల్లో ఎలాంటి మార్పు లేకపోతే కస్టమర్ నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకుంటే సరిపోతుంది. తక్కువ రిస్క్‌లో ఉన్న కస్టమర్లు గడువులోపు కేవైసీ అప్‌డేట్ చేయకపోయినప్పటికీ.. అప్పటి నుంచి ఏడాది పాటు లేదా 2026 జూన్ 30 వరకు వారి ఖాతాల్లో అన్ని లావాదేవీలను అనుమతించాలని ఆర్‌బీఐ కోరింది. కేవైసీ అప్‌డేషన్ విషయంలో క్యాంపులు నిర్వహించి కస్టమర్లలో అవగాహన కల్పించాలని సూచించింది.

మార్కెట్లకు పశ్చిమాసియా సెగ

సెన్సెక్స్ 823 పాయింట్లు డౌన్

- రూ.5.98 లక్షల కోట్ల సంపద ఆవిరి
- 24,900 దిగువకు నిఫ్టీ



ముంబై: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో భారత స్టాక్ సూచీలు గురువారం ఒకశాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 823 పాయింట్లు క్షీణించి 81,692 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 253 పాయింట్లు పతనమై 24,888 వద్ద నిలిచింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడికి సన్నాహాలు చేస్తోందన్న వార్తలతో క్రూడాయిల్ ధరలు పెరుగుదల, అధిక వాల్యుయేషన్ల ఆందోళనలు, వారాంతపు ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ అప్రమత్తత, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు అంశాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఒక దశలో సెన్సెక్స్ 992 పాయింట్లు క్షీణించి 81,523 వద్ద, నిఫ్టీ 315 పాయింట్లు పతనమై 24,826 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.

- అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో విద్యుత్, వినిమయం 2.2%, ఆయిల్ అండ్‌గ్యాస్ 2.1%, రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్ సూచీలు 2% క్షీణించాయి.
- సూచీల ఒక శాతం పతనంతో రూ.5.98 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్ఈలోని మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 449 లక్షల కోట్లు (5.26 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది.
- గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం కుప్పకూలడంతో ఏవియేషన్ సంబంధిత షేర్లు డీలాపడ్డాయి. ఇండిగో 3%, స్పైస్‌జెట్ 2%, చార్టర్డ్ క్యారియర్ టాల్ ఎంటర్‌ప్రైజెస్ 3% నష్టపోయాయి.

భారత జట్టుకు నాలుగో ఓటమి



ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) యూరోపియన్ అంచె పురుషుల ప్రొ లీగ్‌లో భారత జట్టు వరుసగా నాలుగో పరాజయం చవిచూసింది. అర్జెంటీనా జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 1–2 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. డ్రాగ్ ఫ్లికర్ జుగ్‌రాజ్ సింగ్ నాలుగో నిమిషంలో చేసిన గోల్‌తో భారత్1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఐదు నిమిషాల తర్వాత టొమాస్ డొమెనె గోల్‌తో అర్జెంటీనా 1–1తో స్కోరును సమం చేసింది. 49వ నిమిషంలో టొమాస్ రెండో గోల్ చేయడంతో అర్జెంటీనా 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అర్జెంటీనా విజయాన్ని ఖరారు చేసుకుంది. భారత జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించగా... ఒక దానిని సద్వినియోగం చేసుకుంది. అర్జెంటీనా జట్టుకు ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు దక్కగా... రెండింటిని లక్ష్యానికి చేర్చింది. భారత జట్టు మొత్తం 12 మ్యాచ్‌లు ఆడి ఐదింటిలో గెలిచి, ఏడింటిలో ఓడిపోయింది. 15 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఆస్ట్రేలియాతో బెల్జియంలోని ఆంట్‌వర్ప్‌లో ఆడుతుంది.

'సిరీస్‌ను చిరస్మరణీయం చేసుకోండి'

జట్టు సభ్యులకు గంభీర్ ఉద్బోధ



బెకెన్‌హామ్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ భారత ఆటగాళ్లకు గొప్ప అవకాశమని... అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి దీనిని చిరస్మరణీయం చేసుకోవాలని జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచించాడు. ఇందుకోసం తమ సహజశైలిని దాటి దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాలని అతను అన్నాడు. కోహ్లి, రోహిత్, అశ్విన్ లేకుండా టీమిండియా టెస్టు సిరీస్ ఆడుతున్న నేపథ్యంలో జట్టులోని యువ ఆటగాళ్లు సత్తా చూపించాలని కోచ్ ఆకాంక్షించాడు. 'ఈ సిరీస్‌ను రెండు విధాలుగా చూడవచ్చు. ముగ్గురు సీనియర్లు లేకుండా ఆడుతున్నామనే కోణంలో ఒకటి... వారు లేరు కాబట్టి దేశం తరఫున గొప్ప ఆట తీరు కనబర్చేందుకు దక్కిన సరైన అవకాశంగా చూడటం మరొకటి. ఏదైనా ప్రత్యేకంగా సాధించి చూపించాలనే కసి, పట్టుదల నాకు ప్రస్తుత జట్టులో కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ఒక గిరి గీసుకొని ఆడినవారు కూడా దానిని దాటి రావాలి. ప్రతీ రోజు, ప్రతీ సెషన్, ప్రతీ బంతి కోసం పోరాడితే ఈ సిరీస్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది' అని గంభీర్ వ్యాఖ్యానించాడు. ఈ సిరీస్‌తో తొలిసారి టెస్టు టీమ్‌లో చోటు దక్కించుకున్న సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లను కోచ్ టీమ్‌లోకి ఆహ్వానించాడు. 'తొలిసారి టెస్టు పిలుపు రావడం ఎప్పుడైనా గొప్పగా చెప్పుకోగలిగే ప్రత్యేక సందర్భం. సాయి గత మూడు నెలలుగా అద్భుతంగా ఆడుతున్నాడు. టెస్టుల్లోనూ మంచి కెరీర్ ఉండాలని కోరుకుంటున్నా. అర్ష్‌దీప్ కూడా భారత్ తరఫున పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఎంతో బాగా ఆడాడు. ఇప్పుడు టెస్టుల్లో రాణించాల్సిన సమయం వచ్చింది' అన్న గంభీర్... తొలిసారి టెస్టు కెప్టెన్‌గా వ్యవహరించబోతున్న గిల్‌ను ప్రత్యేకంగా అభినందించాడు.

భారత్ గురించి బాగా తెలుసు: మెకల్లమ్

టెస్టు సిరీస్ కోసం భారత జట్టు బాగా సన్నద్ధమై వచ్చిందని, అయితే తాము ఏం చేయాలనేదానిపై పూర్తి స్పష్టత ఉందని ఇంగ్లండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ అన్నాడు. తమ టీమ్ సభ్యులంతా సిరీస్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని అతను చెప్పాడు. 'భారత్ చాలా బలమైన జట్టు. ఎన్నో అంచనాలతో ఇక్కడికి వచ్చింది. అయితే ఒక టెస్టు జట్టుగా మా లక్ష్యాలేమిటో మాకు బాగా తెలుసు. పోరు కోసం సిద్ధంగా ఉన్నాం. కొందరు కీలక బౌలర్లు అందుబాటులో లేకపోయినా ప్రస్తుత పేస్ బృందంలో వైవిధ్యం ఉంది. స్పిన్నర్ బషీర్ ప్రతీ మ్యాచ్‌కు రాటుదేలుతున్నాడు. బ్యాటర్లలో జేమీ స్మిత్, బెథెల్‌లాంటి వాళ్లు సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో కనిపించే దూకుడుకు ఆట జత కలిస్తే మంచి ఫలితాలు ఖాయం' అని మెకల్లమ్ తన సహచరుల గురించి విశ్లేషించాడు.

సిఫ్ట్ కౌర్‌కు కాంస్యం



మ్యూనిక్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. గురువారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా కాంస్య పతకం సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 453.1 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. డ్యూస్టాడ్ జెనెట్ హెగ్ (నార్వే; 466.9 పాయింట్లు) స్వర్ణం, ఎమిలీ జెగి (స్విట్జర్లాండ్; 464.8 పాయింట్లు) రజతం సొంతం చేసుకున్నారు. పంజాబ్‌కు చెందిన 23 ఏళ్ల సిఫ్ట్ కౌర్‌కు ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీలలో ఇది ఐదో పతకం కావడం విశేషం. మరోవైపు గురువారమే జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. క్వాలిఫయింగ్‌లో అంకుశ్ జాదవ్ (631.7 పాయింట్లు) 11వ స్థానంలో, అర్జున్ బబూటా (629.1 పాయింట్లు) 43వ స్థానంలో, సందీప్ సింగ్ (628.3 పాయింట్లు) 53వ స్థానంలో నిలిచారు.

రెండో రోజూ 14 వికెట్లు

ఆసక్తికరంగా సాగుతున్న డబ్ల్యూటీసీ ఫైనల్

- దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 138 ఆలౌట్
- ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 144/8
- ఓవరాల్‌గా 218 పరుగుల ఆధిక్యం

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రెండో రోజు ముగిసేసరికే ఉత్కంఠభరిత స్థితికి చేరింది. గురువారం కూడా పేసర్ల జోరు కొనసాగడంతో తొలి రోజులాగే మొత్తం 14 వికెట్లు నేలకూలాయి. ముందుగా కమిన్స్ ధాటికి దక్షిణాఫ్రికా తడబడి ఆధిక్యం కోల్పోగా... ఆ తర్వాత రబాడ, ఇన్‌గిడి దెబ్బకు ఆసీస్ బ్యాటర్లు కూడా చేతులెత్తేశారు. అయితే ఇప్పటికే ఆధిక్యం 200 దాటిన ఆస్ట్రేలియాదే కాస్త పైచేయిగా కనిపిస్తుండగా... చివరి రోజు సఫారీ టీమ్ ముందు ఎంతటి లక్ష్యం ఉంటుందనేది ఆసక్తికరం.



కమిన్స్ సంబరం

300
టెస్టుల్లో ప్యాట్ కమిన్స్ వికెట్ల సంఖ్య. ఈ ఘనత సాధించిన ఎనిమిదో ఆస్ట్రేలియా బౌలర్‌గా నిలిచిన కమిన్స్ 68 టెస్టుల్లో ఈ మైలురాయిని చేరాడు.

లండన్: ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ట్రోఫీని నిలబెట్టుకుంటుందా... దక్షిణాఫ్రికా 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ గెలుచుకుంటుందా అనేది శుక్రవారమే తేలే అవకాశం ఉంది. బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఫైనల్లో మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. అలెక్స్ కేరీ (50 బంతుల్లో 43; 5 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా... ప్రస్తుతం ఆసీస్ ఓవరాల్ ఆధిక్యం 218 పరుగులకు చేరింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 43/4తో ఆటను కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 57.1 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఆస్ట్రేలియాకు 74 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. బెడింగ్‌హామ్ (45; 6 ఫోర్లు), బవుమా (36; 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. కమిన్స్ (6/28) ఆరు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు.

12 పరుగులకు 5 వికెట్లు...

రెండో రోజు బవుమా, బెడింగ్‌హామ్ భాగస్వామ్యంతో జట్టు పరిస్థితి మెరుగ్గా కనిపించింది. లబుషేన్ అద్భుత క్యాచ్‌కు బవుమా వెనుదిరగడంతో ఈ భాగస్వామ్యానికి తెర పడింది. బవుమా, బెడింగ్‌హామ్ ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. ఆ తర్వాత బెడింగ్‌హామ్ కొద్దిసేపు పోరాడాడు. అయితే లంచ్ తర్వాత కమిన్స్ ధాటికి దక్షిణాఫ్రికా ఒక్కసారిగా కుప్పకూలింది. 126/5తో ఉన్న జట్టు 12 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయింది. ఒకే ఓవర్లో వెరీన్ (13), యాన్సెన్ (0)లను అవుట్ చేసిన కమిన్స్... బెడింగ్‌హామ్‌నూ పెవిలియన్‌కు పంపించి ఐదు వికెట్ల ప్రదర్శనను పూర్తి చేసుకున్నాడు. కేశవ్ మహరాజ్ (7) రనౌట్ కాగా, రబాడ (1) వికెట్‌తో సఫారీల ఇన్నింగ్స్ ముగిసింది.

టపటపా...

తొలి ఇన్నింగ్స్‌కంటే మెరుగైన ప్రదర్శనతో ప్రత్యర్థికి సవాల్ విసరాల్సిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ రెండో ఇన్నింగ్స్‌లో మరింత పేలవంగా సాగింది. ఓపెనర్లు లబుషేన్ (22), ఖ్వాజా (6) తొలి 10 ఓవర్ల పాటు జాగ్రత్తగా ఆడారు. దాంతో ఆసీస్‌కు సరైన ఆరంభం లభించినట్లు అనిపించింది. అయితే ఆ తర్వాత అనూహ్యంగా జట్టు పతనం మొదలైంది. ఒకే ఓవర్లో ఖ్వాజా, గ్రీన్ (0)లను రబాడ పెవిలియన్ పంపించగా, యాన్సెన్ చక్కటి బంతితో లబుషేన్‌ను అవుట్ చేశాడు. స్మిత్ (13) ఇన్‌గిడి బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వగా... 'రివ్యూ'లో దక్షిణాఫ్రికా ఫలితం సాధించింది. వెబ్‌స్టర్ (9), హెడ్ (9), కమిన్స్ (6) కేవలం 7 పరుగుల వ్యవధిలో వెనుదిరిగారు. కేరీ, స్టార్క్ (16 బ్యాటింగ్) 8వ వికెట్‌కు 61 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. దాంతో ఆసీస్ ఓవరాల్ ఆధిక్యం 200 దాటింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (బి) స్టార్క్ 0; రికెల్టన్ (సి) ఖ్వాజా (బి) స్టార్క్ 16; ముల్డర్ (బి) కమిన్స్ 6; బవుమా (సి) లబుషేన్ (బి) కమిన్స్ 36; స్టబ్స్ (బి) హాజల్‌వుడ్ 2; బెడింగ్‌హామ్ (సి) కేరీ (బి) కమిన్స్ 45; వెరీన్ (ఎల్బీ) (బి) కమిన్స్ 13; యాన్సెన్ (సి అండ్ బి) కమిన్స్ 0; మహరాజ్ (రనౌట్) 7; రబాడ (సి) వెబ్‌స్టర్ (బి) కమిన్స్ 1; ఇన్‌గిడి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (57.1 ఓవర్లలో ఆలౌట్)** 138. **వికెట్ల పతనం:** 1–0, 2–19, 3–25, 4–30, 5–94, 6–126, 7–126, 8–135, 9–138, 10–138. **బౌలింగ్:** స్టార్క్ 13–3–41–2, హాజల్‌వుడ్ 15–5–27–1, కమిన్స్ 18.1–6–28–6, లయన్ 8–3–12–0, వెబ్‌స్టర్ 3–0–20–0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: లబుషేన్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 22; ఖ్వాజా (సి) వెరీన్ (బి) రబాడ 6; గ్రీన్ (సి) ముల్డర్ (బి) రబాడ 0; స్మిత్ (ఎల్బీ) (బి) ఇన్‌గిడి 13; హెడ్ (బి) ముల్డర్ 9; వెబ్‌స్టర్ (ఎల్బీ) (బి) ఇన్‌గిడి 9; కేరీ (ఎల్బీ) (బి) రబాడ 43; కమిన్స్ (బి) ఇన్‌గిడి 6; స్టార్క్ (బ్యాటింగ్) 16; లయన్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (40 ఓవర్లలో 8 వికెట్లకు)** 144. **వికెట్ల పతనం:** 1–28, 2–28, 3–44, 4–48, 5–64, 6–66, 7–73, 8–134.
బౌలింగ్: రబాడ 11–0–44–3, యాన్సెన్ 12–3–31–1, ముల్డర్ 6–0–14–1, ఇన్‌గిడి 9–0–35–3, మహరాజ్ 2–0–10–0.

'హ్యాండిల్డ్ ద బాల్' వివాదం

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. వెబ్‌స్టర్ వేసిన 49వ ఓవర్లో బెడింగ్‌హామ్ బ్యాట్‌ను తాకిన బంతి అతని కాలి ప్యాడ్ ఫ్లాప్‌లోకి వెళ్లింది. అది కింద పడే లోపు క్యాచ్ అందుకునేందుకు ఆసీస్ కీపర్ కేరీ ప్రయత్నించాడు. అయితే అదే సమయంలో బెడింగ్‌హామ్ తన చేత్తో బంతిని తీసి కింద విసిరేశాడు. దీనిపై స్మిత్, ఖ్వాజా 'హ్యాండిల్డ్ ద బాల్' గురించి అప్పీల్ చేశారు. దీనిపై ఫీల్డ్ అంపైర్లు గాఫ్‌నీ, ఇల్లింగ్‌వర్త్ చర్చించి అప్పటికే 'డెడ్‌బాల్' అయిందని ప్రకటిస్తూ నాటౌట్‌గా తేల్చారు. అయితే రీప్లేలు చూస్తే బంతి ప్యాడ్‌లో ఇరుక్కుపోకుండా ఇంకా 'రోలింగ్'లోనే ఉండటం కనిపించింది. అది స్పష్టంగా అవుట్ అని, మూడో అంపైర్‌ను సంప్రదించకుండా ఫీల్డ్ అంపైర్లు వేగంగా నిర్ణయం వెలువరించారని దీనిపై తీవ్ర చర్చ సాగింది.

విమాన ప్రమాదం విషాదకరం: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటన విషాదకరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

విమాన ప్రమాదంపై కేసీఆర్ దిగ్భ్రాంతి

సాక్షి, హైదరాబాద్: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇంకా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి తదితరులు కూడా దుర్ఘటనలో మృతి చెందిన వారికి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

విమాన ఘోర ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా ఘోర విమాన ప్రమాదంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది మృతిచెందడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతిచెందిన ప్రయాణికులు, సిబ్బంది కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పిల్లల పెంపకం.. చాలా కాస్ట్లీ





నగరాలూ పట్టణాల్లో పెరిగిన వ్యయం
ఒకరి కోసమే ఏడాదికి రూ.13 లక్షలు
చదువుకు కనీసం రూ.8 లక్షలు
మిగతా ఖర్చులు రూ.5 లక్షలు
బడులు తెరిచేవేళ చర్చకు తెరలేపిన లింక్డ్ఇన్ పోస్టు

'ఒకరికి ఏడాదికి రు.13 లక్షలు'

ముంబైకి చెందిన అంకుర్ ఝువేరీ అనే ఒక ప్రొఫెషనల్ తాజాగా లింక్డ్ఇన్‌లో పెట్టిన ఈ పోస్టు.. పట్టణ ప్రాంత మధ్యతరగతి తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని ఎత్తి చూపుతూనే, పిల్లల పెంపకానికి, చదువుకు అయ్యే ఖర్చు విపరీతంగా పెరుగుతుండటంపై ఆందోళన రేకెత్తించింది. మెట్రోపాలిటన్ నగరంలో ఒకరికి ఏడాదికి రూ.13 లక్షలు ఖర్చవుతుండగా, అందులో చదువుకు అయ్యే ఖర్చే రు.7 నుంచి 8 లక్షల వరకు ఉంటోందని ఝువేరీ తన పోస్టులో అంచనా వేశారు. 'గత వారం నేను నా కజిన్‌ను కలిసే వరకు, భారతదేశంలోనిఇ నగరాల్లో పిల్లలను పెంచడం తలకు మించిన భారమని నాకు తెలియదు' అని ఝువేరీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. **- సాక్షి, స్పెషల్ డెస్క్**

నెలకు రూ.లక్షకు పైగానే

ఏదైనా ఒక ఇంటర్నేషన్ స్కూల్‌లో ట్యూషన్ ఫీజు ఏడాదికి ఒకరికి రూ.7 నుండి 8 లక్షల మధ్య ఉందని, ఇక యూనిఫారాలు, పుస్తకాలు, ప్రైవేట్ ట్యూషన్లు, చదువుకు సంబంధించిన ఇతర ఖర్చులన్నీ కలిపితే – సంవత్సరానికి మరో రూ. 2 నుండి 4 లక్షల వరకు అవుతుందని అంకుర్ ఝువేరీ పేర్కొన్నారు. ఒక విద్యా సంవత్సరానికి మొత్తం ఖర్చు దాదాపుగా రూ.12 లక్షలు అవుతోందని చెప్పారు. ఝువేరీ మరికొన్ని ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఈ రూ.12 లక్షలకు అదనంగా కోచింగ్ / పాఠ్యేతర కార్యకలాపాలు, దుస్తులు, పుట్టినరోజు పార్టీలు, హాలిడే ఖర్చులు మొదలైనవి కూడా నెలకు రూ.8000–10,000 (ఏడాదికి రూ.1 లక్ష) చొప్పున కలిపితే, మొత్తం వార్షిక వ్యయం రూ.13 లక్షలు అవుతుందని తన పోస్టులో అంచనా కట్టారు.

ఆర్థిక భారానికి సిద్ధం

ఈ లెక్కలన్నీ కూడా తన పైపై అంచనాలు మాత్రమే అని అంగీకరిస్తూ, 'నేనింకా ఏమైనా మిస్ అయ్యానేమో తల్లిదండ్రులు చెప్పాలి' అని ఝువేరీ నెటిజనుల అభిప్రాయాన్ని కోరారు. తన పోస్టుపై వ్యతిరేకత వ్యక్తం అవుతుందేమోనని భావించిన ఝువేరీ, ''కొంతమంది ఐ.సి.ఎస్.ఇ. పాఠశాలలు తక్కువ ఫీజులు వసూలు చేస్తున్నాయి, పిల్లల్ని అక్కడ చేర్చవచ్చు కదా?' అని అనొచ్చు. ఇక్కడ నేను రెండు విషయాలను తీసుకుని ఈ లెక్కలు వేశాను. అవి, ఒకటి : ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి చదువును అందించాలని కోరుకుంటారు. రెండు : ఐ.సి.ఎస్.ఇ. పాఠశాలల్లో ప్రవేశం దొరకటం చాలా కష్టం' అని ఝువేరీ వివరించారు.

సామాజిక ఒత్తిడీ కారణం!

ఝువేరీ పెట్టిన పోస్టుపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. కొంత మంది ఆయనతో ఏకీభవించారు. మరికొంత మంది విభేదించారు. ఖరీదైన పాఠశాలలు కావాలనుకున్నప్పుడే ఇంత ఖర్చు అవుతుంది అని కొందరు వాదించారు. ఒక నెట్ యూజర్ 'బ్రాండెడ్ స్కూళ్లలో అంతేగా' అని కామెంట్ చేశారు. మరొకరు.. పిల్లల చదువు విషయమై తల్లిదండ్రుల మీద ఉండే సామాజిక ఒత్తిడి గురించి మాట్లాడారు. తమ పిల్లలు ఎక్కడ వెనుకబడి పోతారోనన్న భయంతో తల్లిదండ్రులు కష్టమో, నష్టమో తలకు మించిన ఆర్థిక భారానికి సిద్ధమౌతారు, ప్రైవేటు స్కూళ్లు చెప్పే ఫీజులు కడతారు అని చెప్పారు. ఒక నెటిజెన్ ఝువేరీ పోస్టుతో పూర్తిగా విభేదించారు. 'సెలబ్రిటీల పిల్లలు చదివే స్కూళ్లలో మీ పిల్లల్ని ఎవరు చదివించమన్నారు?' అని విమర్శించారు. ఐ.సి.ఎస్.ఇ., సి.బి.ఎస్.ఇ., ఐ.జి.సి.ఎస్.ఇ. పాఠశాలల్లో సీటు తెచ్చుకోగలిగితే తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను పిల్లలకు అందివ్వవచ్చు అని కొందరు అన్నారు.

దత్తతలో నకిలీ సర్టిఫికెట్ల దందా

వయసు ధ్రువీకరణకు పిల్లలు లేని దంపతుల అడ్డదారులు
- ఎక్కువ వయసున్నా తక్కువ ఉండేలా ప్రణాళిక
- ప్రైవేట్ పాఠశాలల పేర్ల మీద డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ల దందా
- వరంగల్ జిల్లా కేంద్రంగా 'కారా'నిబంధనలకు నీళ్లు



నర్సంపేటలోని శ్రీ అరుణోదయ విద్యాలయం జారీ చేసిన నకిలీ స్టడీ, కండక్ట్ అండ్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లు



ఓ వివాహితకు వివేకానంద పబ్లిక్ స్కూల్ పేరుతో జారీ చేసిన నకిలీ రికార్డు షీట్

సాక్షి, వరంగల్ : దత్తత ప్రక్రియలో కొందరు బాలల సంరక్షణ విభాగాధికారులు దందాకు తెర లేపారన్న ఆరోపణలున్నాయి. తక్కువ వయసున్న పిల్లల కోసం..కొందరు దంపతులు తమ వయసును తక్కువగా చూపించేందుకు కొన్ని స్కూళ్ల నుంచి స్టడీ, కండక్ట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. కొందరైతే చదువుకోకున్నా, స్టడీ సరిఫికెట్లు తీసుకున్న ఘటనలు కూడా వెలుగుచూశాయి. తెర వెనుక ఉండి కొందరు అధికారులు ఈ తతంగాన్ని నడిపించనట్టు తెలుస్తోంది. వాస్తవానికి నిరక్షరాస్యులకు వయసు ధ్రువీకరణ పత్రం ప్రభుత్వామోదిత వైద్యుడి వద్ద ఓసిఫికేషన్ పరీక్ష నివేదిక ఆధారంగా తీసుకోవచ్చు. లేదంటే పాన్‌కార్డులోని పుట్టిన తేదీ ఉంటే సరిపోతుంది. అయితే ఎక్కువ వయసున్న దంపతులకు తక్కువ వయసు పిల్లలను దత్తత ఇచ్చే అవకాశం లేదని అధికారులే 'మామూలు'గా మాట్లాడతారు. కొందరు ప్రైవేట్ పాఠశాలల యజమానులతో కుమ్మక్కై సర్టిఫికెట్లను తీసుకొచ్చి వాటినే ఒరిజినల్‌గా చూపిస్తూ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాస్తవానికి దంపతులిద్దరి వయసు కలిపి 85 ఏళ్లుంటే రెండేళ్లలోపు పిల్లలు, 90 ఏళ్లుంటే రెండేళ్ల నుంచి నాలుగేళ్లలోపు, 100 ఏళ్లుంటే నాలుగు నుంచి ఎనిమిదేళ్లలోపు పిల్లలు, 110 ఏళ్లుంటే ఎనిమిది నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను దత్తత ఇస్తారు. ఈ నేపథ్యంలో నకిలీ సర్టిఫికెట్ల తీసుకొని దందాకు తెరలేపారు. ఇలా చేసి పిల్లల జీవితాల్ని ఇరకాటంలోకి నెడుతున్నారు. ఎందుకంటే పిల్లలు పదో తరగతి చదువుకునే సమయంలో తల్లిదండ్రులు వృద్ధాప్య దశలోకి రావడం.. పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపుతోంది.

వరంగల్ కేంద్రంగా...

వరంగల్ జిల్లా కేంద్రంగా 2022లో దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న దంపతులిచ్చిన పత్రాల్లో ఈ నకిలీల బాగోతం బయటకు వచ్చింది. గత నెలలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ విభాగ ఉన్నతాధికారి దత్తతకు సంబంధించి హోంస్టడీ రిపోర్టులను సమీక్షించాలని చెప్పడం, దరఖాస్తు చేసుకున్నవారు రెన్యూవల్‌కు వచ్చిన సందర్భంలో నకిలీ సర్టిఫికెట్ల అంశం అధికారుల దృష్టికి వచ్చింది. అయినా చర్యలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల దర్యాప్తునకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

నర్సంపేట నుంచే నకిలీ సర్టిఫికెట్లు

- వరంగల్ జిల్లాలోని నర్సంపేట కేంద్రంగా శ్రీఅరుణోదయ విద్యాలయం, అరుణోదయ విద్యాలయం, ఏకశిల హైస్కూల్ పేర్లతో రెండు దశాబ్దాల క్రితం ఒకటి, రెండు, మూడో తరగతి చదువుకున్నారంటూ కొందరు పిల్లలు లేని దంపతులకు నకిలీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. పిల్లలు లేని భార్యాభర్తలిద్దరూ చదువుకోకపోయినా, ఒకటే పాఠశాలలో చదివినట్టుగా సరిఫ్టికెట్ ఇవ్వడం, ఇద్దరూ వేర్వేరు ప్రాంతాలకు చెందినవారైనా, రెండు దశాబ్దాల క్రితం ఒకటే పాఠశాలలో చదివినట్టుగా ఇవ్వడం వివాదాస్పదమవుతోంది. అసలు వారు చదువుకున్న సమయంలో ఆ పాఠశాలలు లేకపోవడం గమనార్హం.
- పర్వతగిరి మండలం చింతనెక్కొండలోని వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో ఒకరు చదవుకున్నా చదివినట్టుగా పాఠశాల పేరుతో నకిలీ స్కూల్ రికార్డు షీట్ తీసుకున్నారని ఆ పాఠశాల నిర్వాహకుడు బి.సాంబయ్య లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చారు.
- దత్తతకు వచ్చిన చాలామంది దంపతులు నర్సంపేటలోని పాఠశాలల నుంచే ఈ సరిఫికెట్లు తేవడంతో దీని వెనుక బడా నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర జిల్లాలకు చెందిన వారు సైతం ఇక్కడే చదువుకున్నట్టుగా సర్టిఫికెట్లు తీసుకెళ్లారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

సాగర్ కుడి కాల్వ మా అధీనంలోనే..

- ప్రాజెక్టు కుడివైపు భద్రత మేమే చూసుకుంటాం
- ఎస్పీఎఫ్ డీజీపీకి ఏపీ ప్రభుత్వం స్పష్టీకరణ

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు కుడివైపు (కృష్ణానదికి ఆవలివైపు) ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉన్న ఆనకట్ట, కుడి కాల్వ తమ అధీనంలోనే ఉండాలని, కుడికాల్వ గేట్లను తామే నిర్వహించుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ ఎస్పీఎఫ్ (ప్రత్యేక రక్షణ దళం) డీజీపీకి లేఖ ఇచ్చినట్టు తెలిసింది. నాగార్జునసాగర్ డ్యాంపై ఏపీ వైపు ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారాలో ఉన్నాయి. తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ బలగాలు డ్యాం భద్రతను ఉపసంహరించుకొని ఏప్రిల్‌లో వెళ్లిపోయాయి. ఇరు రాష్ట్రాల మధ్య కేఆర్ఎంబీ సమక్షంలో గతంలో జరిగిన సమావేశంలో.. ఏపీ వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు జూన్ నెలాఖరులోగా వెళ్లిపోతాయని ఏపీ ప్రభుత్వం చెప్పింది. వాస్తవంగా సీఆర్‌పీఎఫ్ బలగాలు వెళ్లిపోగానే సాగర్ డ్యాం మొత్తం తెలంగాణకు చెందిన ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) పర్యవేక్షణలో ఉంటుంది. అయితే, ఏపీ వైపు సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉపసంహరించుకోగానే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీఎఫ్ డీజీపీకి లేఖ ఇచ్చినట్టు తెలిసింది. సొంత బలగాల ఏర్పాటుతో పాటు కుడి కాల్వ గేట్లను తామే నిర్వహించుకుంటామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణారివర్ బోర్డుకు కూడా తెలిపింది. దీని ప్రకారం నాగార్జునసాగర్ కుడివైపున గల ప్రాజెక్టు భూభాగం పూర్తిగా తమ (ఏపీ)అధీనంలోనే ఉండాలని, కుడి కాల్వ గేట్లపై తెలంగాణ ప్రభుత్వ సాగునీటి అధికారుల అజమాయిషీ ఉండరాదని చెప్పకనే చెప్పినట్లు అయ్యింది.



సాగర్‌డ్యాంపై ఏపీ వైపు ప్రస్తుతం ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు



రామప్ప రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న జస్టిస్ ఘోష్ దంపతులు

రామప్ప శిల్పాకళాసంపద అద్భుతం

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిటీ చైర్మన్ ఘోష్

వెంకటాపురం(ఎం): రామప్ప శిల్పాకళా సంపద అద్భుతంగా ఉందని కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశంసించారు. గురువారం ములుగు జిల్లా వెంకటాపురం(ఎం)మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఘోష్ దంపతులు సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి పూజలు చేసిన అనంతరం.. వారికి ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. రామప్ప గుడి బాగుందని, ఆలయం మరింత అభివృద్ధి చెందాలని జస్టిస్ పీసీ ఘోష్ ఆకాంక్షించారు.

పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

చిల్లకూరు: చెన్నై నుంచి విజయవాడ వెళ్తున్న పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం 4.10 గంటలకు తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఓడూరు రైల్వేస్టేషన్‌కు అతి సమీపంలో ట్రాక్‌పై ఆవులు అడ్డుగా రావడంతో పినాకిని ఎక్స్‌ప్రెస్ వాటిని ఢీకొంది. దీంతో రైలు చక్రాల బ్రేక్‌లు పట్టేసి సాంకేతిక లోపం ఏర్పడింది. రైలు అక్కడికక్కడే నిలిచిపోవడంతో లోకో పైలట్ గూడూరు రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సాంకేతిక సిబ్బంది ఓడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుని మరమ్మతులు చేపట్టిన అనంతరం రైలు గూడూరు స్టేషన్‌కు చేరుకుంది. అనంతరం గూడూరులో రైలును క్షుణ్ణంగా పరిశీలించి రైలును విజయవాడకు పంపారు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



డాక్టర్ వివేక్ సహకారంతో నిర్మించిన ఇల్లు

ఇందిరమ్మ ఇల్లు రాలేదు.. దాత కట్టించాడు

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం హూన్యాతండాలో ఓ పేద గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు రాకపోవటంతో, ఓ దాత పెద్ద మనసుతో సొంత ఖర్చులతో ఇల్లు నిర్మించి ఇచ్చాడు. హూన్యాతండాకు చెందిన వృద్ధ దంపతులు భూక్యా దేవా, కిమినితోపాటు వారి కుమారుడు రవి, అతడి ఇద్దరు పిల్లలు పూరి గుడిసెలో నివసిస్తున్నా రు. రవి పేరిట ఇందిరమ్మ ఇల్లుకోసం దరఖాస్తు చేసుకున్నా.. రేషన్ కార్డు అతడి పేరుపై లేకపోవటంతో ఇల్లు మంజూరు కాలేదు. కొద్ది రోజుల క్రితం హూన్యాతండాలో పర్యటించిన కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్.. ఆ కుటుంబం దీనస్థితిని చూసి చలించిపోయారు. సుమారు రూ.1.5 లక్షలతో ఆ కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చారు. గురు వారం డాక్టర్ వివేక్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని దేవా దంపతులతో కలిసి ఇంటిని ప్రారంభించారు.

బాపు పట్టుదల.. బడికి పునరుజ్జీవం!

నారపునేనిపల్లి పాఠశాలలో పది మంది చేరిక • బ్రాండ్ అంబాసిడర్‌గా 'ఒకే ఒక్క విద్యార్థి' కీర్తన

వైరా రూరల్: ఖమ్మం జిల్లా వైరా మండలంలోని నారపునేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల మళ్లీ గాడిలో పడింది. గతేడాది స్కూల్ మొత్తంలో నాలుగో తరగతి చదివే కీర్తన అనే ఒకే విద్యార్థిని ఉండగా, అధికారులు పాఠశాలను మూసివేయాలని నిర్ణయించారు. కానీ కీర్తన తండ్రి అనిల్‌శర్మ పాఠశాలను మూసివేస్తే తన కుమార్తె చదువు మాన్పిస్తానని పట్టుబట్టడంతో కొనసాగించారు. ఈ విషయంపై ఈ ఏడాది మార్చి 23వ తేదీన 'సాక్షి'దినపత్రిక ప్రధాన సంచికలో 'బడిని బతికించిన బాపు'శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.6 లక్షలతో పాఠశాలలో సకల వసతులు కల్పించారు. బడిబాట ద్వారా ప్రచారం చేయటంతో ఈసారి పది మంది పిల్లలు చేరారు. రూ.లక్ష వ్యయంతో 'వుయ్ కెన్ లెర్న్'పేరిట ఇంగ్లిష్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. పాఠశాల మూతపడకుండా కొనసాగటానికి కారణమైన కీర్తనను స్కూల్‌కు ప్రచారకర్తగా ఎంపిక చేసి, ఆమె ఫొటో పాఠశాల గోడపై ఆకట్టుకునేలా అతికించారు.



తొలిరోజు ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు

క్యాంపెయినింగ్‌కు దక్కిన ఫలితం..

బడిబాటలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పాఠశాలలో విద్య, ఇతర వసతులపై అవగాహన కల్పించాం. దీంతో తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించారు. **- ఉమాపార్వతి, ఉపాధ్యాయురాలు, నారపునేనిపల్లి యూపీఎస్**

స్నేహితులు వచ్చారు..



గతేడాది బడిలో నేను మాత్రమే ఉండేదాన్ని. మా నాన్న ఉదయం దింపి తిరిగి తీసుకెళ్లే వారు. ఈ ఏడాది మరికొంత మంది చేరడంతో నాకు స్నేహితులు దొరికారు. **- నందిగామ కీర్తన, 5వ తరగతి**

పిల్లల డ్రెస్సు సారేస్తే..



రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్ గురువారం విద్యార్థుల్లో విద్యార్థిగా మారిపోయారు. స్కూల్ యూనిఫాం వేసుకొని పిల్లలతో కలిసి పాఠశాలకు వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - ఇబ్రహీంపట్నం రూరల్

బడిబుడి అడుగులు



హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రవేశ ద్వారాన్ని మామిడాకుల తోరణాలతో అలంకరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆనందోత్సాహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రతీచోట తొలి రోజు హడావిడి కనిపించింది. విద్యార్థులకు.. స్థానిక నేతలు, విద్యాశాఖ అధికారులు స్వాగతం పలికారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో స్వాగత బ్యానర్లు, పోస్టర్లు వెలిశాయి. యాభైరోజుల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం కనిపించింది. అన్నిచోట్ల తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. మొత్తంగా 50 లక్షల పాఠ్యపుస్తకాలు, 20 లక్షల యూనిఫాం అందజేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజే పుస్తకాలు, యూనిఫాం అందించాలని సీఎం కార్యాలయం అన్ని జిల్లా లకు ఆదేశాలు ఇచ్చింది. పంపిణీ కార్యక్రమాలపై సీఎంవో వివరాలు తెప్పించుకుంది. కొన్ని జిల్లాల్లో పుస్తకాల పంపిణీ ఆలస్యమవ్వడం, మరికొన్ని చోట్ల అందరికీ అందుబాటులో యూనిఫాం లేకపోవడంతో పంపిణీ జరగలేదు. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పాఠశాలలు

పాఠశాలలను తెరిచే నాటికే.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,852 ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల పాఠశాలలకు 1,01,66,220 పుస్తకాలు చేరాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. తొలిరోజు పాఠశాలలకు 8,33,398 లక్షల మంది హాజరయ్యారని, వీరిలో 54,52,708 మందికి పుస్తకాలు అందించామని సీఎంవో పేర్కొంది. ఈ ఏడాది మొత్తం 20,30,667 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి రోజు పాఠశాలలకు హాజరైన 8,33,398 విద్యార్థులకు ఒక జత యూనిఫాంలను ఉపాధ్యాయులు అందజేశారు. రెండో జత త్వరలో అందిస్తామని విద్యాశాఖ తెలిపింది. ఈ ఏడాది నుంచి పాఠశా లల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఒక సబ్జెక్టుగా బోధిస్తారు. దీనికి సంబంధించిన పుస్తకాలను కూడా విద్యార్థులకు అందజేశారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో తొలి రోజు విద్యార్థుల హాజరు తక్కువగా నమోదైంది.

విద్యావాహిని ప్రచార రథంగా సొంత వాహనం

చొప్పదండి ఎమ్మెల్యే సత్యం నిర్ణయం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎంఈవో తదితరులు

కరీంనగర్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. తన సొంత వాహనాన్ని బడిబాట విద్యావాహిని ప్రచార రథంగా మార్చారు. గంగాధర మండలం మల్లాపూర్‌లో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో.. వాహనాన్ని ఎంఈవో ప్రభాకర్‌రావు, ఆరు మండలాల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లా డుతూ.. చొప్పదండి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాలల్లో సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. రాష్ట్రంలోనే వినూత్నంగా.. సొంత వాహనాన్ని బడిబాటలో విద్యావాహిని వాహనంగా వినియోగించడానికి అప్పగించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను నియోజకవర్గ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సాక్షి వద్దకే న్యాయమూర్తి




కొడంగల్ రూరల్: వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో కోర్టు హాల్‌లోకి అడుగు పెట్ట లేని సాక్షి వద్దకు.. స్వయంగా న్యాయమూర్తే వెళ్లి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ కోర్టు ఆవర ణలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. ఒక కేసులో సాక్షిగా ఉన్న చాకలి అంజిలప్ప సాక్ష్యం చెప్పేందుకు ఆటోలో కోర్టు కు వచ్చారు. ఆయన హాల్‌లోకి రాలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న కొడంగల్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి శ్రీరామ్ బయటికొచ్చారు. ఆటోలో ఉన్న అంజిలప్ప వద్దకు చేరుకుని వాంగ్మూలం నమోదు చేశారు. ఆయన వెంట పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభినయ్ ఉన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



ఆలయంలోని రామలింగేశ్వరస్వామి



ఆలయం వద్ద కల్పవృక్షం

కాశీ తర్వాత కందూరే!

దక్షిణకాశీగా వెలుగొందుతున్న రామలింగేశ్వరాలయం

ఇక్కడ కొలువైన 27 కల్పవృక్షాలే ప్రత్యేకం

11వ శతాబ్దంలో ఆలయ నిర్మాణం

హోలీ పౌర్ణమి నుంచి ఉగాది వరకు ఉత్సవాలు

అడ్డాకుల: కందూరు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే కాశీవిశ్వేశ్వరుడిని దర్శించుకున్నంత పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఇక్కడ కల్ప వృక్షాలు ఉండటమే ఇందుకు ప్రత్యేక కారణం. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అడ్డాకుల మండలం కందూరు సమీపంలోని రామలింగేశ్వరాలయం దక్షిణ కాశీగా వెలుగొందుతోంది. కాశీ తర్వాత కల్ప వృక్షాలు ఇక్కడే ఉన్నాయని పురాణం చెబుతోంది. ఈ కల్ప వృక్షాలకు ఓ ప్రత్యేకత ఉంది. వృక్షాల కింద వంటలు చేసి, అందులో కొంత ఇతరులకు దానం చేసి కల్పవృక్షాల కిందే భోజనాలు చేసి నిద్రిస్తే కోరిన కోర్కెలు, గృహబాధలు, రోగాల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

కల్పవృక్షాలు ఉండటమే ప్రత్యేకత

కల్పవృక్షాలు (కబంధ) కాశీ తర్వాత కందూరులోనే కొలువయ్యాయని చరిత్ర చెబుతోంది. 11వ శతాబ్దంలో కాకతీయుల వంశానికి చెందిన ప్రతాపరుద్రుడు ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రలో ఉంది. ఈ ఆలయం వద్ద ఓ విశిష్టత ఉంది. ఆలయం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ 27 కల్పవృక్షాలు ఉండటమే ప్రత్యేకత. ఆకాశంలో ఉండే 27 నక్షత్రాలకు ప్రతీకగా ఆలయం పక్కనున్న కోనేరు చుట్టూ 27 కల్పవృక్షాలు ఉన్నాయి. చాలామంది ఆలయం వద్ద ఉన్న కల్పవృక్షాల వేర్లను తీసుకెళ్లి నాటినా అవి పెరగలేదు. ఆలయం వెలిసిన నాటి నుంచి ఇక్కడ 27 కల్పవృక్షాలే ఉండటం అరుదైన విశేషంగా భక్తులు భావిస్తారు. అందుకే కందూరుకు వెళ్తే కాశీకి వెళ్లినంత పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. ఆలయ ప్రచారకర్తగా ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి వ్యవహరిస్తున్నారు.

తంబళి వంశ మహిళతో..

కందూరు సమీపంలోని గుట్టపై పూర్వం రామలింగేశ్వర స్వామి ఆలయం ఉండేది. గుట్టపై కొలువైన రామలింగేశ్వరుడిని తంబళి వంశానికి చెందిన మహిళ రోజూ గుట్టపైకి ఎక్కి దర్శించుకునేది. కాలక్రమేణా ఆమె గర్భిణి కావడంతో రోజూ గుట్ట ఎక్కడం ఆమె వల్ల కాలేదు. ప్రతిరోజు గుట్ట ఎక్కి మిమ్మల్ని దర్శించుకోవడం నావల్ల కాదు.. మళ్లీ ఎప్పుడు దర్శించుకుంటానో ఏమోనని స్వామితో మొరపెట్టుకుంది. వెంటనే అక్కడ ప్రత్యక్షమైన రామలింగేశ్వర స్వామి నీవు రాలేకుంటే నేనే నీవెంట వస్తాను.. వెనుదిరిగి చూడకుండా గుట్ట దిగి వెళ్లు అని ఆమెతో చెప్పాడు. వెంటనే ఆ మహిళ గుట్ట దిగడం ఆరంభించింది. రథంపై రామలింగేశ్వరస్వామి గుట్ట దిగుతున్న సమయంలో రథచక్రాలు, గంటల శబ్దాలకు ఆమె భయపడి వెనుదిరిగి చూసింది. దీంతో రథచక్రాలు విరిగి ఒకటి కోనేరులో పడిపోయింది. రెండోది లింగాకృతి దాల్చి రామలింగేశ్వరుడి పీఠంగా ఏర్పడిందని ఆలయ చరిత్ర చెబుతోంది. ఆ మహిళ శిలగా రూపాంతరం చెందింది. ఆమె శిలా విగ్రహం నేటికీ గర్భగుడిలో ఉంది. ప్రస్తుతం స్వామివారికి పానవట్టం లేదు. రథచక్రమే పానవట్టంగా మారడమే ఈ క్షేత్ర మహిమ.



క్షేత్రంలోని ఆలయాలు


దండకారణ్యంపై పట్టు సడలొద్దని!

పోలీస్ నిర్బంధాన్ని ఎదుర్కొనేందుకు మావోయిస్టుల వ్యూహం

ఇతర ప్రాంతాల నుంచి బస్తర్‌కు వస్తున్న అగ్రనేతలు

ప్రతీకార చర్యలు, పార్టీ బలోపేతానికి యత్నాలు ?

మావోల వ్యూహాలకు చెక్ పెట్టే పనిలో పోలీసులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే..దండకారణ్యంపై పట్టు సడలకుండా ఉండేందుకు మావోయిస్టులు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడాదిన్నరగా మావోయిస్టులు బస్తర్ పరిధిలోకి వచ్చే దండకారణ్యం, ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియా, అబూజ్‌మడ్ అడవుల్లో క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత 409 మందికి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా.. లొంగిపోయిన/అరెస్టయిన వారు మరో 1,200 మందికి పైగా ఉన్నారు. పోలీసుల చేతిలో హతమైన వారిలో కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు చలపతి, ప్రయాగ్‌మాంజీ, సుధాకర్ వంటి అగ్రనేతలు ఉన్నారు. ఇంతకు రెట్టింపు సంఖ్యలో డివిజన్ కమిటీ సభ్యులు చనిపోయారు. దీంతో మావోయిస్టు పార్టీ మరో ఆరేడు నెలల్లో తన ఉనికిని కోల్పోతుందనే ప్రచారం జరిగింది. మరోవైపు ఈ ఏడాది మార్చి 28న శాంతి చర్చల ప్రతిపాదనను మావోయిస్టులు తెర మీదకు తెచ్చారు.

బస్తర్‌కు తిరిగి రండి..!

వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు/అరెస్టులతో కేడర్‌ను మావోయిస్టులు చాలా వరకు నష్టపోయారు. మరోవైపు శాంతి చర్చల ప్రతిపాదనపై కేంద్రం, ఛత్తీస్‌గఢ్ సర్కార్ నుంచి సానుకూల ప్రకటన రావడం లేదు. దీంతో బస్తర్ అడవుల్లో తమ పట్టు కోల్పోకుండా ఉండేందుకు మావోయిస్టులు ప్రణాళిక సిద్ధం చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆంధ్రా–ఒడిశా బోర్డర్ (ఏఓబీ), ఎంఎంసీ (మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్), కేకేటీ (కర్ణాటక, కేరళ, తమిళనాడు) ప్రాంతాల్లో పనిచేస్తున్న అగ్రనేతలను బస్తర్‌కు తిరిగి రావాలని మావోయిస్టు పార్టీ కోరినట్టు తెలుస్తోంది. పార్టీ నిర్మాణం, సాయుధ పోరాటం, గెరిల్లా వార్‌ఫేర్‌లో నిపుణులైన సీనియర్ నాయకులు రంగంలోకి దిగితే సానుభూతిపరులు, పార్టీ కేడర్‌లో ఆత్మ విశ్వాసం పెంచొచ్చని ఆ పార్టీ అంచనా వేస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

కొత్తగా ఏడుగురు ఐపీఎస్‌లు

వానాకాలం రావడంతో బస్తర్ అడవులు చిక్కబడ్డాయి. డ్రోన్ల సాయంతో కూంబింగ్ చేయడం సైతం భద్రతా దళాలకు కష్టంగా మారే పరిస్థితి వచ్చింది. అయినా మావోయిస్టులపై నిర్బంధం కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా మావోయిస్టు ప్రభావిత జిల్లాలైన సుక్మా, బీజాపూర్, దంతేవాడ, నారాయణపూర్‌లో కొత్తగా ఏడుగురు ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. 2021 బ్యాచ్‌కు చెందిన ఈ యువ అధికారులకు నక్సల్స్‌ను తుదముట్టించే బాధ్యతలు అప్పగించింది. కొత్తగా వచ్చిన అధికారులతో ఈ నాలుగు జిల్లాల పరిధిలో యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్న ఐపీఎస్‌ల సంఖ్య 20కి చేరుకుంది.

ఊహించని దాడి..

ఏఓబీ నుంచి కొందరు కీలక నేతలు ఇప్పటికే దండకారణ్యానికి చేరుకున్నట్టు సమాచారం. ఈ సందేహాలకు బలం చేకూర్చేలా పువర్తిలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌నకు సమీపంలో ఒక వ్యక్తిని ఇటీవల మావోయిస్టులు హత్య చేశారు. అంతటితో ఆగకుండా రాష్ట్ర సరిహద్దులో ఉన్న కుంట మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో భద్రాచలం–జగ్‌దల్‌పూర్ జాతీయ రహదారి నుంచి కేవలం 400 మీటర్ల సమీపంలో ఐఈడీ పేల్చి ఏఎస్పీ స్థాయి అధికారిని హతమార్చారు. తీవ్ర నిర్బంధం నడుమ వరుసగా రెండు రోజుల పాటు భద్రతా దళాల కన్నుగప్పి దాడులు నిర్వహించి ఈ ప్రాంతంపై తమకున్న పట్టు ఏంటో మావోలు తెలియజేసినట్టయ్యింది. అయితే ఈ రెండు ఘటనలపై మావోయిస్టుల నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు.

దర్యాప్తు స్టేటస్ రిపోర్టు సమర్పించండి

మోహన్‌బాబు పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీసులు దాఖలు చేసిన కేసులో దర్యాప్తు స్టేటస్ రిపోర్టు సమర్పించాలని హైకోర్టు.. పోలీసులను ఆదేశించింది. డీఫ్యాక్టో కంప్లైనెంట్ (ఫిర్యాదుదారు) రంజిత్‌కుమార్‌కు రెండు రోజుల్లో నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ఆవరణలో మీడియా ప్రతినిధిపై దాడి కేసులో పహాడీషరీఫ్ పోలీసులు తొలుత పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయసలహాలు తీసుకున్న తర్వాత హత్యాయత్నం సెక్షన్ జోడించారు. ఈ క్రమంలో ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ మోహన్‌బాబు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తాము డీఫ్యాక్టో కంప్లైనెంట్‌కు నోటీసులు పంపినా వెనక్కి తిరిగి వస్తున్నాయన్నారు. దీంతో న్యాయమూర్తి నోటీసులు పంపే బాధ్యతను దర్యాప్తు అధికారికి అప్పగిస్తూ.. విచారణను వాయిదా వేశారు.

కమాన్‌పూర్ పెద్దచెరువు వద్ద చెట్లపై పక్షులు



పొద్దంతా చెరువులు, కుంటలు తిరిగి ఆహారం సేకరించిన పక్షులు.. సాయం సంధ్య వేళ గూటికి చేరాయి. చెట్ల నిండా సందడి చేశాయి. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెద్దచెరువు వద్ద కనిపించిన మనోహర దృశ్యమిది.

– కమాన్‌పూర్(మంథని)

కుంటిసాకులు చెబుతూ తప్పించుకోలేరు

- అనధికార భవనం కూల్చివేతపై చర్యలు తీసుకోండి
- నల్లగొండ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: అనధికారిక భవనం కూల్చివేతపై కుంటిసాకులు చెబుతూ తప్పించుకోలేరని అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నల్లగొండ గొల్లగూడలోని ఆ భవనానికి వెంటనే విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత కూల్చివేత పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు తేల్చి చెప్పింది. తదుపరి విచారణ జూలై 3కు వాయిదా వేస్తూ.. ఆ లోగా కార్యక్రమం పూర్తి చేయాలని చెప్పింది. విద్యుత్, నీటి సరఫరా నిలిపివేసిన తర్వాత అంతటితో ఆగి.. కూల్చివేత పనులు చేపట్టకుంటే పక్క ఇంటి నుంచి వసతులు పొందే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. నల్లగొండ మున్సిపాలిటీ కమిషనర్ 2022లోనే కూల్చివేతకు ఉత్తర్వులు జారీ చేసినా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీఎండీఏ), నల్లగొండ జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీలు) అమలు చేయడం లేదంటూ గొల్లగూడకు చెందిన కె.రాములమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గొల్లగూడలో జి.రవికుమార్ చేపట్టిన అనధికార నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి, ఇకపై ఎటువంటి నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. కూల్చివేత ఉత్తర్వులు ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. విద్యుత్, నీటి సరఫరా నిలిపివేతకు సంబంధిత అధికారులకు లేఖలు రాశామని, వారి నుంచి ఇంకా స్పందన రాలేదన్నారు. దీనిపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ఏం చేస్తున్నారని.. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. కూల్చివేతకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ.. విచారణ వాయిదా వేసింది.

స్పీకర్ ప్రసాద్‌తో యూపీ స్పీకర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను.. ఉత్తర ప్రదేశ్ శాసన సభ స్పీకర్ సతీష్ మహానా మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సతీష్ మహానా దంపతులు.. బంజారాహిల్స్‌లోని స్పీకర్ ప్రసాద్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ స్పీకర్ దంపతులను.. స్పీకర్ గడ్డం ప్రసాద్ సన్మానించి మెమెంటో బహూకరించారు. అనంతరం తెలంగాణ, ఉత్తరప్రదేశ్ శాసనసభల నిర్వహణపై ఇరువురు స్పీకర్లు మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు.

ప్రజలే బట్టలూడదీసి కొడతారు


ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ఆయన్ను ప్రజలే బట్టలూడదీసి కొడతారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. వెంకట్ గురువారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌కు ఉబలాటం ఎక్కువగా ఉందని, తన తప్పులకు జైలుకెళ్లే రోజు వస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని, జరిగిన తప్పులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కారని, ఎవరైనా కమిషన్ ముందు హాజరు కావాల్సిందేనన్నారు. కేటీఆర్ బేషరతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆనాడు నీతులు చెప్పిన కేటీఆర్ ఇప్పుడు.. సీఎంను పట్టుకుని తిట్టడంపై సమాధానమివ్వాలని కోరారు.

వీధిరౌడీల కన్నా హీనంగా కేటీఆర్ కామెంట్స్

టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వీధిరౌడీల కన్నా హీనంగా కేటీఆర్ కామెంట్స్ చేశారని పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం పోయిందన్న అక్కసు కేటీఆర్ మాటల్లో కనిపించిందని అన్నారు. రేవంత్‌రెడ్డి అంచెలంచెలుగా సీఎం స్థాయికి ఎదిగిన నేత అని, సీఎంపై అవాకులు చెవాకులు పేలితే నాలుక కోస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కాళేశ్వరం కూలిపోయిందని, ఆ ప్రాజెక్టు నీళ్లు లేకుండానే రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగైందని చెప్పారు. ప్రజలు స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెపుతారని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా నడిపిస్తున్నదన్నారు.

కేటీఆర్‌కు చెంపదెబ్బలు ఖాయం: చనగాని

కేటీఆర్ వ్యాఖ్యలు రోజురోజుకూ హద్దుమీరుతున్నాయని, సీఎంపై సమయం, సందర్భం లేని వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ హితవు పలికారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్ తీరు మారకపోతే కాంగ్రెస్ కార్యకర్తల నుంచి చెంపదెబ్బలు తప్పవని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్ అయినా, సామాన్య ప్రజలకైనా ఒకే చట్టం ఉంటుందని, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కమిషన్ నిర్ధారించిందని, అలాంటప్పుడు కమిషన్ ముందుకు హాజరు కావడానికి వారికి భయమెందుకని ఆయన ప్రశ్నించారు.

విమానంలో విద్యుత్

నడవడమే రాని మానవుడు నేడు పక్షిలా గాలిలో ఎగిరిపోయే సాధనాలను కనుగొని ఎక్కడికి అంటే అక్కడికి నిమిషాలు, గంటల్లోనే ప్రయాణిస్తున్నాడు. దేశ విదేశాల్లో విమానంలో చక్కర్లు కొడుతున్నాడు. ఆ విమానం నడవాలంటే మాత్రం ఇంధనంతో పాటు విద్యుత్ కూడా చాలా అవసరం. కానీ, అవే ఒక్కోసారి వందల ప్రాణాలు పోవడానికి కారణం అవుతున్నాయి. అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదం కూడా అలాంటిదే. ఈ దుర్ఘటనకు విమానంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా విఫలమవడం కారణం కావొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు విమానంలో విద్యుత్ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది..? ఎందుకు విఫలం అవుతుంది..? దానివల్ల జరిగిన ప్రమాదాలేంటి? అనే అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



సాక్షి, అమరావతి: విమానంలో ప్రధానంగా నాలుగు రకాల విద్యుత్ వ్యవస్థలు పనిచేస్తుంటాయి. వాటినే ప్రధాన, అత్యవసర, ద్వితీయ, సహాయక విద్యుత్ వ్యవస్థలుగా పిలుస్తుంటారు. వీటితో పాటు ఓవర్‌లోడ్, షార్ట్ సర్క్యూట్ వంటి ఆకస్మిక ప్రమాదాల నుంచి రక్షించేందుకు సర్క్యూట్ బ్రేకర్లను అమర్చుతారు. అత్యవసర సమయంలో వాడుకునేందుకు వీలుగా విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేస్తారు. నావిగేషన్, కమ్యూనికేషన్, నియంత్రణ, క్యాబిన్, కాక్‌పిట్ లైటింగ్, ఎయిర్ కండిషనింగ్, టీవీ, ఫ్యాన్లు వంటి కీలక పనులకు ఈ విద్యుత్ వ్యవస్థ ఉపయోగపడుతుంది. ఇది ఏమాత్రం విఫలమైనా విమానం కుప్పకూలే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. విమానంలో జనరేటర్లు లేదా ఆల్టర్నేటర్లు అనేవి ఉంటాయి. ఇవి ఇంజిన్‌తో నడుస్తూ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ప్రధాన ఇంజన్లు పని చేయనప్పుడు సహాయక విద్యుత్ యూనిట్ ఆదుకుంటుంది. రామ్ ఎయిర్ టర్బైన్ అనేది కొన్ని సందర్భాల్లో విద్యుత్ వనరుగా పనికొస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ రెక్టిఫయర్ యూనిట్లు కొన్ని వ్యవస్థల కోసం విద్యుత్‌ను అందిస్తుంటాయి. బ్యాటరీలు బ్యాకప్ పవర్ సోర్స్‌లుగా పనిచేస్తాయి. కాకపోతే ఈ వ్యవస్థ అన్ని విమానాల్లోనూ ఒకేలా ఉండదు. సింగిల్ ఇంజిన్ జనరల్ ఏవియేషన్ ఎయిర్‌క్రాఫ్ట్, ఆధునిక, బహుళ ఇంజిన్ కమర్షియల్ జెట్ ఎయిర్‌క్రాఫ్ట్ మధ్య విద్యుత్ వ్యవస్థ సామర్థ్యం, నిర్మాణంలో చాలా తేడా ఉంటుంది.

ముందే శిక్షణ ఇస్తారు..

విద్యుత్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా తగిన సూచనలను, శిక్షణను ముందే పైలట్‌లకు తెలియజేస్తారు. విద్యుత్ వ్యవస్థ వైఫల్యాన్ని సూచించడానికి ఒక అమ్మీటర్, లోడ్ మీటర్ లేదా హెచ్చరిక లైట్ ఉంటాయి. బలమైన రక్షణ వ్యవస్థ, పర్యవేక్షణ, వైఫల్య హెచ్చరిక నిబంధనలు విద్యుత్ వ్యవస్థలో ఉంటాయి. ఇవి ఎప్పటికప్పుడు తగిన సూచనలను పైలట్‌లకు అందజేస్తుంటాయి. స్టాండ్‌బై ఫ్లైట్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎయిర్‌క్రాఫ్ట్ ఎమర్జెన్సీ ఫ్లోర్ పాత్ ఇల్యూమినేషన్ వంటి భాగాలు వాటికి సొంత బ్యాకప్ విద్యుత్ ఉంటుంది. విద్యుత్ వ్యవస్థ పూర్తిగా విఫలమైనా కూడా ఇవి పనిచేస్తాయి. విమానంలో సర్క్యూట్ బ్రేకర్ విఫలమైనప్పుడు ఒకసారి మాత్రమే రీసెట్ చేయాలి. రెండోసారి చేయకూడదు. విద్యుత్ జనరేటర్లు, వైర్ల నుంచి పొగలు, మంటలు వస్తే విద్యుత్ ఐసోలేషన్ విధానాన్ని అనుసరించాలి. విమానాన్ని త్వరగా ల్యాండ్ చేయాలి. ఏమాత్రం ఆలస్యమైనా భారీ నష్టం సంభవిస్తుంది.

విద్యుత్ వ్యవస్థ విఫలంతో విమాన ప్రమాదాలు, దుర్ఘటనల్లో కొన్ని

- ఎండీ11 అనే స్విస్ ఎయిర్ విమానంలో విద్యుత్ అగ్నిప్రమాదం వల్ల కెనడా సమీపంలో 1998 సెప్టెంబర్ 2న అట్లాంటిక్ మహాసముద్రంలో కూలిపోయింది.
- 2010 ఆగస్టు 24న ఉత్తర సూడాన్‌లో ఖార్టూమ్ నుంచి బీరుట్ బయల్దేరిన ఏ321 ఎయిర్‌బస్‌లో జనరేటర్లు దెబ్బతిని విద్యుత్ వ్యవస్థ పనిచేయడం మానేసింది. 49 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.
- 2009 మార్చి 15న లండన్ హీత్రూ నుంచి ఎడిన్‌బర్గ్‌కు బయల్దేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఏ319 విమానంలో విద్యుత్ వైఫల్యం ఏర్పడి పైలట్లకు డిస్‌ప్లే కనిపించలేదు. పొగలు కూడా వచ్చాయి. దీంతో అత్యవసరంగా ల్యాండ్ చేశారు.
- 2008 సెప్టెంబరు 22న అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బి752 సియాటిల్ నుంచి న్యూయార్క్ వెళ్తుండగా విద్యుత్ సమస్య ఎదుర్కొంది. చికాగోలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ల్యాండింగ్ గేర్ దెబ్బతిన్నది. 192 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

క్లుప్తంగా...

'ఏసీడీ'ల్లో ట్రూ అప్ చార్జీలు వద్దు

డిస్కంలకు ఏపీఈఆర్‌సీ ఆదేశం

సాక్షి, అమరావతి: అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్ (ఏసీడీ)తో ట్రూ అప్ చార్జీలను కలిపి వేయవద్దని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) గురువారం ఆదేశించింది. పరిశ్రమలకు ఇకపై ఇచ్చే ఏసీడీ నోటీసుల్లో ట్రూ అప్ చార్జీలు ప్రస్తావించవద్దని డిస్కంలకు ఏపీఈఆర్‌సీ స్పష్టం చేసింది. ఈమేరకు ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ నుంచి వచ్చిన అభ్యంతరాలపై వివరణ ఇచ్చింది.

కృష్ణంరాజు ముందస్తు బెయిల్ పిటిషన్ మూసివేత

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి గురించి వ్యాఖ్యలు చేసినందుకు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సీనియర్ జర్నలిస్ట్ వీవీఆర్ కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు మూసివేసింది. కృష్ణంరాజు అరెస్టయిన నేపథ్యంలో ఆయన దాఖలు చేసిన వ్యాజ్యాన్ని నిరర్థకంగా తేల్చింది. అందువల్ల దానిని మూసివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోషకాహార మిషన్ అమలుకు కమిటీ

సాక్షి, అమరావతి : జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) స్కీం అమలుకోసం రాష్ట్రస్థాయిలో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటుచేస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మిషన్‌కు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మెంబర్ కమ్ డైరెక్టర్‌గా వ్యవసాయశాఖ కార్యదర్శి, మెంబర్ సెక్రటరీగా వ్యవసాయశాఖ డైరెక్టర్ వ్యవహరించనుండగా.. వివిధ శాఖల కార్యదర్శులతో పాటు ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, ఐసీఏఆర్ ప్రాజెక్టు డైరెక్టర్, నాబార్డు ప్రతినిధులను సభ్యులుగా నియమించారు. ఈ స్కీం అమలుకోసం వివిధ సంస్థల సహకారంతో సర్వేలు నిర్వహించి వార్షిక కార్యాచరణను రూపొందిస్తారు. రైతు సంఘాలు, ఎన్జీఓలు, ఎస్‌హెచ్‌జీ, ఎఫ్‌పీఓలు వంటి సంస్థల సహకారంతో ఈ స్కీంను అమలుచేయనున్నారు.

మిథున్‌రెడ్డి పిటిషన్ విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ మహేశ్వరరావు

త్వరగా విచారణకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీకి ఆదేశం

సాక్షి, అమరావతి: మద్యం విధానం వ్యవహారంలో సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ కుంచెం మహేశ్వరరావు తప్పుకున్నారు. ఈ వ్యాజ్యం ఫైలును ప్రధాన న్యాయమూర్తి ముందుంచి, సాధ్యమైనంత త్వరగా మరో న్యాయమూర్తి ముందు విచారణకు వచ్చేలా చూడాలని హైకోర్టు రిజిస్ట్రీని గురువారం ఆదేశించారు. అంతకు ముందు మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నాలుగు వారాలలో నిర్ణయం వెలువరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు.


ఇథియోపియాలో ఏపీ సాంకేతికత

అధ్యయనం చేసేందుకు వచ్చిన బృందం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న సమగ్ర డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ (ఏపీ ఏఐఎంఎస్-2.0)ను తమ దేశంలో కూడా అమలు చేయాలనే యోచనలో ఉన్నామని ఇథియోపియా వ్యవసాయ శాఖకు చెందిన డిజిటల్ అగ్రికల్చర్, ఫైనాన్స్ ప్రోగ్రాం డైరెక్టర్ గిరుమ్ కెటిమా టెక్లె చెప్పారు. ఇథియోపియా అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి బృందం ఏపీ వ్యవసాయ శాఖ చేపట్టిన ఆధునిక డిజిటల్ పథకాల అధ్యయనం కోసం గురువారం ఏపీకి వచ్చింది. ఏపీఏఐఎంఎస్ 2.0 సాంకేతికత, పనితీరుపై వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు ఇథియోపియా బృందానికి అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్‌తో సమావేశమై వ్యవసాయ శాఖలో జరుగుతున్న కార్యకలాపాలను ఇథియోపియా బృందం అడిగి తెలుసుకుంది.

రాజస్థాన్ ప్రథమం.. సిక్కిం అధమం

- చెట్ల సంఖ్యపై జాతీయ 2025 పర్యావరణ గణాంకాలు వెల్లడి
- తొమ్మిదో స్థానంలో ఆంధ్రప్రదేశ్
- 2019-22 మధ్యకాలంలో ఏపీలో చదరపు కిలో మీటర్‌కు పెరిగిన చెట్లు 93



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా చెట్ల సంఖ్య పెరుగుదలలో రాజస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. 2019-20లో చదరపు కిలోమీటరుకు 10363 చెట్లుండగా, 2021-22 నాటికి ఆ సంఖ్య 10841కు చేరింది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ నిలిచాయని జాతీయ పర్యావరణం-2025 తెలిపింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఈ నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2019-20తో పోల్చితే 2021-22 నాటికి 93 చెట్లు పెరిగినట్లు వివరించింది. అసోం, బీహార్, గోవా, గుజరాత్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మణిపూర్, మిజోరం, మేఘాలయ, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 2019-20తో పోల్చితే 2021-22లో చెట్ల సంఖ్య తగ్గిపోయినట్లు గణాంకాలు వెల్లడించాయి. తెలంగాణ 11వస్థానం సాధించింది. కాగా చెట్ల సంఖ్య పెరుగుదలలో సిక్కిం చివరిస్థానంలో నిలిచింది. 2019-20లో చదరపు కిలోమీటరుకు 51 చెట్లుండగా , 2021-22 నాటికి వాటి సంఖ్య 48కు తగ్గిందని నివేదిక వెల్లడించింది.

వివిధ రాష్ట్రాల్లో చదరపు కిలోమీటర్‌కు చెట్ల సంఖ్య ఇలా

రాష్ట్రం పేరు	2019-20	2021-22
రాజస్థాన్	10363	10841
ఉత్తరప్రదేశ్	8510	8951
మధ్యప్రదేశ్	8891	8650
కర్నాటక	8386	7779
గుజరాత్	6648	6632
ఛత్తీస్‌గఢ్	5836	6539
ఒడిశా	5757	6163
తమిళనాడు	5324	5371
ఆంధ్రప్రదేశ్	5247	5340
జార్ఖండ్	3409	3638
తెలంగాణ	3479	3518
పశ్చిమబెంగాల్	2963	2938
కేరళ	3026	2906
బిహార్	2623	2370
అసోం	2174	2101
హరియాణ	1552	1693
పంజాబ్	1298	1475
ఉత్తరాఖండ్	1202	1231
అరుణాచల్ ప్రదేశ్	1163	1202
హిమాచల్‌ప్రదేశ్	813	855
మేఘాలయ	775	721
మిజోరం	631	568
నాగాలాండ్	467	394
గోవా	260	258
త్రిపుర	253	248
మణిపూర్	217	210
ఢిల్లీ	171	176
సిక్కిం	51	48

వైపరీత్యం..పెరుగుతోంది ప్రాణ నష్టం

దేశంలో వైపరీత్యాలు ఏటికేటికీ పెరుగుతున్నాయి. ఇవి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి. భూకంపాలు, వరదలు, అకాల వర్షాలు, కొండ చరియలు విరిగిపడడం, సుడిగాలులు.. ఇలా జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. పులి మీద పుట్రలా ప్రజా జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇందుకు తాజాగా భారత ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలే నిదర్శనం.



- ప్రకృతి వైపరీత్యాల కారణంగా దేశంలో పెరిగిన మరణాలు
- 11 ఏళ్ల తర్వాత తొలిసారి 3,080 మంది మరణించినట్లు ఎన్వీస్టాట్స్ నివేదిక వెల్లడి
- ఏపీలో 56మంది మృతి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా మానవ మరణాల సంఖ్య గణనీయంగా ఉందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ తెలిపింది. తాజాగా విడుదల చేసిన ఎన్వీస్టాట్స్ ఇండియా-2025 (పర్యావరణ గణాంకాలు) నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. వరదలు, పిడుగుపాట్లు, వడగాడ్పులు, భారీ వర్షాలు వంటి వైపరీత్యాలతో 2024-25 ఏడాదిలో దేశంలో ఏకంగా 3,080 మంది మరణించినట్లు తెలిపింది. 2013-14 ఏడాదిలో సంభవించిన మానవ మరణాల తర్వాత అత్యధిక మరణాలు గత ఏడాదే సంభవించినట్లు పేర్కొంది.

నివేదికలో అంశాలివీ..

- గడిచిన 25ఏళ్లలో అంటే 2001-02 నుంచి చూస్తే అత్యధిక మరణాలు 2007-08లో 3,764, 2008-09లో 3,405, 2013-14లో 5,677 నమోదు కాగా, ఆ తర్వాత గత ఏడాదే అత్యధికంగా 3,080 మరణాలున్నాయి.
- పశు మరణాల సంఖ్య మాత్రం గత ఏడాది గణనీయంగా తగ్గింది. అత్యధికంగా 2006-07లో 4,55,619 మరణించగా, 2023-24లో 1,19,683 గతేడాది 61,966 చనిపోయాయి.
- ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇళ్లు కూలడం వంటి నష్టాలు 2007-08లో ఏకంగా 35.27లక్షలుండగా, 2023-24లో 1.40లక్షలు, 2024-25లో మాత్రం 3.64లక్షలుగా ఉంది.
- 2007-08లో 85.13లక్షల హెక్టార్లలో పంట నష్టం జరగ్గా, 2023-24లో 13.39లక్షల హెక్టార్లు, 2024-25లో 14.24 లక్షల హెక్టార్లుగా ఉంది.

దంపతులపై బరితెగించిన బాస్

వారిపై చెయ్యెత్తిన పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డా. దామోదర్‌నాయుడు

- దరఖాస్తు చేయకుండానే బదిలీచేసి పోస్టింగ్ ఇవ్వలేదని అడిగినందుకు దౌర్జన్యం
- నిలదీసిన కొద్దిసేపటికి పోస్టింగ్ ఆర్డర్లు
- డైరెక్టర్ తీరుపై మండిపడుతున్న ఉద్యోగ సంఘాలు
- ఈ శాఖలో బది'లీలలు' కోకొల్లలు
- ఎనిమిది నెలల గర్భిణీ దరఖాస్తు చేయకపోయినా స్థానచలనం
- క్యాన్సర్‌తో బాధపడుతున్న మరో మహిళా డాక్టర్ కూడా..
- వెటర్నరీ అసిస్టెంట్‌కు వెటర్నరీ డాక్టర్‌గా పోస్టింగ్



డాక్టర్ సురేష్, పద్మలీల దంపతులపై చేయి ఎత్తి కొట్టేందుకు యత్నిస్తున్న పశు సంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ టీ.దామోదర నాయుడు

సాక్షి, అమరావతి : టీడీపీ కూటమి పాలనలో నాయకులు, పోలీసులే కాదు.. పాలకపక్ష నేతల అడుగులకు మడుగులొత్తే కొందరు అధికారులు సైతం పేట్రేగిపోతున్నారు. చేతిలో అధికారం, పెద్దల ఆశీర్వాదం ఉందన్న ధీమాతో కిందిస్థాయి వారిని ఇష్టారాజ్యంగా వేధిస్తున్నారు. పశుసంవర్థక శాఖలో ఓ ఉన్నతాధికారి ఓ అడుగు ముందుకేసి దంపతులపై చెయ్యెత్తి కొట్టేందుకు బరితెగించారు. బదిలీల్లో తాము దరఖాస్తు చేసుకోకపోయినా బదిలీ అయిందని.. పైగా పోస్టింగ్ ఇవ్వలేదని అడగడమే వారు చేసిన నేరం. ఆ వివరాలు..

స్పాజ్ గ్రౌండ్‌లో పశు వైద్యులు డాక్టర్ సురేష్ విశాఖ జిల్లా పరవాడ మండలం వాడచీపురపల్లిలోనూ, డాక్టర్ పద్మలీల గాజువాక డిస్పెన్సరీల్లో మూడేళ్లుగా పనిచేస్తున్నారు. తాజా బదిలీల్లో వారు దరఖాస్తు చేసుకోకపోయినప్పటికీ పద్మలీలను బదిలీచేశారు. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. తమ గోడు చెప్పుకునేందుకు విజయవాడ వచ్చిన ఈ దంపతులపై పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి. దామోదరనాయుడు చేయిచేసుకున్నంత పనిచేశారు. 'నిబంధనల మేరకే బదిలీలు చేశాం.. మీరు ఏమైనా చెప్పాలనుకుంటే వెళ్లి ప్రభుత్వానికి చెప్పుకోండి.. మీరు కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇవ్వడం కుదరదు'.. అంటూ గుడ్లురుముతూ ఆగ్రహంతో ఊగిపోయారు. చెయ్యెత్తి కొట్టేందుకు వారి మీదకు దూసుకెళ్లారు. 'కొట్టాలనుకుంటే కొట్టండి.. మీకు దండం పెట్టి అడుగుతున్నా.. అప్లై చేయకుండా ఎలా బదిలీ చేస్తారు? కనీసం ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారో కూడా చెప్పకపోతే ఎలా?'.. అంటూ డాక్టర్ సురేష్ దంపతులు వాపోయారు. 'ముందు మీరిక్కడ నుంచి వెళ్లిపోండి. పోస్టింగ్ ఆర్డర్స్ పంపిస్తాం'.. అంటూ బలవంతంగా వారిని అక్కడ నుంచి పంపించేసిన కొద్దిసేపటికే వారిద్దరికీ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. వాడచీపురపల్లి నుంచి ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడకు సురేష్‌ను.. ఆయన ఖాళీచేసిన వాడచీపురపల్లికి ఆయన భార్య పద్మలీలను పంపించారు. ఈ ఘటన ఒక్కటే కాదు.. పశుసంవర్థక శాఖలో జరిగిన తాజా బదిలీల్లో ఉన్నతాధికారుల లీలలు కోకొల్లలు. జీఓ-23 ప్రకారం.. ఐదేళ్లు నిండిన వారిని విధిగా బదిలీ చేయాలి. దరఖాస్తు చేస్తేనే రెండేళ్లు దాటిన వారిని బదిలీ చేయాలి. కానీ, ఆచరణకు వచ్చేసరికి ఈ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి పార్టీ నేతల సిఫార్సు లేఖలు ఉంటే చాలు అడ్డగోలుగా బదిలీలు చేసేశారు. ముడుపులు ముట్టజెప్పిన వారికైతే కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇచ్చారు. సిఫార్సులున్నాయనే సాకుతో 5-7 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారి జోలికిపోని ఉన్నతాధికారులు, పనిచేసేచోట ఆరునెలల సర్వీస్ కూడా పూర్తికాని వారిని పైరవీలతో బదిలీలు చేశారు. ఓ సామాజికవర్గానికి చెందిన వారికైతే కోరుకున్న చోట కోరుకున్న పోస్టింగ్‌లు ఇచ్చారు. విజయవాడ చుట్టుపక్కల ప్రాధాన్యత గల కీలక విభాగాల్లో తమకు అనుకూలంగా ఉన్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చుకున్నారని డైరెక్టర్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రశ్నిస్తే దాడికి యత్నిస్తారా?

బదిలీల్లో నిబంధనలు పాటించలేదు. దరఖాస్తు చేయకపోయినా, ఐదేళ్లు నిండకపోయినా అడ్డగోలుగా బదిలీలు చేశారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే నానా దుర్భాషలాడుతూ దురుసుగా ప్రవర్తించడం, బెదిరించడం, దాడికి సైతం యత్నించడం చేస్తున్నారు. డాక్టర్ సురేష్ దంపతులపట్ల పశుసంవర్థక శాఖ డైరెక్టర్ దామోదరనాయుడు ప్రవర్తించిన తీరే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం.

– డాక్టర్ సీహెచ్ కృష్ణారావు, చైర్మన్, ఏపీ పశుసంవర్థక శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ జేఏసీ

'తల్లికి వందనం' నిధులు వెంటనే విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

సాక్షి, అమరావతి: తల్లికి వందనం ఇస్తున్నట్లు ప్రకటించి, నిధులు విడుదల చేయకపోవడం దారుణమైన చర్యగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అభివర్ణించింది. కూటమి నాయకులు అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అండగా నిలబడతామని చెప్పారని.. ఎంతమంది ఉంటే అంతమంది విద్యార్థులకు రూ.15,000 చొప్పున ఖాతాల్లో జమచేస్తామన్న హామీ ఏమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి. రామ్మోహన్‌రావు, కె. ప్రసన్నకుమార్ ప్రశ్నించారు. 2024, 2025 సంవత్సరాలకు కూడా ఎగవేశారని, ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం రోజున నిధులు విడుదల చేస్తామని ప్రకటించి తల్లులను మోసంచేశారని మండిపడ్డారు. కూటమి నాయకులు ఏడాది పాలనలో హామీలు అమలుచేసేశామని ప్రగల్భాలు పలుకుతున్నారని, ఇది రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. గతంలో రూ.15 వేల చొప్పున ఇస్తామని, ఇప్పుడు రూ.13 వేలు మాత్రమే జమచేయడమేమిటని వారు ప్రశ్నించారు.

'ప్రైవేట్' విద్యార్థుల రూ.2వేలు ఎవరికిస్తున్నారు?

ఇక పాఠశాలల అభివృద్ధి నిధి కోసం రూ.2 వేలు తగ్గిస్తున్న ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ బడుల్లో చదువుతున్న విద్యార్థుల వద్ద వసూలుచేసే ఆ మొత్తాన్ని ఎవరికిస్తుందని ప్రశ్నించారు. అలాగే, కరెంటు 300 యూనిట్లు వినియోగిస్తే అర్హులు కాదనే నిబంధనను గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వ్యతిరేకించారని, మరిప్పుడు అవే నిబంధనలను కొనసాగించడం ఏమిటని పి. రామ్మోహన్‌రావు, కె. ప్రసన్నకుమార్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి ఇస్తామన్న పథకానికి 54,94,703 మంది మాత్రమే అర్హులని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు.. తల్లికి వందనం పథకానికీ ముడిపెట్టడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా అందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇవ్వాలని, లేకుంటే తల్లిదండ్రులు, విద్యార్థుల వ్యతిరేకతను చూపిస్తామని వారు హెచ్చరించారు.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ 16కి వాయిదా

సాక్షి, అమరావతి : తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరులో భాగంగా జరిగిన ఆ పార్టీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్యలతో తమకు ఎటువంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి హైకోర్టుకు విన్నవించారు. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. వాదనల అనంతరం ఈ కేసు విచారణను న్యాయమూర్తి జస్టిస్ కుంచెం మహేశ్వరరావు ఈ నెల 16కు వాయిదా వేశారు. ఈ దశలో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని తెలిపారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిన్నెల్లి సోదరులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరరావు గురువారం విచారణ జరిపారు. పిన్నెల్లి సోదరుల తరఫున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య ఆ పార్టీ అంతర్గత కలహాల కారణంగానే జరిగిందని, పిటిషనర్లకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా ఎస్పీ కూడా చెప్పారన్నారు. హత్య జరిగిన సమయంలో పిటిషనర్లు ఘటన స్థలంలో లేరన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను ఆయన కోర్టు ముందుంచారు. అందువల్ల తదుపరి విచారణ వరకు అరెస్ట్ నుంచి పిటిషనర్లకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. పిన్నెల్లి సోదరుల ప్రోద్బలంతోనే ఈ హత్యలు జరిగాయన్నారు.

తీరని 'పండిట్స్' కష్టాలు!

పదోన్నతులకు నోచుకోని తెలుగు, హిందీ పండిట్స్

1400 మందికి పదోన్నతి ఇవ్వకుండా అన్యాయం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులకు బదిలీల్లో, పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోంది. దీంతో కొన్నేళ్లుగా డీఈవో పూల్‌లో ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, తమిళం, కన్నడ, ఒరియా పండిట్స్‌కి ఆవేదనే మిగిలింది. తోటి లాంగ్వేజ్ పండిట్లు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందగా, 1400 మందిని మాత్రం డీఈవో పూల్‌లో ఉంచి విద్యాశాఖ సర్దుబాటు పేరుతో అవసరం ఉన్న చోటుకి బదిలీ చేస్తోంది. దీంతో వీరంతా కొన్నేళ్లుగా ఏ స్కూల్లోనూ రెండేళ్లకు మించి పనిచేసే అవకాశం లేకుండాపోయింది. సాధారణంగా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు ఒక పాఠశాలలో 8 సంవత్సరాలు పనిచేస్తే తప్పనిసరి బదిలీ పొందుతారు. మిగిలిన వారు అవసరం మేరకు రిక్వెస్టు బదిలీకి దరఖాస్తు చేసుకుంటారు. కానీ ఈ 1400 మంది భాషా పండితులు ఎక్కడ ఖాళీలుంటే అక్కడ సర్దుబాటుకే పరిమితమయ్యారు. దీంతో వీరికి స్టేషన్ పాయింట్లు కూడా లేకుండా పోయాయి. వీరు తమకు అన్యాయం జరిగిందంటూ హైకోర్టును ఆశ్రయించగా, 2024 డిసెంబర్‌లో వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది. వీరందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని విద్యా శాఖను ఆదేశించింది. కోర్టు తీర్పును అమలు చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయగా, ప్రస్తుత బదిలీల్లో న్యాయం చేస్తామని విద్యాశాఖ హామీ ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. కానీ, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఈ బదిలీల్లోనూ తమకు అన్యాయమే జరుగుతోందని వాపోతున్నారు.

26 కులాలపై ముగిసిన బీసీ కమిషన్ విచారణ

- త్వరలో ప్రభుత్వానికి నివేదిక
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న సెటిలర్స్

సాక్షి, అమరావతి: తెలంగాణలో బీసీ జాబితాలో తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చే వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన అనంతరం 26 కులాలను తొలగించిన తెలంగాణ ప్రభుత్వం బీసీ జాబితాను 112 కులాలకే పరిమితం చేసింది ఏపీలో ఉన్న ఆ కులాలు తెలంగాణలో లేరనే కారణం చూపి వాటిని తొలగించడంతో తెలంగాణలో స్థిరపడిన ఏపీకి చెందిన ఆ 26 కులాల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏపీలో బీసీ రిజర్వేషన్ ఫలాలు పొందుతున్న ఆ కులాల వారిని తెలంగాణ రాష్ట్రంలో ఓసీ(జనరల్ కేటగిరీ)గా పరిగణిస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి, ఉద్యోగం కోసం ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లి స్థిరపడిన సుమారు 10 లక్షల మంది బీసీలకు ప్రభుత్వ పథకాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, స్కాలర్‌షిప్‌లు ఇతర ప్రయోజనాలు అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ కులాలను బీసీ జాబితాలో చేర్చే విషయంలో తెలంగాణ బీసీ కమిషన్ ఈ ఏడాది మే 31 వరకు అభ్యంతరాలు స్వీకరించింది. దానికి కొనసాగింపుగా ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించిన విచారణలో తెలంగాణలోకి బీసీ కులాల ప్రతినిధులతోపాటు వారికి మద్దతుగా ఏపీకి చెందిన వారు కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. మూడు రోజులపాటు నిర్వహించిన విచారణలో సేకరించిన వివరాలను బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలంగాణ ప్రభుత్వానికి నివేదించనుంది. తెలంగాణ ప్రభుత్వం 26 బీసీ కులాలను జాబితాలో తిరిగి చేర్చే విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఉత్కంఠగా మారింది.

ఆ 26 కులాలు ఇవే..

శెట్టిబలిజ, తూర్పు కాపు(గాజుల కాపు), కళింగ, కొప్పుల వెలమ, నాగవసం, పోలినాటి వెలమ, బండారా, కొచ్చ, కూరాకుల, పొందర, సామంతుల, అసాదులు, అచ్చుకుంట్ల వాండ్లు, నాగవడ్డీలు, కుంచటి, గుడియా, అగరు, అతగర, గవర, గౌడబ, జక్కల, కంద్ర, సదర, అరవ, బైరి వైశ్య, అతిరస


రజనీకాంత్



రవితేజ


ప్రభాస్


పవన్ కల్యాణ్

'కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతీక అయితే.. కనిపించని ఆ నాలుగో సింహమేరా పోలీస్' అంటూ 'పోలీస్ స్టోరీ' సినిమాలో హీరో సాయి కుమార్ చెప్పిన డైలాగులకు ప్రేక్షకుల రోమాలు నిక్కబొడుచుకున్నాయ్. హీరోలు పోలీస్ పాత్రల్లో కనిపిస్తే అటు అభిమానులకు, ఇటు ప్రేక్షకులకు దక్కే మజానే వేరు. ఖాకీ డ్రెస్‌లో లాఠీ, తుపాకీ చేత బట్టి ఆన్ డ్యూటీలో భాగంగా పవర్‌ఫుల్ డైలాగులతో విలన్లకు వార్నింగ్ ఇస్తుంటే ప్రేక్షకులు విజిల్స్ వేస్తూ, కేకలు వేస్తూ సందడి చేస్తుంటారు. పైగా పోలీస్ బ్యాక్‌డ్రాప్ అన్నది ఎవర్ గ్రీన్ ఫార్ములా. కథ, పాత్రలో దమ్ముంటే చాలు పోలీస్ సినిమాలు హిట్టయిపోతాయ్. ఇప్పటికే పోలీస్ కథాంశంతో ఎన్నో సినిమాలు వచ్చాయి. ప్రస్తుతం ఈ నేపథ్యంలో రూపొందుతోన్న సినిమాల్లో 'ఆన్ డ్యూటీ' అంటూ పోలీస్‌గా విజృంభిస్తున్న హీరోల గురించి తెలుసుకుందాం.


కార్తీ


విజయ్ దేవరకొండ

పోలీస్... ఆన్ డ్యూటీ


ఆది


మంచు మనోజ్


విశ్వక్ సేన్

ముత్తువేల్ పాండియన్

రజనీకాంత్ హీరోగా డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'జైలర్' (2023) చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. జైలర్, రిటైర్డ్ జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీకాంత్ నటనకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రజనీ-నెల్సన్ కాంబినేషన్‌లోనే 'జైలర్'కి సీక్వెల్‌గా 'జైలర్ 2' చిత్రం రూపొందుతోంది. ఈ చిత్ర కథాంశం ప్రధానంగా గోవా నేపథ్యంలో ఉంటుందట. ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ముత్తువేల్ పాండియన్ సత్తా ఏ రేంజ్‌లో ఉంటుందన్నది ఇండస్ట్రీలో ఆసక్తిగా మారింది. 'జైలర్' సినిమాలో రజనీకాంత్ భార్య పాత్రలో రమ్యకృష్ణ నటించారు. అయితే 'జైలర్ 2'లో విద్యాబాలన్ నటించనున్నారని టాక్. అయితే ఆమె పాత్ర ఏంటి? అన్నది తెలియాల్సి ఉంది.

కెరీర్‌లో తొలిసారి...

వరుస పాన్ ఇండియా సినిమాలతో జెట్ స్పీడ్‌తో దూసుకెళుతున్నారు హీరో ప్రభాస్. 'ఈశ్వర్' (2002) సినిమాతో టాలీవుడ్‌లో హీరోగా ఎంట్రీ ఇచ్చారాయన. రెండు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో, ఈ జనరేషన్ హీరోల్లో ఖాకీ డ్రెస్ వేయని ఒకే ఒక్క హీరో ప్రభాస్. ఆయన్ని ఖాకీ డ్రెస్‌లో, పవర్‌ఫుల్ పాత్రలో చూడాలని ప్రభాస్ అభిమానులు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణకు 'స్పిరిట్' సినిమాతో ఫుల్‌స్టాప్ పడింది. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో ప్రభాస్‌కి జోడీగా త్రిప్తి డిమ్రీ నటిస్తున్నారు. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణణ్ కుమార్, మురాద్ ఖేతానీ నిర్మిస్తున్నారు. విభిన్నమైన యాక్షన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తొలిసారి ప్రభాస్ ఖాకీ డ్రెస్‌లో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. 'స్పిరిట్'లో పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ ఏ రేంజ్‌లో విజృంభిస్తారో బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డులు సృష్టిస్తారో వేచి చూడాలి.

పోలీస్ జాతర

పోలీస్ కథలకు చిరునామాగా నిలుస్తుంటారు హీరో రవితేజ. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన 'వెంకీ' (2004)లో మొదటిసారి ఖాకీ డ్రెస్‌లో కనిపించినప్పటికీ ఆ సినిమాలో పూర్తి స్థాయిలో కనిపించరు. రాజమౌళి దర్శకత్వం వహించిన 'విక్రమార్కుడు' (2006) సినిమాలో విక్రమ్ రాథోడ్‌గా పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించారు. ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఆ తర్వాత 'ఖతర్నాక్, మిరపకాయ్, పవర్, టచ్ చేసి చూడు, క్రాక్' వంటి సినిమాల్లో పోలీసాఫీసర్‌గా తనదైన మేనరిజమ్‌తో ప్రేక్షకులను అలరించారు రవితేజ. చిరంజీవి హీరోగా నటించిన 'వాల్తేరు వీరయ్య' (2023) సినిమాలోనూ ఏసీపీ విక్రమ్ సాగర్‌గా కనిపించారు. తాజాగా రవితేజ పోలీస్ ఆఫీర్‌గా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ-శ్రీలీల ఈ సినిమాలో రెండోసారి జోడీగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనంలాంటి మాస్ ఎంటర్‌టైనర్‌గా 'మాస్ జాతర' రూపొందుతున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సినిమా మే 9న విడుదల కావాల్సింది కానీ వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్‌ని ప్రకటించలేదు మేకర్స్.

ఉస్తాద్ భగత్ సింగ్‌లో...

పవన్ కల్యాణ్ పోలీసాఫీసర్ పాత్రలో హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన 'గబ్బర్ సింగ్' మంచి విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన 'సర్దార్ గబ్బర్ సింగ్' చిత్రంలో మరోసారి ఖాకీ డ్రెస్‌లో కనిపించారు పవన్ కల్యాణ్. అయితే ఈ సినిమా ఆశించిన ఫలితం సాధించలేదు. కాగా తనకు 'గబ్బర్ సింగ్' వంటి హిట్ ఇచ్చిన హరీష్ శంకర్ దర్శకత్వంలోనే 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో మరోసారి పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు పవన్ కల్యాణ్. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పవన్ కల్యాణ్‌తో పాటు, సినిమాలోని ప్రముఖ తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.

డబుల్ ధమాకా

హీరో కార్తీ పోలీసాఫీసర్‌గా ప్రేక్షకులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు. ఆయన హీరోగా నటించిన 'సర్దార్' (2022) చిత్రం తమిళంతో పాటు తెలుగులోనూ సూపర్ హిట్‌గా నిలిచింది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి సీక్వెల్‌గా కార్తీ-పీఎస్ మిత్రన్ దర్శకత్వంలోనే 'సర్దార్ 2' రానున్న సంగతి తెలిసిందే. ఆషికా రంగనాథ్, మాళవికా మోహనన్, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించగా, ఎస్‌జే సూర్య కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం షూటింగ్ ఇటీవల పూర్తయింది. ఈ సినిమాలో కార్తీ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. తండ్రి ఖైదీ పాత్రలో కనిపించనుండగా ఆయన కొడుకు పాత్ర పవర్ పోలీసాఫీసర్‌గా కనిపిస్తారు. ఈ సినిమా 2026 సంక్రాంతికి రిలీజ్ కానుందట.

హిట్ 4లో.... తెలుగులో 'హిట్' సిరీస్‌కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. శైలేష్ కొలను దర్శకత్వంలో ఈ సిరీస్‌లో వచ్చిన 'హిట్: ది ఫస్ట్ కేస్' (విశ్వక్ సేన్), 'హిట్: ది సెకండ్ కేస్' (అడివి శేష్), 'హిట్: ది థర్డ్ కేస్' (నాని) సినిమాలు విజయం సాధించాయి. ఈ సిరీస్‌లో రానున్న నాలుగో చిత్రం 'హిట్ 4'. ఈ సినిమాలో కార్తీ హీరోగా నటించనున్నారు. ఏసీపీ వీరప్పన్‌గా కార్తీ నటించనున్నట్లు 'హిట్: ది థర్డ్ కేస్' క్లైమాక్స్‌లో చూపించారు మేకర్స్.

స్పై పోలీస్ ఆఫీసర్

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'కింగ్‌డమ్'. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. పీరియాడికల్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ కనిపించని వైవిధ్యమైన పాత్రలో, స్పై పోలీస్ ఆఫీసర్‌గా సందడి చేయనున్నారట విజయ్. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్స్, టీజర్, పాటలకి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విజయ్ నటించిన ఏ సినిమా ఇప్పటి వరకూ రెండు భాగాలుగా రాలేదు. అలా వస్తున్న ఆయన మొదటి చిత్రం 'కింగ్‌డమ్' కానుండటం విశేషం. ఈ సినిమా రెండో భాగానికి 'కింగ్‌డమ్ స్క్వేర్' లేదా 'కింగ్‌డమ్ 2' అనే టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది.

రెండోసారి...

హీరో విశ్వక్ సేన్ రెండోసారి పోలీసాఫీసర్‌గా చార్జ్ తీసుకున్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్: ది ఫస్ట్ కేస్' (2020) చిత్రంలో విక్రమ్ రుద్రరాజు అనే ఐపీఎస్ అధికారిగా నటించారు విశ్వక్. హీరో నాని, ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మంచి విజయం అందుకుంది. ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్ తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. కాగా మరోసారి ఆయన ఖాకీ దుస్తులు ధరించారు. శ్రీధర్ గంగా దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'వీఎస్ 13' (వర్కింగ్ టైటిల్). ఎస్ఎల్‌వీసీ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్‌లో చూస్తుంటే విశ్వక్ మరోసారి పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారని స్పష్టం అవుతోంది. విశ్వక్ ఫేస్ కనిపించకుండా పాకెట్‌లో తుపాకీతో అటువైపు తిరిగి ఉన్న పోస్టర్ రిలీజ్ చేశారు. 'ప్రతి యాక్షన్‌కి అదిరిపోయే రియాక్షన్ ఉంటుంది' అంటూ ఓ కొటేషన్ కూడా ఇచ్చారు మేకర్స్. ఇదిలా ఉంటే.. ఈ చిత్రానికి 'బందూక్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని టాక్.

రక్షక్!

నటనకు కొన్నాళ్లు విరామం ప్రకటించిన మంచు మనోజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో బిజీ బిజీగా దూసుకెళుతున్నారు. ఆయన ఓ హీరోగా నటించిన 'భైరవం' సినిమా మే 30న విడుదలైంది. ఈ చిత్రంలో గజపతి వర్మ పాత్రలో తనదైన నటనతో ఆకట్టుకున్నారు మనోజ్. అదే విధంగా తేజ సజ్జా హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న 'మిరాయ్' సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్ర చేస్తున్నారు మనోజ్. ఇక ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో మనోజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రక్షక్'. ఈ చిత్రం ద్వారా నవీన్ కొల్లి దర్శకునిగా పరిచయమవుతున్నారు. శ్రీనిధీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు మంచు మనోజ్. మే 20న ఆయన పుట్టినరోజుని పురస్కరించుకుని 'రక్షక్'ను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లోని మనోజ్ శక్తిమంతమైన లుక్ ఆకట్టుకునేలా ఉంది. కొందరు తాము చేసిన నేరాన్ని బయటకు రాకుండా దాచి పెట్టడానికి ప్రయత్నిస్తే హీరో ఎలా వెలికి తీశాడు? అన్నది కథలో ఆసక్తిగా ఉంటుందట. అంతేకాదు... ప్రస్తుతం సమాజంలో మహిళల మీద జరుగుతున్న వేధింపులను కూడా ఇందులో ప్రస్తావించారని ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తే అర్థం అవుతోంది.

తండ్రి బాటలో...

పోలీస్ పాత్రలకు పెట్టింది పేరు సాయికుమార్. 'పోలీస్ స్టోరీ' సినిమాలో ఆయన నటన, డైలాగులను ఎప్పటికీ మరచిపోలేరు ప్రేక్షకులు. ఆ తర్వాత ఎన్నో సినిమాల్లో పోలీసాఫీసర్‌గా నటించి, ప్రేక్షకుల్ని మెప్పించారు సాయికుమార్. తాజాగా ఆయన తనయుడు ఆది సాయికుమార్ పోలీస్ అధికారిగా నటిస్తున్న చిత్రం 'ఎస్ఐ యుగంధర్'. యశ్వంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మేఘలేఖ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నటుడు రాకేందు మౌళి విలన్ పాత్ర పోషిస్తున్నారు. శ్రీ పినాక మోషన్ పిక్చర్స్‌పై ప్రదీప్ జూలూరు ఈ సినిమా నిర్మిస్తున్నారు. క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా వైవిధ్యమైన కథతో ఈ మూవీ రూపొందుతోంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ సబ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్ పాత్రలో ఆది నటిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

- దేరంగుల జగన్ మోహన్


అనుష్క

ఖైదీ భార్య పాత్రలో..?

ఢిల్లీ తిరిగి సెట్స్‌కి వస్తున్నాడు. లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న సినిమా 'ఖైదీ 2'. కార్తీ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'ఖైదీ'. 2019లో విడులై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీంతో వెంటనే 'ఖైదీ' సినిమాకు సీక్వెల్‌గా 'ఖైదీ 2' ప్రకటించారు లోకేశ్-కార్తీ. కానీ దర్శకుడు లోకేశ్ వరుసగా కమల్‌హాసన్‌తో 'విక్రమ్', రజనీకాంత్‌తో 'కూలీ' సినిమాలు చేయాల్సి రావడంతో, 'ఖైదీ 2' సినిమా చిత్రీకరణ వాయిదా పడుతూ వస్తోంది. ఇక 'విక్రమ్' (2022) సినిమా విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. 'కూలీ' సినిమా ఈ ఏడాది ఆగస్టు 14న విడుదల కానుంది. దీంతో ప్రస్తుతం 'ఖైదీ 2' సినిమాపై ఫోకస్ పెట్టారు కార్తీ-లోకేశ్. అయితే ఈ సినిమా గురించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఈ 'ఖైదీ 2'లో అనుష్కా శెట్టి ఓ లీడ్ క్యారెక్టర్ చేయనున్నట్లుగా కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. 'ఖైదీ'లో కార్తీ కుమార్తె పాత్రను పరిచయం చేశారు. కానీ భార్య పాత్ర గురించి సరైన ప్రస్తావన లేదు. దీంతో 'ఖైదీ 2' సినిమాలో ఆ పాత్ర ప్రస్తావన ఎక్కువగా స్క్రీన్‌పై ఉంటుందని, ఈ పాత్రలోనే అనుష్కా శెట్టి నటించనున్నారనే టాక్ తెర పైకి వచ్చింది. అలాగే 'ఖైదీ'లో పోలీసాఫీసర్ల పాత్రలు ఎక్కువగా ఉంటాయి. మరి... 'ఖైదీ' (కార్తీ) భార్య పాత్రలో అనుష్కా శెట్టి నటిస్తారా? లేక పోలీసాఫీసర్ రోల్ చేస్తారా? అనే విషయంపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ ఏడాది సెప్టెంబరులో ప్రారంభించి, వచ్చే ఏడాది ప్రారంభంలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని సమాచారం.


కీర్తి సురేష్

రివాల్వర్ రీటా వస్తున్నారు

థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అయ్యారు రివాల్వర్ రీటా. కీర్తి సురేష్ టైటిల్ రోల్ చేసిన లేటెస్ట్ యాక్షన్ అండ్ కామెడీ ఫిల్మ్ 'రివాల్వర్ రీటా'. రాధికా శరత్‌కుమార్, సునీల్, అజయ్ ఘోష్, సూపర్ సుబ్బరాయన్, జాన్ విజయ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. జేకే చంద్రు దర్శకత్వంలో సుధన్ సుందరం, జగదీష్ పళనీస్వామి నిర్మించిన చిత్రం ఇది. తాజాగా 'రివాల్వర్ రీటా' రిలీజ్ డేట్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ సినిమాను ఆగస్టు 27న రిలీజ్ చేయనున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. కథ రీత్యా ఈ సినిమాలో కీర్తి సురేష్, రాధికా శరత్‌కుమార్ తల్లీ కూతురు పాత్రలో నటించారని, ఈ సినిమాలో కీర్తి సురేష్ పాత్రకు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయని సమాచారం.

బిజినెస్ రీల్

మెర్సిడెస్ బెంజ్ కలెక్టర్స్ ఎడిషన్@ 4.3 కోట్లు



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ తాజాగా ఏఎంజీ జీ63 'కలెక్టర్స్ ఎడిషన్' మోడల్‌ను ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 4.3 కోట్లు (ఆల్ ఇండియా ఎక్స్–షోరూం). ప్రస్తుత టాప్ ఎండ్ లగ్జరీ వాహన కస్టమర్ల కోసం కంపెనీ కేవలం 30 యూనిట్లే విక్రయించనుంది. బెంగళూరులోని మెర్సిడెస్ బెంజ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా (ఎంబీఆర్‌డీఐ) భాగస్వామ్యంతో భారత్‌లోని పరిస్థితులకు అనుగుణంగా కంపెనీ దీన్ని రూపొందించింది. తమ అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దిన వాహనాలను కస్టమర్లు కోరుకుంటున్న నేపథ్యంలో టాప్ ఎండ్ లగ్జరీ సెగ్మెంట్లో హైపర్–పర్సనలైజేషన్ ట్రెండ్ ఎక్కువగా ఉంటోందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు.

యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ సారథిగా సుమిత్ మదన్

న్యూఢిల్లీ: యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్త ఎండీ, సీఈవోగా సుమిత్ మదన్ నియామకానికి ఆమోదం తెలిపినట్లు మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. ప్రస్తుతం ఆయన యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత ఎండీ, సీఈవోగా ఉన్న ప్రశాంత్ త్రిపాఠి వచ్చే సెప్టెంబర్ 30న ముందస్తు పదవీ విరమణ తీసుకోనున్నారు. దీంతో సుమిత్ మదన్ అక్టోబర్ 1 నుంచి సారథ్య బాధ్యతలు స్వీకరించనున్నట్టు, ఐదేళ్ల పాటు సేవలు అందించనున్నట్టు మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది.

హైదరాబాద్‌లో లైటస్ హెల్త్‌టెక్ ప్రారంభం

హైదరాబాద్: లైటస్ బీఎల్‌వోడీ (ఆన్–డిమాండ్ బ్లడ్ లాజిస్టిక్స్ ప్లాట్‌ఫాం) కొత్తగా హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. దేశీయంగా తొలి ఏఐ ఆధారిత బ్లడ్ లాజిస్టిక్స్ ప్లాట్‌ఫాంగా చెన్నైలో ఇప్పటికే 5,000 యూనిట్ల రక్తాన్ని అందించినట్లు, రెడ్ క్రాస్ సొసైటీ పురస్కారాన్ని కూడా దక్కించుకున్నట్లు సంస్థ సీవోవో సాయిగుణ రంజన్ పురాణం తెలిపారు.



హైదరాబాద్‌లో 12 ప్రధాన బ్లడ్ బ్యాంకులతో, 35 పైచిలుకు ఆస్పత్రులతో చేతులు కలిపినట్లు వివరించారు. వచ్చే 12 నెలల్లో ఆస్పత్రుల సంఖ్యను 50కి పైగా పెంచుకోనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగానే కాకుండా అమెరికా, యూఏఈ తదితర అంతర్జాతీయ మార్కెట్లలోకి విస్తరించే ప్రణాళికలు ఉన్నట్లు చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

13-6-2025

విశాఖ	550–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	535–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	6,994.00	0.96
ASIANPAINT	2,225.00	0.73
BAJAJFINSV	2,022.10	0.46
DRREDDY	1,356.30	0.38
TECHM	1,643.60	0.37

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATAMOTORS	714.45	-2.98
TITAN	3,448.90	-2.62
TRENT	5,620.00	-2.62
SHRIRAMFIN	668.4	-2.57
COALINDIA	392	-2.51

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,007
ఎన్ఎస్ఈ	1,17,581
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,93,908
ఎఫ్ఐఐ	- 3,831
డీఐఐ	+ 9,394

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	68.44	$	68.15
బ్రెంట్	69.72	$	69.77

ఏఐ మార్కెట్ @17 బిలియన్ డాలర్లు

- 2027 నాటికి మూడు రెట్లు వృద్ధి
- టెక్నాలజీపై పెట్టుబడులు, డిజిటల్ వ్యవస్థ దన్ను
- బీసీజీ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ 2027 కల్లా ప్రస్తుత స్థాయి నుంచి మూడు రెట్లు వృద్ధి చెందనుంది. అంతర్జాతీయంగా అత్యంత వేగంగా ఎదుగుతున్న ఏఐ ఎకానమీల్లో ఒకటిగా భారత్‌ను నిలబెడుతూ 17 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీలో పెట్టుబడులు పెరుగుతుండటం, డిజిటల్ వ్యవస్థ వృద్ధి చెందుతుండటం, నిపుణులైన ప్రొఫెషనల్స్ లభ్యత తదితర అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రపంచ ఏఐ టాలెంట్‌లో 16 శాతం మంది భారత్‌లో ఉన్నారు. దేశీ ఏఐ వ్యవస్థలో 6,00,000 మంది పైగా ఏఐ ప్రొఫెషనల్స్, 70 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారు. గత మూడేళ్లలో 2,000 పైగా ఏఐ స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి.

డిజిటల్ ఇన్‌ఫ్రా దన్ను..

ఆధార్, యూపీఐ, డిజిలాకర్, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లాంటి డిజిటల్ మౌలిక సదుపాయాలు దేశీయంగా వివిధ రంగాలను ఏఐతో అనుసంధానించేందుకు సహాయకరంగా ఉంటున్నాయి. పెద్ద సంఖ్యలో ఇంటర్నెట్ యూజర్లు, విస్తృతంగా స్మార్ట్‌ఫోన్ వినియోగం కారణంగా భారత్‌లో భారీ స్థాయిలో డేటా జనరేట్ కావడం ఏఐ మోడల్స్ శిక్షణకు ఉపయోగకరంగా ఉంటోంది. ఇక ప్రస్తుతమున్న 152 డేటా సెంటర్ల నెట్‌వర్క్‌కు అదనంగా 2025లో భారత్‌లో కొత్తగా 45 సెంటర్లు రానున్నాయి. రూ. 10,000 కోట్లతో ప్రభుత్వం ప్రకటించిన ఇండియాఏఐ మిషన్ జాతీయ స్థాయిలో ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడనుంది. దీనితో ఏఐ మోడల్ శిక్షణ, పరిశోధన కోసం 10,000 పైగా జీపీయూలు (గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు) అందుబాటులోకి వస్తాయి. 'ఏఐ అనేది వ్యాపార సంస్థలకు ఒక ఆప్షన్‌గా కాకుండా అవసరంగా మారింది. భారతీయ కంపెనీలు అంతర్జాతీయంగా కూడా మరింత ధీమాగా పోటీపడగలుగుతున్నాయి. టెక్నాలజీ వినియోగం మాత్రమే కాకుండా మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొనడం, అంతర్గత వ్యవస్థలో ఏఐని వినియోగించుకోవడం వంటి అంశాలే అగ్రగామి కంపెనీలకు మిగతా సంస్థలకు మధ్య వ్యత్యాసాన్ని నిర్దేశిస్తాయని బీసీజీ ఇండియా ఎండీ మన్‌దీప్ కోహ్లి తెలిపారు.

ఇరెడా నిధుల సమీకరణ

క్విప్ ద్వారా రూ. 2,000 కోట్లు



న్యూఢిల్లీ: అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు(క్విప్) ద్వారా పునరుత్పాదక ఇంధన అభివృద్ధి పీఎస్‌యూ.. ఇరెడా రూ. 2,000 కోట్లు సమీకరించింది. ఈ నెల 5–10 మధ్య చేపట్టిన క్విప్‌నకు దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి ప్రోత్సాహకర స్పందన లభించినట్లు కంపెనీ పేర్కొంది. బీమా రంగ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తదితర అర్హతగల సంస్థాగత కొనుగోలుదారులు(క్విబ్) ఆసక్తి చూపినట్లు వెల్లడించింది. ఇష్యూ ప్రాథమిక పరిమాణం రూ. 1,500 కోట్లుకాగా.. 1.3 రెట్లు అధికంగా రూ. 2,006 కోట్ల విలువైన బిడ్స్ దాఖలైనట్లు తెలియజేసింది. వెరసి అర్హతగల కొనుగోలుదారులకు ఈక్విటీ షేర్ల కేటాయింపును చేపట్టేందుకు బోర్డు అనుమతించినట్లు తెలియజేసింది. దీంతో షేరుకి రూ. 165.14 ధరలో 12.15 కోట్ల ఈక్విటీ షేర్లు జారీ చేస్తున్నట్లు వెల్లడించింది. రూ. 10 ముఖ విలువగల వీటిని రూ. 155.14 ప్రీమియంతో కేటాయిస్తున్నట్లు వివరించింది. ఫ్లోర్ ధర రూ. 173.83తో పోలిస్తే 5 శాతం డిస్కౌంట్‌లో రూ. 165.14 చొప్పున షేర్లను జారీ చేస్తున్నట్లు తెలియజేసింది. క్విప్ నిధుల సమీకరణతో కంపెనీ టైర్–1 మూలధనంసహా కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) మరింత పటిష్టమైనట్లు పేర్కొంది. దేశీయంగా పునరుత్పాదక ఇంధన రంగ విస్తరణకు నిధులు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. 2023 నవంబర్‌లో ఐపీవో చేపట్టిన కంపెనీ తక్కువ సమయంలోనే క్విప్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఇరెడా చైర్మన్, ఎండీ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.

బీఎస్ఈలో ఇరెడా షేరు 4% తగ్గి రూ. 176 వద్ద ముగిసింది.

శ్రీరామ్ గ్రూప్ వెల్త్ సేవలు

సన్లామ్ గ్రూప్‌తో కలసి జాయింట్ వెంచర్



న్యూఢిల్లీ: శ్రీరామ్ గ్రూప్ సంపద నిర్వహణ (వెల్త్ మేనేజ్‌మెంట్) సేవల్లోకి ఎంట్రీ ఇచ్చింది. దక్షిణాఫ్రికాకు చెందిన సన్లామ్ గ్రూప్‌తో కలసి 50:50 వాటాతో 'శ్రీరామ్ వెల్త్' కంపెనీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు మొదటి ఐదేళ్లలోనే రూ.50,000 కోట్ల నిర్వహణ ఆస్తులను సాధించాలన్న లక్ష్యాన్ని ప్రకటించింది. తొలుత టాప్ 10 పట్టణాల్లో సేవలు ఆరంభించి, వచ్చే ఏడాది కల్లా 20 పట్టణాలకు విస్తరించనున్నట్టు తెలిపింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని అవకాశాలను సొంతం చేసుకోవడంపై దృష్టి సారిస్తామని.. వచ్చే ఐదేళ్లలో 500 మంది వెల్త్ నిపుణులను నియమించుకుంటామని ప్రకటించింది. రూ.10లక్షల నుంచి రూ.2 కోట్ల శ్రేణిలో క్లయింట్లతోపాటు, రూ.2–25 కోట్ల ధనవంతులు, రూ.25 కోట్లపై పైబడి అధిక ధనవంతులపై దృష్టి సారిస్తామని వివరించింది. వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, ప్రొటెక్షన్ (బీమా రక్షణ), అంతర్జాతీయంగా పెట్టుబడి అవకాశాలు, వారసత్వ బదిలీ సేవలను ఏఐ ఆధారితంగా అందించనున్నట్టు తెలిపింది. సన్లామ్ గ్రూప్ 31 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున భారత్ వెలుపల పెట్టుబడి అవకాశాలతోనూ ఉత్పత్తులను అందించనున్నట్టు శ్రీరామ్ వెల్త్ ఎండీ, సీఈవో వికాస్ సాతిజ్ ప్రకటించారు.

రూ. 1,000 కోట్లపై వెర్టెక్స్ గ్రూప్ కన్ను

ఏఐ అభివృద్ధి, ఇతర సంస్థల కొనుగోళ్లకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ సేవల వెర్టెక్స్ గ్రూప్ రానున్న మూడేళ్లలో ఆదాయాన్ని నాలుగు రెట్లు పెంచుకోవాలని చూస్తోంది. ఇందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అభివృద్ధితోపాటు.. ఇతర సంస్థల కొనుగోళ్లు, మార్కెట్లో విస్తరణ తదితర ప్రణాళికలు వేసింది. తద్వారా 2027–28కల్లా రూ. 1,000 కోట్ల టర్నోవర్ అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. కంపెనీ ప్రస్తుతం రూ. 250 కోట్ల ఆదాయం సాధించింది. న్యూయార్క్ కేంద్రంగా ఏర్పాటైన కంపెనీ ఆర్గానిక్, ఇన్‌ఆర్గానిక్ మార్గాలలో వృద్ధిని సాధించేందుకు వ్యూహరచన చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో వివిధ విభాగాలలో విస్తరించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని ఆశిస్తోంది. ఇందుకు వ్యూహాలను రచించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌదీ అరేబియాలలో వేగంగా విస్తరించనున్నట్లు తెలియజేసింది. కొత్త క్లయింట్లను చేరడం ద్వారా అంతర్జాతీయంగా కార్యకలాపాలను విస్తరించాలని భావిస్తున్నట్లు వెల్లడించింది. వెరసి సొంత కార్యకలాపాల విస్తరణకు జతగా ఇతర సంస్థలను కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన ఏఐ ప్రొడక్టులతో ఒక సూట్‌ను ప్రవేశపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. మార్కెట్‌లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా రెండు కొత్త బిజినెస్ వెర్టికల్స్‌ను విడుదల చేయనున్నట్లు తెలియజేసింది. తద్వారా సర్వీసుల పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించనున్నట్లు వివరించింది. పరిశ్రమకు అవసరమయ్యే గ్లోబల్ డేటా సెంటర్లు, క్లౌడ్ ఎక్స్‌పో, గ్లోబల్ హెల్త్ కనెక్ట్ తదితర ఈవెంట్లను నిర్వహించనున్నట్లు పేర్కొంది. భారత్ నుంచి 4,000 మంది భాషా నిపుణులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించింది.

తెలంగాణలో ఆన్‌లైన్ మోసాలకు ఎయిర్‌టెల్ చెక్

1,80,000 హానికారక లింకులు బ్లాక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ మోసాల కట్టడి చేసే దిశగా తమ ఏఐ ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టంను దేశవ్యాప్తంగా మరింతగా అందుబాటులోకి తెస్తున్నట్లు టెలికం సంస్థ భారతి ఎయిర్‌టెల్ తెలిపింది. ఇందులో భాగంగా తెలంగాణలో దీన్ని ప్రవేశపెట్టిన 25 రోజుల వ్యవధిలోనే 1,80,000 పైచిలుకు హానికారక లింకులను బ్లాక్ చేసినట్లు పేర్కొంది. దీనితో 54 లక్షల మందికి ప్రయోజనం చేకూరినట్లు వివరించింది.



ఎయిర్‌టెల్ మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లందరికీ ఇది ఆటోమేటిక్‌గా ఎనేబుల్ చేసినట్లు భారతి ఎయిర్‌టెల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సీఈవో అజయ్ అనంతపద్మనాభన్ చెప్పారు. ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఈ–మెయిల్స్ మొదలైన వాటిల్లో వచ్చే లింకులను ఈ అధునాతన వ్యవస్థ ఫిల్టర్ చేస్తుందని పేర్కొన్నారు. స్కాములను నివారించేందుకు తమ విభాగం నిరంతరం కృషి చేస్తోందని, ఎయిర్‌టెల్ కూడా సమర్థవంతమైన ఫ్రాడ్ డిటెక్షన్ సొల్యూషన్ ప్రవేశపెట్టడం ప్రయోజనకరమైన విషయమని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ, డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు.

ఏషియన్ పెయింట్స్‌లో రిలయన్స్ వాటా విక్రయం

3.64 శాతానికి రూ. 7,703 కోట్లు



న్యూఢిల్లీ: ఏషియన్ పెయింట్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.64 శాతం వాటాకు సరిసమానమైన 3.50 కోట్ల షేర్లను విక్రయించింది. వీటి విలువ రూ. 7,703 కోట్లు. ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా ఒక్కో షేరును సగటున రూ. 2,201కి విక్రయించగా, ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. తాజా లావాదేవీతో ఏషియన్ పెయింట్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ సిద్ధాంత్ కమర్షియల్స్ వాటా 4.90 శాతం నుంచి 1.26 శాతానికి తగ్గింది. మరోవైపు ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ షేర్‌హోల్డింగ్ 1.51 శాతం నుంచి 5.15 శాతానికి పెరిగింది.

గురువారం బీఎస్ఈలో ఏషియన్ పెయింట్స్ షేరు స్వల్పంగా పెరిగి రూ. 2,225 వద్ద క్లోజయ్యింది.

మ్యాప్ మై ఇండియాలో వాటా తగ్గించుకున్న ఫోన్ పే

5 శాతం వాటా అమ్మకం



న్యూఢిల్లీ: డిజిటల్ మ్యాపింగ్, టెక్నాలజీ సొల్యూషన్లను అందించే మ్యాప్ మై ఇండియా (సీఈ ఇన్ఫోసిస్టమ్స్)లో డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే వాటాను తగ్గించుకుంది. కంపెనీలో 5 శాతం వాటాకు సమానమైన షేర్లను ఓపెన్ మార్కెట్ లావాదేవీల రూపంలో విక్రయించింది. వీటి విలువ రూ.486 కోట్లుగా ఉంది. బీఎస్ఈ బల్క్‌డీల్ డేటా ప్రకారం.. మ్యాప్ మై ఇండియాలో ఫోన్‌పే మొత్తం 27.1 లక్షల షేర్లను, ఒక్కోటీ సగటు ధర రూ.1,786.22కు అమ్మేసింది. దీంతో మ్యాప్ మై ఇండియా షేరు (సీఈ ఇన్ఫోసిస్టమ్స్) బీఎస్ఈలో 9 శాతానికి పైనే నష్టపోయి రూ.1,768.75 వద్ద ముగిసింది. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, టాటా మ్యూచువల్ ఫండ్ సంయుక్తంగా 12.88 లక్షల షేర్లను (2.4 శాతం వాటాకు సమానం) కొనుగోలు చేశాయి. ఈ వాటా విక్రయం అనంతరం మ్యాప్ మై ఇండియాలో ఫోన్‌పే వాటా 18.74 శాతం నుంచి 13.74 శాతానికి తగ్గింది.

ఈపీఎఫ్ క్లెయిమ్‌లకు వేగంగా ఆమోదం

50% క్లెయిమ్‌లకు 3 రోజుల్లో పరిష్కారం



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) క్లెయిమ్‌ల పరిష్కారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరింత వేగాన్ని సంతరించుకుంది. క్లెయిమ్ దరఖాస్తుల్లో 50 శాతాన్ని (ప్రధానంగా ఉపసంహరణ) మూడు రోజుల్లోనే పరిష్కరించినట్టు ఓ అధికారి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇలా మూడు రోజుల్లోనే పరిష్కరించిన క్లెయిమ్‌లు 39 శాతంగా ఉన్నట్టు చెప్పారు. 2025 ఏప్రిల్ నుంచి జూన్ 5 మధ్య 68.96 లక్షల క్లెయిమ్‌లకు మూడు రోజుల్లో పరిష్కారం లభించింది. ప్రస్తుతం రూ.లక్ష వరకు క్లెయిమ్‌లకు ఆటోమేటెడ్ పరిష్కారం అమల్లో ఉండగా, ఈపీఎఫ్‌వో త్వరలోనే రూ.5 లక్షల వరకు క్లెయిమ్‌లకు ఈ పరిమితిని పెంచనుంది. దీంతో మరిన్ని క్లెయిమ్‌లకు వేగంగా పరిష్కారం లభించనుందని ఆ అధికారి తెలిపారు. ఈ పరిమితి పెంపునకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఆమోదం అవసరం లేదన్నారు. సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ ఇందుకు అనుమతించొచ్చని చెప్పారు. అనారోగ్యం, విద్య, ఇంటి నిర్మాణం/కొనుగోలు, వివాహ అవసరాలకు సంబంధించిన క్లెయిమ్‌లు రూ.లక్ష వరకు ఉండి, దరఖాస్తుదారులకు అర్హతలు ఉంటే వాటికి మూడు రోజుల్లోనే క్లెయిమ్ మొత్తం మంజూరవుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా 2012కు ముందు చేరిన సభ్యుల క్లెయిమ్‌ల ధ్రువీకరణకు సమయం తీసుకుంటున్నట్టు తెలిపారు. పెన్షన్, గ్రూప్ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ ఉపసంహరణలు అన్నింటినీ 72 గంటల్లోనే పరిష్కరించాలన్నది ఈపీఎఫ్‌వో లక్ష్యమని.. ఈ దిశగా ఈపీఎఫ్‌వో కృషి చేస్తున్నట్టు చెప్పారు.

పీఎల్ఐ స్కీములతో పెట్టుబడులకు దన్ను...


ఎలక్ట్రిక్ హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ రంగంపై ఎఫ్ఐఎంఐ నివేదిక



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్, ఇతరత్రా ప్రత్యామ్నాయ ఇంధనాలతో పని చేసే హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ (హెచ్ఈఎంఎం) తయారీ కోసం ప్రత్యేకంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని (పీఎల్ఐ) ప్రవేశపెడితే మరిన్ని కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుందని ఓ నివేదిక తెలిపింది. ప్రస్తుతం దేశీయంగా ఇలాంటి వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటంతో భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ విభాగంపై తయారీ సంస్థలు, సరఫరాదారులు పెద్ద స్థాయిలో ఇన్వెస్ట్ చేయకపోవచ్చని పేర్కొంది. 'పీఎల్ఐ స్కీమును ప్రకటిస్తే కొత్త పెట్టుబడులు వస్తాయి. తయారీ, ఇంజినీరింగ్, ఆర్అండ్‌డీ విభాగాల్లో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఎలక్ట్రిక్, ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే హెచ్ఈఎంఎంలను దేశీయంగా ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాలు పెరుగుతాయి' అని భారతీయ ఖనిజ పరిశ్రమ సమాఖ్య (ఎఫ్ఐఎంఐ) రూపొందించిన నివేదిక తెలిపింది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్‌తో కలిసి ఎఫ్ఐఎంఐ దీన్ని రూపొందించింది. మైనింగ్ కార్యకలాపాల్లో కీలకమైన హెచ్ఈఎంఎంలు.. కర్బన ఉద్గారాలకు కారకంగా ఉంటున్నందున పర్యావరణహితమైన మెషినరీపై ఆసక్తి ఏర్పడుతోంది.

భారత ఫార్మా సంస్థలు ఉత్పత్తులను కాపీ కొట్టవు

- మేధో హక్కులను భారత్ గౌరవిస్తుంది
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



బెర్న్: భారత ఫార్మాస్యూటికల్స్ కంపెనీలు స్విస్ కంపెనీల ఉత్పత్తులను కాపీ కొడతాయన్న ఆరోపణలను కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఖండించారు. ఇది ఎంతో కాలంగా నెలకొన్న అపోహ అని స్పష్టం చేశారు. మేధో సంపత్తి హక్కులను (ఐపీఆర్) భారత్ గౌరవిస్తుందే కానీ.. ఇతరుల నుంచి టెక్నాలజీని ఎప్పుడూ చోరీ చేయదన్నారు. తమ ట్రేడ్‌మార్క్‌లు లేదా పేటెంటెడ్ లేదా కాపీ రైట్ టెక్నాలజీని భారత కంపెనీలు చట్టవిరుద్ధంగా కాపీ చేశాయన్న దానికి స్విస్ కంపెనీలు ఒక్క నిదర్శనం కూడా చూపించలేకపోయినట్టు చెప్పారు. ఈ విషయంలో ఒక్క కంపెనీ కూడా ఏ ఒక్క ఘటనను తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. పేటెంట్లలో స్వల్ప మార్పులను భారత్ అనుమతించబోదన్నారు. దురదృష్టవశాత్తూ కొన్ని కంపెనీలు కొన్ని సవరణలతో అదనపు మేధో హక్కును సొంపాదిస్తున్నట్టు పేర్కొన్నారు. భారత పేటెంట్ చట్టంలోని సెక్షన్ 3(డీ) కింద అప్పటికే ఉన్న పేటెంటెడ్ ఔషధాల కంటే మరింత ప్రభావవంతమైనవని నిరూపితమైనే కొత్త వాటికి అనుమతులకు అవకాశం కల్పిస్తుండడం గమనార్హం. ఈ నిబంధనలను సవరించాలని కొన్ని బహుళజాతి కంపెనీలు లోగడ కోరినప్పటికీ భారత్ తోసిపుచ్చింది. ఐపీఆర్ ప్రక్రియలను భారత్ మరింత మెరుగుపరుస్తోందని, దీంతో నిబంధనల అమలు భారం తగ్గి, వేగంగా అనుమతులు లభిస్తాయని మంత్రి చెప్పారు.

సూక్ష్మ రుణాలు 25 శాతం డౌన్

- 2024–25లో వితరణ రూ.1.12 లక్షల కోట్లు
- సగటు రుణంలో 12 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: సూక్ష్మ రుణ సంస్థలు గత ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేసిన రుణాల మొత్తం రూ.1,12,459 కోట్లుగా ఉంది. మొత్తం 2.2 కోట్ల ఖాతాదారులకు ఈ మొత్తం రుణాల రూపంలో అందింది. 2023–24లో ఈ రంగం పంపిణీ చేసిన రుణాల మొత్తంతో పోల్చితే 25 శాతం తగ్గినట్టు సూక్ష్మ రుణ సంస్థల నెట్‌వర్క్ (ఎంఫిన్) తెలిపింది. 2023–24తో పోల్చితే 2024–25లో ఒక్కో ఖాతావారీ సగటు రుణ పంపిణీ 12.3 శాతం అధికంగా రూ.50,131గా ఉంది. ఎన్‌బీఎఫ్‌సీ–ఎంఎఫ్ఐ రంగం గత ఆర్థిక సంవత్సరంలో రూ.57,307 కోట్లను రుణాల రూపంలో సమకూర్చుకుంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం కంటే 36 శాతం ఎక్కువ. ఎన్‌బీఎఫ్‌సీ–ఎంఎఫ్ఐ సమీకరించిన రుణ నిధుల్లో 78.4 శాతం బ్యాంకుల నుంచి లభించింది. 11.9 శాతం నాన్ బ్యాంకుల నుంచి, 5.1 శాతం ఈసీబీల రూపంలో వచ్చింది. 2025 మార్చితో ముగిసిన చివరి మూడు నెలల కాలంలో ఎంఎఫ్ఐ నిర్వహణ ఆస్తులు (రుణాలు) 2024 మార్చి త్రైమాసికంతో పోల్చి చూస్తే 11.9 శాతం తగ్గి రూ.1,47,279 కోట్లుగా ఉన్నాయి. ప్రాంతాలవారీగా ఎంఎఫ్ఐ పోర్ట్‌ఫోలియోని గమనిస్తే.. తూర్పు, ఈశాన్య రాష్ట్రాల వాటా 33 శాతంగా ఉంది. దక్షిణాది రాష్ట్రాలు 28 శాతం, ఉత్తరాది 17 శాతం, పశ్చిమ భారత్ వాటా 14 శాతం చొప్పున ఉంది.



ఇంగ్లండ్ పర్యటనకు రాధా యాదవ్

గాయపడిన శుచి స్థానంలో భారత మహిళల జట్టుకు ఎంపిక

ముంబై: ఇంగ్లండ్‌లో పర్యటించే భారత మహిళల జట్టుకు లెఫ్టార్మ్ స్పిన్నర్ రాధా యాదవ్ ఎంపికైంది. శుచి ఉపాధ్యాయ్ స్థానంలో ఆమెను ఎంపిక చేసినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. 20 ఏళ్ల స్పిన్నర్ శుచి గత నెల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు సిరీస్ ద్వారా వన్డేల్లో అరంగేట్రం చేసింది. తాజాగా ఆమె ఎడమ కాలికి గాయమైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళల జట్టు సభ్యులు పాల్గొంటున్నారు. త్వరలో అక్కడికి బయలుదేరనున్న మహిళల జట్టు ఇంగ్లండ్‌లో పరిమిత ఓవర్ల ద్వైపాక్షిక సిరీస్‌లలో ఆడనుంది. ఐదు టి20లు సహా మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు తలపడతాయి. ఇందులో భాగంగా జూన్ 28న నాటింగ్‌హామ్‌లో తొలి టి20 జరుగుతుంది. జూలై 1న బ్రిస్టల్‌లో రెండో మ్యాచ్, 4న ఓవల్‌లో మూడు, 9న మాంచెస్టర్‌లో నాలుగు, 12న బర్మింగ్‌హామ్‌లో ఆఖరి టి20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అనంతరం సౌతాంప్టన్, లార్డ్స్, చెస్టర్లీ స్ట్రీట్ వేదికలపై వరుసగా జూలై 16, 19, 22 తేదీల్లో మూడు వన్డేలు నిర్వహిస్తారు.

భారత మహిళల టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, రిచా ఘోష్, యస్తిక, హర్లీన్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, సయాలీ సత్‌గరే, రాధా యాదవ్. **వన్డే జట్టు:** హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, ప్రతీక, హర్లీన్, జెమీమా, రిచా, యస్తిక, తేజల్, దీప్తి, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్, అరుంధతి రెడ్డి, క్రాంతి, సయాలీ, రాధా యాదవ్.



కరుణ్ నాయర్ ఏం చేస్తాడో!

ఎనిమిదేళ్ల తర్వాత జాతీయ జట్టులోకి పునరాగమనం

ఇంగ్లండ్ పర్యటనలో అందరి దృష్టి అతడిపైనే

రెండో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానంటున్న కర్ణాటక ప్లేయర్

'ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి టెస్టు జట్టులో చోటు దక్కడం ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఈ అవకాశాన్ని రెండు చేతులా ఒడిసి పట్టేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా' ఇది కరుణ్ నాయర్ తాజా వ్యాఖ్య. ఈ నెల 20 నుంచి ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ఎంపికైన కరుణ్ నాయర్... సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వచ్చిన చాన్స్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని భావిస్తున్నాడు. 2024–25 రంజీ సీజన్‌లో విదర్భ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 33 ఏళ్ల కరుణ్ నాయర్... 53.93 సగటుతో 863 పరుగులు చేశాడు. దీంతో విదర్భ జట్టు రంజీ చాంపియన్‌గా నిలవగా... అంతకుముందు విజయ్ హజారే ట్రోఫీలోనూ నాయర్ దుమ్మురేపాడు. 8 ఇన్నింగ్స్‌ల్లో 389.50 సగటుతో 779 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో 5 శతకాలు ఉండటం విశేషం. ఈ ప్రదర్శన అతడిని మరోసారి వెలుగులోకి తేగా... తాజా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున కూడా మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టులో ఖాళీ ఏర్పడగా... ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం కూడా ఉన్న కరుణ్‌ను సెలెక్టర్లు తిరిగి జట్టుకు ఎంపిక చేశారు.

అనధికారిక టెస్టులో 'డబుల్'

ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ లయన్స్, భారత్ 'ఎ' జట్ల మధ్య జరిగిన అనధికారిక టెస్టులోనూ నాయర్ ఆకట్టుకున్నాడు. తొలి ప్రాక్టీస్ పోరులో మూడో స్థానంలో బరిలోకి దిగి డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. ఈ ప్రదర్శనతో తొలి టెస్టులో కరుణ్‌కు తుది జట్టులో చోటు దక్కడం ఖాయంగానే కనిపిస్తోంది. మరి విధ్వంసక వీరుడు వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత భారత్ తరపున టెస్టు క్రికెట్‌లో 'ట్రిపుల్ సెంచరీ' చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచిన నాయర్... సెకండ్ ఇన్నింగ్స్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడో చూడాలి. 2016లో ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నాయర్... తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 4, 13 పరుగులు చేశాడు. మూడో మ్యాచ్‌లో అవకాశం దక్కించుకున్న నాయర్.. చెన్నై పిచ్‌పై ఇంగ్లండ్ బౌలర్లను చితక్కొట్టాడు. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న మైదానంలో తన సహచర ఆటగాడు కేఎల్ రాహుల్ అండతో భారీ ఇన్నింగ్స్ ఆడి... కెరీర్‌లో తొలి సెంచరీనే ట్రిపుల్ సెంచరీగా మలిచాడు. అయితే అప్పటికే టీమిండియా సిరీస్ కైవసం చేసుకోగా... ఎక్కువ ఒత్తిడి లేని మ్యాచ్ కావడంతోనే నాయర్ 'ట్రిపుల్ సెంచరీ' చేయగలిగాడనే వార్తలు వినిపించాయి. ఎవరేమన్నా... స్టువర్ట్ బ్రాడ్, బెన్ స్టోక్స్, మొయిన్ అలీ, ఆదిల్ రషీద్ వంటి ప్రపంచస్థాయి బౌలర్లను ఎదుర్కొంటూ మూడొందల పరుగులు చేయడం అంటే... ఎలాంటి స్థితిలో అయినా అషామాషీ కాదనేది వాస్తవం.


యువ ఆటగాళ్లకు పెద్దన్నలా...

నాయర్ 'ట్రిపుల్ సెంచరీ' అనంతరం బంగ్లాదేశ్‌తో టీమిండియా ఆడిన ఏకైక టెస్టులో అతడికి అవకాశం దక్కలేదు. ఆ వెంటనే ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌కు నాయర్‌ను ఎంపిక చేసినా... అతడు ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. మూడు టెస్టుల్లో ఒక్కసారి కూడా 30 పరుగుల మార్క్ దాటలేకపోయాడు. దీంతో అతడికి మరో అవకాశం దక్కలేదు. 2018 ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైనా... ఐదు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. అప్పటికే సిరీస్ కోల్పోయిన అనంతరం జరిగిన ఆఖరిదైన ఐదో టెస్టులో సైతం నాయర్‌కు అవకాశం ఇవ్వకుండా... తెలుగు ఆటగాడు హనుమ విహారిని భారత్ నుంచి రప్పించి మరీ అరంగేట్రం చేయించారు. ఇక అప్పటి నుంచి రేసులో వెనుకబడిపోయిన నాయర్... దేశవాళీ ధనాధన్‌తో మళ్లీ వెలుగులోకి వచ్చాడు. అయితే గతంతో పోలిస్తే షాట్‌ల ఎంపికలో కచ్చితత్వం... బ్యాటింగ్‌లో నిలకడ... అనుభవం అతడిని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ వంటి యువ ఆటగాళ్లతో కూడిన జట్టులో నాయర్ కీలకం కాగలడని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జట్టులో అందరికంటే సీనియర్ అయిన కేఎల్ రాహుల్‌కు నాయర్‌తో మంచి అనుబంధం ఉండగా... ఈ పర్యటనలో ఈ కన్నడ జోడీపై భారీ అంచనాలు ఉన్నాయి. 2023–24 సీజన్‌లలో ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో నార్తంప్టన్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నాయర్ 56.61 సగటుతో 736 పరుగులు చేశాడు. అక్కడి పరిస్థితులపై చక్కటి అవగాహన ఉన్న నాయర్... యువ ఆటగాళ్లకు పెద్దన్నలా వ్యవహరిస్తే ఈ సిరీస్‌లో టీమిండియాకు సానుకూల ఫలితాలు దక్కే అవకాశం ఉంది.

'ప్రియమైన క్రికెట్... నాకు మరో అవకాశం ఇవ్వు'... ఇది 2022 డిసెంబర్‌లో కరుణ్ నాయర్ చేసిన ట్వీట్! జాతీయ జట్టు తరపున ఆడిన మూడో టెస్టులోనే 'ట్రిపుల్ సెంచరీ' చేసి రికార్డులు తిరగరాసిన కరుణ్ నాయర్... ఆ తర్వాత లైమ్ లైట్‌లో లేకుండా పోయాడు. కెరీర్‌లో తొలి శతకాన్నే మూడొందలుగా మార్చినా... ఆ మరుసటి మ్యాచ్‌లోనే అతడికి తుది జట్టులో అవకాశం లేకుండా పోయింది. ఆ తర్వాత టీమిండియా ఆడిన వరుస మూడు మ్యాచ్‌ల్లో ఆడినా... వాటిలో తనదైన ముద్ర వేయడంలో విఫలమయ్యాడు! దీంతో సెలెక్టర్లు అతడి పేరు పరిశీలించడమే మానేశారు. అయినా పట్టువీడని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూ వచ్చిన కరుణ్ నాయర్... దేశవాళీల్లో టన్నులకొద్దీ పరుగులు చేసి తిరిగి జాతీయ జట్టులో అవకాశం దక్కించుకున్నాడు. ఎనిమిదేళ్ల నిరీక్షణ అనంతరం వచ్చిన 'సెకండ్ చాన్స్'ను సద్వినియోగ పరుచుకుంటూ ఇంగ్లండ్‌తో సిరీస్‌లో సత్తా చాటేందుకు నాయర్ సమాయత్తమవుతున్నాడు.

–సాక్షి క్రీడావిభాగం

బంగ్లాదేశ్ వన్డే కెప్టెన్‌గా మిరాజ్




ఢాకా: ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్ బంగ్లాదేశ్ వన్డే కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వచ్చే నెలలో శ్రీలంకతో జరగనున్న వన్డే సిరీస్ నుంచి 27 ఏళ్ల మిరాజ్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ఏడాది కాలం పాటు అతడు ఈ బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ప్రస్తుతం టెస్టు, వన్డే కెప్టెన్‌గా కొనసాగుతున్న నజ్ముల్ హసన్ షాంటో ఇకపై టెస్టు ఫార్మాట్‌కు మాత్రమే నాయకత్వం వహించనున్నాడు. టి20లకు లిటన్ దాస్ సారథ్యం వహిస్తున్నాడు. ఈ నెల 17 నుంచి బంగ్లాదేశ్ జట్టు శ్రీలంకలో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య రెండు టెస్టులు, 3 వన్డేలు, మూడు టి20లు జరగనున్నాయి. అనంతరం భారత్‌తో బంగ్లాదేశ్ పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడనుంది. 2017లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మిరాజ్... ఇప్పటి వరకు 105 వన్డేలాడి 1617 పరుగులు చేయడంతో పాటు 110 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. 'ఇది నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. జాతీయ జట్టుకు సారథ్యం వహించడం ప్రతి ఆటగాడి కల. అలాంటి అవకాశం రావడం అదృష్టం. అత్యుత్తమ ప్రదర్శనతో నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తా. ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపుతూ అందరితో కలిసి ముందుకు సాగుతా' అని మిరాజ్ అన్నాడు. అటు బంతితో ఇటు బ్యాట్‌తో జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న మిరాజ్ సారథిగానూ విజయవంతమవుతాడని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఆశాభావం వ్యక్తం చేసింది.



మెకింటోష్... మూడో ప్రపంచ రికార్డు

విక్టోరియా: కెనడా స్టార్ స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ మరో ప్రపంచ రికార్డు తన ఖాతాలో వేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కెనడా జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో 18 ఏళ్ల మెకింటోష్ ఐదు రోజుల వ్యవధిలో మూడో ప్రపంచ రికార్డు తిరగరాసింది. బుధవారం జరిగిన 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ రేసులో 4 నిమిషాల 23.65 సెకన్లలో లక్ష్యాన్ని చేరి తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును (4 నిమిషాల 24.38 సెకన్లు) తిరగరాసింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించిన మెకింటోష్... వచ్చే నెలలో సింగపూర్ వేదికగా జరగనున్న ప్రపంచ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ఈ ట్రయల్స్‌లో భాగంగా ఇప్పటికే మెకింటోష్ 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ, 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగాలలో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించింది. 'పోటీకి ముందే ఏదో ప్రత్యేకంగా చేస్తానని అనుకున్నా. నా కెరీర్‌లో ఇది అత్యుత్తమ టోర్నీ. ప్రపంచ రికార్డులు నమోదయ్యేవి బద్దలవడానికే. కొలనుకు వీడ్కోలు చెప్పేంతవరకు వాటిపై నా పేరే ఉండే విధంగా చూసుకుంటా' అని మెకింటోష్ పేర్కొంది.



బోపన్న జోడీ ఓటమి

స్టుట్‌గార్ట్: బాస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–సాండర్ జిలె (బెల్జియం) పోరాటం ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ బోపన్న–జిలె ద్వయం 5–7, 4–6తో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)–జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్) జంట చేతిలో ఓడిపోయింది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–జిలె జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒక్కసారి కూడా బ్రేక్ చేయలేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన బోపన్న–జిలెలకు 6,930 యూరోల (రూ. 6 లక్షల 86 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సింగిల్స్ విజేతల ఖాతాలో రూ. 35 కోట్లు

ప్రైజ్‌మనీ వివరాలను ప్రకటించిన వింబుల్డన్ నిర్వాహకులు

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌కు సంబంధించి ప్రైజ్‌మనీ వివరాలను నిర్వాహకులు ప్రకటించారు. ఈ ఏడాది పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 30 లక్షల పౌండ్‌ల (రూ. 35 కోట్లు) చొప్పున లభిస్తాయి. రన్నరప్‌గా నిలిచిన క్రీడాకారులకు 15 లక్షల 20 వేల పౌండ్‌ల (రూ. 17 కోట్ల 68 లక్షలు) చొప్పున అందజేస్తారు. సెమీఫైనల్లో ఓడిన వారికి 7,75,000 పౌండ్‌ల (రూ. 9 కోట్లు) చొప్పున... క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగిన వారికి 4 లక్షల పౌండ్‌ల (రూ. 4 కోట్ల 65 లక్షలు) చొప్పున... ప్రిక్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలైన వారికి 2,40,000 పౌండ్‌ల (రూ. 2 కోట్ల 79 లక్షలు) చొప్పున లభిస్తాయి. మూడో రౌండ్‌లో ఓడిన వారికి 1,52,000 పౌండ్‌ల (రూ. 1 కోటీ 72 లక్షలు) చొప్పున... రెండో రౌండ్‌లో వెనుదిరిగిన వారికి 99 వేల పౌండ్‌ల (రూ. 1 కోటీ 15 లక్షలు) చొప్పున, తొలి రౌండ్‌లో ఓడిన వారికి 66 వేల పౌండ్‌ల (రూ. 77 లక్షలు) చొప్పున అందజేస్తారు. పురుషుల, మహిళల డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించిన జోడీలకు 6,80,000 పౌండ్‌ల (రూ. 7 కోట్ల 91 లక్షలు) చొప్పున లభిస్తాయి. ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ జూన్ 30 నుంచి జూలై 13వ తేదీ వరకు జరుగుతుంది. గత సంవత్సరం పురుషుల సింగిల్స్‌లో అల్‌కరాజ్, మహిళల సింగిల్స్‌లో క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) టైటిల్స్ సాధించారు.

ఇక... మైదానంలో మ్యాచ్ ప్రాక్టీస్

నేటి నుంచి భారత జట్ల సన్నాహక పోరు ● భారత్ 'ఎ'తో సీనియర్ జట్టు 'ఢీ'



సిరాజ్

బెకెన్‌హామ్: ఐదు టెస్టుల పూర్తిస్థాయి సిరీస్‌కు ముందు తమ బలాన్ని పరీక్షించుకునేందుకు భారత ఆటగాళ్లంతా సిద్ధమయ్యారు. విదేశీ పర్యటనకు వెళితే సాధారణంగా అక్కడి దేశవాళీ జట్టుతో ప్రాక్టీస్ చేస్తారు. కానీ ఈసారి అనధికారిక టెస్టులు ఆడేందుకు ఇంగ్లండ్ వచ్చిన భారత్ 'ఎ' జట్టుతోనే సీనియర్ జట్టు వార్మప్ మ్యాచ్‌కు సిద్ధమైంది. ఈ నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ నేటి నుంచి జరుగుతుంది. ఇక్కడికి రాగానే నెట్స్‌లో కసరత్తు చేసిన ఆటగాళ్లు ఇప్పుడు మైదానంలో ప్రాక్టీస్ చేయనున్నారు. నాలుగు రోజుల పాటు జరుగనున్నప్పటికీ ఈ వార్మప్ పోరుకు ఫస్ట్‌క్లాస్ హోదా లేదు. దీంతో బాగా ఆడినా... త్వరగా అవుటైనా ఫస్ట్‌క్లాస్ గణాంకాల్లో నమోదు కావు. కాబట్టి ఆటగాళ్లందరూ యథేచ్ఛగా ఆడుకునేందుకు అవకాశముంటుంది. ఐదు రోజుల ఫార్మాట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి రిటైరయ్యాక జరుగుతున్న తొలి సిరీస్ కావడంతో... తుది జట్టు కూర్పు, యువ ఆటగాళ్ల నేర్పు కొంతవరకైనా తెలుసుకునేందుకు ఈ ప్రాక్టీస్ మ్యాచ్ దోహదం చేస్తుందని భారత జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. టీమిండియా బలాలు, బలహీనతలు బయటికి పొక్కకుండా ఈ ప్రాక్టీస్ మ్యాచ్ నిర్వహించాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనుకుంటున్నాడు. ఇందులో భాగంగా ప్రేక్షకులు, భారత అభిమానులెవరికీ ప్రవేశం కల్పించడం లేదు. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్ ఇదే విధంగా చేసింది. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ నెట్స్‌లో శ్రమించడం, 90 ఓవర్ల పాటు మ్యాచ్ ఆడటం రెండు భిన్నమైనవని అన్నాడు. ముఖ్యంగా ఈ నాలుగు రోజుల పాటు 360 ఓవర్లు ఆడే ఆటగాళ్ల సామర్థ్యాన్ని భారత సహాయక బృందం పరిశీలిస్తుంది. అలాగే బౌలింగ్ విభాగానికి ఈ పర్యటనలో ఎదురయ్యే ప్రతికూలతల్నీ తెలుసుకోనుంది. పేసర్లు, స్పిన్నర్లు రోజంతా ఎన్ని ఓవర్లను ఉత్సాహంగా వేయగలరో ఒక అంచనాకు వస్తుంది. సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు అక్కడి బౌన్సీ పిచ్‌లపై ఎదురయ్యే సవాళ్లను కూడా భారత మేనేజ్‌మెంట్ బేరీజు వేస్తుంది. స్పీడ్‌స్టర్ బుమ్రా జట్టుకు అందుబాటులో ఉన్నప్పటికీ మొత్తం ఐదు టెస్టులు ఆడే అవకాశమైతే లేదు. ఈ విషయాన్ని సెలక్షన్ సమయంలోనే స్పష్టం చేశారు. ఐదింటిలో మూడు టెస్టులే అతను ఆడతాడని వెల్లడించారు. ఏ మూడు మ్యాచ్‌లనే విషయాన్ని అపుడు సెలక్టర్లు... ఇప్పుడు కోచ్ గంభీర్... స్పష్టంగా చెప్పడం లేదు. అగ్రశ్రేణి పేసర్ బుమ్రా ఆరు నెలల తర్వాత టెస్టు బరిలోకి దిగబోతున్నాడు. తన విభిన్న శైలీ బౌలింగ్ కారణంగా తరచూ ఇబ్బందిపెట్టే వెన్నెముక గాయం నుంచి కోలుకున్నాక బుమ్రా స్వదేశంలో జరిగిన ఐపీఎల్ ఆడాడు. అది కేవలం 4 ఓవర్లకు సంబంధించిన ఫార్మాట్... కానీ ఇది సుదీర్ఘ ఫార్మాట్ ఇందులో రోజు పడే 90 ఓవర్లలో అతను ఎన్ని ఓవర్లు సమర్థంగా వేయగలడో ఈ ప్రాక్టీస్ మ్యాచ్ ద్వారా తెలియనుంది. ఈ వార్మప్‌లో అందరూ భారత ఆటగాళ్లే అయినా మ్యాచ్‌కు ముందరి తుది సన్నాహకం కావడంతో ప్రత్యర్థితో ఆడే పట్టుదలే కనబరుస్తారని జట్టు మేనేజ్‌మెంట్ చెబుతోంది.



సాయి సుదర్శన్


ఢిల్లీలో ఎండవేడిమి నుంచి ఉపశమనానికి ముఖం కడుక్కుంటున్న బాటసారి


ఢిల్లీలో దాహార్తి తీర్చుకుంటున్న కాకి


జలంధర్‌లో కాలువలో ఈతకొడుతున్న కుర్రాళ్లు


గుహవటిలోని జూలో నీటిలో సేదదీరుతున్న జింకలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

సైనిక సిబ్బందిని తిరిగి రప్పిస్తున్న అమెరికా

అతి ప్రమాదకరమైన ప్రదేశంగా మారింది: ట్రంప్

ఇరాన్ అణు ఒప్పంద ప్రతిష్టంభనతో కీలక పరిణామాలు

టెహ్రాన్: ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల్లో ప్రతిష్టంభన నెలకొన్నట్లు కనిపిస్తోంది. దాంతో ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ఇజ్రాయెల్ సన్నాహాలు చేస్తోందని అమెరికా నిఘా వర్గాలు సంకేతాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించాలని ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వెనక్కు రావాల్సిందిగా సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు ప్రకటించారు. ''పశ్చిమాసియా ప్రమాదకరమైన ప్రదేశంగా మారేలా ఉంది. అందుకే అమెరికా సిబ్బందిని అక్కడి నుంచి తరలిస్తున్నాం''అని బుధవారం ప్రకటించారు. ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు విఫలమయ్యేలా కన్పిస్తున్నందునే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని అమెరికా అనుమతించబోదని ఆయన పునరుద్ఘాటించారు. యురేనియం శుద్ధిని ఆపాలన్న అమెరికా డిమాండ్‌కు ఇరాన్ అంగీకరిస్తుందన్న నమ్మకం తగ్గిపోతోందని తెలిపారు.

ఇరాన్‌అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని ట్రంప్ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్‌తో అణు చర్చలు విఫలమైతే అవసరమైతే దాడి చేస్తామని గతంలో కూడా హెచ్చరించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే చర్యల గురించి మీడియా ప్రస్తావించగా, ''చాలా సింపుల్. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదు''అని స్పష్టం చేశారు. ట్రంప్ నిర్ణయం, వ్యాఖ్యలను గమనిస్తే పశ్చిమాసియాలో ఏదో జరగబోతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇరాన్‌పై దాడులు జరిగితే పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ప్రతీకార దాడులకు దిగుతామని ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదే బుధవారం హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే సైనిక తదితర సిబ్బందిని పశ్చిమాసియా దేశాల నుంచి అమెరికా తరలిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పశ్చిమాసియాలో ఇరాక్, కువైట్, ఖతర్, బహ్రెయిన్, యూఏఈల్లో అమెరికాకు సైనిక స్థావరాలున్నాయి. పశ్చిమాసియాలో అమెరికాకు ఇరాక్ కీలక భాగస్వామి. ఈ ప్రాంతంలోనే అమెరికాకు అధిక బలగాలున్నాయి. ఆయా ప్రాంతాల్లోని సైనిక సిబ్బంది కుటుంబాలు స్వచ్ఛందంగా బయలుదేరడానికి అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అనుమతిచ్చారని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇరాక్‌లోని రాయబార కార్యాలయాన్ని పాక్షికంగా ఖాళీ చేయడానికి అమెరికా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దనీఇకి కారణాలను ఇరు దేశాలూ ప్రకటించలేదు. బహ్రెయిన్, కువైట్ నుంచి స్వచ్ఛందంగా బయలుదేరడానికి విదేశాంగ శాఖ అనుమతి ఇచ్చిందని, ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన కారణంగా అత్యవసరం లేని సిబ్బంది తిరిగి రావాలని జూన్ 11న విదేశాంగ శాఖ ఆదేశించిందని అమెరికా అధికారి ఒకరు తెలిపారు. అయితే పశ్చిమాసియాలో అతి పెద్ద అమెరికా సైనిక స్థావరమైన ఖతర్‌లోని అల్ ఉదీద్‌లో కార్యకలాపాల్లో ఎలాంటి మార్పూ లేదు. ఖతర్‌లోని అమెరికా రాయబార కార్యాలయమూ యథావిధిగా పనిచేస్తోంది. ఉద్యోగులు, కుటుంబాలకు తరలింపు ఉత్తర్వులు జారీ చేయలేదు.

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు మరింత ముమ్మర సైనిక కార్యకలాపాల దారితీయవచ్చని, ఇది కీలకమైన జలమార్గాలలో షిప్పింగ్‌ను ప్రభావితం చేస్తుందని యూకే మారిటైం ట్రేడ్ ఆర్గనైజేషన్ బుధవారం హెచ్చరించింది. ఇరాన్ సరిహద్దులో ఉన్న గల్ఫ్, ఒమన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేటప్పుడు ఓడలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. అమెరికా కీలక ప్రకటనల నేపథ్యంలో ఇరాక్‌లోని తమ రాయబార కార్యాలయానికి సంబంధించి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు బ్రిటన్ తెలిపింది.

మంగళ సూత్రమే పట్టించింది

షిల్లాంగ్: మేఘాలయ హనీమూన్ హత్య కేసు దర్యాప్తులో ప్రధాన నిందితురాలు సోనమ్‌కు చెందిన మంగళసూత్రాలే కీలక సమాచారాన్ని పట్టిచ్చాయి. మే 23న తూర్పు ఖాసీ హిల్స్‌లో నోంగ్రియాట్ గ్రామంలోని హోమ్‌స్టే నుండి బయటకు వచ్చిన కొన్ని గంటలకే రాజా రఘువంశీ, సోనమ్ రఘువంశీ జంట అదృశ్యమైన విషయం తెలిసిందే. అయితే.. సోనమ్ రఘువంశీ హోమ్‌స్టేలోని సూట్‌కేస్‌లో వదిలేసి వెళ్లిన మంగళసూత్రం, ఉంగరాలే కేసును ఛేధించడానికి ఉపయోగపడ్డాయని మేఘాలయ డీజీపీ నోంగ్‌రాంగ్ తెలిపారు. ఈ జంట మే 22న ముందస్తు బుకింగ్ లేకుండా సోహ్రా హోమ్‌స్టేకు వెళ్లింది. అక్కడ గది దొరకలేదు. డబుల్ డెక్కర్ లివింగ్ రూట్ బ్రిడ్జి ఉన్న నోంగ్రియాట్ గ్రామానికి చేరుకోవడానికి 3,000 మెట్ల ట్రెక్కింగ్ ప్లాన్ చేసుకున్నారు. సూట్‌కేసులను సోహ్రా హోమ్‌స్టేలోనే ఉంచారు. నోంగ్రియాట్‌లోని మరో హోమ్‌స్టేలో రాత్రి బస చేశారు. మర్నాటి రోజు ఉదయం, అంటే మే 23న ఖాళీ చేసి సోహ్రా తిరిగి వెళ్లారు. అక్కడ ఒక స్కూటర్ అద్దెకు తీసుకుని వీసావ్‌డాంగ్ జలపాతానికి చేరుకున్నారు. అక్కడే ముగ్గురు కిరాయి హంతకులు సోనమ్ కళ్లముందే రాజాను చంపారు. సోహ్రా హోమ్‌స్టేలో ఉన్న సూట్‌కేసుల్లో లభించిన మంగళసూత్రం, ఉంగరాలు చూసి పోలీసులు అనుమానించారు. కొత్తగా పెళ్లయిన మహిళ మంగళసూత్రాలను వదిలి వెళ్లిందంటే పెళ్లి ఇష్టం లేకపోయి ఉండొచ్చని భావించి సోనమ్‌ను అనుమానితురాలిగా చేర్చారు. ఒక జంటతో పాటు ముగ్గురు హిందీ మాట్లాడే వారిని చూశానని ఓ స్థానికుడు చెప్పిన సాక్ష్యంతో సోనమ్‌పై అనుమానాలు మరింత బలపడ్డాయి. ప్రస్తుతం నిందితులు ఐదుగురు పోలీసుల కస్టడీలో ఉన్నారు.

ఎడాపెడా అంతరిక్ష ప్రయోగాలతో
ఓజోన్‌కు తూట్లు!

క్రైస్ట్‌చర్చ్ (న్యూజిలాండ్): అంతరిక్ష రంగంలో పట్టు కోసం అన్ని దేశాలూ కొన్నేళ్లుగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. దాంతో అంతరిక్ష ప్రయోగాల సంఖ్య కొద్ది సంవత్సరాలుగా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. అంతర్జాతీయ అంతరిక్ష పరిశ్రమ కనీవినీ ఎరగని రీతిలో వృద్ధి చెందుతూ వస్తోంది. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. విపరీతంగా పెరిగిపోతున్న రాకెట్ ప్రయోగాలు కీలకమైన ఓజోన్ పొరను తూట్లు పొడుస్తున్నట్టు తాజా అధ్యయనం వెల్లడించింది. పరారుణ తదితర హానికారక కిరణాలు భూమిని చేరకుండా అడ్డుకోవడంలో ఓజోన్ పొరది కీలక పాత్ర అన్నది తెలిసిందే. విచ్చలవిడి పారిశ్రామికీకరణ, పర్యావరణ విధ్వంసం తదితరాల వల్ల కొన్ని దశాబ్దాలుగా అది పలుచబడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రపంచదేశాలు కళ్లు తెరిచి దిద్దుబాటుకు దిగడంతో కొన్నేళ్లుగా ఓజోన్ పొరకు రంధ్రాలు పూడుతూ వస్తున్నాయి. అంతరిక్ష ప్రయోగాల వల్ల పరిస్థితి గంప లాభం చిల్లి తీసిన చందంగా మారుతున్నట్టు అంతర్జాతీయ సైంటిస్టుల బృందం నిర్వహించిన అధ్యయనంలో తేలింది.

అంటార్కిటికాపై చిల్లులు

2019లో ప్రపంచవ్యాప్తంగా 102 అంతరిక్ష ప్రయోగాలు జరిగాయి. 2024 కల్లా ఆ సంఖ్య 258కి పెరిగింది. ఈ ఏడాది ప్రయోగాలు మరింతగా పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. స్పేస్ ఎక్స్ తదితర ప్రైవేట్ కంపెనీల రాకతో అంతరిక్ష రంగంలో విపరీతమైన పోటీ నెలకొంది. దాంతో పాటే ప్రయోగాల సంఖ్య కూడా పెరిగిపోతోంది. వాటి ఫలితంగా వెలువడే రసాయనాలు ఓజోన్ పొరను బాగా దెబ్బ తీస్తున్నట్టు అధ్యయనం గుర్తించింది. వీటిలోనూ చాలా ప్రయోగాలు ఉత్తరార్ధ గోళంలో ఉన్న అమెరికా తదితర దేశాల్లోని 20 పై చిలుకు ప్రయోగ కేంద్రాల నుంచే జరుగుతున్నాయి. ''దాంతో అంటార్కిటికాపై ఓజోన్ పొరకు క్రమంగా చిల్లులు పడుతున్నట్టు తేలింది. ప్రయోగాల్లో భారీగా వాడే క్లోరిన్‌తో కూడిన, ముఖ్యంగా బ్లాక్ కార్బన్ కణాలను వెలువరించే రసాయనాలు ఓజోన్‌కు తీవ్ర నష్టం చేస్తాయి. కనుక కొంతకాలంగా మెరుగవుతున్న పొర మళ్లీ దెబ్బతింటూ వస్తోంది''అని అధ్యయనం పేర్కొంది. అంతరిక్ష ప్రయోగాల సంఖ్య ఏటా 2,000కు చేరే పక్షంలో ఓజోన్ పొరకు నష్టం ఆందోళనకర స్థాయికి చేరుతుందని హెచ్చరించింది. కనుక దేశాలన్నీ సకాలంలో స్పందించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని సూచించింది.

బంగ్లాదేశ్‌లో రవీంద్రుని పూర్వీకుల ఇంటిపై దాడి

ధాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని సిరాజ్‌గంజ్ జిల్లాలో ఉన్న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల ఇంటిపై దాడి జరిగింది. మంగళవారం నాటి ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం మోటార్ సైకిల్ పార్కింగ్ ఫీజు విషయంలో ఒక సందర్శకుడికి, సిబ్బందికి జరిగిన వాగ్వాదం దాడికి కారణమైంది. ఈ చరిత్రాత్మక స్థలంపై జూన్ 10న మూక దాడి జరిగింది. ఆడిటోరియం తదిత విభాగాల్లో కిటికీల అద్దాలు, తలుపులు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయి. అధికారులు ఆ ప్రదేశాన్ని మూసేశారు. దీనిపై దర్యాప్తుకు ముగ్గురు సభ్యులతో కమిటీ వేశారు. దీనికి సంబంధించి 50 నుంచి 60 మంది వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

సిరాజ్‌గంజ్‌లోని షాజాద్‌పూర్ ఉప జిల్లాలో రవీంద్రనాథ్ ఠాగూర్ పూర్వీకుల ఎస్టేట్ ఉంది. దీనిని 'రవీంద్ర కచారిబారి'గా పిలుస్తారు. ఇదిప్పుడు స్మారక మ్యూజియంగా మారింది. బంగ్లాదేశ్ ప్రవాసిగా ఉన్న షానవాజ్ జూన్ 8న తన కుటుంబంతో కలిసి కచారిబారిని సందర్శించారు. మ్యూజియం ప్రవేశ టికెట్ కొనుక్కుని, మోటార్ సైకిల్ పార్కింగ్ ఫీజు చెల్లించాడు. కానీ అతనికి రసీదు ఇవ్వలేదు. ప్రధాన ద్వారం వద్ద ఉన్న సిబ్బంది టికెట్ అడిగినప్పుడు చూపించకపోవడంతో గొడవ జరిగింది. తర్వాత సిబ్బంది, కస్టోడియన్ నవాజ్‌ను కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ జరిగిన గొడవలో ఆయనను కొట్టారు. ఈ సంఘటనతో ఆగ్రహించిన స్థానికులు మంగళవారం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నవాజ్‌పై దాడిని నిరసిస్తూ దుండగుల బృందం మర్నాడు విధ్వంసానికి దిగారు. సంస్థ డైరెక్టర్‌పైనా దాడి చేశారు. మ్యూజియంను తాత్కాలికంగా సందర్శకులకు మూసివేసినట్లు కచారిబారి సంరక్షకుడు మొహమ్మద్ హబీబుర్ రెహమాన్ తెలిపారు.

ఖండించిన బీజేపీ

దాడిని బీజేపీ ఖండించింది. ఇది కేవలం స్మారక చిహ్నంపై దాడి కాదని, భారత సాంస్కృతిక ఆత్మ, రవీంద్రుని తాత్వికతపై జరిగిన దాడి అని బీజేపీ ఎంపీ సంబిత్‌పాత్రా అన్నారు. జమాతే ఇస్లామ్, హెఫాజత్-ఇ-ఇస్లాం వంటి రాడికల్ గ్రూపులు ముందస్తు ప్రణాళికతో చేసిన చర్యగా దీన్ని అభివర్ణించారు. ''యూనస్ ప్రభుత్వం దీనిపై సరిగా స్పందించలేదు. ఎటువంటి దర్యాప్తు జరగలేదు. బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నాను. రవీంద్రుని ఇంటిపై దాడి అంటే ఆయన ఆలోచనలపై దాడి. ఈ దాడిని అన్ని దేశాలు తీవ్రంగా ఖండించాలని కోరుతున్నా''అన్నారు. మరో బీజేపీ ఎమ్మెల్యే, పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి ఈ సంఘటనను రవీంద్రుని వారసత్వంపై దాడిగా అభివర్ణించారు.

టెక్నాలజీతో అపరిమిత ప్రయోజనాలు

- డీబీటీతో రూ.3.48 లక్షల కోట్లు ఆదా చేశాం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తమ 11 ఏళ్ల పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించుకున్నామని, దీనివల్ల ప్రజలకు అపరిమిత ప్రయోజనాలు లభించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశంలో యువశక్తిని వాడుకోవడం ద్వారా టెక్నాలజీ, నవీన ఆవిష్కరణల్లో అద్భుత ప్రగతి సాధించామని హర్షం వ్యక్తంచేశారు. స్వయం సమృద్ధ దేశంగా, టెక్నాలజీ విషయంలో ప్రపంచ శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దుకోవడంలో మన ప్రయత్నాలను ఎంతగానో బలోపేతం చేసుకున్నట్లు ఉద్ఘాటించారు. ఈ మేరకు ప్రధాని మోదీ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. పేదల్లో అత్యంత పేదల సాధికారతకు టెక్నాలజీ ఒక కీలక సాధనంగా మారిందన్నారు. ప్రజలకు సేవలందించడంలో, పాలనలో పారదర్శకత పెంచడంలో సాంకేతికత తిరుగులేని పాత్ర పోషించిందని వెల్లడించారు. ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా ప్రజలకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతోందని ఉద్ఘాటించారు. 56 ప్రభుత్వ శాఖల పరిధిలో 322 పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.44 లక్షల కోట్లు నేరుగా జమ చేసినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాల పంపిణీలో డీబీటీ ద్వారా అక్రమాలు అరికట్టామని, రూ.3.48 లక్షల కోట్లు పక్కదారి పట్టకుండా ఆదా చేశామని వివరించారు. గత 11 ఏళ్లలో మన టెక్నాలజీ ప్రయాణం ఒక విప్లవం కంటే తక్కువేమీ కాదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. డిజిటల్ నిరక్షరాస్యత నుంచి టెక్నాలజీ ఆధారిత ప్రజాస్వామ్యం దిశగా మన ప్రయాణం సాగిందన్నారు.

ఏఎంఏ అధ్యక్షుడిగా బాబీ ప్రమాణం

న్యూఢిల్లీ: అమెరికన్ మెడికల్ అసోసియేషన్(ఏఎంఏ) 180వ అధ్యక్షుడిగా భారత సంతతి వైద్యుడు బాబీ ముక్కామల మంగళవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఈ ప్రతిష్టాత్మక పదవిని దక్కించుకున్న తొలి భారత సంతతి డాక్టర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుడిగా ఆయన పేరుగాంచారు. బాబీ ముక్కాల ఏఎంఏలో చాలాకాలంగా చురుగ్గా పని చేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు 1970వ దశకంలో ఇండియా నుంచి అమెరికాకు వలస వచ్చారు. బాబీ అమెరికాలోనే జన్మించారు. దల్లిదండ్రులిద్దరూ వైద్యులే. బాబీ యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్ మెడికల్ స్కూల్, షికాగోలోని లయోలా యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌లో చదువుకున్నారు. ఏఎంఏలో పలు పదవులు చేపట్టారు. 2009లో ఏఎంఏ ఫౌండేషన్ నుంచి 'ఎక్సలెన్స్ ఇన్ మెడిసిన్'అవార్డు అందుకున్నారు. సామాజిక సేవ కార్యక్రమాల్లోనూ ఆయన ముందంజలో ఉంటున్నారు. మిషగాన్‌లో తాను నివాసం ఉంటుంటున్న ఫ్లింట్ పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. కమ్యూనిటీ ఫౌండేషన్ ఆఫ్ గ్రేటర్ ఫ్లింట్ చైర్మన్‌గా పనిచేశారు.


సియాటెల్‌లో నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


రోడ్డుపై చెత్తబుట్టను తగులబెడుతున్న నిరసనకారులు

ఆగని అరెస్టులు, ఉద్యమాలు

- అమెరికావ్యాప్తంగా వ్యాపించిన 'ఐస్' వ్యతిరేక ఆందోళనలు
- రేపు 'నో కింగ్స్' పేరుతో ఆందోళనలు

లాస్ ఏంజెలెస్/వాషింగ్టన్/ఆస్టిన్: సరైన డాక్యుమెంట్లు లేని విదేశీయులను పంతం పట్టిమరీ పంపేయాలని చూస్తున్న ట్రంప్ సర్కార్‌పై నిరసనజెండా ఎత్తిన ఆందోళనకారులు గురువారం సైతం తమ ఉద్యమాన్ని ఉధృతస్థాయిలో కొనసాగించారు. ఓ వైపు అరెస్టులు కొనసాగుతుండగా మరోవైపు ఆందోళకారులకు దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతోంది. దీంతో మరిన్ని నగరాలకూ ఉద్యమం విస్తరిస్తోంది. ట్రంప్ ఏకపక్ష ధోరణితో రాజులా వ్యవహరిస్తున్నాడని, అమెరికాలో రాజులు, రాజరిక వ్యవస్థ లేదని గుర్తుచేస్తూ శనివారం 1,800 నగరాలు, పట్టణాల్లో 'నో కింగ్స్' పేరిట భారీ ర్యాలీలు చేపట్టనున్నారు. ప్రతిఘటన దినం స్ఫూర్తితో '50501 మూమెంట్' ఉద్యమసంస్థ ఈ ర్యాలీ చేపట్టనున్నారు. లాస్ ఏంజెలెస్‌తోపాటు కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్ ఫ్రాన్సిస్కో, శాంటా అనా నగరాల్లో ఉద్యమం ఉధృతమైంది. వీటికితోడు లాస్ వెగాస్, టక్సన్, సియాటెల్, పోర్ట్‌ల్యాండ్, స్పోకేన్, డెన్వర్, డాలస్, ఆస్టిన్, శాన్ ఆంటోనియో, షికాగో, మిల్‌వాకీ, బోస్టన్, ఫిడలెల్ఫియా, వాషింగ్టన్ డీసీ, అట్లాంటా, రెలీగ్ నగరాల్లోనూ వందల మంది నిరసనకారులు రోడ్లపైకి చేరి ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐస్) అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లాస్ ఏంజెలెస్‌లో మరో 80 మందిని అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.

రెచ్చిపోయిన టెక్సాస్ గవర్నర్

తమ రాష్ట్రంలో ఐస్ వ్యతిరేక ర్యాలీలను అడ్డుకునేందుకు ఎంతకైనా తెగిస్తామని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబ్బాట్ ప్రకటించారు. సోదాలు, తనిఖీలు, ఆకస్మిక దాడులు చేస్తున్న ఫెడరల్ ఏజెంట్లు, ఎఫ్‌బీఐ అధికారులకు రక్షణగా మరో 5,000 మంది టెక్సాస్ నేషనల్ గార్డ్ బలగాలను రంగంలోకి దింపుతానని గ్రెగ్ గురువారం వెల్లడించారు. వీళ్లకు అదనంగా 2,000 రాష్ట్ర పోలీసులు జతకూడుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని శాన్ ఆంటోనియో సిటీలోని 'ది అలామో' ప్రాంతంలో బుధవారం రాత్రి పెద్దసంఖ్యలో ఆందోళనకారులు గుమికూడడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఎలాంటి ఘర్షణలు, హింసాత్మక ఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతోనే గవర్నర్ బలగాలను ఇక్కడికి రప్పించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. లాస్ ఏంజెలెస్‌లో మాదిరి అల్లర్లు, లూటీలకు పాల్పడితే ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

మంత్రితో సెనేటర్ వాగ్వాదం

గురువారం లాస్ ఏంజెలెస్‌లో ప్రసంగించేందుకు వచ్చిన హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ మంత్రి క్రిస్టీ నోయెమ్‌తో డెమొక్రటిక్ పార్టీ నేత, కాలిఫోర్నియా సెనేటర్ అలెక్స్ ప్యాడిలా వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ విధానంపై ధ్వజమెత్తారు. అయితే ఆయనను నిరసనకారుడిగా భావించిన ఎఫ్‌బీఐ అధికారులు వెంటనే ఆయన పట్ల అనుచితంగా ప్రవర్తించారు. నేరస్తుడిలాగా మోకాళ్లపై కూర్చోవాలని బెదిరించారు. సంకెళ్లు వేసి బయటకు లాక్కెళ్లారు.

షికాగోలో కారు కలకలం

షికాగోలో నిరసనలు తెలుపుతున్న ఆందోళనకారుల పైకి ఓ కారు దూసుకెళ్లి కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. షికాగోలో స్థానిక కాలమాణం ప్రకారం మంగళవారం ఆందోళకారులు మన్రో స్ట్రీట్ రహదారిపై ర్యాలీగా వెళ్తుండగా వెనక నుంచి ఒక ఎరుపు రంగు కారు దూసుకెళ్లింది. దీంతో అక్కడి నిరసనకారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. కారు ఢీకొనంతో ఒక పెద్దావిడకు గాయాలయ్యాయి. అధికారులు వెంటనే అప్రమత్తమై ఆమెను ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ సభ్యులను పోగొట్టుకుని..

నాగపూర్: అహ్మదాబాద్ విమానం ప్రమాదంలో చాలామంది తమ కుటుంబ సభ్యులను పోగొట్టుకున్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన మనీశ్ కామ్‌దార్ కుమార్తె, మనవడితో పాటు సమీప బంధువు సైతం ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. వారి ఆచూకీ తెలియక ఆయన తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మనీశ్ కామ్‌దార్ కుమార్తె యశ మోధా అహ్మదాబాద్‌లో ఉంటున్నారు. ఏడాదిన్నర వయసున్న కుమారుడు, అత్తతో కలిసి గురువారం విమానంలో లండన్‌కు బయలుదేరారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడారు. తన ప్రయాణం గురించి తెలియజేశారు. మధ్యాహ్నం కల్లా విమాన ప్రమాదం గురించి తెలిసింది. బిడ్డ, మనవడు, మరో బంధువు ఏమయ్యారో తెలియడం లేదని మనీశ్ చెప్పారు. తనకు ఎవరూ సమాచారం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తంచేశాడు. రోడ్డు మార్గాన అహ్మదాబాద్ వెళ్తున్నానని, అక్కడే ఉన్న తన అల్లుడికి సైతం సమాచారం తెలియడం లేదని, క్షతగాత్రులున్న ఆసుపత్రిలోకి వెళ్లనివ్వడం లేదని అన్నాడు.

తమవాళ్లు ఏమయ్యారో తెలియక ఆందోళన

రాజస్తాన్ వాసులు దాదాపు పది మంది అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చిక్కుకున్నారు. వీరిలో ఉదయ్‌పూర్‌కు చెందినవాళ్లు నలుగురు, బనస్వారా జిల్లా వాసులు ఐదుగురు ఉన్నారు. ఉదయ్‌పూర్‌లో మార్బుల్ వ్యాపారం చేసే సంజీవ్ మోదీ కుమారుడు, కుమార్తె శుభ్, షగున్ ఈ విమానంలో లండన్ విహార యాత్రకు బయలుదేరారు. కానీ, వారి ఆచూకీ తెలియరావడం లేదు. ఉదయ్‌పూర్ జిల్లాకు చెందిన వెర్దీచంద్ మెనారియా, ప్రకాశ్ మెనారియా సైతం గల్లంతయ్యారు.

ఫోన్ రింగవుతున్నా సమాధానం లేదు

ఇంఫాల్: మణిపూర్‌కు చెందిన 20 ఏళ్ల కాంగ్‌బ్రెయిలాత్పామ్ నాంగ్‌తోయి శర్మ ఏఐ171 విమానంలో కేబిన్ క్రూ సభ్యురాలిగా మూడేళ్ల నుంచి పని చేస్తోంది. శర్మ బతికే ఉందా? లేదా? అనేది తెలియక ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. శర్మ ఫోన్ ఇప్పటికీ పని చేస్తోందని, తాము ఫోన్ చేస్తే రింగవుతూనే ఉందని, ఎవరూ ఎత్తడం లేదని చెబుతున్నారు. శర్మ గురించి తమకు సమాచారం ఇవ్వాలని వేడుకుంటున్నారు. ఆమె ఫోన్‌లో బ్యాటరీ అయిపోయి, స్విచ్ఛాఫ్ అవుతుందన్న భయంతో సాయంత్రం 6 గంటల నుంచి తాము ఫోన్ చేయడం లేదని అన్నారు. విమానం టేకాఫ్ అయ్యే ముందు తమకు ఫోన్ చేసిందని తెలిపారు.

కేరళ నర్సు మృతి

మరోవైపు కేరళకు చెందిన రంజిత గోపకుమార్(39) అనే నర్సు ఈ విమాన ప్రయాదంలో మృతిచెందారు. ఆమె కేరళ ప్రభుత్వ ఆరోగ్య శాఖలో నర్సుగా పనిచేశారు. తన కుటుంబానికి మంచి జీవితం ఇవ్వాలన్న ఉద్దేశంతో విదేశాల్లో నర్సుగా ఉద్యోగంలో చేరారు. ఇటీవలే స్వదేశానికి వచ్చారు. మళ్లీ ఉద్యోగంలో చేరడానికి వెళ్తూ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

కుమారుడి దగ్గరికి వెళుతూ..

పుణే: మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాకు చెందిన వృద్ధ దంపతులు మహాదేవ్ పవార్(68), ఆశా పవార్(60) అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించినట్లు తెలుస్తోంది. లండన్‌లో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్తుండగా, దురదృష్టం వెంటాడింది. మహాదేవ్ పవార్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో, మరొకరు లండన్‌లో ఉంటున్నారు. పవార్ గతంలో అహ్మదాబాద్‌లో బట్టల మిల్లులో పనిచేశారు. ఆయన కుటుంబం 15 ఏళ్ల క్రితం అక్కడే స్థిరపడింది. బంధువులను కలవడానికే ఇటీవలే షోలాపూర్ జిల్లాలోని సొంత గ్రామానికి వచ్చారు.

తల్లికి గుడ్‌మార్నింగ్ చెప్పి..

విమాన ప్రమాదంలో కేబిన్ క్రూ సభ్యుడిగా పని చేస్తున్న దీపక్ పాఠక్ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అతడు గురువారం ఉదయమే తల్లితో మాట్లాడాడు. గుడ్ మార్నింగ్ అని చెప్పాడు. ప్రమాదం తర్వాత అతడి క్షేమ సమాచారాలు తెలియడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మహారాష్ట్రలోని థానే జిల్లాకు చెందని రోష్నీ రాజేంద్ర సంఘారే అనే మరో కేబిన్ క్రూ సభ్యుడు సైతం కనిపించకుండా పోయాడు. అతడు మృతిచెందినట్లు భావిస్తున్నారు.

రెక్కల వెనక భాగం ముడుచుకుంది

గేర్ రాడ్ మూసుకోలేదు ● తక్కువ ఎత్తులో ఇది ప్రాణాంతకమే

ప్రమాద సమయంలో ఎయిరిండియా విమానం గేర్ రాడ్ మూసుకోలేదు. దానికి తోడు రెక్కల వెనక భాగం (ఫ్లాప్) ముడుచుకుపోయి ఉంది. ప్రమాదానికి సంబంధించిన వీడియోలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అసాధారణ పరిస్థితిపై వైమానిక నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు, ముఖ్యంగా టేకాఫ్ సమయంలో ఈ పరిస్థితి విమానానికి ప్రాణాంతకమేనని చెబుతున్నారు. సాధారణంగా విమానం టేకాఫైన వెంటనే, అంటే 600 అడుగుల ఎత్తుకు చేరడానికి ముందే గేర్ రాడ్ విధిగా మూసుకోవాలి. ఇక విమానం చెప్పుకోదగ్గ ఎత్తుకు ఎగిరేదాకా ఫ్లాప్స్ రెండూ విచ్చుకునే ఉండాలి. విమానం పైకి వెళ్తున్న కొద్దీ అవి క్రమంగా లోనికి ముడుచుకుంటాయి. కానీ ఎయిరిండియా విమానం టేకాఫ్ కాగానే లాండింగ్ గేర్ తొలుత కొంతమేరకు ముడుచుకున్నా, ఆ వెంటనే తిరిగి బయటికి వచ్చింది. ''బహుశా విమానానికి కావాల్సిన వేగం (థ్రస్ట్) లోపించడమో, పవర్ ఫెయిల్యూర్ చోటుచేసుకోవడమో జరిగి ఉండాలి. అది గమనించి పైలట్ ముందుజాగ్రత్తగా లాండింగ్ గేర్‌ను తెరిచి ఉంటాడు. దాంతోపాటే కిందకు పడిపోతున్న విమానాన్ని వెంటనే పైకి లేపేందుకు కావాల్సిన థ్రస్ట్ కోసం ఫ్లాప్స్‌ను ఒక్కసారిగా మూసేందుకు ప్రయత్నించి ఉంటాడు'' అని వైమానిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ''కానీ 600 అడుగుల ఎత్తులో ఇది చాలా రిస్కు. ఇలాంటప్పుడు విమానం అటూ ఇటూ ఊగిపోతుంది. ఎయిరిండియా విమానం మాత్రం ఇలాంటి పరిస్థితుల్లోనూ కూలేదాకా సజావుగానే ప్రయాణించింది. అందుకు పైలట్ సామర్థ్యమే కారణం కావచ్చు. దీంతోపాటు రైట్ రడ్డర్‌లో సమస్య తలెత్తిన సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇది లెఫ్ట్ ఇంజన్ ఫెయిల్యూర్‌కు సంకేతం. ఇవన్నీ కలగలిసి విమానాన్ని ఢీకొనడానికి ముందే సకాలంలో పైకి లేపడంలో పైలట్ విఫలమై ఉంటారు'' అని వారు విశ్లేషించారు. అంతేగాక పక్షులు ఇంజన్‌ను ఢీకొనడం కూడా ప్రమాదానికి కారణం కావచ్చంటున్నారు. ''ఎయిర్‌పోర్టును ఆనుకుని ఆవాస ప్రాంతాలున్నాయి. కనుక అక్కడ చాలా పక్షులుంటాయి. అనేక పక్షులు ఢీకొని రెండు ఇంజన్లనూ శక్తి కోల్పోయి ఉంటాయి. అందువల్లే టేకాఫ్ అనంతరం విమానం నిర్దిష్ట అందుకోలేకపోయి ఉంటుంది'' అని వారన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి ప్లస్
శుక్రవారం । 13-6-2025

పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

విపత్తుల నిర్వహణ

విపత్తులు - ప్రాథమిక భావనలు

ఒక భౌగోళిక ప్రాంతంలో సంభవించిన దుర్ఘటన విపత్తు అవుతుందా/ కాదా అనే విషయాన్ని నిర్ధారించాలంటే విపత్తు నిర్వ హణకు సంబంధించిన కొన్ని ప్రాథమిక భావనల గురించి తెలుసుకోవాలి. అవి..

1. వైపరీత్యం (Hazard)
2. దుర్బలత్వం (Vulnerability)
3. సామర్థ్యం (Capacity)
4. ఆపద (Risk)

వైపరీత్యం

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనానికి, ఆస్తులకు, పర్యావరణానికి నష్టాన్ని కలుగజేసే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలనే వైపరీత్యాలు అంటారు. 'Hasard' అనే అరబిక్, Az-Zhar అనే ఫ్రెంచి పదాల నుంచి వైపరీత్యం (Haz-ard) అనే పదం వచ్చింది.

వైపరీత్యాలు అనేవి ప్రకృతి, మానవ చర్యల వల్ల లేదా రెండింటి వల్ల సంభవిస్తాయి. వైపరీత్యాలు సంభవించే కారణాల ఆధారంగా విపత్తులను కిందివిధంగా విభజించవచ్చు. అవి..

A) **భౌగోళిక వైపరీత్యాలు:** ఇవి భూనిర్మాణం లో వచ్చే మార్పుల వల్ల సంభవిస్తాయి. **ఉదా:** భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు, భూపాతాలు, ఆనకట్టలు తెగిపోవడం, గనుల్లో అగ్నిప్రమాదాలు.

B) **నీరు, వాతావరణ సంబంధ వైపరీత్యాలు:** భూ వాతావరణంలో సంభవించే మా ర్పుల వల్ల ఏర్పడతాయి. **ఉదా:** చక్రవాతాలు, టోర్నడోలు, వరదలు, కరువు, కుంభవృష్టి,భూపాతం, హిమ సంపాతాలు, వేడి, శీతల గాలులు.

C) **జీవసంబంధ వైపరీత్యాలు:**
ఉదా: అంటు వ్యాధులు, తెగుళ్ల దాడులు, కలుషిత ఆహారం, సామూహిక జనహనన ఆయుధాలు.

D) **పర్యావరణ సంబంధిత వైపరీత్యాలు: ఉదా:** పర్యావరణ కాలుష్యం, అడవుల నరికివేత, ఎడారీకరణ.

E) **మానవ నిర్లక్ష్యం వల్ల ఏర్పడే వైపరీత్యాలు:** పారిశ్రామిక దుర్ఘటనలు, అగ్ని ప్రమా దాలు, చమురు ప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, రోడ్డు/ రైల్వే ప్రమాదాలు, భవ నాలు కూలిపోవడం, తొక్కిసలాటలు.

F) **సామాజిక- సహజ విపత్తులు:** ఇవి ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత కారణాలు రెం డింటి వల్ల ఏర్పడతాయి.
ఉదా: వరదలు, దుర్భిక్షం, భూపాతాలు.

వైపరీత్యాలు సంభవించే వేగం, ప్రభావ కాలం ఆధారంగా వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి..

1) **Rapid-Onset Hazards:** ఇవి ఆకస్మి కంగా సంభవిస్తాయి. వీటి ప్రభావం స్వల్పకాలం లేదా దీర్ఘకాలం ఉండొచ్చు. **ఉదా:** భూకంపాలు, సునామీలు, వరదలు, చక్రవాతం, అగ్నిపర్వత విస్ఫోటనాలు.

2) **Slow - Onset Hazards:** ఇవి చాలా నెమ్మదిగా సంభవిస్తాయి. వీటి ప్రభావం సుదీర్ఘకాలం ఉంటుంది.
ఉదా: పర్యావరణ క్షీణత, తెగుళ్ల దాడి, దుర్భిక్షం.



విపత్తు నిర్వహణపై 1999లో కె.సి. పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధి కారిక కమిటీ' (High Powered Com-mittee) దేశంలోని వివిధ ప్రాంతాల్లో 31 రకాల వైపరీత్యాలను గుర్తించి, వాటిని 5 సబ్ గ్రూపులుగా విభజించింది. 2005లో ఏర్పాటు చేసిన విపత్తు నిర్వహణ సంస్థ 'వేడిగాలులను' వైపరీత్యంగా పేర్కొనలేదు. అన్ని వైపరీత్యాలు విపత్తు రూపాన్ని పొందలేవు. కొన్ని మాత్రమే విపత్తు రూపాన్ని సంతరించుకుంటాయి. ఒక వైపరీత్యాన్ని విపత్తుగా గుర్తించాలంటే ఆ ప్రాంతంలో కింద తెలిపిన నష్టాలు జరిగి ఉండాలి.

అవి..

1. ధన, ప్రాణ నష్టం అధికంగా ఉండాలి.
2. ప్రజల జీవనోపాధి దెబ్బతిని ఉండాలి.
3. ఆ ప్రాంత పర్యావరణ, సాంస్కృతిక వనరులు దెబ్బతిని ఉండాలి.
4. గాయాల బారిన పడినవారి సంఖ్య అధికంగా ఉండాలి.
5. వైపరీత్యం సంభవించిన ప్రాంతంలో జనాభా పరిమాణం, సాంద్రత అధికంగా ఉండాలి.

దుర్బలత్వం (Vulnerability)

ఏదైనా ఒకే భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్యం వల్ల అక్కడ ఉన్న సమాజంలో నష్ట తీవ్రతను పెంచే కారకాలనే ఆ ప్రాంత దుర్బలత్వం అంటారు. **ఉదా:** 2001 గుజరాత్ లోని 'భుజ్' ప్రాంతంలో సంభవించిన భూకంపం కారణంగా శివారు ప్రాంతాల్లో నివ సిస్తున్నవారి కంటే ఇరుకైన రోడ్లు, ఎత్తయిన, సురక్షితం కాని భవనాలు, అధిక జనసాంద్రత ఉన్న, నిరుపేదలు నివసిస్తున్న భుజ్ పాత నగరానికి చెందినవారే ఎక్కువ గాయపడ్డారు, మరణించారు. శివారు ప్రాంతాల ప్రజలు విశాలమైన రోడ్లను కలిగి ఉండటమే కాకుండా, జనసాంద్రత తక్కువగా ఉండి, ఒకటి లేదా రెండు అంతస్తుల భవనాలనే కలిగి ఉండటం వల్ల ఆయా ప్రాంతాల్లో నష్ట తీవ్రత తక్కువగా ఉంది.

సామర్థ్యం (Capacity)

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్యం వల్ల జరిగే నష్ట తీవ్రతను తట్టుకొని తిరిగి జీవనోపాధిని పునరుద్ధరించుకునే అవ కాశా లున్న ఒక సమాజం స్థితిని దాని సామర్థ్యంగా పేర్కొనవచ్చు. **ఉదా:** రిక్టరు స్కేలుపై 6 తీవ్రత ఉన్న భూకంపం మురికివాడలో సంభవించినప్పుడు ప్రాణనష్టం, గాయాల బారిన పడినవారి సంఖ్య, జీవనోపాధి ని పునరుద్ధరించుకోలేని వారి సంఖ్య అధికంగా ఉంటుంది. అక్కడి సమాజానికి దుర్బల పరిస్థితుల నుంచి కోలుకునే సామర్థ్యం తక్కువగా ఉండటమే దీనికి కారణం. అదే బంజారాహిల్స్ లాంటి ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 8 తీవ్రత ఉన్న భూకంపం సంభవించినా నష్ట తీవ్రత తక్కువగా ఉంటుంది. దీనికి కారణం అక్కడ పేదరికం, బలహీనమైన ఇళ్లు, ఇరుకైన రోడ్లు లాంటి దుర్బల పరిస్థితులు లేకపోవడం. అంటే ఈ ప్రాంతానికి దుర్బలత్వాన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉంది అని అర్థం.

ఆపద (లేదా) విపత్కర స్థితి (Risk)

వైపరీత్యాలు, దుర్బల పరిస్థితుల మధ్య పరస్ప ర చర్యల కారణంగా ఒక సమాజ ఆర్థిక కార్య కలాపాల్లో అంతరాయం, పర్యావరణ క్షీణతతో పాటు మరణా లు, గాయాలు, ఆస్తి, జీవ నోపాధి దెబ్బతినడం లాంటి పర్యవసానాలు జరిగే సంభావ్యతనే ఆపద అంటారు. దీన్ని కిందవిధంగా వ్యక్తపరచ వచ్చు.

విపత్కర స్థితి (ఆపద) =
(వైపరీత్యం × దుర్బలత్వం)/ సామర్థ్యం

మాదిరి ప్రశ్నలు

1. **కిందివాటిలో 'విపత్తు'కు సంబంధించి సరైన వాక్యాన్ని గుర్తించండి.**
ఎ) అనుకోకుండా సంభవించే ఒక దుర్ఘటన
బి) నియంత్రించడానికి వీలు లేని దుర్ఘటన
సి) ప్రకృతి (లేదా) మానవ చర్యల వల్ల కలిగే దుర్ఘటన
డి) పైవన్నీ
2. **భూనిర్మాణంలో వచ్చే మార్పుల వల్ల (విరూపాకార కారకాల వల్ల) సంభవించే వైపరీత్యానికి ఉదాహరణ ఏది?**
ఎ) చక్రవాతాలు బి) వరదలు
సి) దుర్భిక్షం డి) భూకంపాలు
3. **ఒక సమాజం విపత్తుకు గురయ్యే సున్నితత్వాన్ని లేదా ఘటనను ప్రతిస్పందించే సామర్థ్యాలను దెబ్బతీసే భౌతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ కారకాల సమూహాన్ని ఏమని పిలుస్తారు?**
ఎ) వైపరీత్యం బి) విపత్తు
సి) విపత్కర స్థితి డి) దుర్బలత్వం
4. **కిందివాటిలో నాలుగు రకాల విపత్తులు (కరువు, వరదలు, చక్రవాతం, భూ కంపం) ఎదుర్కొనే రాష్ట్రం ఏది?**
ఎ) ఉత్తరప్రదేశ్
బి) పశ్చిమబెంగాల్
సి) ఆంధ్రప్రదేశ్ డి) ఒడిశా
5. **విపత్తులకు సంబంధించి కిందివాటిలో వాస్తవం ఏది?**
ఎ) ఒక ప్రాంతం ఒకే రకమైన విపత్తుకు లోనవుతుంది
బి) విపత్తు సహజ లేదా మానవ తప్పి దాల వల్ల సంభవించవచ్చు
సి) విపత్తు ఎల్లప్పుడు మీడియాలో విస్తృతంగా ప్రసారమవుతుంది
డి) విపత్తు ముందుగా తెలిసి, క్రమంగా ప్రారంభమవుతుంది
6. **కిందివాటిలో పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?**
ఎ) భూకంపాలు
బి) భూపాతాలు
సి) కుండపోత వర్షాలు
డి) పైవన్నీ
7. **కిందివాటిలో పర్యావరణ క్షీణత వల్ల ఏర్పడే వైపరీత్యం ఏది?**
ఎ) వరదలు బి) దుర్భిక్షం
సి) భూపాతం డి) భూకంపాలు
8. **1999లో కె.సి. పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధికారిక కమిటీ' దేశం లో ఎన్ని రకాల విపత్తులను గుర్తించింది?**
ఎ) 20 బి) 10
సి) 21 డి) 31
9. **కిందివాటిలో ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపితమైన విపత్తు కానిదేది?**
ఎ) అడవుల కార్చిచ్చు
బి) దుర్భిక్షం సి) భూపాతం
డి) అగ్నిపర్వతాలు
10. **సునామీలను ఏ సంవత్సరం తర్వాత విపత్తుల జాబితాలో చేర్చారు?**
ఎ) 2001 బి) 1989
సి) 2004 డి) 2005
11. **ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనానికి, ఆస్తులకు నష్టాన్ని కలుగజేసే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలను ఏమని పిలుస్తారు?**
ఎ) విపత్తులు
బి) దుర్బలత్వం
సి) వైపరీత్యం
డి) విపత్కర స్థితి
12. **'ఆపద' అనే ఫలితాన్ని (Risk) కింది విధంగా వ్యక్తపర్చవచ్చు?**
ఎ) (వైపరీత్యం × సామర్థ్యం)/ దుర్బలత్వం
బి) (వైపరీత్యం × దుర్బలత్వం)/ సామర్థ్యం
సి)(వైపరీత్యం × సామర్థ్యం)/ విపత్కర స్థితి
డి)(విపత్కర స్థితి× సామర్థ్యం)/ వైపరీత్యం
13. **కింద తెలిపిన ఏ సందర్భాల్లో వైపరీత్యం విపత్తుగా మారుతుంది?**
ఎ) సమాజంలోని ఒక వర్గం ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలకు వైపరీత్యం కారణమైనప్పుడు
బి) వైపరీత్యం మానవ సంచారం లేని ప్రాంతాల్లో సంభవించినా, దీర్ఘకా లంలో సమీప మానవ సమాజాల్లో దాని ప్రభావం ఉన్నప్పుడు
సి) ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధి దెబ్బతిని, వారు నిరాశ్రయులు అయినప్పుడు
డి) పైవన్నీ
14. **అత్యంత దుర్బలత్వ ప్రాంతాల్లో, అతి తీవ్రత ఉన్న వైపరిత్యం సంభవిస్తే అది దేనికి దారి తీస్తుంది?**
ఎ) బలమైన విపత్తు
బి) బలహీన విపత్తు
సి) ఏ ప్రమాదం ఉండదు
డి) ఏమీ చెప్పలేం
15. **కిందివాటిలో మానవ నిర్లక్ష్యం వల్ల సంభవించే విపత్తులు?**
ఎ) అడవుల కార్చిచ్చు
బి) అణు విస్ఫోటనాలు
సి) రోడ్డు, రైల్వే ప్రమాదాలు
డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) డి 3) డి 4) బి 5) బి
6) డి 7) బి 8) డి 9) డి 10) సి
11) సి 12) బి 13) డి 14) ఎ 15) డి.

మాట్లాడే భాషలో సాధారణంగా కనిపించే లక్షణం



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

శాసన భాష

శాసనాల్లో వినియోగించిన భాషనే శాసన భాష అంటారు. ప్రాఙ్నన్నయ యుగం నాటి ప్రాచీనాంధ్ర భాషా స్వరూపాన్ని గుర్తించడానికి శాసనాలు ముఖ్య ఆధారాలు. క్రీ.పూ 200 నుంచి క్రీ.శ 1000 వరకున్న కాలాన్ని సాహితీ చరిత్ర కారులు ప్రాఙ్నన్నయ యుగంగా నిర్ధారించారు. నన్నయకు పూర్వం రాజులు, సామంతరాజులు తమ జైత్రయాత్రల్లో కొత్త రాజ్యాలు, భూభాగాలను గెలిచినప్పుడు పండితులు, పురోహితులకు అగ్రహారాలు దానం చేసేవారు. మత ధార్మిక విషయాలను చాటిచెప్పేందుకు శాసనాలు వేయించేవారు. శాసనాలు రెండు రకాలు. ఒకటి శిలా శాసనాలు. రెండు తామ్ర శాసనాలు.

శాసనాల స్వరూపాన్ని బట్టి భాషావేత్తలు ప్రాఙ్నన్నయ యుగాన్ని రెండు భాగాలుగా వర్గీకరించారు. క్రీ.పూ 200 నుంచి క్రీ.శ 575 వరకు ఉన్న కాలాన్ని తొలి దశగా, క్రీ.శ 575 నుంచి క్రీ.శ 1000 వరకు ఉన్న కాలాన్ని మలిదశగా పేర్కొన్నారు. తొలి దశలో శాసనాలన్నీ సంస్కృత, ప్రాకృత శాసనాలు. వాటిలో అక్కడక్కడా వ్యక్తి నామాలు, గ్రామ నామాలు, సంఖ్యా వాచకాలు, విశేషణాలు మాత్రం తెలుగులో ఉన్నాయి. క్రీ.శ 575లో కడప జిల్లా కమలాపురంలో ఎరుకల్ ముత్తురాజు వేయించిన ఎర్రగుడిపాడు శాసనాన్ని తొలి గద్య శాసనంగా భాషావేత్తలు గుర్తించారు. అదే కాలానికి చెందిన ధనుంజయుని కలమళ్ల శాసనాన్ని ఇటీవల కొందరు పరిశీలకులు తొలి గద్య శాసనంగా పేర్కొన్నారు. దీన్ని భాషావేత్తలు నిర్ధారించాల్సి ఉంది. పుణ్యకుమారుడి పొట్లదుర్తి మాలెపాడు శాసనం (క్రీ.శ 610)లో ఎక్కువ తెలుగు పదాలు ఉన్నాయి. జయసింహవల్లభుని విప్పర్ల శాసనం (క్రీ.శ 640)లో తెలుగు, సంస్కృతం కలిసిన పదాలు ఉన్నాయి.

తెలుగులో తొలి పద్య శాసనం అద్దంకి పండరంగని శాసనం (క్రీ.శ 848). అందులో తరువోజ పద్యాలు ఉన్నాయి. అదే కాలానికి చెందిన గుణగ విజయాదిత్యుని కందుకూరి శాసనం (క్రీ.శ 848)లో సీస పద్యం ఉంది.

బెజవాడ యుద్ధమల్లుని శాసనంలో (క్రీ.శ 885) మధ్యాక్కర పద్యాలు ఉన్నాయి. గూడూరు విరియాల కామసాని శాసనంలో (క్రీ.శ 1000) చంపక, ఉత్పలమాలలు ఉన్నాయి. ధర్మవరం శాసనంలో ఆటవెలది పద్యాలు ఉన్నాయి. కె.వి.సుబ్రహ్మణ్య అయ్యర్ ప్రచురించిన దక్షిణ హిందూ దేశ శాసనాల సప్తమ సంపుటి లో 27 తెలుగు శాసనాలు ఉన్నాయి. డా. బూదరాజు రాధాకృష్ణ ప్రాఙ్నన్నయ యుగంలోని 269 తామ్ర శాసనాలను నిశితంగా పరిశోధించి ప్రచురించారు. జయంతి రామయ్య పంతులు సంపాదకత్వంలో దక్షిణ హిందూ దేశ శాసనాల పదో సంపుటిలో 781 తెలుగు శాసనాలను ప్రచురించారు. 14వ శతాబ్దం నాటికి దాదాపు రెండువేల శాసనాలు ప్రచురితమైనట్లు భాషావేత్తలు నిర్ధారించారు. తొలిదశ శాసనాల్లో కొన్నింటిలో బ్రాహ్మీలిపి, ఇంకొన్నింటిలో కొంత భాగం దేవనాగరిలిపి, మరికొంత భాగం తెలుగు-కన్నడ లిపి ఉన్నాయి. కొన్ని శాసనాలు వేంగీచాళుక్యుల లిపిలో ఉన్నాయి. అప్పట్లో భాష ద్రవరూపంలో ఉన్నందున స్పష్టత, నిబద్ధత శాసన భాషలో కనిపించదు. శాసన భాషలో 23 హల్లులు, 10 అచ్చులు గల దేశ్య వర్ణమాల ఉండేది. వీటిలో లేఖన దోషాలు విరివిగా కనిపి స్తాయి. రేఫ బదులు వలపలి గిలక ఉపయోగిం చేవారు.

- శాసన భాషలో కనిపించే 'ఱ' వర్ణం క్రమేపి తెలుగులో డ కారంగా, రేఫగా మారింది.
- శాసనభాషలో అనుస్వరానికి బదులు వర్గ పంచమాక్షరాన్ని సంయుక్తంగా రాసేవాళ్లు.
ఉదాహరణ: పణ్డు (పండు)
- శాసనభాషలో శకట రేఫ ప్రయోగం విరివిగా ఉంది.
- నేటి భాషలో శకట రేఫకు బదులు సాధు రేఫను ఉపయోగిస్తున్నారు. శకట రేఫ అదృశ్యమైపోయింది.
- శాసన భాషలో ఉన్న '఩', 'ళ'లు నేటి భాషలో 'న', 'ల' లుగా మారాయి.
ఉదా: అణ్ణతి – (అన్నతి), సంవత్సరంబుళ్లు (సంవత్సరంబులు).
- సంస్కృత శాసనాల్లో గ్రామ నామాలను సంస్కృతీకరించిన రూపాలున్నాయి. ఉదా: చేబ్రోలు (తామ్రపురీ), కొలను (సారసపురీ)
- శాసన భాషలో ఎన్నో భాషా విశేషాలు గమనించవచ్చు.
- తొలి తెలుగు మాట 'నాగబు' పదం (క్రీ.శ.మొదటి శతాబ్ది) అని వేటూరి ప్రభాకరశాస్త్రి నిర్ధారించారు.
- తెలుగు భాష ప్రాచీనతను నిర్ధారించే సందర్భంలో ఫిబ్రవరి, 2006లో కొత్తూరు శాస నం (క్రీ.పూ 2 వ శతాబ్ది)లోని 'తమ్బయ' పదాన్ని తొలి తెలుగు మాటగా భాషా వేత్త లు నిర్ధారించారు.

గ్రాంథిక భాష

ఆదికవి నన్నయ నుంచి చిన్నయసూరి వరకు కావ్య రచనలో ఉపయోగించిన వ్యాకరణ నియమబద్ధమైన భాషనే గ్రాంథిక భాష అంటారు. 19వ శతాబ్ది ఉత్తరార్థం నాటికి గ్రాంథిక భాషే ప్రామాణిక భాషగా ఉండేది. గ్రాంథిక భాషను సమర్థిస్తూ, వ్యావహారిక భాషను నిరసిస్తూ జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యంలో కాకినాడలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సంస్థ ఏర్పడింది. వేదం వేంకటరాయశాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు త దితరులు దీనిలో సభ్యులు. గ్రాంథిక భాషను సమర్థిస్తూ, గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పా రావుల వ్యావహారిక భాషోద్యమాన్ని అవహేళన చేస్తూ పానుగంటి లక్ష్మీనరసింహారావు 'గ్రామ్య వాదుల భాషాపవాదం' అనే గ్రంథాన్ని రచిం చారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో 1912, డిసెంబరు 11, 12 తేదీల్లో వావిలకొలను సుబ్బారావు అధ్యక్ష తన జరిగిన సదస్సులో తెలుగు భాష ఔన్నత్యాన్ని గొప్పగా ప్రశంసించారు. అక్షరసంఖ్యను బట్టి చూసినా తెలుగు.. ఇంగ్లిష్ భాష కంటే అభివృద్ధి చెందిందని అన్నారు. గ్రాంథిక భాష ఉత్కృష్టతను వివరిస్తూ. ఆ భాషలో అన్యదేశ్యాలు కొద్దిగా ఉన్నా మాండలి కాలు లేవన్నారు. వ్యావహారిక భాషకు వ్యాకర ణం, నిఘంటువు లేనందున వ్యావహారికంలో రచనలు చేయడం తగదని అధిక్షేపించారు.

జయంతి రామయ్య పంతులు.. గిడుగు వారి 'ఎ మెమోరాండమ్ ఆఫ్ మోడరన్ తెలుగు' వ్యాసాన్ని ఖండిస్తూ 'ఎ డిఫెన్స్ ఆఫ్ లిటరరీ తెలుగు' అనే వ్యాసాన్ని ప్రచురించారు.

గ్రాంథిక భాష మహాకవుల ప్రయోగాల నుంచి సిద్ధించినందున అది గొప్పదని, దాన్ని అనుసరించడం మంచిదని వాదించేవారు. వ్యావహారిక భాష శిష్టేతరుల వ్యవహారికం నుంచి సిద్ధించినందున దానికి ప్రామాణికత, సంస్కారం లేవని వారి ఆరోపణ. గ్రాంథిక భాష నన్నయ నుంచి ఆధునిక యుగం వరకు మారకుండా స్థిరంగా ఉన్నందున ప్రామాణిక వ్యవహారానికి అది అనుకూలమని వారి అభిప్రాయం. కందుకూరి వీరేశలింగం గారి ప్రత్యర్థి కొక్కొండ వెంకటరత్నం పంతులు నిత్య వ్యవహారంలో గ్రాంథిక భాషనే మాట్లాడేవారు.

సరళ గ్రాంథిక భాష

గ్రాంథికభాషలో మారుమూల తెలుగు పదాలు, కన్నడ పదాలతో అర్థం కాని సంస్కృత పదాలు, కఠోరమైన వ్యాకరణ నియమాలు, అన్యదేశ్యాలున్నందున గ్రాంథిక భాషావాదులు పనికట్టుకొని వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. పెద్ద సంక్లిష్ట వాక్య నిర్మాణాలతో గ్రాంథిక భాష చదివేందుకు, రాసేందుకు కఠినంగా ఉన్నందున ఈ లోపాలను సవరించాలన్న నిర్ణయంతో సరళ గ్రాంథిక వాదులు చిన్నచిన్న సమాసాలు, సరళమైన సామాన్య వాక్యాలు, ప్రసిద్ధమైన తెలుగు, సంస్కృత పదాలతో రచనలు చేయాలని నిర్ణయించారు. అందమైన తెలుగు నుడికారాలు, జాతీయాలు, సామెతలతో, ఆకర్షణీయమైన శైలిలో తిరుపతి వేంకటకవులు, విశ్వనాథ సత్యనారాయణ, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, దివాకర్ల వేంకటావధాని, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామ శాస్త్రి మొదలైనవారు సరళ గ్రాంథిక శైలిలో రచనలు చేసి పాఠకులను కొంతమేర ఆకర్షించ గలిగారు. 20వ శతాబ్ది పూర్వార్థంలో నవలలు, కథానికలు, పత్రికా రచనలు, ఆధునిక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు, వ్యాసాలు సరళ గ్రాంథిక శైలిలో వచ్చాయి.

గ్రాంథిక భాషా సమర్థనతో వచ్చిన రచనలు

1. ఎ డిఫెన్స్ ఆఫ్ మోడరన్ లిటరరీ తెలుగు – **జయంతి రామయ్య పంతులు**
2. గ్రామ్యవాదుల భాషాపవాదం – **పానుగంటి లక్ష్మీనరసింహారావు**
3. ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి – **జయంతి రామయ్య పంతులు**

మాదిరి ప్రశ్నలు

1. **శాసనాల్లో తత్సమ శబ్దాలకు తెలుగు పద్ధతిలో సంధి చేయడానికి ఉదాహరణ?**
ఎ) మన్న్యుణ్ణ బి) నీలీశ్వర
సి) మీనవమ్మ డి) తిక్కనయ్య
2. **శిష్టోచ్ఛారణలో జరిగే మార్పు?**
ఎ) హ కారం పోతుంది
బి) చకారం సకారమవుతుంది
సి) శ-ష-సల భేదం ఉంటుంది
డి) హల్లులు సమీకరణ పొందుతాయి
3. **క్రీ.శ 1100 ముందునాటి శాసనాల్లో కనిపించే దేశ్య తత్సమ మిశ్ర సమాసాలు?**
ఎ) కణ్ణసామి, గొల్లపల్లు
బి) అమృతపడి జయమాడ
సి) చౌషష్ఠ, ఘనరాచమణి
డి) దేవానొజ్ఞ, మొగమాడున్
4. **శాసనభాషలో స్త్రీ, పురుషోభయ వాచకాలైన ప్రత్యయాలు?**
ఎ) అయ్య, అన్న బి) అవ, ఇయ
సి) పిడుగు, పోతు డి) అమ్మ, పోటి
5. **భాషా చరిత్రకు ముఖ్యమైన జయసింహవల్లభుని శాసనం?**
ఎ) బెజవాడ బి) అద్దంకి
సి) మైదవోలు డి) విప్పర్ల
6. **శాసనాల్లో కనిపించని ప్రసిద్ధమైన ఛందస్సు**
ఎ. ఉత్పలమాల బి. చంపకమాల
సి. శార్దూలం డి. కందం
7. **శాసన భాషలో 'ళ' వర్ణం ఏ శతాబ్ది వరకు కనిపిస్తుంది?**
ఎ) క్రీ.శ 5వ శతాబ్ది బి) క్రీ.శ 6వ శతాబ్ది
సి) క్రీ.శ 9వ శతాబ్ది డి) క్రీ.శ 10వ శతాబ్ది
8. **గూడూరు కామసాని శాసనంలో ఉన్న పద్యాల ఛందస్సు?**
ఎ) రెండు చంపకమాలలు- మూడు ఉత్పలమాలలు
బి) మూడు చంపకమాలలు – రెండు ఉత్పల మాలలు
సి) ఒక ఉత్పలమాల- నాలుగు చంపక మాలలు
డి) నాలుగు చంపకమాలలు-ఒక తేటగీతి
9. **జిన వల్లభుడి హర్మ్యనల శాసనంలో ఉన్న పద్య ఛందస్సు?**
ఎ) తేటగీతి బి) మధ్యాక్కర
సి) కందం డి) ఆటవెలది
10. **పొట్లదుర్తి మాలెపాడు శాసనం వేయించిన రాజు**
ఎ) ఎరుకల్ ముత్తురాజు
బి) జయసింహ వల్లభుడు
సి) రేనాటి పుణ్యకుమారుడు
డి) గుణగ విజయాదిత్యుడు
11. **1910లో ప్రారంభమైన భాషోద్యమం?**
ఎ) గ్రాంథిక బాషోద్యమం
బి) ప్రామాణిక భాషోద్యమం
సి) అధికార భాషోద్యమం
డి) వ్యావహారిక భాషోద్యమం
12. **గ్రాంథిక భాషలో 'ప్రొందెనుగు కమ్మ' పుస్తకం రచించిన పండితుడు**
ఎ) గురజాడ అప్పారావు
బి) గిడుగు రామ్మూర్తి పంతులు
సి) కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి
డి) జయంతి రామయ్య పంతులు
13. **నిత్య వ్యవహారంలో గ్రాంథిక భాషనే మాట్లాడిన పండితుడు?**
ఎ) కందుకూరి వీరేశలింగం
బి) వేదం వేంకటరాయ శాస్త్రి
సి) కొక్కొండ వెంకటరత్నం పంతులు
డి) జయంతి రామయ్య పంతులు
14. **గ్రాంథిక భాషా పరిరక్షణకు నిర్వహించిన పత్రిక**
ఎ) ఆంధ్ర భారతి బి) ఆంధ్ర పత్రిక
సి) భారతి డి) ఆంధ్ర సాహిత్య పరిషత్

సమాధానాలు

1. బి; 2. సి; 3. సి; 4. బి; 5. డి;
6. సి; 7. బి; 8. బి; 9.సి; 10. సి
11. డి; 12. బి; 13.సి; 14.డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **'ప్రాణ సమానుండవైన చెలివి' అన్న శాసన ప్రయోగం**
ఎ) నామవాచకం మీద ప్రథమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
బి) నామవాచకం మీద ఉత్తమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
సి) నామవాచకం మీద మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
డి) నామవాచకం మీద ప్రథమ పురుష బహువచన ప్రత్యయం చేరింది.
2. **శాసనభాషలో కనిపించే వెలసును అనే తద్ధర్మార్థక రూపానికి ధాతు రూపం?**
ఎ) వెలుచు బి) వేచు
సి) వెలుగు డి) వెలయు
3. **శాసనభాషలో క్రీ.శ 6వ శతాబ్దికి ఈ విశిష్టత ఉంది?**
ఎ) శాసనంలో తెలుగురాజుల పేర్లుండటం
బి) శాసనాల్లో తెలుగు రాజ్యాల ప్రత్యేక ప్రస్తావన
సి) మొత్తం తెలుగులో ఉన్న శాసనాలు లభించడం
డి) శాసనాల్లో తెలుగు పదాలు ఉండడం
4. **100 సంఖ్యను సూచించే తెలుగు శబ్దాల్లో ప్రాఙ్నన్నయ యుగ శాసన భాషలో కనిపించని శబ్దం?**
ఎ) శతము బి) నూట
సి) వంద డి) నూఱు
5. **ఎక్కువమంది ప్రజలకు సమ్మతంగా ఉండటం లక్షణంగా కలది?**
ఎ) జానపద భాష
బి) వ్యావహారిక భాష
సి) ప్రామాణిక భాష
డి) మాండలిక భాష
6. **మాట్లాడే భాషలో సాధారణంగా కనిపించే లక్షణం?**
ఎ) చందోబద్ధత
బి) సుదీర్ఘ వాక్య నిర్మాణం
సి) సమాచార పునరుక్తి
డి) దీర్ఘ సమాస భూయిష్ఠత

సమాధానాలు

1) సి 2) డి 3) సి
4) సి 5) సి 6) సి

సిగ్నల్స్‌లో ఎరుపు రంగు వాడటానికి కారణం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ


పరమాణు నిర్మాణం

ద్రవ్యరాశి ఉండి కొంత ప్రదేశాన్ని ఆక్రమించే ధర్మమున్న దేనినైనా పదార్థం అంటారు. పురాతన కాలం నుంచే పదార్థ నిర్మాణాన్ని గురించి, పదార్థ మౌలిక కణాల గురించి వివిధ సిద్ధాంతాలు ప్రతిపాదించారు. పదార్థం అతిసూక్ష్మ కణాలైన 'అణువు', 'పరమాణువు'ల సమ్మిళితమని 'కణాదుడు' అనే మహర్షి వేదకాలంలోనే ప్రతిపాదించాడు. తర్వాత గ్రీక్ తత్వవేత్త 'డిమోక్రటిస్' పదార్థాలు అతి సూక్ష్మమైన 'పరమాణువులు' కలిగి ఉంటాయని ప్రతిపాదించాడు. గ్రీక్ భాషలో 'Atom (పరమాణువు)' అంటే విభజించే వీలు కానిది అని అర్థం. ఒక సిద్ధాంత రూపంలో వివరించింది మాత్రం 'జాన్ డాల్టన్' (క్రీ.శ. 1808) అనే శాస్త్రవేత్త. ఈ సిద్ధాంతం ప్రకారం పదార్థం 'అవిభాజ్యమైన అత్యంత సూక్ష్మ కణమే' పరమాణువు. ఒక మూలకానికి చెందిన పరమాణువులన్నీ ఒకేరకంగా ఉండి ఒకే ధర్మాలను కలిగి ఉంటాయి. 20వ శతాబ్దం లో జరిగిన అనేక పరిశోధనల ఫలితాల్లో పరమాణువులో ఎన్నో మౌలిక కణాలున్నాయని తేలింది. వాటిలో ముఖ్యమైనవి ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్‌లు. వీటినే ప్రాథమిక లేదా మౌలిక కణాలంటారు.

- జె.జె.థామ్సన్ 'విద్యుత్ ఉత్సర్గ నాళికా' ప్రయోగంలో కనుగొన్న 'రుణ విద్యుత్ కిరణాల' కు జె.జె.స్టోనీ అనే శాస్త్రవేత్త 'ఎలక్ట్రాన్‌లు' అని నామకరణం చేశాడు. ఏకమాత్ర రుణావేశం ఉన్న ఈ కణాలు అత్యంత తేలికైనవి. ప్రోటాన్ ద్రవ్యరాశిలో 1/1836వ వంతు ఉంటుంది.
- గోల్డ్ స్టెయిన్ కనిపెట్టిన ధన ధృవకిరణాలే ప్రోటాన్‌లు. ఇవి ఏకమాత్ర ధనావేశం ఉన్న ఎలక్ట్రాన్ల ద్రవ్యరాశి కంటే 1837 రెట్లు అధిక ద్రవ్యరాశిని కలిగి ఉంటాయి.
- ప్రాథమిక కణాల్లో అత్యంత భారమైన, ఆవేశ రహిత కణాలు న్యూట్రాన్లు. వీటిని జేమ్స్ చాడ్విక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- పరమాణువులో ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్ల అమరికను 'పరమాణు నమూనా' అంటారు. జె.జె. థామ్సన్, రూథర్ ఫర్డ్, నీల్స్ బోర్‌లు ప్రతిపాదించిన పరమాణు నమూనాలు ముఖ్యమైనవి.
- 'పుచ్చపండు' నమూనాగా ప్రసిద్ధి చెందిన థామ్సన్ నమూనాలో పుచ్చపండు గుజ్జు లో గింజలు పొదిగినట్లు ధనావేశ పూరిత పరమాణు కేంద్రకంలో ఎలక్ట్రాన్‌లన్నీ పొదిగి ఉంటాయని ప్రతిపాదించారు. వ్యతిరేక ఆవేశాలు ఉన్న ఎలక్ట్రానులు, ప్రోటాన్లను కలిపి ఉంచడం సాధ్యం కాదు. కాబట్టి ఈ నమూనా తిరస్కారానికి గురైంది.
- 'గ్రహమండల నమూనా'గా పేరు గాంచిన రూథర్‌ఫర్డ్ నమూనా ప్రకారం పరమాణు ద్రవ్యరాశి, ధనావేశ పరమాణు కేంద్రం వద్ద కేంద్రీకృతమై ఉంటుంది. దీన్నే పరమాణు కేంద్రకం అంటారు. దాని చుట్టూ ఎలక్ట్రాన్‌లు వృత్తాకార కక్ష్యల్లో తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించారు. ఈ నమూనాలోని లోపాలను సవరిస్తూ కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్‌లు సంచరించడానికి వృత్తాకార మార్గాల (కర్పరాలు)ను బోర్ నమూనా ప్రతిపాదించింది. బోర్ నమూనా విజయవంతానికి కాంతి స్వభావం, పరమాణు వర్ణపటం, ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం, ఐన్‌స్టీన్ కాంతి విద్యుత్ ఫలితం మొదలైన అంశాలు కారణమయ్యాయి.

కాంతి స్వభావం విద్యుదయస్కాంత వర్ణపటం

- కాంతికి కణ స్వభావంతో పాటు, తరంగ స్వభావం కూడా ఉంటుంది. కాంతి వివిధ విద్యుదయస్కాంత వికిరణాల సమూహం. వీటి శక్తి తగ్గే క్రమం: కాస్మిక్ కిరణాలు > γ కిరణాలు > X – కిరణాలు > అతి నీలలోహిత(UV) కిరణాలు > దృగ్గోచర కిరణాలు > పరారుణ (IR) కిరణాలు > సూక్ష్మ తరంగాలు (Micro waves) టి.వి. తరంగాలు > రేడియో తరంగాలు.
- వీటి శక్తి తగ్గుతున్న కొద్దీ తరంగదైర్ఘ్యం పెరుగుతుంది. అంటే γ కిరణాల శక్తి ఎక్కు వ, తరంగదైర్ఘ్యం తక్కువ. రేడియో తరంగాలకు శక్తి తక్కువ,తరంగదైర్ఘ్యం ఎక్కువ.
- కోబాల్ట్-60 అనే రేడియో ధార్మిక మూలకం ఉద్గారం చేసే γ కిరణాలను క్యాన్సర్ కారక కణాలను నశింప చేయడానికి, కూరగాయలు, గింజధాన్యాలను ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు క్రిమిరహితం చేయడానికి ఉపయోగిస్తారు. లెడ్ నుంచి γ కిరణాలు ప్రయాణించవు.
- X కిరణాలను రాంట్‌జన్ కనిపెట్టాడు. కంటికి కనిపించని ఈ కిరణాలు మామూలు కాంతి చొచ్చుకుపోని పదార్థాల ద్వారా చొచ్చుకుని పోగలవు. విరిగిన ఎముకల గురించి, శరీరంలో ఇతర అంగవైకల్యాలు, పరిశ్రమల్లో పరికరాల్లోని పగుళ్ల గురించి తెలుసుకోవడానికి ఈ కిరణాలను విరివిగా వాడతారు. అణువుల నిర్మాణం, స్ఫటిక నిర్మాణం తెలుసుకోవచ్చు. కస్టమ్స్ శాఖ అధికారులు X–కిరణాలను ఉపయోగించి దొంగ రవాణా చేస్తున్న వస్తువులు, ఆయుధాల గురించి తెలుసుకుంటారు.
- అతినీలలోహిత కిరణాల (UV)ను నీటిని క్రిమిరహితం చేయడానికి, నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించడానికి ఉపయోగిస్తారు.
- దృగ్గోచర కాంతి కంటికి కనిపిస్తుంది. ఇది VIBGYOR అనే ఏడురంగుల సమ్మిళితం.
- పరారుణ (IR) కిరణాలను టి.వి. రిమోట్‌లలో, చీకట్లో చూడడానికి ఉపయోగించే 'నైట్ విజన్' కళ్లద్దాలలో ఉపయోగిస్తారు.
- వంట చేయడానికి మైక్రో తరంగాలను ఉపయోగిస్తారు. నీరు, కొవ్వు కణాలను మైక్రో తరంగాలు కంపనం చెందించడం వల్ల వేడి జనించి పదార్థాలు ఉడుకుతాయి.
- అయనోస్ఫియర్ నుంచి అధిక తరంగ దైర్ఘ్యం ఉన్న రేడియో తరంగాలు పరివర్తనం చెందుతాయి. అందువల్ల వీటిని కమ్యూనికేషన్ల వ్యవస్థలో ఉపయోగిస్తారు.



మాదిరి ప్రశ్నలు

1. పరమాణు కేంద్రకంలో ప్రోటాన్లు ఉంటా యని తెలిపిన శాస్త్రవేత్త?
   1) బోర్ 2) రూథర్‌ఫర్డ్
   3) థాంసన్ 4) చాడ్విక్
2. మానవ శరీర అంతర నిర్మాణాన్ని చూడటానికి ఉపయోగించే కంప్యూటర్ టోమో గ్రఫీ (CT)కి ఆధారం?
   1) X–కిరణాలు 2) ధ్వని తరంగాలు
   3) అయస్కాంత అనునాదం
   4) రేడియో ఐసోటోపులు
3. రాత్రి చూడటానికి ఉపయోగించే పరికరాల్లో వాడే కిరణాలు?
   1) రేడియో తరంగాలు 2) మైక్రో తరంగాలు
   3) పరారుణ తరంగాలు 4) ఏవీ కావు
4. సిగ్నల్స్‌లో ఎరుపు రంగును వాడటానికి కారణం?
   1) ఎరుపు డేంజర్‌ను సూచించడానికి సింబాలిక్‌గా వాడతారు
   2) అల్ప తరంగదైర్ఘ్యం ఉండటం
   3) అధిక తరంగదైర్ఘ్యం ఉండటం
   4) చవకైంది
5. అయనోవరణం అనే భూ వాతావరణం లోని ఒక పొర, రేడియో కమ్యూనికేషన్లకు వీలు కలిగిస్తుంది. ఎందుకు?
   ఎ) ఓజోన్ ఉనికి వల్ల రేడియో తరంగాలు భూమిపైకి పరావర్తనం చెందడం
   బి) రేడియో తరంగాలకు సుదీర్ఘమైన తరంగదైర్ఘ్యం ఉండటం.
   పై వాటిలో సరైంది?
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) రెండూ కాదు
6. రాడార్‌లో ఉపయోగించే విద్యుదయ స్కాంత కిరణాలు?
   1) X–కిరణాలు 2) పరారుణ
   3) మైక్రో తరంగాలు 4) గామా
7. కాంతి విస్తరణను అధ్యయనం చేయడానికి ఉపయోగించే సాధనం?
   1) మైక్రోస్కోప్ 2) స్పెక్ట్రోమీటర్
   3) టెలిస్కోప్ 4) ఫొటోమీటర్
8. కిందివాటిలో సరైన వాక్యం?
   ఎ) కాస్మిక్ కిరణాలు అతి తక్కువ తరంగ దైర్ఘ్యం, అత్యధికశక్తి కలిగిన ఎలక్ట్రో మాగ్నటిక్ తరంగాలు
   బి) అన్ని విద్యుదయస్కాంతాలు కాంతి వేగం (3×10^8 మీ/సె)తో ప్రయాణి స్తాయి
   సి) ఓజోన్ పొర కాస్మిక్ కిరణాలను, అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరకుండా ఫిల్టర్ చేస్తుంది
   డి) ఏదైనా పదార్థాన్ని మైక్రో తరంగాలు వేడి చేయాలంటే అందులో తప్పని సరిగా నీటి అణువులుండాలి
   1) ఎ మాత్రమే 2) ఎ, బి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
9. సూక్ష్మ తరంగ భట్టీ (Microwave Oven) ఏ గుణకాన్ని ఉపయోగిస్తుంది?
   1) నీళ్ల సూక్ష్మ తరంగ శోషణం
   2) వంటచేసే పాత్ర సూక్ష్మ తరంగ శోషణం
   3) వంట సూక్ష్మ తరంగ పరావర్తనం
   4) ఏదీ కాదు
10. సెల్‌ఫోన్‌లలో ఉపయోగించే విద్యుద యస్కాంత తరంగాలు?
    1) మైక్రో తరంగాలు 2) పరారుణ కాంతి
    3) రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలు
    4) కాస్మిక్ కిరణాలు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3; 5) 2; 6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 3

కాల్షియం, మెగ్నీషియం

ఆరోగ్యవంతమైన దంతాలు, ఎముకల కోసం కాల్షియం అత్యంత ఆవశ్యకమైంది. యుక్త వయసులో మానవ శరీరంలో సుమారు 25 గ్రాముల మెగ్నీషియం (Mg), 1200 గ్రాముల కాల్షియం (Ca) ఉంటాయి. శరీరంలో ఉండే కాల్షియంలో 99 శాతం ఎముకలు, దంతాల్లో ఉంటుంది. కండరాల్లోని నరాల పనుల్లోనూ, రక్తం గడ్డకట్టడంలోనూ కాల్షియం ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

కాల్షియం ముఖ్యమైన సమ్మేళనాలు: కాల్షియం కార్బొనేట్, కాల్షియం హైడ్రాక్సైడ్, సిమెంట్, జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్.

- సున్నపురాయి, సుద్ద, చలువరాతి ముక్కలను రసాయనికంగా 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)' అంటారు. సున్నపురాయిని బట్టీల్లో కాల్చినప్పుడు పొడిసున్నం (కాల్షియం ఆక్సైడ్) వస్తుంది. దీనికి పరిమితంగా నీటిని కలిపితే రాళ్లు పగిలి ముద్దగా మారుతాయి. ఈ ప్రక్రియనే 'స్లేకింగ్ ఆఫ్ లైమ్' అంటారు. ఇది కాల్షియం హైడ్రాక్సైడ్. విలీన కాల్షియం హైడ్రాక్సైడ్(సున్నపు తేట)ను మిల్క్ ఆఫ్‌లైమ్ అంటారు.
- గాజు తయారీ, చర్మం శుద్ధి, బ్లీచింగ్ పౌడర్ తయారీ, చక్కెర శుద్ధి ప్రక్రియల్లో కాల్షియం హైడ్రాక్సైడ్ ఉపయోగపడుతుంది.
- సున్నపురాయిని పొడిసున్నం తయారీలో వాడతారు.సిమెంట్ తయారీకి ప్రధాన ముడి పదార్థాలు- సున్నపురాయి, బంకమట్టి.
- ప్రత్యేకంగా అవక్షేపించిన కాల్షియం కార్బొనేట్‌ను మేలు రకం కాగితం తయారీలో, ఆమ్ల విరోధిగా, టూత్‌పేస్ట్‌లో సున్నితమైన అపఘర్షకంగా, చ్యూయింగ్ గమ్‌లో, సౌందర్య సాధనాల్లో పూరకంగానూ వాడతారు.
- కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్ ($CaSO_4 . 2H_2O$)ను 'జిప్సం' అంటారు. దీన్ని ప్రత్యేక ఉష్ణోగ్రత 393K వద్ద వేడిచేస్తే 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ($CaSO_4 . \frac{1}{2}H_2O$)' ఏర్పడుతుంది. దీన్ని గృహ నిర్మాణాల్లో, విరిగిన విగ్రహాలను అతికించడంలో, ఎముకలు కదలకుండా కట్టు కట్టడంలో, దంత వైద్యంలో, నగలు పోతపోయడానికి, విగ్రహాల తయారీలో ఉపయోగిస్తారు.
- సున్నం(కాల్షియం ఆక్సైడ్)తోపాటు సిలికా (SiO_2), అల్యూమినా(Al_2O_3), మెగ్నీషియం ఆక్సైడ్‌లతో కూడిన బంకమట్టి మిశ్రమమే 'సిమెంట్'.
- మొక్కల్లో ఉండే ఆకుపచ్చ వర్ణద్రవ్యం'క్లోరోఫిల్'. ఇందులో ఉండే లోహ అయాన్ 'మెగ్నీషియం'.
- ఆమ్ల విరోధిగా పనిచేసే 'మెగ్నీషియం హైడ్రాక్సైడ్'ను 'మిల్క్ ఆఫ్ మెగ్నీషియా' అంటారు.
- ఎక్కువ బలం ఉన్న స్ప్రింగ్‌ల తయారీలో కాపర్-బెరీలియం మిశ్రలోహాలను ఉపయోగిస్తారు.
- మెగ్నీషియం పొడిని ఫ్లాష్ పౌడర్ తయారీలో, బల్బులు, సిగ్నల్‌లలో వాడతారు.
- రేడియం అనేది రేడియోధార్మిక మూలకం. దీని లవణాలను 'రేడియో థెరపీ' (కేన్సర్ చికిత్స)లో వాడతారు.
- ముత్యంలో కాల్షియం కార్బొనేట్, ఎమరాల్డ్‌లో బెరీలియం ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. ముత్యంలో ప్రధాన అనుఘటకాలేవి?
   1) సోడియం కార్బొనేట్, కాల్షియం కార్బొనేట్
   2)కాల్షియం కార్బొనేట్,మెగ్నీషియం కార్బొనేటు
   3) కాల్షియం ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్
   4) కాల్షియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్
2. కిందివాటిలో ఏది లోపించడం వల్ల ఎముకలు, దంతాలు బలహీనపడతాయి?
   1) కాల్షియం 2) ఫాస్పరస్
   3) ఫ్లోరైడ్ 4) పైవన్నీ
3. సిమెంట్ వేటి మిశ్రమం?
   1) కాల్షియం కార్బొనేట్, కాల్షియం సిలికేట్
   2) కాల్షియం సిలికేట్, కాల్షియం అల్యూమినేట్
   3) ఇసుక, సున్నం, నీరు
   4) జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్
4. మార్బుల్ రసాయన సంకేతం ఏది?
   1) $Ca(OH)_2$ 2) $CaCO_3$
   3) CaO 4) $CaHCO_3$
5. ఎమరాల్డ్‌లో ఉండే ప్రధాన మూలకం ఏది?
   1) కాల్షియం 2) మెగ్నీషియం
   3) బెరీలియం 4) సిలికాన్
6. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
   1) గట్టిదనం కోసం 2) బూడిద రంగు కోసం
   3) నీరు కలిపినప్పుడు ప్రారంభ దశలో నెమ్మదిగా సెట్టింగ్ జరగడానికి
   4) బరువు తూగడానికి
7. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను ఏ పదార్థం నుంచి తయారు చేయవచ్చు?
   1) తడిసున్నం 2) జిప్సం
   3) సిమెంట్ 4) మార్బుల్
8. సముద్రపు నీటి నుంచి సంగ్రహించే లోహం?
   1) బంగారం 2) సిల్వర్
   3) మెగ్నీషియం 4) మెర్క్యూరీ
9. బాణాసంచా కాల్చినప్పుడు మిరుమిట్లు గొలిపే తెల్లని కాంతినిచ్చే లోహం ఏది?
   1) మెగ్నీషియం 2) కాల్షియం
   3) స్ట్రాన్షియం 4) బేరియం
10. టపాకాయలు కాల్చినప్పుడు సింధూర ఎరుపు రంగునిచ్చే లోహం ఏది?
    1) మెగ్నీషియం 2) కాల్షియం
    3) బేరియం 4) స్ట్రాన్షియం

సమాధానాలు

1) 2 2) 4 3) 2 4) 2 5) 3 6) 3 7) 2 8) 3 9) 1 10) 4

The antonym of Conciliatory is..



MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The greater Hyderabad Municipal Corporation is caught in a catch 22 situation (1)/ to enforcing (2)/ its own flat on stoppage of road cutting (3)/ and evacuation work during monsoon. (4)/ No error (5)
2. The Supreme Court upheld the validity of a Income Tax law (1)/ amendment linking PAN with Aadhar for filling tax returns (2)/ and making Aadhar compulsory (3)/ to apply for a PAN card. (4)/ No error (5)
3. Numismatists felt (1)/ that the demonetization (2)/ exercise was a call on duty (3)/ for them. (4)/ No error (5)
4. Savings remained unclaimed in dormant EPF accounts (1)/ for seven years will be used (2)/ to fund a new scheme (3)/ for providing medical benefits to pensioners. (4)/ No error (5)
5. Sri Lanka skipper Angelo Mathews thanks (1)/ quite a few people (2)/ after the stunning win (3)/ over India on Thursday. (4)/ No error(5)

Directions (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The media should not be cowed by the government's efforts to encroach upon its freedom.
   1) cowed for
   2) cowed down by
   3) cowed at 4) cowed by for
   5) No correction required
7. Despite her fear of heights, she was thrilled to be up the mountain.
   1) so up 2) far up
   3) so far up 4) on up
   5) No correction required
8. The minister also claimed that all the formalities had been completed and would be implemented in immediate effects.
   1) With immediate effect
   2) In immediate effect
   3) As immediate effects
   4) Immediately effect
   5) No correction required
9. Raghu moved earth as well as heaven to pass the exam but he could not.
   1) Earth as heaven
   2) Heaven as earth
   3) Earth and as heaven
   4) Earth and heaven
   5) No correction required
10. The yoga session on the international yoga day is most likelihood to start at. 6.00 a.m.
    1) Like to start from 6.00 a.m
    2) Most like to start at 6.00 a.m.
    3) Most likely to start at 6.00 a.m
    4) Likely to start on 6.00 a.m
    5) No correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The WHO paper asks to integrate traditional and complementary medicine services, where appropriate, into health care service delivery and self-health care and to promote an improved universal health coverage by doing so
B) WTO, WIPO and WHO ask for respect for both the economic value and the social and cultural significance of traditional knowledge
C) Traditional medicine has a long history of use in health maintenance and in disease prevention and treatment, particularly for chronic diseases
D) Traditional medicine, including Ayurveda, contributes significantly to the health status of many communities, and is increasingly used within certain communities in developed countries
E) Suitable recognition of traditional medicine is an important element of national health policies and has as well important basis for new products with significant export potential
F) And supports documentation of traditional medical knowledge and enhanced regulation of quality, safety and efficacy of such products

11. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) F 5) E
13. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) D 4) C 5) E
15. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. A major tragedy was _____ after an Air India plane suffered a brake failure and skidded beyond the _____ before coming to a halt.
    1) occurred; aisle
    2) averted; runway
    3) halted; passage
    4) diverted; take off
    5) stopped; trajectory
17. The government is ____ a new data protection law to protect personal data of citizens.
    1) reporting 2) considering
    3) mulling 4) sharing5)
    responding
18. The _____ weather patterns of the tropical island meant tourists had to carry both umbrellas and sunglasses.
    1) impertinent 2) supplicant
    3) preeminent 4) illustrative
    5) kaleidoscopic
19. The eager members of the audience found the lecture topic ____, but unfortunately the lecturer' droning voice had a _____ effect.
    1) Interesting; rousing
    2) Advantageous; beneficial
    3) Rudimentary; reassuring
    4) Insipid; bland
    5) Stimulating; soporific
20. Hari's ability to analyze issues fairly and competently has earned him the ____of even his most _____ peers.
    1) solicitation; unbiased
    2) attention; sympathetic
    3) suspicion; discerning
    4) reputation; knowledgeable
    5) respect; exacting

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

With Brexit negotiations set to commence soon, the result will also raise fundamental questions about Britan's Brexit strategy, though perhaps not in the way some had foreseen. The collapse of support for the right-wing UK Independence party had been expected to benefit just the Conservatives, but labour gained from them too, suggesting that the disillusionment that UKIP in part reflected did not necessary involve policies focused around cutting immigration. While Labour has pledged "fair rules and reasonable management of migration", its immigration strategy would be big departure from the tough Conservative approach, making allowances for family reunions and a more welcoming environment for students. However, the results also suggested that there was limited public **appetite** for the Liberal Democrat pledge to hold a second referendum on the terms of the Brexit deal, as the party failed to make the comeback it had hoped to. At the same time, Labour has pledged to **rip up** the Conservatives' white paper and adopt a more **conciliatory** approach to the negotiations, which would include retaining the benefits of the single market and customs union.

21. Which statement is true?
    a) Family reunions and student friendly programs are going to have a tough time.
    b) The immigration policy of the Labour falls in line with the Conservative approach.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Either a or b
    5) Neither a nor b
22. Identify the statement which is false.
    a) The collapse of support for the right-wing UK Independence party had been expected to benefit the Conservatives.
    b) The collapse of support for the right-wing UK Independence party was expected to benefit both the Conservatives and the Labour.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Either a or b
    5) Neither a nor b
23. The antonym of Conciliatory is:
    1) Provocative 2) Pacifying
    3) Appeasing 4) Pacific
    5) Placatory
24. The meaning of the phrase "rip up" is:
    1) Through away 2) Down size
    3) Tear into pieces
    4) Collide together 5) Conjoin
25. The synonym of Appetite is:
    1) Taste 2) Hunger
    3) Food 4) Eatery 5) Desire

Directions (Q.No. 26 - 35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Seven years of rollercoaster ____ (26) over an India-Japan civil nuclear energy deal came to ___(27) on Wednesday when Japan's Parliament, the Diet, ____(28) the pact. Opposition parties voiced ___(29) against the deal, highlighting ____ (30) that India has provided ____ (31) guarantees for Japan's right to ____ (32) the agreement in the event of New Delhi ____ (33) a nuclear test. Nonetheless, the ruling coalition pushed the ____ (34) through with a majority vote. The agreement is set to take _____(35) in early July.

26. 1) negotiations 2) discussion
    3) debate 4) talk
    5) possessions
27. 1) result 2) fruition 3) execution 4) termination 5) conclusion
28. 1) standard 2) official
    3) approved 4) permission
    5) agree
29. 1) object 2) approval
    3) complain 4) protest
    5) gripe
30. 1) consent 2) concerning
    3) concerned 4) concern
    5) concerns
31. 1) insufficient 2) supply
    3) enough 4) adequate
    5) lacking
32. 1) expire 2) terminate
    3) permit 4) conceal
    5) pause
33. 1) organizing 2) managing
    3) conducting 4) participating
    5) performing
34. 1) harmony 2) unity
    3) settlement 4) accord
    5) concurrence
35. 1) after 2) along
    3) with 4) affect 5) effect

KEY

1) 2	2) 1	3) 3	4) 1	5) 1
6) 2	7) 3	8) 1	9) 4	10) 3
11) 2	12) 5	13) 3	14) 3	15) 5
16) 2	17) 3	18) 5	19) 5	20) 5
21) 5	22) 3	23) 1	24) 3	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5
31) 1	32) 2	33) 3	34) 4	35) 5